www.andhrajyothy.com
వెల (Price) : Rs. 8.00
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 318
ఆదివారం | 3-3-2024 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి ఉ. 8.46 తదుపరి అష్టమి; నక్షత్రం: అనూరాధ మ. 3.56 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా. 9.38-11.15; దుర్ముహూర్తం: సా. 4.45-5.32; అమృతఘడియలు: శేషం ఉ. 6.41 రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.36; సూర్యాస్తమయం: 6.19
విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మళ్లీ ఫ్లోటింగ్.. టింగ్!

బ్రిడ్జి నుంచి విడిపోయి దూరంగా వెళ్లిన టి-జంక్షన్ వ్యూ పాయింట్

- మరోసారి కొట్టుకుపోయిన బ్రిడ్జి వ్యూ పాయింట్
- ముంబై నిపుణుల తనిఖీలతో కనిపించని ఫలితం
- వారంలోపే 2 సార్లు తెగిపోయిన వంతెన
- ఇదీ మాక్ డ్రిల్లేనంటారా?

12



తాకట్టులో సచివాలయం!

జగన్ సర్కారు మరో దా'రుణం'

370 కోట్ల కోసం హెచ్‌డీఎఫ్‌సీకి రాసిచ్చేశారు

- గుట్టుగా తనఖా రిజిస్ట్రేషన్
- తొలుత ఐసీఐసీఐని కోరిన సర్కారు
- కాదు పొమ్మనడంతో హెచ్‌డీఎఫ్‌సీకి
- అధికారుల భవనాలపైనా తాకట్టు అప్పు
- పూర్తయినట్లు చూపేందుకే అద్దె చెల్లింపు
- కట్టడం చేతకాదుకానీ.. అప్పులకు 'సిద్ధం'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెరలేపి.. రాష్ట్రాన్ని ఒక్క రాజధాని కూడా లేకుండా చేసి.. చివరికి ఉన్న రాజధాని అమరావతిలోని రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టేశారు. అడ్డగోలుగా తెస్తున్న అప్పులు చాలక.. చివరికి రాష్ట్ర సచివాలయాన్నే తాకట్టుకు రాసిచ్చి రూ.370 కోట్ల అప్పు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణంలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన భవన సముదాయాన్ని కూడా

మిగతా 12వ పేజీలో...


ఈయనేం 'నాయకుడు?'

- ఉద్యోగ నేతా? వైసీపీ భక్తుడా?
- వెంకట్రామిరెడ్డి వీర భజన
- జగన్ ఓడిపోతే మనం ఓడినట్టే
- ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయండి
- సచివాలయ ఉద్యోగులకు పిలుపు



అమలాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పేరుకే ఆయన ఉద్యోగ సంఘాల నాయకుడు! చేసేది మాత్రం ముఖ్యమంత్రి జగన్ భజన! ఆయనే... రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల గౌరవాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి. ఉద్యోగుల

మిగతా 12వ పేజీలో...





పల్నాడు జిల్లా దాచేపల్లిలో జరిగిన సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న చంద్రబాబు

భావితరాల కోసం

ధర్మ యుద్ధమిది



నెల్లూరులో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

జగన్‌ను చిత్తు చేయడానికి 'సిద్ధం' కావాలి

- విలువలు ఉన్న నేతలంతా వైసీపీని వీడుతున్నారు
- వేమిరెడ్డిని గౌరవించడం కోసమే నెల్లూరు వచ్చా
- ఫ్లెక్సీలు మార్చినట్టు ఇన్‌చార్జుల్ని మార్చుతున్న జగన్
- ప్రజలారా.. గత పొరపాటు పునరావృతం కావొద్దు
- అలా జరిగితే ఈసారి రాష్ట్రం ఉనికి మాయం: బాబు
- వందలాది మందితో వీపీఆర్ దంపతులు పార్టీలోకి

సాధారణంగా చేరికలు హైదరాబాద్ లేదా అమరావతిలో జరుగుతాయి. కానీ, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాజకీయాలకు గౌరవం తెచ్చే వ్యక్తి. అటువంటివారిని పార్టీలోకి ఆహ్వానించడం నా బాధ్యతగా భావించి నెల్లూరుకు వచ్చా. విలువలు కలిగిన నేతలు వైసీపీని వీడుతున్నారు. ఇది చూసి జగన్ అండ్ కోకు పిచ్చి పట్టింది. ఏం చేయాలో అర్థంకాక రోజుకో అభ్యర్థిని మార్చేస్తున్నారు.

- నెల్లూరు సభలో చంద్రబాబు

11

పల్నాడులో నరహంతకులను

అణిచేస్తా

- మర్యాదకు మర్యాద.. దెబ్బకు దెబ్బ
- జగన్.. నీ నోరు మూయిస్తా
- ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదు
- హు కిల్డ్ బాబాయ్? నేను కాదు.. నీ చెల్లి అడుగుతోంది
- దాచేపల్లి 'రా.. కదలిరా' సభలో చంద్రబాబు ఆగ్రహం

'కదలిరా' సభలో ఎంపీ లావు, హైదరాబాద్‌లో వసంత చేరిక



11

నేడు పల్స్ పోలియో

- 53,35,519 మంది చిన్నారులకు
- 67,76,100 డోస్‌లు సిద్ధం
- రాష్ట్రవ్యాప్తంగా 37,921 బూత్‌లు



2

'అత్యంత పేదరికాన్ని' నిర్మూలించిన భారత్

- మోదీ ప్రభుత్వ విధానాలే కారణం
- వాస్తవ తలసరి వినియోగంలో ఏటా 2.9 శాతం వృద్ధి
- తగ్గిన పట్టణ, గ్రామీణ అసమానతలు
- అమెరికా మేధో సంస్థ బ్రూకింగ్స్ నివేదిక



2

మండిన సీమ

అనంతలో 41.1 డిగ్రీలు

పోటీ నుంచి తప్పుకొంటున్నా

11

- టీడీపీ, జనసేనకు నష్టం జరగకూడదనే నిర్ణయం
- పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటా: మహాసేన రాజేశ్

195 కమలాలు

- బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితా
- మోదీ, రాజ్‌నాథ్, అమిత్‌షా సహా 34 మంది కేంద్ర మంత్రులు, ఇద్దరు మాజీ సీఎంలకు చోటు
- న్యూఢిల్లీ నుంచి సుష్మాస్వరాజ్ కుమార్తె బాన్సురీ స్వరాజ్‌కు అవకాశం
- ఎస్సీలకు 27, ఎస్టీలకు 18, ఓబీసీలకు 57 సీట్లు
- మొత్తమ్మీద 28 మంది మహిళలకు చాన్స్

మల్కాజిగిరి ఈటలకే.. 9 పేర్లతో టీ-జాబితా.. సిట్టింగ్‌లు కిషన్‌రెడ్డి, సంజయ్, అర్వింద్‌లకు ఓకే

న్యూఢిల్లీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ ఒకే సారి 195 మంది అభ్యర్థులతో తొలి జాబితాను శనివారం ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు మొత్తం 34 మంది కేంద్రమంత్రులు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులకు తొలి జాబితాలో చోటు లభించింది. ప్రధాని మోదీ యూపీలోని వారాణసి నుంచి తిరిగి పోటీపడనున్నారు. 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలోని 195 నియోజకవర్గాలకు బీజేపీ అభ్యర్థులను ఖరారు చేసింది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 51 మంది

మిగతా 2వ పేజీలో...

విహారయాత్రలో అలజడి!

మహాబలిపురంలో ఐదుగురు ఏపీ విద్యార్థులు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో నలుగురి కోసం గాలింపు
- అంతా అనంత, చిత్తూరు వాసులే

చెన్నై(ఆంధ్రజ్యోతి)/యాడికి/పలమనేరు, మార్చి 2: విద్యార్థుల విహారయాత్రలో 'అల'జడి రేగింది. తమిళనాడు మహాబలిపురం తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడిన రాకాసి అలలు ఒక విద్యార్థిని బలి తీసుకున్నాయి. భారీ అలల తాకిడికి మరో నలుగురు విద్యార్థులు గల్లంతయ్యారు. వీరి జాడ కోసం సహాయక

మిగతా 12వ పేజీలో...



మహాబలిపురం బీచ్‌లో శనివారం ఉదయం విద్యార్థులు దిగిన గ్రూప్ ఫొటో

జగన్‌కు విశాఖ గుర్తొచ్చింది!

- 5,7 తేదీల్లో విశాఖ నగరానికి సీఎం
- 'వైజాగ్ విజన్.. ఫ్యూచర్ విశాఖ' సమావేశం
- 7న రుషికొండ ప్యాలెస్‌లో కేబినెట్!?



విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఇన్నాళ్లకు విశాఖపై 'విజన్' గుర్తుకొచ్చింది. అంతేకాదు... ఎన్నికల ముందు 'పరిపాలనా రాజధాని'లో ఏదో ఒకటి చేశాం అనిపించుకునేందుకు విశాఖపట్నంలో మంత్రివర్గ సమావేశం కూడా ఏర్పాటు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. జగన్

మిగతా 12వ పేజీలో...

కేంద్రం హెచ్చరికతో దిగొచ్చిన గూగుల్

» ప్లేస్టోర్ నుంచి తొలగించిన పది యాప్‌ల పునరుద్ధరణ

న్యూఢిల్లీ, మార్చి 2: సర్వీసు రుసుము చెల్లింపు వివాదంతో ప్లే స్టోర్ నుంచి పలు భారతీయ స్టార్టప్ కంపెనీల యాప్‌లను తొలగించడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ చర్యను తాము అంగీకరించబోమని సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్‌కు తేల్చిచెప్పింది. కేంద్ర ఐటీ, టెలికాం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ స్టార్టప్ రంగం భారతీయ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకం అని, వాటి భవితవ్యాన్ని ఏ సాంకేతిక దిగ్గజానికో వదిలివేయలేమని స్పష్టం చేశారు. స్టార్టప్‌లకు అవసరమైతే అండగా నిలుస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో గూగుల్‌తో పాటు స్టార్టప్ ప్రతినిధులను సోమవారం చర్చలకు పిలిచారు. కాగా, శుక్రవారం గూగుల్ 10 యాప్‌లను ప్లే స్టోర్ నుంచి తొలగించింది. ప్రముఖ మ్యాట్రిమోనీ.కామ్‌కు చెందిన భారత్ మ్యాట్రిమోనీ, క్రిస్టియన్ మ్యాట్రిమోనీ, ముస్లిం మ్యాట్రిమోనీ, జోడీతో పాటు ఇన్ఫో ఎడ్జ్‌కు చెందిన జీవన్ సాథీ వీటిలో ఉన్నాయి. తమకు సంబంధించిన నౌకరీ, నౌకరీ రిక్రూటర్, నౌకరీ గల్ఫ్, 99 ఎకర్స్, శిక్షా యాప్‌లనూ ప్లే స్టోర్ నుంచి తొలగించినట్లు ఇన్ఫో ఎడ్జ్ శనివారం పేర్కొంది. ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని తెలిపింది. ప్రభుత్వ తీవ్ర హెచ్చరికతో సాయంత్రానికి పరిస్థితి మారిపోయింది. నౌకరీ, 99 ఎకర్స్ తదితర యాప్‌లను గూగుల్ ప్లేస్టోర్‌లో పునరుద్ధరించింది. కాగా, గూగుల్ సర్వీస్ రుసుములను సుప్రీం కోర్టులో సవాల్ చేసిన సంస్థల్లో మ్యాట్రిమోనీ.కామ్, ఇన్ఫో ఎడ్జ్, డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌తో పాటు ప్రముఖ తెలుగు ఓటీటీ ఆహా కూడా ఉంది.

అమెరికాలో భారత నృత్య కళాకారుడి హత్య

» తుపాకీతో పలుమార్లు కాల్చి చంపిన దుండగులు



న్యూయార్క్, మార్చి 2: అమెరికాలో భారతీయులు, ఇండో-అమెరికన్లపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా మిస్సోరిలోని సెయింట్ లూయిస్ ప్రాంతంలో జరిగిన దాడిలో కోల్‌కతాకు చెందిన కూచిపూడి, భరతనాట్య కళాకారుడు అమర్‌నాథ్ ఘోష్ (34) దారుణ హత్యకు గురయ్యారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఘోష్ ఉన్నత విద్య కోసం గతేడాది అమెరికాకు వెళ్లారు. సెయింట్ లూయిస్‌లోని వాషింగ్టన్ యూనివర్సిటీలో పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగంలో మాస్టర్స్ (ఎంఎఫ్ఏ) చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్లిన ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు పలుమార్లు కాల్పులు జరిపారు. ఘోష్ అక్కడికక్కడే మృతిచెందారు. కాగా ఘోష్ హత్యకు గురైన సమాచారాన్ని ఆయన స్నేహితురాలు, టీవీ నటి దేవలీనా భట్టాచార్జీ శుక్రవారం వెల్లడించారు. మృతదేహాన్ని భారత్‌కు తీసుకురావడంలో సాయం చేయాలని ప్రధాని మోదీ, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు ఆమె విజ్ఞప్తి చేశారు. ఘోష్ తండ్రి ఆయన బాల్యంలోనే కన్నుమూయగా, తల్లి మూడు సంవత్సరాల క్రితమే మరణించారని దేవలీనా తెలిపారు. ఈ హత్యకు గల కారణాన్ని తెలుసుకోవాలని భారత రాయబార కార్యాలయాన్ని ఆమె కోరారు. మరోవైపు తుపాకీ దాడిని చికాగోలోని భారత రాయబార కార్యాలయం తీవ్రంగా ఖండించింది. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపింది. ఘోష్ బంధువులకు అన్ని విధాల సహాయం అందిస్తామని పేర్కొంది.

లోకం తీరు



లోక్‌సభ ఎన్నికల్లో పోటీ అంటే
వారసులకు భయం: మోదీ


బిహార్‌లో ఓ కార్యక్రమంలో మోదీతో నితీశ్

ఔరంగాబాద్, క్రిషి నగర్, మార్చి 2: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రతిపక్ష పార్టీల్లో వారసులకు ధైర్యం చాలడం లేదని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. అందుకే వారు రాజ్యసభ ద్వారా పార్లమెంటులోకి అడుగు పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. బిహార్ ప్రజలను భయాందోళనల్లో ముంచి వారసత్వ రాజకీయాలు చేసిన వారిని ఎన్డీయే కూటమి హద్దుల్లో ఉంచిందని చెప్పారు. బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో శనివారం జరిగిన ఒక ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. కాంగ్రెస్, ఆర్జేడీ కూటమిపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో మళ్లీ డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చిందని... అభివృద్ధికి, చట్టబద్ధ పాలనకు, మహిళలు భయం లేకుండా జీవించడానికి తనది హామీ.. అని చెప్పారు. బెంగాల్‌లోని నదియా జిల్లా క్రిషి నగర్‌లో శనివారం నిర్వహించిన మరో ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ... టీఎంసీ అంటే తూ.. మై... ఔర్ కరప్షన్(నువ్వు, నేను, అవినీతి) అంటూ మమత ప్రభుత్వంపై చెణుకులు విసిరారు.

ఎన్డీఏలో చేరిన ఆర్ఎల్డీ

న్యూఢిల్లీ, మార్చి 2: రాజకీయ వర్గాలు ఊహించిన మాదిరిగానే రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్డీ) శనివారం ఎన్డీఏ కూటమిలో చేరింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా సమక్షంలో ఆర్ఎల్డీ అధినేత జయంత్ చౌధరి ఈ మేరకు లాంఛనంగా ప్రకటించారు. ఆర్ఎల్డీ ఇంతవరకు విపక్షాలకు చెందిన ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉండేది.

అధికారంలోకి వస్తే చట్టబద్ధ ఎమ్మెస్పీ: రాహుల్

భోపాల్, మార్చి 2: కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతులకు చట్టబద్ధంగా మద్దతు ధర(ఎమ్మెస్పీ) కల్పించేలా హామీని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్చుతున్నట్టు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం పేర్కొన్నారు. రైతులు తమ ఉత్పత్తి, కష్టానికి తగిన ధరను, ఎమ్మెస్పీని మాత్రమే అడుగుతున్నారన్నారు. కానీ పంటలు కోతకు సిద్ధం కాగానే వ్యవసాయ కమోడిటీల ధరలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం తన దిగుమతి-ఎగుమతి విధానాన్ని మార్చుతోందని ఆరోపించారు. దీని వల్ల రైతులు తమ ఉత్పత్తిని తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోందని చెప్పారు. కాగా, ఇండియా కూటమి ప్రభుత్వం తొలుత కుల గణన పని చేపడుతుందని పేర్కొన్నారు.

ప్రతి పట్టణంలో అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు

న్యూఢిల్లీ, మార్చి 2: జాతీయ అర్బన్ కోఆపరేటివ్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌యూసీఎఫ్‌డీసీ)ను కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి పట్టణంలోనూ ఒక అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకును ఏర్పాటు చేయాలని ఎన్‌యూసీఎఫ్‌డీసీకి లక్ష్యం నిర్దేశించారు. ఏటీఎం సదుపాయం, క్రెడిట్/డెబిట్ కార్డులు, క్లియరింగ్ వ్యవస్థ, స్టాచుటరీ లిక్విడిటీ రేషియో (ఎస్ఎల్ఆర్) పరిమితి నిర్వహణ, రీఫైనాన్సింగ్ అందించేందుకుగాను అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు వాటికవే అప్‌గ్రేడ్ కావాలని ఆయన చెప్పారు.

పేలుళ్ల నిందితులను త్వరగా పట్టుకుంటాం

బెంగళూరు/హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో పేలుళ్ల ఘటన నిందితులను సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు సాధ్యమైనంత త్వరలో పట్టుకుంటారని కర్ణాటక సీఎం సిద్దరామయ్య విశ్వాసం వ్యక్తం చేశారు. 'మాస్క్, టోపీ ధరించిన ఒక వ్యక్తి బస్సులో వచ్చి రామేశ్వరం కేఫ్‌లోని కౌంటర్ నుంచి రవ్వ ఇడ్లీ తీసుకుని, అక్కడే కూర్చుండిపోయాడు. తర్వాత అతను టైమర్ సెట్ చేసి వెళ్లిపోయాడు. అదంతా సీసీటీవీలో రికార్డు అయింది' అని చెప్పారు. అయితే, ఘటన వెనుక ఏదైనా సంస్థ హస్తం ఉందోలేదో ఇప్పుడే చెప్పలేమన్నారు. ఈ ఘటనపై ధార్వాడ్, హుబ్బళ్లి, బెంగళూరుల్లో మొత్తం నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని పోలీసు వర్గాలు తెలిపాయి. వైదేహి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ముఖ్యమంత్రి సిద్దరామయ్య శనివారం పరామర్శించారు. కాగా, పేలుళ్ల ఘటనను మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లోని రామేశ్వరం కేఫ్‌ను సందర్శించి, సంఘీభావం ప్రకటించారు.

కాంగ్రెస్ వార్‌రూమ్ అడ్రస్ మారింది!

న్యూఢిల్లీ, మార్చి 2: ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్(ప్రధాన కార్యాచరణ వేదిక) మారింది. దాదాపు 18 ఏళ్లుగా సెంట్రల్ ఢిల్లీలో కొనసాగిన ఈ కార్యాలయం ఖాన్ మార్కెట్ పక్కనే ఉన్న భవంతిలోకి మారింది. 2004 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఏర్పాటుచేసుకున్న వార్ రూమ్ సెంట్రల్ ఢిల్లీలోని 99 సౌత్ అవెన్యూలో సుదీర్ఘకాలం కొనసాగింది. 99 సౌత్ అవెన్యూలో నివాసం ఉంటున్న రాజ్యసభ సభ్యుడు ప్రదీప్ భట్టాచార్య పదవీకాలం గత ఏడాది ఆగస్టులో పూర్తైంది. దీంతో కొత్త వార్‌రూమ్‌ను కాంగ్రెస్ ఏర్పాటుచేసుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఖాన్ మార్కెట్ ప్రాంతంలోని సుబ్రహ్మణ్య భారతి మార్గ్‌లోని సీ 1/10 భవంతిలోకి తాజాగా మార్చారు. ఇది ప్రస్తుత తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేరు మీద ఉంది. ఎంపీగా ఉన్నప్పుడు ఆయనకు ఈ బంగ్లాను కేటాయించారు. మాజీ ఎంపీలు తమకు కేటాయించిన బంగ్లాను ఖాళీ చేయడానికి కొంత సమయం ఇస్తారు. అందువల్ల సార్వత్రిక ఎన్నికలు అయ్యేవరకు ఈ బంగ్లాలో వార్‌రూమ్ నడిపించే అవకాశం ఉంది.

3 న్యూస్ చానెళ్లకు ఎన్‌బీడీఎస్ఏ జరిమానా

న్యూఢిల్లీ, మార్చి 2: విద్వేషాలు, మత కలహాలను ప్రేరేపించేలా కార్యక్రమాలను ప్రసారం చేశారంటూ మూడు న్యూస్ చానెళ్లపై న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్, డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎన్‌బీడీఎస్ఏ) చర్యలు తీసుకుంది. న్యూస్ 18 ఇండియా, టైమ్స్ నౌ నవభారత్, ఆజ్‌తక్ చానెళ్లకు జరిమానా విధించడమే కాకుండా ఆయా కార్యక్రమాల వీడియోలను ఆన్‌లైన్ (యూట్యూబ్, వెబ్‌సైట్) నుంచి తొలగించాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. శ్రద్ధావాకర్ హత్య కేసును 'లవ్ జిహాద్'గా అభివర్ణిస్తూ మత కలహాలు ప్రేరేపించేలా కార్యక్రమాలను ప్రసారం చేశారంటూ న్యూస్ 18 ఇండియాకు రూ.50 వేల జరిమానా విధించింది. 'లవ్ జిహాద్'పైనే గతేడాది మే 31న టైమ్స్ నౌ నవభారత్‌లో ప్రసారమైన కార్యక్రమానికి సంబంధించి ఆ చానెల్‌కు రూ.లక్ష జరిమానా వేసింది. భారత్‌లోని మైనారిటీలపై అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా చేసిన వ్యాఖ్యలపై ఆజ్‌తక్ నిర్వహించిన చర్చలో వ్యాఖ్యాత సుధీర్‌చౌదరి 'తుక్డే తుక్డే గ్యాంగ్, ఖలిస్థానీ ఇన్ పంజాబ్' పదాలను వాడటంపై ఆ చానెల్‌కు రూ.75 వేలు జరిమానాగా విధించింది.

మండిన రాయలసీమ... అనంతలో 41.1డిగ్రీలు

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. శనివారం రాయలసీమలో వేడి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాదిలో 40 డిగ్రీలు దాటి నమోదుకావడం ఇదే తొలిసారి. రానున్న 24 గంటల్లో రాయలసీమలో వేడి వాతావరణం కొనసాగుతుందని, కోస్తాలో ఎండ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే కోస్తాలో ఉదయం పూట మంచు కురవొచ్చు.

195 కమలాలు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థుల పేర్లను ప్రకటించగా, గుజరాత్, రాజస్థాన్‌లలో 15 మంది చొప్పున, కేరళలో 12 మంది, తెలంగాణలో 9 మంది, అస్సాం, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లలో 11 మంది చొప్పున, ఢిల్లీలో అయిదుగురు, ఉత్తరాఖండ్‌లో ముగ్గురు, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఇద్దరు చొప్పున, గోవా, త్రిపుర, డయ్యు డామన్, అండమాన్‌లలో ఒక్కొక్కరు చొప్పున అభ్యర్థులను ఖరారు చేశారు. ఢిల్లీలో ఏకంగా నాలుగు స్థానాలలో సిటింగ్ అభ్యర్థులు రమేశ్ బిధూరి, పర్వేశ్ వర్మ, మీనాక్షి లేఖి, హర్షవర్ధన్‌లను పక్కనపెట్టి ఇతరులకు కేటాయించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సాధ్వి ప్రగ్యా ఠాకూర్‌ను కూడా పక్కనపెట్టారు. కాగా బీజేపీ దివంగత నాయకురాలు సుష్మా స్వరాజ్ కుమార్తె బాన్సురీ స్వరాజ్‌కు న్యూఢిల్లీ స్థానం నుంచి అవకాశం కల్పించారు. ఆమెకు ఇది తొలి ఎన్నికల సమరం. ప్రస్తుతం ఈ స్థానం నుంచి కేంద్రమంత్రిగా ఉన్న మీనాక్షి లేఖి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

కోట నుంచి స్పీకర్ ఓం బిర్లా

ప్రధాని మోదీ తిరిగి యూపీలోని వారణాసి నుంచి, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లక్నో నుంచి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి పోటీ చేయనున్నారు. గత ఎన్నికల్లో అమేథీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఓడించిన కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని మళ్లీ అదే స్థానం నుంచి రంగంలోకి దింపారు. ఈసారి ఆ స్థానం నుంచి రాహుల్ తిరిగి తలపడతారా లేదా అన్నది కాంగ్రెస్ ఇంకా స్పష్టం చేయని విషయం తెలిసిందే. కాగా రాజస్థాన్‌కు చెందిన కేంద్రమంత్రుల్లో కార్మిక మంత్రి భూపేందర్ యాదవ్ ఆల్వార్ నుంచి, జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్ జోధ్‌పూర్ నుంచి పోటీ చేయనున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రాజస్థాన్‌లోని కోట నుంచి పోటీ చేస్తారు. సినీ నటి హేమమాలిని మళ్లీ మధుర నుంచి పోటీ చేస్తారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విదిశ నుంచి, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ సేన్ త్రిపుర వెస్ట్ నుంచి బరిలో ఉంటారు. కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తిరువనంతపురం నుంచి, వి.మురళీధర్ అట్టింగల్ నుంచి పోటీ చేయనున్నారు. కేంద్రమంత్రులు మన్‌సుఖ్ మాండవీయ, శరబానంద సోనేవాల్, కిరణ్ రిజిజు, జ్యోతిరాదిత్య సింధియా, జితేంద్రసింగ్, కిషన్‌రెడ్డి, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, అర్జున్ ముండా తదితరులకు తొలి జాబితాలో చోటు దక్కింది. కాగా, భోజ్‌పురి గాయకుడు, నటుడు పవన్ సింగ్‌కు పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి పోటీ పడే అవకాశం లభించింది. యూపీలో మాజీ బీఎస్పీ ఎంపీ రితేశ్‌పాండేకు (అంబేద్కర్‌నగర్), జార్ఖండ్‌లో కాంగ్రెస్ మాజీ ఎంపీ గీతా కోడాకు (సింఘ్‌బమ్) అవకాశం కల్పించారు. తొలి జాబితా అభ్యర్థులలో 28 మంది మహిళలు, 47 మంది యువ నేతలు, 27 మంది షెడ్యూల్డు కులాలు, 18 మంది షెడ్యూల్డు జాతులు, 57 మంది ఓబీసీ వర్గాలకు చెందిన వారున్నారు.

మరింత మెజారిటీ సాధిస్తాం

పార్టీ అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఢిల్లీలో ప్రకటించారు. మోదీ సారథ్యంలో మూడోసారి మరింత అధిక మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీని అన్ని రాష్ట్రాల్లోనూ విస్తరిస్తున్నామని, ఎన్డీఏ కూటమిని కూడా బలోపేతం చేస్తామని తెలిపారు. తొలి జాబితా ఖరారు కోసం బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ గురువారం రాత్రి ఐదు గంటలకుపైగా సమావేశమై కసరత్తు జరిపింది. ఈ కమిటీలో ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, అమిత్‌షా సభ్యులుగా ఉన్నారు. తదుపరి జాబితా కోసం కమిటీ వచ్చే వారం సమావేశం కానుంది. ఈసారి ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 సీట్లను, ఎన్డీఏ పరంగా 400కుపైగా సీట్లను గెలవాలనే లక్ష్యాన్ని మోదీ నిర్దేశించిన విషయం తెలిసిందే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303 సీట్లు గెల్చుకుంది. ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ఈ నెలాఖరు నాటికి ప్రకటించే అవకాశం ఉంది. ఏప్రిల్-మే నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి.

తెలంగాణలో బీజేపీ తొలి జాబితా

న్యూఢిల్లీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ముక్కోణపు పోటీ నెలకొంటుందని భావిస్తున్న తెలంగాణలో మిగతా పార్టీల కంటే ముందుగా బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. తెలంగాణలో రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ సీట్లకు గాను బీజేపీకి నలుగురు ఎంపీలున్నారు. వీరిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి (సికింద్రాబాద్), జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ (కరీంనగర్), ధర్మపురి అర్వింద్ (నిజామాబాద్)లకు మళ్లీ టికెట్ దక్కింది. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు పేరు లేదు. ఇక మల్కాజిగిరి అభ్యర్థిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను ఖరారు చేశారు. ఊహించినట్లే చేవెళ్ల, భువనగిరిలలో మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్‌కు అవకాశం దక్కింది. హైదరాబాద్ సీటుకు విరించి ఆస్పత్రుల ఛైర్‌పర్సన్ డాక్టర్ కొంపెల్ల మాధవీ లతను ప్రకటించారు. కాగా, బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు ఒక్క రోజులోనే టికెట్ లభించింది. రెండు రోజుల కిందట తండ్రితో కలిసి కాషాయ జెండా కప్పుకొన్న ఎంపీ పి.రాములు కుమారుడు భరత్‌ప్రసాద్‌ను నాగర్‌కర్నూల్‌లో పోటీకి నిలిపారు.

నన్ను రాజకీయ బాధ్యతల నుంచి తప్పించండి
గౌతమ్ గంభీర్

తనను రాజకీయ బాధ్యతల నుంచి తప్పించాలని మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కోరారు. తాను క్రికెట్‌పై మరింత దృష్టి పెట్టాల్సి ఉందని, కొన్ని ఒప్పందాలను పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. గంభీర్ ప్రస్తుతం ఈస్ట్ ఢిల్లీ ఎంపీగా ఉన్నారు. తాజా ప్రకటనతో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గంభీర్ పోటీ చేయబోరని తేలిపోయింది. అయితే, ఈస్ట్ ఢిల్లీ సహా ఏ స్థానంలోనైనా అభ్యర్థులుగా ప్రకటించే అవకాశం ఉన్నవారి జాబితాలో గంభీర్ పేరు లేదని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి జయంత్ సిన్హా కూడా తనకు రాబోయే ఎన్నికల్లో టికెట్ ఇవ్వవద్దని బీజేపీ అధిష్ఠానాన్ని కోరారు.

నదీగర్భంలో తొలి మెట్రో మార్గం

కోల్‌కతాలోని హుగ్లీ నది అడుగున నిర్మాణం

ఈ నెల ఆరోతేదీన ప్రారంభించనున్న మోదీ

కోల్‌కతా, మార్చి 2: దేశంలోనే తొలిసారి నదీగర్భంలో నిర్మించిన మెట్రో మార్గాన్ని ఈ నెల ఆరోతేదీన ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. అతి లోతైన నదిగా పేరు తెచ్చుకున్న కోల్‌కతాలోని హుగ్లీ నదీ గర్భంలో ఈ మార్గం ఏర్పాటుచేశారు. నదీమట్టానికి 32 అడుగుల లోతున, 520 మీటర్ల పొడవునా ఈ నిర్మాణం జరిగింది. హుగ్లీ తూర్పు, పశ్చిమ తీరాల్లో మహాకరణ్, హవ్‌డా రైల్వే స్టేషన్లు నిర్మించారు. ఈ రెండు స్టేషన్లను మెట్రో మార్గం అనుసంధానిస్తుందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. మెట్రో మార్గం అందుబాటులోకి వస్తే కోల్‌కతాలో టీగోరియా స్టేషన్ నుంచి హుగ్లీ నది ఆవతలి తీరంలోని హవ్‌డా వరకు సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అలాగే.. ప్రయాణ దూరం కూడా తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుతం కోల్‌కతాలోని గ్రీన్‌లైన్ తూర్పు కోల్‌కతాలోని సెక్టార్‌వీ నుంచి ఫూల్‌బగాన్ వరకు 6.97 కిలోమీటర్ల దూరం పరుచుకొని ఉంది. మెట్రో మార్గం అందుబాటులోకి వస్తే, సెక్టార్ వీ నుంచి హౌరా వరకు అది విస్తరించి.. 27 నిమిషాల్లోనే ఆ దూరాన్ని అధిగమించే వీలు కలుగుతుందని మంత్రి తెలిపారు. కాగా, దాదాపు వెయ్యి అమృత్ భారత్ రైళ్లను రానున్న సంవత్సరాల్లో తయారుచేయనున్నట్టు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గంటకు 250 కిలోమీటర్లు ప్రయాణించేలా వాటిని సిద్ధంచేస్తున్నాట్టు చెప్పారు.



'అత్యంత పేదరికాన్ని' నిర్మూలించిన భారత్

అమెరికా మేధో సంస్థ బ్రూకింగ్స్ నివేదికలో వెల్లడి




న్యూఢిల్లీ, మార్చి 2: అత్యంత పేదరికాన్ని భారత దేశం అధికారికంగా నిర్మూలించిందని అమెరికాకు చెందిన మేధో సంస్థ బ్రూకింగ్స్ వెల్లడించింది. ప్రధాని మోదీ ప్రభుత్వం పాటించిన బలమైన విధానాలే దీనికి కారణమని పేర్కొంది. బ్రూకింగ్స్ సంస్థ విడుదల చేసిన ఈ నివేదికను ఆర్థికవేత్తలు సుర్జిత్ భల్లా, కరన్ భాసిన్ రూపొందించారు. తీవ్ర పేదరికాన్ని భారత్ అధికారికంగా నిర్మూలించిన విషయాన్ని తలసరి పేదరిక నిష్పత్తిలో గణనీయమైన క్షీణత, గృహ వినియోగంలో స్పష్టమైన పెరుగుదల ధ్రువీకరిస్తున్నాయని ఈ నివేదిక తెలిపింది. 2022-23కి సంబంధించిన అధికారిక వినియోగ వ్యయ గణాంకాలను భారత్ ఇటీవల విడుదల చేసింది. ఇది గత పదేళ్లలో దేశానికి మొదటి అధికారిక సర్వే-ఆధారిత పేదరిక అంచనాల సమాచారం అందిస్తుంది. దీని ప్రకారం 2011-12 నుంచి వాస్తవ తలసరి వినియోగంలో ఏడాదికి 2.9శాతం చొప్పున వృద్ధి నమోదైంది. ఈ సమయానికి పట్టణ వృద్ధి రేటు (2.6%)తో పోలిస్తే గ్రామీణ వృద్ధి రేటు (3.1%) గణనీయంగా పెరిగింది. పట్టణ, గ్రామీణ అసమానతలు అనూహ్యంగా తగ్గుముఖం పట్టాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇవి ఆర్థిక వృద్ధి, అసమానతలో భారీ క్షీణత దేశంలో పేదరికాన్ని తొలగించడానికి దోహదపడ్డాయని నివేదిక పేర్కొంది. ప్రపంచ బ్యాంకు అంచనాల కంటే భారత్‌లో పేదల సంఖ్య చాలా తక్కువగా ఉందని తేల్చింది. భారత్‌లో పేదరికం 5 శాతానికి తగ్గిందని ఇటీవల నీతి ఆయోగ్ ప్రకటించింది. కొద్ది రోజుల వ్యవధిలోనే బ్రూకింగ్స్ సంస్థ.. భారత్‌లో దుర్భర పేదరికం అనుభవిస్తున్న వారి సంఖ్య 2% కంటే తక్కువేనని స్పష్టం చేసింది. గ్రామీణ పేదరికం 2.5% ఉండగా, పట్టణ పేదరికం 1 శాతానికి తగ్గిందని పేర్కొంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభా నిష్పత్తి (హెచ్‌సీఆర్) 2011-12లో 12.2 శాతం ఉండగా అది 2022-23లో 2 శాతానికి తగ్గింది. గతంలో భారత్ ఈ స్థాయిలో తగ్గింపు సాధించడానికి 30 ఏళ్లు పట్టింది. అయితే ఇప్పుడు కేవలం 11 ఏళ్లలోనే దీన్ని సాధించడం విశేషం. 'సబ్ కా సాథ్- సబ్ కా వికాస్' నినాదంతో లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న మోదీ సర్కారుకు ఈ నివేదిక పెద్ద సానుకూల అంశంగా మారనుంది.

పోలీసు రికార్డులు సాక్ష్యాలా?

» ఎవిడెన్స్ యాక్ట్ అందుకు అనుమతించదు

» గంజాయి పట్టివేత కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పును తీవ్రంగా తప్పుబట్టిన సుప్రీంకోర్టు

» నిందితుల విడుదలకు ఆదేశాలు



న్యూఢిల్లీ, మార్చి 2: గంజాయి పట్టివేత కేసులో ఇద్దరు వ్యక్తులకు తెలంగాణ హైకోర్టు విధించిన శిక్షను సుప్రీం కోర్టు కొట్టివేసింది. విచారణ సందర్భంగా హైకోర్టు తీర్పును తీవ్రంగా తప్పుబట్టింది. వీసమెత్తు సాక్ష్యాధారాలు కూడా లేకుండానే నిందితులకు శిక్ష విధించారని, విచారణ కోర్టు వేసిన శిక్షను హైకోర్టు ఏమాత్రం సమీక్షించకుండా యాంత్రికంగా ఆమోదించిందని మండిపడింది. నిందితులకు శిక్ష నుంచి విముక్తి ప్రసాదిస్తూ తీర్పు జారీ చేసింది. కారులో 80 కిలోల గంజాయిని తరలిస్తున్నారన్న ఆరోపణలపై మహమ్మద్ ఖాలిద్‌తోపాటు మరో వ్యక్తిని పోలీసులు 2009లో అరెస్టు చేశారు. 2010లో విచారణ కోర్టు నార్కోటిక్ చట్టం కింద.. నిందితులు నేరానికి పాల్పడ్డారంటూ తీర్పు చెప్పింది. దీనిపై వారు హైకోర్టులో అప్పీల్ చేయగా.. హైకోర్టు 2022 నవంబరులో విచారణ కోర్టు ఇచ్చిన ఆదేశాలనే సమర్థించింది. దీనిపై నిందితులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కేసుపై విచారణ జరిపింది. పోలీసు అధికారి రికార్డు చేసిన నిందితుల వాంగ్మూలాన్ని ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 25 ప్రకారం సాక్ష్యంగా అంగీకరించలేమని, ఈ విషయాన్ని విచారణ కోర్టు, హైకోర్టు పూర్తిగా విస్మరించాయని ధర్మాసనం పేర్కొంది. పోలీసులు రికార్డు చేసిన స్టేట్‌మెంట్లను, ఇంటరాగేషన్ నోట్స్‌ను సాక్ష్యంగా ఎలా పరిగణిస్తారని నిలదీసింది. ఈ కేసులో పట్టుబడిన గంజాయిని సరిగా భద్రపరచలేదని, ఫోరెన్సిక్ పరీక్షలనూ సరిగా జరపలేదని ధర్మాసనం పేర్కొంది. 'మిర్చి బస్తాలతో కలిపి గంజాయిని పట్టుకున్నట్లు రికార్డుల్లో ఉంది. కానీ, మిర్చిని వేరు చేసి వాస్తవానికి దొరికిన గంజాయి ఎంత అన్నదానిని సదరు అధికారి లెక్కించనేలేదు. పంచనామాలోనైతే గంజాయితోపాటు మిర్చి కూడా ఉందన్న విషయమే లేదు' అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. విచారణ కోర్టు, హైకోర్టుల తీర్పులను కొట్టివేస్తూ నిందితులను విడుదల చేయాలని ఆదేశించింది.

ద్విసభ్య ధర్మాసనం తీర్పును ఇద్దరు జడ్జిల బెంచ్ ఎలా కొట్టివేస్తుంది?

బిల్కిస్ కేసు ముద్దాయిల పిటిషన్

న్యూఢిల్లీ, మార్చి 2: తమ శిక్షను తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడాన్ని ఇద్దరు ముద్దాయిలు సవాలు చేశారు. దీనిపై మళ్లీ సుప్రీంకోర్టులోనే పిటిషన్ దాఖలు చేశారు. బిల్కిస్‌బానోపై గ్యాంగ్‌రేప్ కేసులో 11 మందికి విధించిన యావజ్జీవ కారాగార శిక్షను ఇటీవల గుజరాత్ సర్కారు తగ్గించింది. దీనిపై సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు కాగా, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టేసింది. దాంతో ముద్దాయిలంతా మళ్లీ జైలుకు వెళ్లారు. ఈ తీర్పును రాధేశ్యాం భగవాన్ దాస్ షా, రాజుభాయ్ బాబూలాల్ సోని అనే ముద్దాయిలు సవాలు చేశారు. ఇదే అంశంపై సుప్రీంకోర్టులోని ఒక ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును మరో ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసినట్టయిందని, ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. బిల్కిస్‌బానోపై అత్యాచారం గుజరాత్‌లో చోటుచేసుకోగా, కేసు విచారణ మాత్రం మహారాష్ట్రలో జరిగింది. ఈ నేపథ్యంలో ముద్దాయిలకు శిక్ష తగ్గింపు అధికారం ఏ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్న ప్రశ్న తలెత్తింది. ఆ అధికారం గుజరాత్ ప్రభుత్వానికే ఉందని జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ విక్రంనాథ్‌ల సుప్రీం ధర్మాసనం తీర్పు చెప్పింది. దీన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలు కాగా, ఈ సారి జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ముద్దాయిలు మళ్లీ జైలుకు వెళ్లాలని ఆదేశాలు ఇచ్చింది.

దేశంపై దాడులకు కుట్ర!

» పీఎఫ్ఐ నేత అబ్దుల్ సలీమ్ అరెస్టు.. ఏపీలో పట్టివేత

హైదరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) కీలక నేత అబ్దుల్ సలీమ్‌ను ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఇతను పీఎఫ్ఐకి రాష్ట్ర కార్యదర్శి(ఉత్తర తెలంగాణ)గా పనిచేస్తుండగా.. నిజామాబాద్ పీఎఫ్ఐ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడు. దేశంలో కుట్రలకు పీఎఫ్ఐ స్కెచ్ వేసిందని ఎన్ఐఏ స్పష్టం చేసింది. తెలంగాణ సహా.. దేశరాజధాని ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, బిహార్ తదితర ప్రాంతాల్లో ఓ వర్గం వారిని టార్గెట్‌గా చేసుకుని దాడులు చేసేందుకు పీఎఫ్ఐ శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు ఎన్ఐఏ వివరించింది. ఈ సంస్థపై కేంద్ర హోంశాఖ ఇప్పటికే నిషేధం విధించింది. ఈ క్రమంలోనే 2022లో నిజామాబాద్, హైదరాబాద్, ఏపీలోని పలు ప్రాంతాల్లో ఎన్ఐఏ దాడులు చేసి, పలువురిని అరెస్టు చేసింది. సలీమ్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. ఇంతకాలం అజ్ఞాతంలో ఉన్న సలీమ్.. ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా మైదుకూరులో ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. దీంతో అతన్ని శనివారం అరెస్టు చేసి, హైదరాబాద్‌కు తరలించినట్లు ఎన్ఐఏ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సలీమ్‌పై రూ.2లక్షల రివార్డు ఉంది. సలీమ్ అరెస్టుతో.. ఈ కేసులో అరెస్టుల సంఖ్య 15కు చేరింది. 2022 జూలైలో నిజామాబాద్ పోలీసులు తొలుత కేసు నమోదు చేయగా.. కుట్ర, ఉగ్ర శిక్షణ వంటి చర్యలు, తీవ్రత నేపథ్యంలో ఎన్ఐఏ దర్యాప్తును స్వీకరించింది. ఇదిలా ఉండగా, ఎఫ్ఐ నాయకుడు, మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ మహమ్మద్ గౌస్ నియాజీని ఎన్ఐఏ దక్షిణాఫ్రికాలో అరెస్టు చేసింది. 2016లో బెంగళూరులో ఆరెస్సెస్ నాయకుడు రుద్రేశ్ హత్య కేసులో అతడు నిందితునిగా ఉన్నాడు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతుండడంతో పట్టుకున్నవారికి రూ.5 లక్షల బహుమతి ఇస్తామని అధికారులు ప్రకటించారు కూడా.

సత్యేందర్ జైన్‌పై సీబీఐ దర్యాప్తునకు అనుమతి



న్యూఢిల్లీ, మార్చి 2: ఆప్ నాయకుడు, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌పై విచారణ జరిపేందుకు సీబీఐకి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా శనివారం అనుమతి ఇచ్చారు. జైన్ హోం మంత్రిగా ఉన్నప్పుడు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఆమోదం తెలిపారు. జైలులో ఉన్న ప్రముఖ ఖైదీలకు అక్కడ తగిన సౌకర్యాలు కల్పించేందుకు 'ప్రొటక్షన్ మనీ' కింద సొమ్ము వసూలు చేశారన్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేయనుంది. జైలులో సౌకర్యవంతంగా, ప్రశాంతంగా ఉండేందుకు రూ.10 కోట్లను పలు విడతలుగా ఇచ్చానంటూ ఆర్థిక నేరగాడు సుఖేష్ చంద్రశేఖర్ ఆరోపించిన నేపథ్యంలో ఈ దర్యాప్తు జరగనుంది. లెఫ్టినెంట్ గవర్నర్ నిర్ణయాన్ని ఆప్ ఖండించింది. కేవలం ఒక ఆర్థిక నేరగాడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే నిర్ణయం తీసుకోవడాన్ని తప్పు పట్టింది. ఇది చట్టాన్ని అపహాస్యం చేయడమేనని వ్యాఖ్యానించింది.

అత్యాశకు పోతే.. ఉన్నది పోయింది!

» అమెరికాలో అయిదుగురు గుజరాతీ సోదరుల వ్యాపార వివాదం

» హస్తగతం చేసుకొని మిగిలిన వారిని వెళ్లగొట్టిన హరీశ్ జొగానీ

» తప్పుబట్టిన కోర్టు.. సోదరులకు రూ.20 వేల కోట్లు చెల్లించాలని తీర్పు

వాషింగ్టన్, మార్చి 2: అయిదుగురు అన్నదమ్ములు.. వేల కోట్ల వజ్రాల వ్యాపారం దానికితోడు రియల్ ఎస్టేట్ కంపెనీ.. అందరూ కలిసికట్టుగా నిర్మించుకున్న వ్యాపార సామ్రాజ్యాన్ని ఒక్కడే సొంతం చేసుకోవాలని భావించాడు.. మిగిలిన వారు కోర్టుకెక్కారు.. 21 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు.. అన్నదమ్ములకు వాటాలు పంచి ఇచ్చింది.. సోదరులను మోసగించినందుకు అక్షరాల రూ.20 వేల కోట్ల పరిహారం వారికి చెల్లించాలని 'ఆ ఒక్కడికి' షాక్ ఇచ్చే తీర్పునిచ్చింది. గుజరాత్‌కు చెందిన శశికాంత్ జొగానీ 22 ఏళ్ల వయసులో 1969లో అమెరికాలోని కాలిఫోర్నియాకు వచ్చి వజ్రాల వ్యాపారం ప్రారంభించాడు. తర్వాత కాలంలో తన నలుగురు సోదరులు హరీశ్, రాజేష్, శైలేష్, చేతన్‌లను గుజరాత్ నుంచి తీసుకొచ్చి వ్యాపారంలో భాగస్వామ్యం ఇచ్చాడు. వ్యాపారం అమెరికాతోపాటు యూరప్, ఆఫ్రికా, మధ్యప్రాచ్యానికి విస్తరించింది. అయితే తర్వాత, సోదరుల మధ్య ఆస్తి వివాదాలు పెరిగాయి. వ్యాపారం మొత్తాన్ని హరీశ్ జొగానీ హస్తగతం చేసుకున్నాడు. శశికాంత్‌తోపాటు మిగిలిన ముగ్గురినీ కంపెనీ నుంచి తొలగించాడు. దీనిపై 2003లో న్యాయ పోరాటం మొదలైంది. 21 ఏళ్లలో ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. అప్పీళ్ల మీద అప్పీళ్లు దాఖలయ్యాయి. మొత్తమ్మీద లాస్‌ఏంజెల్స్ సుపీరియర్ కోర్టు దీనిపై తాజాగా తీర్పునిస్తూ.. అన్నదమ్ముల మధ్య వ్యాపార భాగస్వామ్యం నిజమని నిర్ధారిస్తూ.. ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకుగాను నలుగురు సోదరులకు హరీశ్ జొగానీ 250 కోట్ల డాలర్ల (దాదాపు రూ.20 వేల కోట్ల) నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. రియల్ ఎస్టేట్ కంపెనీలో సగం వాటా శశికాంత్‌దేనని, మిగిలిన సగంలో హరీశ్‌కు 24%, రాజేష్‌కు 10%, శైలేష్‌కు 9.5%, చేతన్‌కు 6.5% వాటా ఉంటుందని తీర్పు చెప్పింది.

జగన్ ఓడితేనే సర్పంచ్‌లకు మనుగడ: వైవీబీ

ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఉద్రిక్తత

ఏలూరు కలెక్టరేట్, మార్చి 2: 'రాష్ట్రంలో గ్రామీణ ప్రజల జీవనస్థితిగతులు మెరుగుపడాలంటే సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలి. జగన్ ఓడితేనే సర్పంచ్‌లకు మనుగడ. 14, 15 ఆర్థిక సంఘం నిధులు కాజేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలి'.. అంటూ ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.బి.రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. 16 డిమాండ్ల సాధన కోసం ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద శనివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. సర్పంచ్‌లు, కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకోగా ఉద్రిక్తత నెలకొంది. ఈ సమయంలో పోలీసులు సర్పంచ్‌లను బలవంతంగా వెనక్కి నెట్టివేశారు. బారికేడ్లు తోసుకుని సర్పంచ్‌లు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు మెయిన్‌గేటును మూసివేయడంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 3.5 కోట్ల గ్రామీణ ప్రజల జీవనస్థితిగతులు మెరుగుపడాలంటే జగన్‌ను ఇంటికి పంపాలన్నారు.


సర్పంచ్ గొంతు పట్టుకుని నెడుతున్న పోలీస్



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

- తిరుమల

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ కుల ఆస్తి పట్టింపు లేదు /కమ్మ / డైవర్సీ / పిల్లలు లేరు / Fair / 41y/5'5"/ MD General Doctor / మంచి ఆస్తి కలిగిన వధువుకు 1,2వ వరుడు కావలెను. వాట్సాప్ : 9705864549 AJH-002226

★ రెడ్డి /విడో/వయస్సు : 30 / డిగ్రీ / OWN BUSINESS, కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు) అన్ని కులాలు వారికి సంబంధాలు చూడబడును. ఫోన్ : 9515673252 AJH-002275

★ కుల పట్టింపు లేదు / 21y & 23y & 25y & 27y & 29y & 31y & 33y & 35y & 37y & 39y & 40y & 42y & 44y & 45y & 46y & 48y & 50y & 52y & 54y & 56y & 58y & 60y & 61y & 63y/ "మాసేవ" (Since 1998) : PH/WA: 9291503949 AJH-3700

★ 55y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / Govt. Job / పిల్లలు లేరు /సొంత ఇల్లు రెంట్స్, / సొంత ప్రాపర్టీ / ఏ బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 7995376608 AJH-3700

★ 60y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / Govt Rtd / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ /సొంత ల్యాండ్స్ / వెల్ సెటిల్డ్ ఏ బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 9030858258 AJH-3700

★ రెడ్డి / 46y /5'4" / డిగ్రీ / G. Employee / సొంత ఇల్లు / బాగా స్థిరపడిన పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. కులపట్టింపు లేదు. ఫోన్ : 7396608019 / 8019484384 AJH-002227

★ వైశ్య / 53y /5'4" / బిజినెస్ / పొలాలు / విడో వధువుకి వరుడు కావలెను. పిల్లలున్నా OK. / కుల ప్రసక్తి లేదు. ఫోన్ : 8019484384 / 7396608019 AJH-002227

★ ఆర్య వైశ్య / 21y & 23y & 25y & 26y & 28y & 30y & 32y & 34y & 35y & 36y & 38y & 39y & 40y & 42y & 43y & 45y & 46y & 48y & 50y & 52y & 53y & 55y & 57y & 59y/ డి.సుధా గుప్తా "మాసేవ" (Since 1998) : PH/WA: 9291503949 AJH-3700

★ కమ్మ / కుల ఆస్తి పట్టింపు లేదు /31y/5'5"/ లేట్ మ్యారేజ్ / Fair / Govt. Teacher / మంచి సాలరీ / మంచి ల్యాండ్ / ఓన్ హౌస్ / వెల్ సెటిల్డ్ గల ఫ్యామిలీ లేని వధువుకు తగిన వరుడు కావలెను. వాట్సాప్ : 9133451145 AJH-002226

★ కుల పట్టింపు లేదు /చౌదరి / 2nd మ్యారేజ్ / 40y/5'6"/ Doctor /Gynecologist / వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ అందమైన వధువుకు 1,2వ వరుడు కావలెను. వాట్సాప్ : 8465934486 AJH-002226

★ 62 సం.ల / విడో / సొంత ఇల్లు / పిల్లలు లేరు / ★ 52 సం.లు / మంచి జీతం / సొంత ఇల్లు / కుల పట్టింపు లేదు : ఫోన్ : 8523840236 AJH-14164

★ కుల పట్టింపు లేదు / రెడ్డి / 26y / B.Tech / 5'4" / పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్ లో సెండ్ చెయ్యండి. ఫోన్ : 9885463158 AJH-14164

★ 2వ పెళ్ళి / B.Tech(CSE)/ సాఫ్ట్‌వేర్ / 31 సం./ 5'3"/మంచి జీతం గల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9963757612 AJH-14164

★ బ్రాహ్మణ / 27y / 5'4"/ B.Com కంప్యూటర్స్ / Pvt. జాబ్ / అందమైన వధువుకు తగిన జాబ్ / బిజినెస్ / పురోహితం వరుడు కావలెను. ఫోన్: 9701743336 AJH-14163

★ రెడ్డి, ఆస్తి, ప్రసక్తి లేదు/విడో / 45y / Govt. Employee / Own House Agriculture Land / పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. సెల్: 9676896226 AJH-002274

★ కుల పట్టింపు లేదు/42y /విడో/ Andhra / / పిల్లలు లేరు / మెడికల్ డిపార్ట్‌మెంట్ / మంచి జీతం / సొంత ఇల్లు /ల్యాండ్స్ / అమ్మ సంరక్షణలో ఉంటున్న వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 7075948409 AJH-002274

★ కుల పట్టింపు లేదు/50y /విడో/ Andhra /Govt. Job /సొంత అపార్ట్‌మెంట్ / ల్యాండ్స్ / ఒంగోలు, గుంటూరు / విజయవాడ వారికి ప్రాధాన్యత. ఫోన్ : 9989350417 AJH-002274

★ కుల పట్టింపు లేదు/విడో/ 40y /Andhra /Govt. Employee / మంచి జీతం / ఓన్ హౌస్ / రెంట్స్ / అగ్రికల్చర్ ల్యాండ్స్ / పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8374476725 AJH-002274

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు/48y /Tirupathi /Anantapur / Widow / Family Pensioner / Good Salary / Own House / Rents / 1 Girl Settled / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 7286976721 AJH-002275

★ రెడ్డి / కుల ప్రసక్తి లేదు/Age : 30 QLY:MBA, ట్రావెల్స్ Business కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. ఫోన్ : 9121300377 AJH-002275

★ రెడ్డి : Age (25 to 40) 1st మ్యారేజ్, రెండవ పెళ్లి, ఆంధ్ర, తెలంగాణలో ఉన్న అమ్మాయిలకి మంచి సంప్రదాయ కుటుంబ వరులు కావలెను. జాబ్ లేదా బిజినెస్ సెల్ : 9110329179 AJL_180458

★ యాదవ / 28y/5'4"/ MBA / డైవర్సీ / స్థిరాస్తులు కలిగిన అందమైన వధువుకు / రెడ్డి / కమ్మ / ఆర్య వైశ్య / పద్మశాలి / వరుడు కావలెను. (డైరెక్ట్)(నో బ్రోకర్స్). ఫోన్ : 9440506975 AJH-002231

★ రెడ్డి విడో / కుల, మత ఆస్తి ప్రసక్తి లేదు / Age : 29, Qly : డిగ్రీ / సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd OK. Ph: 9849337176 AJH-002231

★ కాపు నాయుడు: మొదటి సంబంధం, 10th To డిగ్రీ, చదివిన, అలాగే కమ్మ 1st మ్యారేజ్, 10th To B.Tech అమ్మయిలకు ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరులు కావలెను.సెల్ : 9110329179 AJL_180458

★ SC / మాదిగ / 36 Y / 5'6" / B .Tech / బ్యాంక్ ఆఫీసర్ Well Settled 2nd మ్యారేజ్ వధువుకు Govt. వరుడు కావలెను. నో బ్రోకర్స్ సంప్ర. 7032 44 9889 AJB-181891

★ కుల పట్టింపు లేదు / విడో / పిల్లలు లేరు / 60 Y / ఓన్ బిజినెస్ / ఓన్ కార్ / రెంట్స్ / ఓన్ అపార్ట్‌మెంట్ / మంచి ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. సంప్ర. 83175 07910 AJB-999

★ ఆర్యవైశ్య : మొదటి సంబంధం, డిగ్రీ, ప్రైవేట్ జాబ్, ఫాదర్ కిరాణం షాప్, మిడిల్ క్లాస్, సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి వరుడు కావలెను Age (25 to 35). (AP & TS) సెల్ :9110329179 AJL_180458

★ రెడ్డి డాక్టర్ / 1990/ 5'-10" / M.D. (DVL) / డెర్మటాలజిస్ట్ / మంచి ప్రాపర్టీ / పేరెంట్స్ Hyd లో సెటిల్డ్ వధువుకు / Hyd లో వెల్ సెటిల్డ్ / 5'-11" పైన ఎత్తు గల రెడ్డి వరుడు కావలెను. సెల్ :94404 61893 AJK-15038

★ ఆచారులు (విశ్వబ్రాహ్మన్స్) : 10th To డిగ్రీ, సొంత ఇల్లు, స్థిరాస్తి యాదవులు (గొల్లలు) 10th To డిగ్రీ, సొంత ఇల్లు, ప్రైవేట్ జాబ్ ఉన్న అమ్మాయిలకు వరులు కావలెను. సెల్ : 9110329179 AJL_180458

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9703618806, 9985921386, 9985921380

వధువు కావలెను



★ BCA / 63y / 5'6" / Fair / రిటైర్డ్ ఎంప్లాయ్ / సొంత ఇల్లు కలిగిన వరునకు ఎలాంటి బాదరబందీలేని వధువు కావలెను. మీ బయోడేటాను వాట్సప్‌లో పంపండి. (నో బ్రోకర్స్) (డైరెక్ట్) ఫోన్ : 9391147135 AJH-002231

★ 30y/5'6"/ గ్రాడ్యుయేట్ బిజినెస్/ మంచి ప్రాపర్టీ దూరేకుల వరునికి ఇంటి వద్ద ఉండే వధువు కావలెను. Any muslim sub caste OK. OTHER CASTE NOBAR కట్నం ప్రసక్తి లేదు. డైరెక్ట్ : 6301238816 AJH-002275

★ పద్మశాలి / కుల పట్టింపు లేదు / 39y /5'5"/ ప్రై.జాబ్ / మంచి జీతం / రెండు సొంత ఇండ్లు కిరాయిలు గల వరునికి కట్నం ప్రసక్తి లేని / జాబ్ ఉన్న లేని వధువు కావలెను. డైరెక్ట్ - 9396365661 AJH-3700

★ కమ్మ / 35y /5'7"/ ఫామ్‌హౌస్ డెవలప్ / వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్ సంప్ర: 9885414720 AJH-3700

★ కుల పట్టింపు లేదు / 53y /రెండవ పెళ్ళి/ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయి / వెల్ సెటిల్డ్ వరునకు బీదరికంగా ఉన్న పర్వాలేని / ఏ బాదరబందీలేని వధువు కావలెను. డైరెక్ట్ - 9499947658 AJH-3700

★ రెడ్డి / 33y /5'10" / బిజినెస్ / Land, Own Shopping Mall. Well Settled వరుడికి వధువు కావలెను. Contact. Direct : No Brokers / 8019468462 / 8897213126 AJH-002227

★ వడ్డెర / BE/ మెకానికల్ / C.Govt. / కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ / మంచి జీతం / 5'8" ఎత్తు / 29 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9618579861 AJH-14164

★ SC మాల / కట్నం ప్రసక్తి లేదు / B.Sc / Govt. డిప్యూటీ తహసీల్దార్ / రెవెన్యూ Dept. / 5'7" ఎత్తు / 32 సం.ల వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 8897389698 AJH-14164

★ మున్నూరుకాపు /40y/5'4"/ లేట్ మ్యారేజ్ / MBA / SAP కన్సల్టెంట్/ మంచి జీతం / SWE/Hyd ఏ బాదరబందీలేని వరుడికి సాంప్రదాయ వధువు కావలెను. అర్జంట్, నో మీడియేటర్స్ ఫోన్: 9346344474 AJH-14163

★ మంచి గుణము, ఓపెన్ మైండ్ గల వధువు కావలెను. రెడ్డి/CNB/30y / 5'8"/PG/మంచి ఆదాయం/ మంచి ఆస్తి ★ రెడ్డి /27y / B.Tech/మంచి /జీతం/ మంచి ఆస్తి అర్జెంట్ / వాట్సాప్ : 8187053655/6303293337 AJH-14163

★ కుల కట్నం ప్రసక్తి లేదు/SC మాల/ లేటు మ్యారేజ్ / /47y/5'1"/B.Tech, MBA, LLB, Ph.D/మంచి ఆస్తి, కొంచెం శారీరక వైకల్యం కాలు/ హైదరాబాద్‌లో స్థిరపడిన వరుడికి 1st/2nd వధువు కావలెను. డైరెక్ట్ ఫోన్: 7702438915 AJH-002231

కళ్యాణ వేదిక

★ కమ్మ చౌదరి మ్యారేజెస్ / హైరేంజ్ / హై స్టడీస్ / Engineers & Doctors ఇండియా మరియు అబ్రాడ్, లేట్, Ist మరియు IInd. సంప్ర:9100189499 / Mail:amaravatimatri25@gmail.com AJH-3700

★ 14/04/2024 బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online) Free Registration. Bhavani Matrimony, Hyd. Ph: 9704656103 (9533608887 - Whatsapp) AJH-14164

★ Free Registration (బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్ర: 9704656103 / 9533608887 (Whatsapp) AJH-14164

★ గంగపుత్రుల (అగ్నికుల క్షత్రియ, బెస్త, గూండ్ల, వాడబలిజ, జాలరి, వడ్డీలు, నెయ్యాల, పల్లెకార్లు, పన్నెరెడ్డి) పెళ్లి సంబంధాలకై సంప్రదించండి. వాట్సాప్ నెంబర్: 9494843809 AJH002226

★ మైత్రి కళ్యాణవేదిక. రెడ్డీలకు మాత్రమే. LOCAL / ABROAD సంబంధాలు చూడబడును. NO FEES / G.S. REDDY, LB NAGAR, Ph:8897213126, 8019468462 AJH002227

★ 'JAYASIMHA PARINAYA VEDIKA' offer suitable high level profiles of bridegrooms in all communities, Whatsapp: 9000803380 only. AJH-52143

★ మన ముదిరాజ్ మ్యాట్రిమోని, ముదిరాజ్ వధూవరుల వివాహ పరిచయ వేదిక మార్చి 31 (ఆదివారం) సికాఫ్‌మండి, సికింద్రాబాద్ నందు నిర్వహించబడును. రిజిస్ట్రేషన్ ఫీజు : 500/-. ఫోన్ : 9985555136 / 9014342767 AJH-14164

★ కాపు, బలిజ, మున్నూరుకాపు, Since 24 yrs, NR, డాక్టర్స్, ఇంజనీర్స్, Govt. హైప్రొఫైల్స్, మిడిల్ క్లాస్, 2nd మ్యారేజెస్ ప్రత్యేక శ్రద్ధతో చూడబడును. ఫోన్: 9346344474. Web:www.priyadarshinimatrimony.com AJH-14163

★ గోకుల్ మ్యారేజ్ బ్లెస్ : గుడె వెంకటప్పయ్య చౌదరి, కమ్మ వధూవరుల వివాహ వేదిక. కానూరు, విజయవాడ & చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్. సంప్ర. 94401 53991 AJB-181894

★ తేది 03.03.2024న 1వ కోమట్లు, వధూవరుల స్వయంవరం. ఫీజు 1 సీటుకు రూ.150/-లు. వినాయక వివాహాలు, M.9.H.B., మునుగోడు రోడ్, నల్లగొండ. 9618418981, బయోడేటా, 120 సీట్లు. AJY_134922

శారద వివాహ వేదిక

Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com
EXCLUSIVE CHOWDARY COMMUNITY
Hyderabad. Phone: 9849413031

కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : USA Citizens 30 Cr B.Tech MS 29 / 50 Cr. B.Tech MS 27 / 15 Cr. B.Tech MS 40 / 100 Cr. USA Doctor 34 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 500 Cr. MBBS MD 34 / 100 Cr MBBS MD 25 / 50 Cr MBBS MD Pediatrics / 20 Cr MBBS MD 30 / 15 Cr MBBS MD GS 31 / 20 Cr MBBS MD Pediatrics 29 / 10 Cr MBBS MD DM 35 / 20 Cr MBBS MD Ortho 34 / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 40 B.Tech 15 Cr / 43 MSc 50 Cr / 10 Cr B.Tech 24L PA 39 / 15 Cr B.Tech MS 35 / 20 Cr B.Tech MS 33 / 50 Cr B.Tech 30 / 5 Cr B.Tech 29 / 20 Cr B.Tech MBA 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(రెండో పెళ్ళి): 31 B.Tech IIT MS Business Hyderabad 20 Cr / 37 B.Tech 30 Cr Hyd / 40 B.Tech 15 Cr 38L PA Hyderabad / 50 Cr Business 40 Hyderabad / 15 Cr B.Tech 40 Hyderabad రెండో పెళ్ళి వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(USAరెండో పెళ్ళి): 50 Cr USA Doctor 35 / 15 Cr USA Green Card 40 / B.Tech MS 40 Cr / 15 Cr Doctor Canada / 35 B.Tech MS / 45 B.Tech MS USA / 48 B.Tech MS / 38 B.Tech MS / 32 B.Tech MS వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం Australia: 20 Cr B.Tech MS 29 PR / 5 Cr B.Tech MS 28 / 2 Cr B.Tech MS 32 / 3 Cr B.Tech MS 30 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr BE MSc Bits IPS 32 / M.Tech IIT IRIS Govt Job / 20 Cr B.Tech 30 / 10 Cr B.Tech MBA 28 / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 70 Cr MBA 29 Business / 50 Cr B.Tech 30 Business / 100 Cr B.Tech MS 29 Business / 50 Cr B.Tech 27 / 20 Cr B.Tech Business వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30 Cr B.Tech 28 / 20 Cr B.Tech IIT 29 / 10 Cr B.Tech 35 / 50 Cr Business 32 / 40 Cr B.Tech MS 31 / 20 Cr B.Tech 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 1 Cr to 500 Cr 24 to 45 B.Tech / M.Tech / MS / CA / PG Doctors India / USA /ఆస్ట్రేలియా U.K. వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

వరుడు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B Tech MS 29/30Cr B.Tech MS 27/100Cr B.Tech MS 29/20Cr B.Tech MS 28/40 Cr B.Tech MS 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA డాక్టర్స్ 33 Cardiologist / 29 Neurology / 28 Internal Medicine వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : డాక్టర్స్ India 20Cr MS General 31/15Cr Dermatology 35 / 10Cr Radiology & Gynic & Skin Doctor and ENT Dental డాక్టర్స్ వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 15Cr B.Tech 26 / 70Cr Architecture 30 / 50Cr B.Tech MS 25 / 20 Cr B.Tech 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 B.Tech IIT MBA IAM / 26 B.Tech 30LPA / 28 B.Tech MBA / 32 B.Tech MS 10Cr వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 B.Tech MS / 27 B.Tech MS / 29 B.Tech MS / 31 B.Tech MS / 33 B.Tech MS / 35 B.Tech MS వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండో పెళ్ళి 29 B.Tech MS USA / 42 B.Tech MS / 35 B.Tech MS India / 32 B.Tech MS USA వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30Cr B.Tech 28 / 20Cr B.Tech MBA 32 / 20Cr B.Tech 25 / 50Cr MBBS PG Doctor Hyderabad వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 27 B.Tech Irland / 26 B.Tech MS UK / 27 CA India వధువుకి 25 to 45 USA వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10 Cr 25 B.arch, MS. UK. US/10Cr. BBA 28/ 29 BTech / MS / Amazon, 300k USA. అందమైన యూఎస్. UK. India. Well settled వధువులకి వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

కమ్మ మ్యారేజ్ బ్యూరో (కమ్మాస్ & చౌదరీస్)

C. PRASHANTHI : 9100999850 / 9866619191
ప్రొఫైల్స్ : డాక్టర్స్ / సాఫ్ట్‌వేర్స్ / బిజినెస్ / గవర్నమెంట్ /
B.Tech / M. Tech / MBA / MCA / MS / USA / UK / Australia / Canada / Singapore / Newzealand / Germany / BDS / MDS / MBBS / MD / MS / DM / MCH ఇండియా & అబ్రాడ్స్ 1వ, 2వ లేట్ సంబంధాలు కలవు.

వధువు కావలెను

★ కమ్మ : 1995 / 6 feet / MBA / Pilot / 50 Cr Share Property గల వరుడికి Well settled & Good Looking వధువు కావలెను Ph: 9100999850/9866619191

★ కమ్మ డాక్టర్ : 1992 / 5.9 / DM Oncology /150 Crs Property/Well settled family గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ డాక్టర్ : 1994 / 5.9 / M.S.General Surgery/ Own Hospital/ 100 Cr Share Property గల వరుడికి Good Looking డాక్టర్ వధువు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ : 1992 / 6 feet / B.Tech MS/Director/ Own Business/ 100 Cr. Share Property గల వరుడికి సాఫ్ట్‌వేర్ / డాక్టర్ వధువు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ డైవర్సీ : 1992 / 6.1/ B.Tech/Pune Job/20 Lakshs Package / 25 Crs Share Property గల వరుడికి 1st Marriage వధువు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ : 1997 / 5.9 / MBA /Own Business / 500 Cr Property / Well Settled family గల వరుడికి Good Looking వధువు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ లేట్ : 1983 / 5.9 / B.Tech MBA/ Own Business/ 200 Cr Property గల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ : 1995 / 5.7 / B.Tech MS (UK) / 100 Cr. Share Property గల వరుడికి డాక్టర్ (or) సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ డైవర్సీ: 1978 / 5.9 / MBA/ (IT) Company CEO / USA Citizen / 60 Crs. Property గల వరుడికి Good Looking వధువు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ : 1992/ 5.10 / B.Tech MBA / Own Software Company / 200 Crs Property గల వరుడికి Well Settled Family వధువు కావలెను. Ph: 9100999850/9866619191

వరుడు కావలెను

★ కమ్మ డాక్టర్ : 1996 / 5.5 / MS OBG / 150 Crs Property గల వధువుకి డాక్టర్ (or) బిజినెస్ వరుడు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ డాక్టర్ : 1995 / 5.1 / MD Radiology/ 50 Cr Share Property గల వధువుకి డాక్టర్స్ & బిజినెస్ వరుడు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ డాక్టర్ : 1994 / 5.5 / MD Anaesthesia / 50 Cr Share Property గల వధువుకి Well Settled డాక్టర్ వరుడు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ UK Dr. : 1995 / 5.7 / MCH Surgical Oncology UK/ 300 Crs Share Property గల వధువుకి UK, USA & India డాక్టర్ వరుడు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ USA : 1997 / 5.4 / M.Tech/ H1B /Good Looking గల వధువుకి USAలో ఉన్న వరుడు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ డెంటల్ : 1995 / 5.3 / MDS / 60 Crs Share Property గల వధువుకి MDS/MBBS/MD/MS డాక్టర్ వరుడు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ : 1993 / 5.7 / B.ARCH / 75 Crs Share Property గల వధువుకి సాఫ్ట్‌వేర్ (or) బిజినెస్ వరుడు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ డైవర్సీ : 1989 / 5.9 / B.Tech/ Very Fair గల వధువుకి డైవర్సీ (or) విడో వరుడు కావలెను Ph: 9100999850/9866619191

★ కమ్మ లేట్ : 1984 / 5.7 / B.Arch / 60 Cr Share Property గల వధువుకి సాఫ్ట్‌వేర్ (or) బిజినెస్ (or) డాక్టర్ వరుడు కావలెను. Ph: 9100999850/9866619191

★ కమ్మ లేట్ : 1979 / BDS /5.9 / Well Settled Family గల వధువుకి ఇండియా (or) USA లో ఉన్న వరుడు కావలెను. Ph: 9100999850/9866619191



మనుగడ పోరాటంలో లద్దాక్

ఆర్టికల్ 370 అనగానే అందరికీ సాధారణంగా గుర్తొచ్చేది కాశ్మీర్. కాశ్మీర్ చరిత్ర తెలిసి, ప్రజల హక్కులు, జాతుల స్వయం నిర్ణయాధికారం వంటి వాటిని ఎత్తిపట్టేవాళ్లు తప్ప కాశ్మీరేతర భారతీయులలో ఎక్కువ మంది కాశ్మీర్‌కు మాత్రమే ప్రత్యేక ప్రతిపత్తి రాజ్యాంగంలో ఉందనీ, కాబట్టి దానిని రద్దు చేయడం సరియైనదే అనే అభిప్రాయంతోనే ఉన్నారు. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్ల కింద ఆదివాసీ ప్రాంతాలకు, వివిధ అధికరణాల కింద (ఆర్టికల్ 371A నుండి 371H వరకు) ఈశాన్య భారత రాష్ట్రాలకు ప్రత్యేక ప్రతిపత్తి, అధికారాలు ఉన్నాయని చాలా మందికి తెలియదు. 370 అధికరణాన్ని రద్దు చేయడంతో ఈశాన్య రాష్ట్రాలలో కూడా తమ ప్రత్యేక హక్కుల గురించి ఒక అభద్రతా భావం నెలకొన్నది. కాశ్మీర్ ముస్లిం మెజారిటీ ఉన్న రాష్ట్రం కాబట్టి ఆర్టికల్ 370ని రద్దు చేయడం తమ లక్ష్యాల్లో ఒకటని ప్రకటించిన భాజపా 2019 ఆగస్ట్ 5న ఆ అధికరణాన్ని రద్దు చేయడంతో పాటు, దేశంలో మునుపెన్నడూ లేని విధంగా ఒక రాష్ట్రాన్ని దాని హోదా నుండి తగ్గించి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. జమ్ము–కాశ్మీర్ ఒక కేంద్రపాలిత ప్రాంతం కాగా, కాశ్మీర్ ప్రాంతంలోని కార్గిల్ తదితర ప్రాంతాలను లద్దాక్‌తో కలిపి దీనిని మరో కేంద్రపాలిత ప్రాంతంగా కేంద్ర ప్రభుత్వం విభజించింది.

అప్పటి నుండి కేంద్ర ప్రభుత్వ పాలననే అక్కడ కొనసాగుతున్నది. లద్దాక్ ప్రాంతం ప్రధానంగా (97 శాతం) బౌద్ధ మతాన్ని ఆచరించే బాల్టి, బేడ, బోట్ లేదా బోటో, బ్రోక్పా, ద్రోక్పా లేదా దర్ద్ లేదా షిన్, గార్రా, మోన్, పూరిగ్పా ఆదివాసీ తెగలు ఉన్న ప్రాంతం. ఇక్కడ లేహ్ ప్రాంతంలో తెగల జనాభా 66.8 శాతం కాగా, జంస్కర్ ప్రాంతంలో 99 శాతం దాకా వివిధ తెగలు నివసిస్తాయి. తెగల జీవనం ప్రధానంగా ఉన్న ఇటువంటి ప్రాంతంలో ఆర్టికల్ 370 రద్దుతో వాళ్ళకు సంప్రదాయకంగా భూమిపై వస్తూ ఉన్న హక్కులకు హామీ లేకుండా పోయింది. డెబ్బై ఏళ్లుగా వాళ్ళకు లేని అభద్రత పెరగసాగింది.

2019 సెప్టెంబర్‌లో ఢిల్లీలో షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ 119వ సమావేశం జరిగింది. అది లద్దాక్ కేంద్రపాలిత ప్రాంతాన్ని భారత రాజ్యాంగంలోని 5వ లేదా 6వ షెడ్యూల్‌లో చేర్చడాన్ని చర్చించింది. దీనితో అక్కడి ప్రజల ఆశలు చిగురించాయి. లద్దాక్ ప్రధానంగా తెగలతో కూడుకొని ఉన్న ప్రాంతమనీ, కేంద్రపాలిత ప్రదేశం కాక ముందు అక్కడి తెగల సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి వారికి కొన్ని వ్యవసాయక హక్కులు, భూ యాజమాన్య హక్కులు ఉన్నాయని గుర్తించింది. అందువల్ల అధికార వికేంద్రీకరణకు, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి, భూ సంబంధిత హక్కులను పరిరక్షించడానికి, ప్రాంతీయ అభివృద్ధిని వేగిరపరచడానికి లద్దాక్‌ను రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో చేర్చాలనే సిఫారసును కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు, కేంద్ర షెడ్యూల్డ్ తెగల వ్యవహారాల శాఖకు పంపించింది. కానీ ఆ తరువాత ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి ప్రయత్నం జరగలేదు.

> **మన దేశంలో ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ రంగంలో అతి పెద్ద మదుపుదారులు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీస్. స్థానిక ప్రజల ప్రమేయం లేకుండా ఈ కంపెనీలకు విచ్చలవిడిగా భూమిని కేటాయించాలంటే 6వ షెడ్యూల్ అడ్డం వస్తుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం లద్దాక్‌కు అటువంటి రాజ్యాంగపరమైన రక్షణ కల్పించడానికి సిద్ధం కావడం లేదు.**

తమ హక్కుల పరిరక్షణ కోసం మాజీ పార్లమెంట్ సభ్యుడైన థుప్ స్టాన్ చేవాంగ్ నాయకత్వంలో 2020లో లేహ్ శిఖరాగ్ర సంస్థ (లేహ్ అపెక్స్ బాడీ–లాబ్) ఏర్పడింది. అప్పటి నుండి ఈ సంస్థ లద్దాక్‌ను 6వ షెడ్యూల్ కింద చేర్చాలని డిమాండ్ చేస్తూనే ఉంది. కార్గిల్ ప్రాంతంలో వివిధ రాజకీయ పార్టీలు కలిసి 2020లో కార్గిల్ అభివృద్ధి సంస్థ (కేడిఏ)ను ఏర్పాటు చేసుకున్నాయి. ఈ సంస్థ ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగ వ్యతిరేక చర్య అనీ, కార్గిల్‌ను జమ్ము–కాశ్మీర్‌తో తిరిగి కలపాలనీ డిమాండ్ చేస్తున్నది.

గత రెండు సంవత్సరాలలో కేడిఏ, లాబ్ కలిసి ఉమ్మడిగా ప్రధానంగా నాలుగు డిమాండ్లను చేస్తున్నాయి. లద్దాక్ ప్రాంతానికి రాష్ట్ర హోదా కల్పించడం, దానిని రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో చేర్చడం, స్థానికులకే ఉద్యోగాలను రిజర్వ్ చేస్తూ ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పరచడం, కార్గిల్, లేహ్ ప్రాంతాలకు ఒక్కో పార్లమెంట్ సీటును కేటాయించడం ఆ డిమాండ్లు.

ఈ లోగా కేంద్రప్రభుత్వం హిందీని, సంస్కృతాన్ని, ఏకరూప సంస్కృతిని బలవంతంగా దేశమంతా రుద్దే తన విధానానికి అనుగుణంగా చేపట్టిన కొన్ని చర్యలతో తమ అస్తిత్వం ప్రమాదంలో పడుతున్నదని భావించిన లద్దాక్ ప్రజలు లాబ్, కేడిఏల సంయుక్త నాయకత్వంలో ఫిబ్రవరి 3న లేహ్‌లోని పోలో మైదానంలో 30 వేల మందితో పెద్ద నిరసన సభ జరిపారు. దీనికి నాయకత్వం వహిస్తున్న వాళ్ళలో 2018లో రామన్ మెగసెసే అవార్డు గ్రహీత ఐన సోనమ్ వాంగ్ ఛుక్ (ఈయన జీవితం మీద ఆధారపడినదే త్రీ ఇడియట్స్ సినిమా) కూడా ఉన్నాడు. ఆయన రెండు మూడుసార్లు ఈ డిమాండ్ల కోసం నిరాహార దీక్ష కూడా చేశాడు. మైనస్ 20 డిగ్రీల ఉష్ణోగ్రతతో గడ్డ కట్టించే చలి ఉన్నా లద్దాక్, కార్గిల్ ప్రాంతాలలోని మారుమూల పల్లెల నుండి కూడా ఈ నిరసన సభకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. లద్దాక్ చరిత్రలోనే ఇది అతి పెద్ద సభ. అదే సమయంలో కార్గిల్ జిల్లాలో కూడా వేలాది మందితో సభలు జరిగాయి.

గ్రీన్ ఎనర్జీ (పర్యావరణహిత విద్యుచ్ఛక్తి) పేరుతో ఈ మధ్యే సౌర, పవన విద్యుత్తు కోసం 20,000 కోట్ల రూపాయల ప్రాజెక్టును ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం అందుకోసం లద్దాక్‌లో 20వేల ఎకరాలు కేటాయించింది. 2050 వరకు 43.7 లక్షల కోట్ల రూపాయల సౌర, పవన విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు పెరిగే అవకాశం ఉంది అని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అంచనా వేసింది. లద్దాక్‌లో సౌర రేడియేషన్ చాలా ఎక్కువ కాబట్టి, ఇందులో గణనీయమైన ప్రాజెక్టులు లద్దాక్‌లోనే నెలకొనే అవకాశం ఉంది. మన దేశంలో ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ రంగంలో అతి పెద్ద మదుపుదారులు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీస్. స్థానిక ప్రజల ప్రమేయం లేకుండా ఈ కంపెనీలకు విచ్చలవిడిగా భూమిని కేటాయించాలంటే 6వ షెడ్యూల్ అడ్డం వస్తుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం లద్దాక్‌కు అటువంటి రాజ్యాంగపరమైన రక్షణ కల్పించడానికి సిద్ధం కావడం లేదు.

అయితే లద్దాక్‌లో, కార్గిల్‌లో ప్రజల నిరసనలు రోజురోజుకీ పెరుగుతుండడం వల్ల, పార్లమెంటరీ ఎన్నికలు కూడా దగ్గర పడుతుండడం వల్ల కేంద్ర ప్రభుత్వం లాబ్, కేడిఏలతో చర్చలు జరుపుతోంది. ప్రజల నిరసనకు తల ఒగ్గి అక్కడి ప్రజల అత్యంత ప్రజాస్వామిక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ఒప్పుకుంటుందా, లద్దాక్ ప్రజల పోరాటం సుదీర్ఘంగా కొనసాగవలసి ఉంటుందా చూడవలసే ఉంది. లద్దాక్‌కు 6వ షెడ్యూల్‌లో చోటు కల్పించినా దానిని నిజాయితీగా గౌరవించి అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాలలో లాగా విచ్చలవిడి ఉల్లంఘనలు జరగకుండా చూడటం కూడా అవసరం. చైనాతో ఉద్రిక్త పరిస్థితులు ఉన్న నేపథ్యంలో లద్దాక్ ప్రజలు ఎల్లప్పుడూ భారతదేశ పక్షానే నిలిచారు. వారిలో భారత ప్రభుత్వం పట్ల అపనమ్మకం ఏర్పడితే అది ఎంత ప్రమాదకరం?

■ ఎన్. రవి

‘అదిగో ద్వారక, ఆలమందలవిగో...!’

ఇటీవల గుజరాత్‌లోని ద్వారక పట్టణంలో కొత్తగా నిర్మాణమైన వివిధ మౌలిక సదుపాయాలను ప్రారంభించడానికి వెళ్లిన సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అక్కడి పంచకుయ్ బీచ్ తీరంలో స్కూబా డైవింగ్ చేశారు. సాగర గర్భంలో ఉన్న శ్రీకృష్ణుడి కర్మభూమి (ల్యాండ్ ఆఫ్ యాక్షన్) అయిన పురాతన ద్వారకను సందర్శించి ప్రార్థనలు చేశారు. ‘సముద్రంలో మునిగి ఉన్న ద్వారకా నగరంలో ప్రార్థన చేయడం దివ్యానుభూతిని కలిగించింది. మహోన్నత ఆధ్యాత్మిక వైభవం, భక్తితో కూడిన పురాతనయుగానికి అనుసంధానితమయ్యాను. భగవాన్ శ్రీకృష్ణుడు మనందరినీ ఆశీర్వదిస్తాడు’ అని సోషల్ మీడియా పోస్ట్‌లో ఆయన పేర్కొన్నారు. అదేరోజు ద్వారక పట్టణంలో బహిరంగసభలో మాట్లాడుతూ ‘నేను సముద్రంలోకి వెళ్లి పురాతన ద్వారకను చూశాను. సముద్రంలో మునిగిపోయిన ద్వారక గురించి పురావస్తు శాస్త్రవేత్తలు చాలా రాశారు. మన గ్రంథాలలో కూడా ద్వారక గురించి చాలా చెప్పబడింది. పురాతన ద్వారక ఒక గొప్ప నగరం. ప్రణాళిక, అభివృద్ధికి మంచి ఉదాహరణ. నేను అక్కడ శ్రీకృష్ణునికి నమస్కరించాను. నాతో నెమలి ఈకలు తీసుకువెళ్లి సమర్పించాను’ అని నరేంద్ర మోదీ అన్నారు.

ఇక నరేంద్రుని వ్యాఖ్యలు, అనుభవాలను అలా ఉంచి అసలు కథా నాయకుడు ‘నల్లనయ్య’ నగర చరిత్రను అన్వేషిద్దాం.

శ్రీకృష్ణుడు, మహాభారతంతో ముడివడివున్న ద్వారకకు హిందూ సంస్కృతిలో ఒక సమున్నత ప్రాధాన్యమున్నది. హిందూ ధర్మ ఏడు పవిత్ర ప్రదేశాలలో ఆ నగరం కూడా ఒకటి. మిగతావి: అయోధ్య, మథుర, హరిద్వార్, కాశీ, కంచి, ఉజ్జయిని. మేనమామ కంసుడిని సంహరించిన తరువాత కృష్ణుడు తన యాదవ తెగ ప్రజలతో సహా ద్వారకకు వెళ్లి, సముద్రం నుంచి 12 యోజనాల భూమిని పునఃసంపాదించుకుని తన రాజ్యాన్ని వ్యవస్థాపించాడని పురాణాలు చెబుతున్నాయి. విశాల ఉద్యానవనాలు, తటాకాలు, సరస్సులు, అందమైన

> **మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారకా నగర నెలవును కచ్చితంగా గుర్తించేందుకు 20వ శతాబ్ది ఆరంభం నుంచి చరిత్రకారులు, పండితులు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలన్నీ తొలుత ప్రాచీన సాహిత్య గ్రంథాల ఆధారంగా జరిగాయి. ప్రస్తుతమున్న ద్వారకే శ్రీకృష్ణుడి ద్వారకా నగరమా? లేక సముద్ర గర్భంలో ఉన్న నగరమా? ద్వారక అన్వేషణ 1960వ దశకంలో కొత్త మలుపు తిరిగింది. ప్రాచీన గ్రంథాల ఆధారితంగా కాకుండా పురావస్తు పరిశోధనల ప్రాతిపదికన కృష్ణుడి ద్వారకను గుర్తించే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.**

సౌధాలతో ద్వారక వర్ధిల్లుతున్నదని విష్ణు పురాణం పేర్కొంది. అయితే కృష్ణుడి మరణానంతరం అది సముద్రంలో మునిగిపోయింది. ఇప్పటి ద్వారక కచ్ సింధుశాఖ అరేబియా సముద్రంలో కలుస్తున్న చోట ఉన్నది. కృష్ణ యాత్రా స్థలాలలో అది కూడా ఒకటి. మిగతావి, బృందావన్, మథుర, గోవర్ధన్, కురుక్షేత్ర, పూరి. కృష్ణుడికి అంకితం చేస్తూ నిర్మించిన పురాతన ద్వారకాధీశ్ ఆలయం నేటి ద్వారకలో ఉన్నది. శ్రీకృష్ణుడి మునిమనవడు వజ్రనాభుడు 2500 సంవత్సరాల క్రితం నిర్మించినట్టుగా చెబుతున్న ఈ ఆలయం కాలం పొడుగునా పలుమార్లు పునర్నవీకరింపబడింది. ముఖ్యంగా 16వ, 19వ శతాబ్దాలలో జరిగిన మార్పులు ఆ ఆలయంపై చెరగని ముద్రలు వేశాయి అని గుజరాత్ పర్యాటక శాఖ వెబ్‌సైట్ పేర్కొంది.

మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారకా నగర నెలవును కచ్చితంగా గుర్తించేందుకు 20వ శతాబ్ది ఆరంభం నుంచి చరిత్రకారులు, పండితులు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలన్నీ ప్రాచీన సాహిత్య గ్రంథాల ఆధారంగా జరిగాయి. ప్రస్తుతమున్న ద్వారకే శ్రీకృష్ణుడి ద్వారకా, లేక సముద్ర గర్భంలో ఉన్నదే ఆయన ద్వారకా? లేదా చారిత్రక వాస్తవికతను ఎప్పటికీ ధ్రువీకరించలేని ఒక పౌరాణిక నగరమేనా? బ్రిటిష్ సివిల్ సర్వెంట్, కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి, హిందూ ధర్మ అధ్యయనవేత్త ఎఫ్ఇ పర్గిటర్ 1904లో మార్కండేయ పురాణానికి చేసిన అనువాదంలో మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారక నెలవు రైవత పర్వతాలపై ఉన్నదని ప్రప్రథమంగా పేర్కొన్నారు. ప్రస్తుత ద్వారకకు 200 కిలోమీటర్ల దూరంలో జునాగఢ్‌లో ఉన్న గిర్నార్ పర్వతాలే రైవత పర్వతాలని పండితుల అభిప్రాయం. ప్రస్తుత ద్వారక క్రీ.పూ. 1200 సంవత్సరానికి పూర్వపుది కాకపోవచ్చని అనంత్ సదాశివ్ అల్టేకర్ అనే పండితుడు భావించారు. అయితే ప్రాచీన గ్రంథాల్లో ప్రస్తావితమైన ద్వారక సముద్రంలో మునిగిపోయిందనే విషయాన్ని ఆయన అంగీకరించారు. ఎడి పుల్సాకర్ అనే మరో పండితుడు 1943లో ‘కృష్ణుడి చరిత్రాత్మకత’ అన్న తన వ్యాసంలో ప్రస్తుత ద్వారక మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారకే అని విశ్వసించారు. 1960ల్లో పురావస్తు శాస్త్రవేత్త హెచ్‌డి సంఖాలియా సైతం ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. ద్వారక అన్వేషణ 1960వ దశకంలో కొత్త మలుపు తిరిగింది. ప్రాచీన గ్రంథాల ఆధారంగా కాకుండా పురావస్తు పరిశోధనల ప్రాతిపదికన కృష్ణుడి ద్వారకను గుర్తించే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. నిజానికి ఈ ప్రయత్నాలు 1930ల్లోనే హీరానంద్ శాస్త్రి అనే పురావస్తు శాస్త్రవేత్త ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ప్రస్తుత ద్వారక పరిసర ప్రాంతాల్లో పురావస్తు తవ్వకాలు జరిగాయి. అదే సమయంలో సముద్రంలో మునిగిపోయిన ద్వారకపైనా ఊహాగానాలు ఒక నిర్దిష్టతకు చేరుకున్నాయి. దీంతో సముద్రంలో ఆ నగర అవశేషాలను కనుగొనే ప్రయత్నాలూ ప్రారంభమయ్యాయి.

తొలి పురావస్తు తవ్వకాలు 1963లో ద్వారకాధీశ్ ఆలయం పరిసర ప్రాంతాలలో జరిగాయి. ఆ ప్రాంతాల్లో కిక్కిరిసిన జనావాసాలు ఉండడంతో ఆ తవ్వకాలు విస్తృతస్థాయిలో జరగలేదు. గత 2000 సంవత్సరాలుగానే ఆ ప్రాంతాల్లో జనావాసాలు వర్ధిల్లుతున్నాయని ఆ తవ్వకాలు నిర్ధారించాయి. 1979లో ఎస్ఆర్ రావు నేతృత్వంలో ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ద్వారకాధీశ్ ఆలయ పరిసరాలలో మరోసారి తవ్వకాలు ఆరంభించింది. ఈ తవ్వకాలపై అధికారిక నివేదిక ప్రచురితం కాలేదు. అయితే ఆ నివేదిక ఆధారంగా ద్వారకాధీశ్ ఆలయ పరిసరాలలో క్రీస్తుపూర్వం రెండో సహస్రాబ్దానికి చెందిన మృణ్మయ పాత్రలు, మూడు ఆలయాలు బయటపడినట్టు ఎఎస్ఐ డైరెక్టర్ జనరల్ వెల్లడించారు. ఈ పరిశోధనలు సముద్ర గర్భిత పురాతన నగరంపై ఆసక్తిని మరింత పెంపొందించింది. ఫలితంగా గోవాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ’ (ఎన్ఐఓ)కు చెందిన మెరైన్ ఆర్కియాలజిస్టులు అరేబియా సముద్రంలో మునిగిపోయిన ప్రాచీన నగరాన్ని కనుగొనేందుకు ప్రయత్నాలు ఆరంభించారు. 1988 నుంచి ఈ పరిశోధకుల బృందంలో ఉన్న వారిలో డాక్టర్ శీల త్రిపాఠి ఒకరు. సముద్ర గర్భంలో తమకు లభ్యమైన వస్తువులను, ద్వారకకు 30 కిలోమీటర్ల పరిధిలో నిర్వహించిన పురావస్తు తవ్వకాలలో బయల్పడిన వస్తువులతో పోల్చిచూస్తే అవి హరప్పన్ నాగరికతా యుగం మలి దశకు (క్రీస్తుపూర్వం 1900 నుంచి 1300 సంవత్సరం వరకు) చెందినవిగా నిర్ధారణ అయిందని త్రిపాఠి తెలిపారు. విశేషమేమిటంటే హరప్పా నాగరికత మలి దశ మహాభారత కాలం నాటిదే అన్న వాస్తవాన్ని అనేకమంది విద్వాంసులు అంగీకరిస్తున్నారు. ప్రస్తుత ద్వారక పరిసర ప్రాంతాలలో లభ్యమైన వస్తువులు, సముద్రగర్భ నగర అవశేషాలలో లభ్యమైన వస్తువులు కార్బన్ డేటింగ్ మొదలైన వైజ్ఞానిక పరీక్షలలో ఒకే కాలానికి చెందినవని రుజువు కావడంతో సముద్రంలో మునిగిపోయిన నగరం కృష్ణుడి ద్వారకే అన్న వాదనకు, దాని చారిత్రిక వాస్తవికతకు బలం చేకూరింది. దీనిని మరింతగా దృఢపరిచేం



దుకు పరిశోధనలు కొనసాగుతున్నాయి. 1983–90 సంవత్సరాల మధ్య జరిగిన తవ్వకాల్లో ఒక కోట పునాదులు, స్తంభాలు నీటిపారుదల సదుపాయాలు మొదలైనవి బయల్పడ్డాయి.

ప్రస్తుతమున్న ద్వారకకుగానీ, సముద్రంలో మునిగిన ద్వారకకుగానీ కృష్ణుడి రాజ్యంతో ఎటువంటి సంబంధం లేదని అభిప్రాయపడిన చరిత్రకారులూ పలువురు ఉన్నారు. వీరిలో డిడి కోశాంబి ప్రముఖుడు. మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారక ఆఫ్ఘానిస్తాన్‌లో ఉండవచ్చని కోశాంబి అభిప్రాయం. ఆ దేశంలో దారవాజ్ అనే ప్రదేశాన్ని ఆయన ఎత్తి చూపారు.

సంస్కృతంలో ద్వారక అంటే ద్వారం (గేట్) అని అర్థం. పశ్చిమాసియాతో భారత్ వ్యాపార వాణిజ్యాలకు ద్వారక ఒక ప్రముఖ కేంద్రంగా ఉండేది. గల్ఫ్ ప్రాంతాల సాగర వనరులను తమ వాణిజ్యానికి భారతీయ వ్యాపారులు బాగా ఉపయోగించుకునేవారు. సముద్రంలో మునిగిపోయిన ద్వారకలో లభ్యమైన వివిధ పురావస్తు సాక్ష్యాధారాల ప్రకారం ఆ ద్వారక ఒక నగర రాజ్యమని పురావస్తు శాస్త్రవేత్త ఎస్ఆర్ రావు తెలిపారు. ఈ నగర రాజ్యం క్రీస్తు పూర్వం 1500 సంవత్సరం నాటిదై ఉండవచ్చన్నది ఆయన అభిప్రాయం. భూమి మీద, సముద్రంలోను ద్వారకకు సంబంధించిన పురావస్తు తవ్వ

> **బ్రిటిష్ సివిల్ సర్వెంట్, హిందూ ధర్మ అధ్యయనవేత్త ఎఫ్ఇ పర్గిటర్ 1904లో మార్కండేయ పురాణానికి చేసిన అనువాదంలో మహాభారతంలో ప్రస్తావితమైన ద్వారక నెలవు రైవత పర్వతాలపై ఉన్నదని ప్రప్రథమంగా పేర్కొన్నారు. ప్రస్తుత ద్వారకకు 200 కిలోమీటర్ల దూరంలో జునాగఢ్‌లో ఉన్న గిర్నార్ పర్వతాలే రైవత పర్వతాలని పండితుల అభిప్రాయం. ప్రస్తుత ద్వారక క్రీస్తుపూర్వం 1200 సంవత్సరానికి ముందునాటిది కాకపోవచ్చని అనంత్ సదాశివ్ అల్టేకర్ భావించారు.**

కాలలో బయల్పడిన వస్తువులు, కట్టడాలకు ప్రాచీన గ్రంథాలలో ప్రస్తావితమైన వాటితో సంబంధం ఉన్నదని తెలుపుతూ ఈ ఆవిష్కరణ కృష్ణుడి ద్వారకను ఒక కట్టుకథ నుంచి ఒక చారిత్రక వాస్తవంగా మార్చివేసిందని ఎస్ఆర్ రావు వ్యాఖ్యానించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో సముద్రాంతర్గత ద్వారకా నగరాన్ని చూడాలన్న ఆసక్తి సామాన్య ప్రజలకు కూడా కలగడం సహజం. అరేబియా సముద్రం మింగివేసిన ద్వారకా నగరం ఎంత పెద్దది, మునిగిపోయిన ఆ నగరంలోని కట్టడాలు ఇంకా అలానే ఉన్నాయా? సముద్ర గర్భంలో మునిగిపోయిన ద్వారక నగరాన్ని పర్యాటకులు సందర్శించేందుకు వీలుగా గుజరాత్ ప్రభుత్వం ఒక సబ్‌మెరైన్ నిర్వహణకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో, అనేక మంది ప్రజల ఆకాంక్ష ఫలించే రోజు త్వరలోనే రానుంది.

● కార్తికేయ రావు



నేడు జీడి రైతాంగ సంఘీభావ సదస్సు

మేలు రకం జీడిపప్పును పండిస్తూ దేశంలోనే ప్రసిద్ధి గాంచిన ఉద్దానం ప్రాంత జీడి రైతులు గిట్టుబాటు ధర కోసం ఏడాది నుంచి ఆందోళనను సాగిస్తున్నారు. 2019 జనవరి 9న పలాస సభలో జీడి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించేందుకు, దళారీ వ్యవస్థను అంతం చేసేందుకు ప్రతిపక్ష నాయకుడిగా జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా హామీ వాస్తవ రూపం ధరించలేదు. 2020లో ఎమ్మెల్యే సీదిరి అప్పలరాజు జీడి పిక్కలకు వెయ్యి రూపాయలు మద్దతు ధర పెంచాలని ముఖ్యమంత్రికి లేఖ రాశారు. అయినా ప్రయోజనం లేదు. పైగా 80 కిలోల బస్తా జీడి ధర 14వేల రూపాయల నుంచి ఎనిమిది వేల రూపాయలకు పడిపోయి రైతుల పరిస్థితి పెనంలో నుంచి పొయ్యిలో పడ్డట్లయ్యింది. 2018లో తితిలీ తుఫాను నుంచి సరైన నష్టపరిహారం పొందని జీడి రైతులకు గిట్టుబాటు ధరలు పడిపోవడంతో పాటు నిత్యావసర ధరలు, సాగు ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా అయింది.

ఉద్దానం ప్రాంతంలోని వజ్ర కొత్తూరు, మందస, పలాస, సోంపేట, కంచిలి, కవిటి తదితర మండలాల్లో సుమారు 74 గ్రామాల్లో లక్ష ఎకరాల్లో జీడి సాగే రైతులకు ప్రధాన జీవనాధారం. అందుకే జీడి రైతు సంఘం ఆధ్వర్యంలో అఖిలపక్షాలు 2023 మార్చి నుంచి 150 రోజుల పాటు సాగించిన రకరకాల ఆందోళన తర్వాత జూలై 28న కాశీబుగ్గలో 24 గంటల పాటు రైతులు సత్యాగ్రహం చేశారు. ధర్నాలు, పికెటింగులు, దీక్షలు, యాత్రల తర్వాత రాష్ట్ర పశుసంవర్ధక–మత్స్య శాఖామాత్యులు సీదిరి అప్పలరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తదితరులు రైతు ప్రతినిధి బృందంతో చర్చలు జరిపారు. వాటివల్ల నేటికీ ఫలితం లేకపోవడంతో రైతాంగం తీవ్రంగా ఆందోళన చెందుతున్నది.

ఒకవైపు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతాంగానికి విదేశాల నుంచి వచ్చి స్థానిక మార్కెట్లను ముంచెత్తుతున్న జీడి పప్పు మరిన్ని సమస్యల్ని సృష్టిస్తోంది. దేశీయ ఉత్పత్తుల ధరలు పడిపోవడానికి ఇది కూడా ఒక కారణం. అందుకే కనీస ఉత్పత్తులకు గ్యారెంటీ కోసం రైతు భరోసా కేంద్రాల నుంచి జీడిపప్పును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అది విదేశీ పప్పు రాకముందే జరగాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్రంలో ఉన్న పుణ్యక్షేత్రాల్లో ప్రసాదాలు, లడ్డూలు ఇతర అవసరాలకు దేశీయ ఉత్పత్తులను పంపడం ద్వారా రైతుల జీవనభృతికి గ్యారంటీ లభిస్తుందన్న అంశానికి సైతం ఎలాంటి భరోసా దక్కడం లేదు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని హామీపడ్డ కేంద్రం ఇవేమీ చేయలేదు.

రోజురోజుకు సాగు ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధరలు తగ్గుతుంటే రైతుల ఆదాయం రెట్టింపెలా అవుతుందో ఏలికలే సెలవివ్వాలి. తితిలి, మిచాంగ్ తుఫానుల తర్వాత జీడి పంటకు బీమా పథకం అమలు జరగాలని, అకాల పరిస్థితులకు తట్టుకునే మొక్కలను ప్రభుత్వమే పరిశోధించి అందించాలని జీడి రైతులు కోరుతున్నారు. ప్రధానంగా సముద్రతీర ప్రాంతాల రక్షణతో పాటు, బలవత్తర ఆహార పంటను అందిస్తూ, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్న జీడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు, రైతులకు బ్యాంకుల నుంచి పంటల రుణాలు అందజేయాలని, అంతర్ పంటకోసం తగు సాంకేతిక పరికరాలివ్వాలని, జీడి పండ్ల ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మించాలని ఉద్దానం రైతాంగం పోరాడుతున్నారు.

జీడి పంట సాగవుతున్న పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి మన్యం జిల్లా, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాలో సింహభాగం ఉత్తరాంధ్రలోనిదే. కాబట్టి ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని పారదోలడానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం, జీడి రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని కళ్ళప్పగించి చూస్తున్నది. అందుకే ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్న పార్టీలను తమ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని జీడి రైతాంగం నిలదీయాలి.

జీడి రైతుల పోరాటాన్ని ఎత్తిపడుతూ, రైతు భరోసా కేంద్రాల ద్వారా 80 కిలోల బస్తాకు రూ.16,000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు–కూలీ సంఘం, శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేడు పలాసలోని కాశీబుగ్గలో గల శివరామ దీక్షితుల ఆశ్రమంలో ఉదయం 10 గంటల నుంచి జీడి రైతాంగ పోరాటానికి సంఘీభావంగా సదస్సు జరుగుతున్నది. ఈ సభకు గురయ్య అధ్యక్షత వహిస్తారు. తెప్పల అజయ్ కుమార్, విమలక్క, కర్నాకుల వీరాంజనేయులు, మాష్టారు, జగన్నాథరావు ప్రసంగిస్తారు.

○ ఆంధ్రప్రదేశ్ రైతు–కూలీ సంఘం
శ్రీకాకుళం జిల్లా కమిటీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

చరిత్రను ఇకనైనా చక్కదిద్దుకోవాలి!

> **అలెగ్జాండర్ దండయాత్రా కాలంలో భారతదేశంలో ఆంధ్రరాజులలో చివరివాడు చంద్రశ్రీరాజు. అతడు మైనరు. అతనికి రక్షకులు మంత్రి–సేనాపతులు చంద్రగుప్త సముద్రగుప్తులు. ఈ చంద్రగుప్తుడే మౌర్యచంద్రగుప్తుడని పాశ్చాత్యులు రాశారు. భారతీయ చరిత్రకారులు వారిని అనుసరించారు. చంద్రగుప్త మౌర్యునికి చంద్రశ్రీ చంద్రగుప్తునికి మధ్యలో 48 మంది పాలకులు ఉన్నారు. వీరిద్దరినీ ఒకరిగా చెప్పడం వలన ఆ 48 మంది పాలనాకాలం భారతదేశ చరిత్రలో అదృశ్యమయింది. ఇలా చరిత్రలో ఎన్నో అసంగత విషయాలు కనబడతాయి.**

మన విద్యాలయాలలో బోధిస్తున్న భారతదేశ చరిత్ర చదివితే ‘హిందువులు ఎప్పుడు ఎవరితో పోరాడి ఎలా పరాజితులయ్యార’నే విషయం ప్రాధాన్యం వహిస్తుంది. మహారాష్ట్ర సామ్రాజ్యం నెలకొల్పిన శివాజీ మహారాజును ఔరంగజేబు ‘కొండ ఎలుక’ అన్నాడని రాస్తారు. కానీ ఛత్రపతి శివాజీ గురించి చదివితే ఒళ్లు పులకరిస్తుంది. ఆ విషయాలేవీ ఈ చరిత్ర పుస్తకాలలో కనబడవు. దక్షిణ భారత సామ్రాజ్యాన్ని ఏలిన శ్రీకృష్ణదేవరాయల పాలనలో పన్నులు అధికంగా ఉన్నాయని చరిత్ర పుస్తకాల్లో ఉంది. ఆ మహారాజు చరిత్ర, చేసిన భాషాసేవ, సంస్కృతి, పోషణ వేరే పుస్తకాల్లో చదవవలసిందే.

శకపురుషుడు విక్రమాదిత్యుడు. ఆయన చేసిన ఘనకార్యం కాళిదాస మహాకవి జ్యోతిర్విద్యాభరణమనే శాస్త్రగ్రంథంలో చెప్పాడు. విక్రమార్క మహారాజు సభలో శ్రీ శుకువు, సువాక్కు, వరరుచి, మణి అంగుదత్తుడు, విష్ణువు, త్రిలోచనుడు, ఘటకర్పరుడు, అమరసింహుడు, సత్యుడు, వరాహమిహిరుడు, శ్రుతసేనుడు, బాదరాయణుడు, మణిత్థుడు, కుమారసింహుడు, కాళిదాసు మొదలైన కవి పండితులున్నారు. వీరు వేరు వేరు శాస్త్రాలలో దిగ్గజాల వంటివారు. ఆ మహారాజును జైన కవులు ప్రశంసించిన శ్లోకాలు లభిస్తున్నాయి. పైన పేర్కొన్న వారిలో తొమ్మిది మందిని నవరత్నాలంటారు. ఆ చక్రవర్తికి 800 మంది సామంతులున్నారు. ఆయనకు 3 కోట్ల పదాతులు, 24,300 ఏనుగులు, పదివేల గుఱ్ఱాలు, పదివేల రథాలు సైన్యం ఉండేది. విక్రమార్కుడు 99,999 శకులను సంహరించి కలియుగంలో విక్రమశకం స్థాపించాడు. ఈ విక్రమార్కుడు ద్రవిడ దేశాన్ని, గాంధార దేశాన్ని, వంగ దేశాన్ని, గౌడ దేశాన్ని గుజరాత్‌ను, ధారా రాజ్యాన్ని, కాంభోజ దేశాన్ని కూడా జయించాడు. హిమాలయంపైన ఉండే జయింపశక్యం కాని దుర్గాలను జయించి ఆ రాజ్యాలను ఆ ప్రభువులకే ఇచ్చివేశాడు. ఆయన రాజధాని ఉజ్జయిని. రుక్మ దేశానికి అధిపతి అయిన శకేశ్వరుణ్ణి జయించి ఉజ్జయినికి తీసుకువచ్చి, ఊరేగించి వదిలిపెట్టాడు. (శకేశ్వరుడంటే హిమాలయాలకు ఆవల ఉన్న శకుల రాజు.) విక్రమార్కుని దేశం మాళవ దేశం. కలియుగాది నుంచి 3068వ సంవత్సరంలో ఈ గ్రంథం రాశానని కాళిదాస మహాకవి చెప్పాడు. ఇది ఈ విక్రమార్కుని కాలం. విదేశీయులను కూడా జయించడం వలన ఉత్తరాదిన ఇప్పటికీ విక్రమ సంవత్ అంటే విక్రమ శకం వాడుతున్నారు. ఈ విక్రమార్కుని గురించి భారతదేశ చరిత్రలో ఇతని పేరు చంద్రగుప్తుడని, ఇతనికి విక్రమాదిత్యుడనే బిరుదం ఉందని రాశారు. ఇతడు క్రీ.శ. 388–409 మధ్య శకులను ఓడించాడని రాశారు. కాలం సుమారు 400 సంవత్సరాలు మారిపోయింది.

“మొహంజోదారో నాగరికత వారు మత చిహ్నాల్ని వదల లేదు, వారి మతం తెలియదు’ అని రొమెల్లా థాపర్ రాశారు. నేనా నాగరికత అవశేషాలను పరిశీలించాను. దానిలో ఆమె చెప్పిన మూడు తలల పశుపతి దేవునికి మూడు తలలు, రెండు కొమ్ములు లేవు. అది వేదం, శివాష్టోత్తరం మొదలయినవి వర్ణించిన రుద్ర రూపం. రుద్రుని తలపై చంద్రుడు, గంగ, పాము, పక్కన ప్రణవ చిత్రం మొదలైనవి ఉన్నాయి. ఆ అవశేషాలలో స్వస్తికం, శివావతార చిత్రాలు కూడా ఉన్నాయి. వీటిపై వ్యాసాలు రాసి ప్రచురించాను.

ఇపుడు చరిత్ర పాఠాల్లో శ్రీమద్రామాయణం, మహాభారతం చేర్చే ప్రయత్నం జరుగుతోంది. 75 సంవత్సరాల వెనుక జరుగవలసిన పని ఇది. అభినందించదగినది. కాని శ్రీరామునికి, యుధిష్ఠిరునికి మధ్య ఉన్న రాజుల విషయం, యుధిష్ఠిరునికి చంద్రశ్రీ చంద్రగుప్తునికి మధ్య ఉన్న పరిపాలకుల విషయం కూడా చేరిస్తేనే దేశ చరిత్రకు సరియైన ఆకృతి వస్తుంది. ఋషభదేవుని కుమారుడు భరతుని పేర భారతవర్షమేర్పడింది. అంతకు ముందు దీనిని అజనాభమనేవారు. అంగ, వంగ, కళింగ, పౌండ్ర, ఆంధ్ర, ద్రవిడ దేశాలకు ఆ పేర్లు ఎలా వచ్చాయో తెలియాలి. చారిత్రక పురుషుడు శ్రీకాకుళాంధ్ర విష్ణువు. ఆయన చరిత్రకు త్రిలింగ అనే పదానికి సంబంధం ఉంది. త్రిలింగ పదం నుండి తెలుగు పదం వచ్చిందనడానికి చాలా ఆధారాలున్నాయి.

శ్రీరామునిది ఇక్ష్వాకు వంశం. ఇక్ష్వాకువు నుండి శ్రీరాముని వరకు 65 తరాల పరిపాలకులున్నారు. వీరిలో అయోధ్యను నిర్మించిన ఇక్ష్వాకువు, మహాత్మాగాంధీ సత్యాగ్రహబుద్ధికి కారణమయిన సత్యహరిశ్చంద్రుడు, సముద్రానికి సాగరమనే పేరు రావడానికి కారణమయిన సగరపుత్రులు, గంగకు భాగీరథి అనే పేరు కలిగించిన భగీరథుడు ఉన్నారు. కాళిదాస మహాకవి ఈ వంశంలో కొందరి చరిత్రలు రఘువంశమనే పేరుతో రాశాడు.



శ్రీరాముని తరువాత ఆ వంశం వారు 30 మంది ఉన్నారు. వారిలో చివరివాడు బృహద్బలుడు అర్జునుని కుమారుడైన అభిమన్యువు చేతిలో మరణించాడు. రామాయణానికి భారతానికి మధ్య ఉండే పరిపాలకుల చరిత్ర చేరితే ఈ రెంటికీ మధ్య ఉన్న అగాధం పూడుతుంది. ఇక్ష్వాకువు కుమారుడు నిమి. అతని కొడుకు మిథి. అతడే మిథిలా నగరం నిర్మించాడు. అది జనక మహారాజు రాజధాని. వీరి వంశంలో సుశ్రుతుడున్నాడు. ఇతడు గొప్ప వైద్యుడు కావచ్చు. చంద్రవంశంలో మొదటి రాజు పురూరవుడు. అతని చరిత్రను కాళిదాస మహాకవి విక్రమోర్వశీయ నాటకంగా రాశాడు. పురూరవుని వంశంలో ఆనర్తుని పేరుతో ఆనర్త దేశం ఉండేది. ఇది రుక్మిణి తండ్రి భీష్మకుని దేశం. ఇతని కుమారుడు రేవతుడు. సముద్రతీరంలో కుశస్థలి అనే నగరం నిర్మించాడు. అది సముద్రంలో మునిగింది. తరువాత సముద్రం వెనక్కు వెళ్ళింది. ఆ నేల మీద శ్రీకృష్ణుడు ద్వారక నిర్మింపజేశాడు. శ్రీకృష్ణుని అవసాన కాలంలో ఈ నగరాన్ని సముద్రం మళ్లీ ముంచేసింది. ఎస్.ఆర్.రావు ద్వారక దగ్గర సముద్రంలో పరిశోధిస్తే ద్వారక అవశేషాలు లభించడమే కాక దాని కింద మరో నగరం కూడా ఉండేదని ఆధారాలు లభించాయి. చంద్రవంశంలో వాడు భరత చక్రవర్తి. కిరాతులను, హూణులను, యవనులను, కంకులను, ఖశులను, శకులను జయించాడు. ఇతని పేరుమీద భారతదేశమనే పేరు వచ్చిందని చెప్తారు. ఈ వంశంలో హస్తి అనే రాజు హస్తినానగరం నిర్మించాడు.

యుధిష్ఠిరుని నుంచి చంద్రగుప్తుని వరకు ఉండే పరిపాలకుల పేర్లు, వంశాల పేర్లు కూడా చరిత్రలో చేరాలి. యుధిష్ఠిరుని కాలం వాడు జరాసంధుడు. ఇతని తండ్రి బృహద్రథుడు. ఇతని నుండి 107 మంది పరిపాలకుల పేర్లు, 30 గణాల పాలకుల పేర్లు లభిస్తున్నాయి. వీరి పాలనా కాలాలు కూడా ఉన్నాయి. వీరిలో అజాతశత్రువు పేరు బుద్ధ జాతకాలలో కనబడుతుంది. బృహద్రథ వంశం, ప్రద్యోత వంశం, శిశునాభ వంశం, మౌర్య చంద్రగుప్త వంశం పాలించిన తరువాత పుష్యమిత్రుని కుమారుడు అగ్నిమిత్రుడు పాలించాడు. ఇతని చరిత్రను కాళిదాసు మాళవికాగ్నిమిత్రం నాటకంగా రచించాడు. ఈ కోణంలో చూస్తే కాళిదాసు చారిత్రక నాటకాలను, చారిత్రక కావ్యాన్ని రచించాడని అవగతమవుతుంది. అగ్నిమిత్రునిది శుంగవంశం. వీరి తరువాత ఆంధ్రరాజులు పాలించారు. వీరిలో శాతకర్ణి, హాలాహలుడు (హాలుడు–ఇతడు గాథాసప్తశతి సంకలనం చేసినవాడు.) శాతకర్ణి, శివస్కంధుడు, యజ్ఞశ్రీ, చంద్రశ్రీ పేర్లు చరిత్ర పుస్తకాల్లో కనబడతాయి. మాక్స్‌ముల్లర్ మొదలయిన పాశ్చాత్యుల చేతివాటం వల్ల వీరందరు కొన్ని వందల సంవత్సరాలు ముందరకు వచ్చేశారు. కాని అతి ప్రాచీనమయిన పరాశరుని విష్ణుపురాణం ప్రకారం వీరి తర్వాత చాలా మంది పాలకులుగా వచ్చారు. వారిలో ఆంధ్రభృత్యులు, యవనులు మొదలయినవారు చాలా మంది ఉన్నారు.

అలెగ్జాండర్ దండయాత్రా కాలంలో భారతదేశంలో ఆంధ్రరాజులలో చివరివాడు చంద్రశ్రీరాజు. అతడు మైనరు. అతనికి రక్షకులు మంత్రి సేనాపతులు చంద్రగుప్త సముద్రగుప్తులు. ఈ చంద్రగుప్తుడే మౌర్యచంద్రగుప్తుడని పాశ్చాత్యులు రాశారు. భారతీయ చరిత్రకారులు వారిని అనుసరించారు. చంద్రగుప్త మౌర్యునికి చంద్రశ్రీ, చంద్రగుప్తునికి మధ్యలో 48 మంది పాలకులు ఉన్నారు. వీరిద్దరినీ ఒకరిగా చెప్పడం వలన ఆ 48 మంది పాలనా కాలం భారతదేశ చరిత్రలో అదృశ్యమయింది. ఈ తప్పును ట్రాయి పండితుడు మాక్స్‌ముల్లర్‌కు చెప్పాడు. కాని అతడు సవరించలేదు. తరువాత కుప్పయ్య అనే ఆంధ్ర పండితుడు తప్పును ఎత్తిచూపాడు. ఆ తరువాత కోట వెంకటాచలం ఈ పొరపాటును నిరూపించారు. అయినా భారతదేశ చరిత్రలో ఇప్పటివరకు దీనిని సరిచేయలేదు.

సాంచీ స్థూపం మీద లక్ష్మీదేవికి ఏనుగులు అభిషేకం చేస్తున్న సన్నివేశం ఉంది. ఈ సన్నివేశం ఋగ్వేదానికి చెందిన శ్రీసూక్తం ధ్యాన శ్లోకంలో ఉంది. దాన్ని డిడి కోశాంబి మాయాదేవి చిత్రం అని చెప్పారు. మాయాదేవికి ఏనుగులు కలలో కనబడ్డాయి తప్ప ఆమెకు ఏనుగులు స్నానం చేయించిన సన్నివేశం బుద్ధ చరిత్రలో కనబడదు. మాయాదేవికి ఏనుగులు కలలో కనబడిన దృశ్యంతో ఒక శిల్పం వేరే ఉంది.

ఇలా చరిత్రలో ఎన్నో అసంగత విషయాలు కనబడతాయి. చరిత్ర చదివితే దేశభక్తి కలగాలి తప్ప, చదివినవారు దేశాన్ని ముక్కలు చేస్తాం అనకూడదు. సత్యమయిన ఉదాత్తమైన దేశభక్తిని కలిగించే భారతదేశ చరిత్ర వెలువడాలని కోరుకుందాం.

◆ డాక్టర్ చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ







వీరవల్లిలో 22 ఎకరాల విజయా డెయిరీ సువిశాల నూతన ప్రాంగణం

విజయ భేరి

వీరవల్లిలో విజయా డెయిరీ సరికొత్త ఆటోమేషన్ మిల్క్ ప్లాంట్

- 22 ఎకరాల్లో రూ.180 కోట్లతో అత్యాధునికంగా నిర్మాణం
- పూర్తిగా సాంకేతిక, యాంత్రీకరణతో ఏర్పాటు
- పాలతో పాటు పాల ఆధారిత ఉత్పత్తులెన్నో..
- అమూల్ పోటీకి నిలబడి పైచేయి సాధించిన సంస్థ
- ప్రభుత్వ ప్రతిబంధకాలను తట్టుకుని ముందుకు..
- ప్రస్తుతం 10.01 కోట్ల లీటర్ల పాలసేకరణ.. రూ.1,106 కోట్ల టర్నోవర్
- రూ.180 కోట్ల లాభంతో అంచెలంచెలుగా అభివృద్ధి

స్థానిక పాల డెయిరీల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న ప్రభుత్వ విధానాలను తట్టుకుని 'విజయ' భేరి నిరంతరాయంగా మోగుతూనే ఉంది. ప్రభుత్వ సహకారంతో సాగుతున్న అమూల్ వంటి స్థానికేతర డెయిరీలతో పోటీ పడుతూ ఉక్కు సంకల్పంతో ముందుకు సాగుతోంది. నిన్నటివరకు చిట్టినగర్‌లోని పాలఫ్యాక్టరీ ద్వారా విశేష ఖ్యాతిని ఆర్జించిన 'విజయా'.. వీరవల్లిలో కొత్తగా ఏర్పాటుచేసిన ఆటోమేషన్ టెక్నాలజీతో కూడిన మిల్క్ ప్లాంట్ ద్వారా మరింత ఎత్తుకు ఎదిగింది. 22 ఎకరాల విస్తీర్ణంలో రూ.180 కోట్లతో ఈ నవ స్వయంచాలక (ఆటోమేషన్) మిల్క్‌ప్లాంట్ నిర్మాణం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న డెయిరీల చూపు 'విజయా'పై పడింది. అత్యాధునికంగా కంప్యూటర్ ఆధారిత సాంకేతిక, యాంత్రీకరణతో పనిచేసే ఈ ప్లాంట్‌ను శనివారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. ఆ వివరాలు..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆటోమేషన్ మిల్క్‌ప్లాంట్ ఏర్పాటు ద్వారా విజయా డెయిరీ దేశవ్యాప్తంగా ఎంతో పేరు సంపాదించింది. అమూల్ వంటి స్థానికేతర డెయిరీలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహక విధానాల పరంపరలో కూడా విజయా చెక్కు చెదరకుండా ముందుకు సాగుతోంది. అమూల్ కోసం గ్రామగ్రామాన బలవంతంగా పాలసేకరణ జరిపిస్తున్న ప్రభుత్వ నిర్బంధాలను దాటుకుని అభివృద్ధి చెందటం కృష్ణామిల్క్ యూనియన్‌కే సాధ్యమైంది. కృష్ణాజిల్లా వీరవల్లిలో 16వ నెంబరు జాతీయ రహదారికి అత్యంత సమీపాన 22.2 ఎకరాల్లో ఈ ఆటోమేషన్ మిల్క్‌ప్లాంట్‌ను విజయా డెయిరీ ఏర్పాటు చేసింది. దేశంలోనే అత్యంత అడ్వాన్సుడు టెక్నాలజీతో కూడిన ఈ ప్లాంట్‌ను రూ.181 కోట్లతో ఏర్పాటు చేశారు. దీనిద్వారా విజయా డెయిరీ తన నెట్‌వర్క్‌ను మరింత వేగంగా పెంచుకోవటానికి దోహదపడుతుంది. గోదావరి, కృష్ణా జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలకు కూడా చాలా వేగంగా పాల సేకరణ, ఉత్పత్తులు పంపిణీ చేసే ఆస్కారం ఏర్పడుతుంది.

మిల్క్‌ప్లాంట్ ప్రత్యేకతలివీ..

ఆటోమేషన్ మిల్క్‌ప్లాంట్ పూర్తిగా కంప్యూటర్ ఆధారిత ఆధునిక సాంకేతిక, యాంత్రీకరణ ద్వారా పనిచేస్తుంది. ఇది రెండు డివిజన్లుగా ఉంటుంది. మొదటిది యుటిలిటీ డివిజన్. రెండోది ప్రొడ్యూస్ డివిజన్. ఆటోమేషన్ ప్లాంట్‌కు అవసరమైన పవర్, ఎలక్ట్రిక్, బాయిలర్ తదితర విభాగాలు యుటిలిటీలో ఉంటాయి. ప్రధానమైన ప్రొడ్యూస్ డివిజన్‌లోనే ఆటోమేషన్ ప్లాంట్ ఉంటుంది. ఈ ప్లాంట్‌లో ప్రస్తుతం నాలుగు లక్షల లీటర్ల పాలను సంగ్రహిస్తుంది. మూడు లక్షల లీటర్ల లిక్విడిటీ ప్రొడక్ట్ (లస్సీ, బటర్‌మిల్క్), లక్ష లీటర్ల పెరుగు ఉత్పత్తులను నిర్వహిస్తోంది. ఈ ఉత్పాదకతలను ఆరు లక్షల లీటర్ల వరకు కూడా తీసుకెళ్లవచ్చు. ఈ ప్లాంట్ అంతా కంట్రోల్ రూమ్‌లోని కంప్యూటర్ ఆధారిత వ్యవస్థ ద్వారా పనిచేస్తుంది. స్కాడా వ్యవస్థ ద్వారా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ విధానంలో పాలను ఫిల్లింగ్, పంపింగ్ వంటివి చేస్తుంటారు. ఏ ఉత్పాదకత జరగాలన్నా కంట్రోల్ రూమ్ నుంచి ఆదేశాలు రావాల్సిందే. వాహనాల నుంచి పాలను డాక్ యూనిట్ ద్వారా సంగ్రహించి వాటిని ఫ్యాక్టరీ దక్షిణ దిశలో ఉన్న మిల్క్ స్టోరేజ్డ్ ట్యాంకర్లలోకి పంపిస్తారు. లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లు మూడు, అరలక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లు ఏడు ఉన్నాయి. పాల ఉత్పత్తులు తయారుచేసే ముందు ట్యాంకర్లలోని పాలలో ఉన్న వైరస్‌ను చంపటానికి 80 డిగ్రీల ఉష్ణోగ్రతలో వేడి చేస్తారు. ఆ తర్వాత నిర్దేశిత ఫ్యాట్ కంటే ఎక్కువ ఉంటే తొలగిస్తారు. ఇలా చేసిన పాలను పాల ప్యాకెట్లు, పెరుగు, మజ్జిగ, లస్సీలు చేయటానికి పంపిస్తారు. పాల ప్యాకెట్లను తయారు చేయటం కోసం మిల్క్ పౌచ్ ఫిల్లింగ్ స్టేషన్‌లోకి పంపిస్తారు. ఇక్కడ కంప్యూటర్ ఆధారిత విధానంలో పనిచేసే 150 ఎంఎల్, 160 ఎంఎల్, 500 ఎంఎల్ వంటి ప్యాకింగ్ యంత్రాలు ఉంటాయి. కప్ కర్డ్ ఫిల్లింగ్ స్టేషన్‌లోకి పాలను పంపించి బాగా వేడి చేస్తారు.

- మిగతా 6లో

రైతులకు రూ.200 కోట్ల ఆస్తి



నూతన ప్లాంట్ కృష్ణాజిల్లా పాడి రైతులకు 200 కోట్ల రూపాయల ఆస్తి. కరోనాతో ప్రపంచమంతా వణికిపోతున్న సమయంలో విజయా డెయిరీ ఈ విజయాన్ని సాధించింది. ఇది రైతుల విజయంగా భావిస్తున్నాం. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించేందుకు ఇది సోపానంగా నిలుస్తుందని నమ్ముతున్నాం.

- చలసాని ఆంజనేయులు, డెయిరీ చైర్మన్





సిబ్బంది లేకుండా పనిచేసే యంత్రాలు (ఇన్‌సెట్‌లో) అధునాతన టెస్టింగ్ ల్యాబ్

- వర్షాలు కురిసినప్పుడో, వరదలు వచ్చినప్పుడో ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తినప్పుడు కాల్వల ద్వారా నీరు వృథాగా సముద్రంలోకి చేరుతోంది. ఎండకాలంలోనో, నీటి ఎద్దడి సమయంలోనో ఎగువ నుంచి నీటి విడుదల లేనప్పుడు మాత్రం కాల్వలు ఎండిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కరించడానికి అసలు కాల్వలపై చెక్‌డ్యామ్‌లను నిర్మించే ప్రతిపాదనలు చేయొచ్చు కదా? కొద్దినెలల క్రితం జరిగిన నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కొందరు రైతులు అడిగిన ప్రశ్న ఇది.

- *నీటి వనరులను పొదుపుగా ఉపయోగించుకోవడానికి ఇతర రాష్ట్రాల్లో కాల్వలపై చెక్‌డ్యామ్‌లు కనిపిస్తాయి. మనం ఎందుకు నిర్మించకూడదు? ఇది ఓ ప్రజాప్రతినిధి ప్రశ్న.*

..చెంతనే కృష్ణమ్మ ప్రవహిస్తున్నా ఉమ్మడి జిల్లాకు నీటి ఎద్దడి తప్పడం లేదు. నీటి విషయంలో జిల్లా పరిస్థితి అతివృష్టి, అనావృష్టిగా మారింది. వర్షాలు విస్తారంగా కురిసి, ఎగువ నుంచి నీరు విడుదల చేస్తే దాన్ని పొదుపు చేసుకోలేని పరిస్థితి. ఈ సమస్యకు పరిష్కారం చెక్‌డ్యామ్‌ల నిర్మాణమే అని తెలుస్తున్నా అధికారులు కనీస ఆలోచనలు కూడా చేయట్లేదు.

నీటి సమస్యకు చెక్ పెట్టలేరా



రెండు జిల్లాల్లో కాల్వలపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం అత్యవసరం

వర్షాకాలంలో ప్రకాశం బ్యారేజీ నుంచి వృథాగా పోతున్న నీరు

- వేసవిలో చుక్కనీరు లేక అన్నదాతల అవస్థలు
- కాల్వలపై చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని రైతుల డిమాండ్
- ఐఏబీ సమావేశాల్లో నీటి సంఘాల అభిప్రాయం కూడా అదే
- పట్టించుకోని జలవనరుల శాఖ అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : వర్షాభావ పరిస్థితులు తీవ్రరూపం దాల్చినప్పుడు ఇరు జిల్లాల్లో నీటి విడుదల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల నుంచి తప్పించుకుని నీటి నిల్వలను పెంచుకునే చెక్‌డ్యామ్‌ల గురించి జలవనరుల శాఖ అధికారులు ఇప్పటి వరకు ఆలోచనలు చేసిన పరిస్థితులు లేవు. నీటిపారుదల సలహా మండలి సమావేశాల్లో రైతులు వాటి గురించి ప్రశ్నించినప్పుడు మాత్రం 'ఆలోచిస్తాం..' అనే సమాధానం చెబుతున్నారు. ఆ తర్వాత చెక్‌డ్యామ్‌ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఇదీ పరిస్థితి

కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ మూడు భాగాలు విడిపోయి బందరు, ఏలూరు, రైవస్‌గా దిగువకు ప్రవహిస్తుంది. అక్కడి నుంచి ఉప కాల్వలుగా విడిపోయి స్థానిక నామకరణాలతో ప్రవహిస్తాయి. ఎన్టీఆర్ జిల్లాలో తాగు, సాగునీటి అవసరాలకు సాగర్ కాల్వలు ప్రధానమైతే, కృష్ణాజిల్లాకు ఈ కాల్వలే సాగు, తాగునీటిని అందజేస్తాయి. తూర్పుడెల్టా కింద 6లక్షల78వేల531 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇదికాకుండా పొరుగున ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో 58 వేల ఆయకట్టు సాగుతోంది. వెరసి 7లక్షల36వేల531 ఎకరాల ఆయకట్టు ఉంది. బందరు, ఏలూరు, రైవస్ కాల్వల ద్వారా మొత్తం ఆయకట్టుకు సాగునీరు ప్రవహిస్తోంది. తాగునీటి అవసరాలకు ఈ కాల్వలు ప్రధానం. బందరు కాల్వ 39.6 కిలోమీటర్లు ఉండగా, రైవస్ కాల్వ 57.70 కిలోమీటర్లు, ఏలూరు కాల్వ 50.07 కిలోమీటర్లు పొడవు ఉంది. వాటితో పాటు ఉప కాల్వలపై చెక్‌డ్యామ్‌లను నిర్మించవచ్చని జలవనరుల నిపుణులు చెబుతున్నారు. ఒక్కో కాల్వపై 4.6 కిలోమీటర్ల దూరంతో చెక్ డ్యామ్‌లను నిర్మించు కునే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీకి నీరు ఇవ్వలేదు. జలవనరుల శాఖ అధికారులు ప్రస్తుతం ఉన్న నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని చెక్ డ్యామ్‌లను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

ఇలా చేస్తే మేలు

కాల్వలు, ఉపకాల్వలపై చెక్‌డ్యామ్‌లను నిర్మించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వేగంగా జరిగే నీటి ప్రవాహాన్ని ఇవి నియంత్రిస్తాయి. నీటిని పొదుపు చేసుకోవడానికి సులభమైనవి. తక్కువ ఖర్చుతో అక్కడి భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా నిర్మించుకోవచ్చు. తెలంగాణలోని సాగునీటి కాల్వలపై ఎటుచూసినా చెక్‌డ్యామ్‌లు కనిపిస్తాయి. ఇలా చేశాక అక్కడ సాగునీటి కొరత తీరిందని నిపుణులు చెబుతున్నారు. ఈ డ్యామ్‌లను నిర్మించడం వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరం. వీటి నిర్మాణానికి నిపుణులు కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటి నిర్మాణం వల్ల నీటి వృథా తగ్గుతుంది. పైగా రెండు చెక్‌డ్యామ్‌ల మధ్య నీరు ఏడాది పొడవునా నిల్వ ఉంటుంది. దీనివల్ల ఆ సమీప ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు ఈ నీటిని ఉప యోగించుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మైలవరం వైసీపీ ఖాళీ

టీడీపీ తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యే వసంత



పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే వసంతను ఆహ్వానిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

- ఆయన వెంట భారీగా చేరిన అనుచరులు
- ఇబ్రహీంపట్నం ఎంపీపీతో పాటు మరికొంతమంది
- ఇద్దరు వైస్ ఎంపీపీలు, 12 మంది సర్పంచులు కూడా..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : మైలవరం నియోజకవర్గంలో వైసీపీ కేడర్ దాదాపు ఖాళీ అయ్యింది. వసంత కృష్ణప్రసాద్‌తో పాటు ఇబ్రహీంపట్నం ఎంపీపీ, మరో ఇద్దరు వైస్ ఎంపీపీలు, 12 మంది సర్పంచులు, ఏడుగురు సొసైటీ అధ్యక్షులు, ఇద్దరు మండల పార్టీ అధ్యక్షులు, ఇద్దరు కౌన్సిలర్లు, ఇద్దరు వార్డు సభ్యులు శనివారం హైదరాబాద్‌లో టీడీపీలో చేరారు. దీంతో మైలవరంలో వైసీపీ కేడర్ దాదాపు కనుమరుగైంది.

భారీగా చేరికలు

మైలవరం మండలం నుంచి.. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ రహీం, కీర్తిరాయునిగూడెం ఎంపీటీసీ భూక్యా అయ్యా, వైసీపీ మైలవరం మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ నన్నే బాబు, జిల్లా బీసీ కమిటీ సభ్యుడు వేముల దుర్గారావు, వైసీపీ చంద్రగూడెం అధ్యక్షుడు దేవరకొండ అంజనేయులు, ప్రత్తిపాటి కిరణ్ టీడీపీలో చేరారు. రెడ్డిగూడెం మండలం నుంచి.. శ్రీరాంపురం సర్పంచి అట్లూరి శ్రీనివాస రావు, నేలపట్ల అంబికా నాగరాజు, చిన్ని తిరుపతిరావు, చిన్ని వలరాజు, చిన్ని రామారావు, వైసీపీ సీనియర్ నాయకులు మౌనికల సాంబశివరావు, పటాపంచల రామారావు, పూల కోటేశ్వరరావు, మడిమల నాగేశ్వరరావు, కొండపల్లి సురేశ్, పూల వెంకటేశ్వరరావు, చామకూర దుర్గాప్రసాద్ తదితరులు టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం నుంచి.. ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ-1 బండి నాగమణి, తుమ్మలపాలెం సర్పంచి బొమ్ము వెంకటరమణ, జూపూడి సర్పంచి కాకి దేవమాత, మూలపాడు పీఏసీఎస్ చైర్మన్ గౌరినేని గాంధీ, వాసిరెడ్డి హరినాథ్, లంకె గోవిందరాజులు, చెరుకుమల్లి తిరుపతిరావు, చింతల చిట్టిబాబు, చెరుకుమల్లి సీతారామాంజనేయులు, కొక్కిలిగడ్డ నాగరాజు, పోలగంగు రాణి, కొండపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు షేక్ రసూల్, దామెర్ల శ్రీలక్ష్మి తదితరులు టీడీపీలో చేరారు. జి.కొండూరు మండలం నుంచి.. వైసీపీ మండల అధ్యక్షుడు నెల్లూరు లీలా శ్రీనివాస్, కందులపాడు సర్పంచి నెల్లూరు శ్రీదేవి, సూదిరెడ్డి సురేశ్, గార్లపాటి వెంకట్రావు, విజయవాడ రూరల్ నుంచి.. మండల వైసీపీ అధ్యక్షుడు కాటంనేని పూర్ణచంద్రరావు, ముప్పాళ్ల చైతన్యకుమార్, పెద్ది రాంబాయమ్మ, వెలగలేరు వైసీపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ చల్లగుంట అజయ్‌కుమార్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

ఎపిక్ టెన్షన్



ఇంకా 1,86,784 ఓటరు కార్డులు రావాలి

- నోటిఫికేషన్ దగ్గర పడటంతో బీఎల్వోలపై ఒత్తిడి
- పూర్తిస్థాయిలో ముద్రణ కాకపోవటంతోనే సమస్య

విజయవాడ నగరంలోనే పెండింగ్ ఎక్కువ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓటరు కార్డుల కోసం జిల్లా యంత్రాంగం ఎదురుచూస్తోంది. ప్రింటింగ్‌లో నెలకొన్న జాప్యం కారణంగా, ఓటర్లకు ఎపిక్ కార్డులను పూర్తిగా పంపిణీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. విజయవాడ నగర పరిధిలోని నియోజకవర్గాల్లో ప్రధానంగా ఈ సమస్య నెలకొంది. మరో రెండు వారాల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఎపిక్ కార్డుల కోసం ఓటర్ల నుంచి బీఎల్వోలపై ఒత్తిడి ప్రారంభమైంది. కొత్తగా ఎపిక్ కార్డుల జారీకి సంబంధించి చూస్తే.. ఇంకా 4,00,516 ఎపిక్ కార్డుల ముద్రణ జరగాల్సి ఉంది. ఇప్పటి వరకు చూస్తే 3,97,166 ఎపిక్ కార్డులే జనరేట్ చేశారు. వీటిలో 2,14,616 కార్డులను ప్రింటింగ్ కోసం పంపారు. ఈ కార్డుల వరకు ముద్రణ పూర్తయింది. ఇంకా 1,86,784 కార్డులు ముద్రణ కాలేదు. ఈ కార్డులన్నీ ముద్రణ అయితే కానీ, పూర్తిస్థాయిలో నూతన ఎపిక్ కార్డుల పంపిణీ ప్రక్రియ పూర్తికాదు. నియోజకవర్గాల వారీగా చూస్తే.. తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 25,526 ఎపిక్ కార్డులే ప్రింటింగ్ అయ్యాయి. విజయవాడ పశ్చిమకు సంబంధించి 31,114 ఎపిక్ కార్డులు, విజయవాడ సెంట్రల్‌కు 33,047, విజయవాడ తూర్పుకు 57,372, మైలవరంకు 21,547, నందిగామకు 22,705, జగ్గయ్యపేటకు 23,335 ఎపిక్ కార్డులు మాత్రమే ముద్రితమయ్యాయి. పెండింగ్ ఎపిక్ కార్డుల విషయానికొస్తే తిరువూరులో 8,539 కార్డులు ఇంకా ప్రింటింగ్ కాలేదు.

విజయవాడ పశ్చిమలో 50,199, విజయవాడ సెంట్రల్‌లో 54,144, విజయవాడ తూర్పులో 21,499, మైలవరంలో 37,499, నందిగామలో 7,234, జగ్గయ్యపేటలో 7,790 ఎపిక్ కార్డులు ఇంకా ముద్రితం కావాల్సి ఉంది. మరో పక్షం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నందున ఇంకా ఎపిక్ కార్డుల ముద్రణ జరగకపోవటంలో ఎన్నికల అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఓటర్ల నుంచి ఒత్తిడి పెరిగింది. ఆన్‌లైన్‌లో చాలా వరకు ఓటరు కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని స్మార్ట్ కార్డులపై ప్రింటింగ్ చేయించుకుంటున్నారు. కొంతమంది హాలోగ్రామ్‌తో కూడిన ఎపిక్ కార్డుల కోసమే ఎదురుచూస్తున్నారు. ఇవి పాస్‌పోర్టు పొందటానికి దోహదపడుతుండటంతో చాలామంది హాలోగ్రామ్‌తో కూడిన కార్డుల కోసమే ఎదురుచూస్తున్నారు.

నేడే పల్స్ పోలియో

- 2.48 లక్షల మంది చిన్నారులకు చుక్కల మందు
- 3.11 లక్షల డోసులు సిద్ధం : కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



నగరంలో జరిగిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీ

- 6లో..

దుర్గమ్మ హుండీల ఆదాయం రూ.4.65 కోట్లు



సభాస్థలం వద్ద టీడీపీ కృష్ణాజిల్లా నేతలు

7న పెదపూడిలో ప్రజాగళం

▸▸ విజయవంతం చేయాలని టీడీపీ కృష్ణాజిల్లా నేతల పిలుపు

కూచిపూడి, మార్చి 2: పామర్రు నియోజకవర్గ పరిధిలోని పెదపూడిలో ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం ప్రజాగళం సభను నిర్వహిస్తున్నామని టీడీపీ అధి నేత చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, విజయవంతం చేయాలని ఆ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. శనివారం సభ నిర్వహించే ప్రాంతాన్ని వారు పరిశీలిం చారు. పార్టీలకతీతకంగా తటస్థుల సమస్యలను చంద్రబాబు తెలుసుకుంటారని, అధికారంలోకి వచ్చాక వాటిని పరిష్కరించడానికే ఈసభ నిర్వహిస్తున్నామని కొన కళ్ల నారాయణ తెలిపారు. ప్రజలు, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, స్ర్తీలు పడుతున్న ఇబ్బందులు, అన్నివర్గాల సమస్యలు తెలుసుకుని వాటిని చంద్ర బాబుకు వివరిస్తామని తెలిపారు. కొంతమందితో నేరుగా చంద్రబాబు ముచ్చటి స్తారన్నారు. అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం సభలో టీడీపీ- జనసేన ఉమ్మడి కార్యాచరణ ప్రకటించినట్లు పేర్కొన్నారు. పామర్రు, గుడివాడ, పెడన, బందరుతోపాటు పక్క నియోజకవర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. 6వేల మంది ప్రతినిధులతో సభ నిర్వహిస్తున్నామని రవీంద్ర తెలిపారు. ప్రజాగళం సభ వి జయవంతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా కోరారు. నన్నప నేని వీరేంద్ర, లింగమనేని రామలింగేశ్వర రావు, తలశిల స్వర్ణలత పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో ప్రవర్తనా నియమావళి కీలకం

▸▸ అధికారుల శిక్షణలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

వన్‌టౌన్, మార్చి 2: ఎన్నికలను స్వేచ్ఛగా, నిజాయితీగా, ప్రశాంతంగా నిర్వ హించేందుకు ప్రవర్తనా నియమావళి కీలకంగా వ్యవహరిస్తుందని ఎన్నికల అధి కారి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో గ్రామ, పట్టణ, నగరస్థాయిలో పర్యవేక్షకులుగా వ్యవహరించే ఎంపీడీవోలు, మునిసి పల్ జోనల్ కమిషనర్లకు ప్రవర్తనా నియమావళిపై శనివారం పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తేదీ నుంచి ప్రక్రియ పూర్త య్యేంత వరకు ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమనిబంధనలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయించిన మేరకే అభ్యర్థుల వ్యయం ఉం డాలని, రికార్డును సక్రమంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. దేవాలయాలు, చర్చిలు, మసీదులను ఎన్నికల ప్రచారానికి వినియోగించకూడద న్నారు. ప్రైవేట్ భవనాల యాజమానుల అనుమతి లేకుండా పోస్టర్లు అంటించడం, రాయడం చేయకూడదన్నారు. పార్టీ ప్రచారానికి ముద్రించే కరపత్రం పోస్టర్లపై ప్రచురణకర్త పేరు, చిరునామా తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం చేసే అభ్యర్థులు మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ సర్టిఫికెట్లను తీసుకోవాలన్నారు. వార్తా పత్రికల్లో పెయిడ్ వార్తలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక అధికారుల అనుమతులు లేకుండా పార్టీలు కానీ, అభ్యర్థి గాని బహిరంగ సమావేశాలు నిర్వహించకూడదన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో వాహనాల పరిమితి నిబంధనను అమలు చేయాలన్నారు. ప్రజలను ప్రభావితం చేసే దేశ, రాష్ట్ర, స్థానిక నాయకుల విగ్రహాలను కప్పి ఉంచాలన్నారు. కొత్త పథకాల ప్రకటన, ప్రాజెక్టుల శంకుస్థాపన, కొత్త పనుల మంజూరు, ఆర్థిక గ్రాంట్లు ప్రకటించడం చేయరాదన్నారు. మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు బీహెచ్ భవానీశంకర్, కె.మాధవి, ఆర్.రవీంద్రరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

ఓటర్ల దరఖాస్తులు సత్వరమే పరిష్కరించండి

▸▸ అధికారులకు కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

మచిలీపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తుది ఓటర్ల జాబితాలు ప్రకటించిన అనంతరం కృష్ణాజిల్లాలో ఓటర్లుగా చేరేందుకు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. జేసీ గీతాంజలిశర్మతో కలిసి ఎన్ని కల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో శనివారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపుహాలులో ఆయన సమావేశం నిర్వహించారు. ఈఏడాది జనవరి 22వ తేదీన తుది ఓటర్లజాబితా ప్రకటించిన అనంతరం జిల్లాలో ఫాం-6,7,8 దరఖాస్తులు 37,634 అందాయన్నారు. వీటిలో 24,338 అంగీకరించామని, 2,929 తిరస్కరించా మని, ఇంకా 10,367 దరఖాస్తుల పరిశీలన వివిధ దశల్లో ఉందని తెలిపారు. పద్దెని మిదేళ్లు నిండినవారు నూతన ఓటర్లుగా నమోదయ్యేందుకు ఇంకా దరఖాస్తు చేసు కోవచ్చన్నారు. జిల్లాలో వివిధ పోలింగ్ స్టేషన్ల మార్పుకోసం వచ్చిన ప్రతిపాదన లను ఎన్నికల సంఘం ఆమోదం కోసం పంపినట్లు తెలిపారు. డీఆర్వో కె.చంద్రశేఖ రరావు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

సురక్ష క్యాంపుల నిర్వహణలో కృష్ణాకు ప్రథమస్థానం

రెండో విడత ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణలో కృష్ణాజిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండో వి డత జిల్లాలో 236 సురక్ష క్యాంపుల్లో 1,14,594మందికి వైద్యపరీక్షలు నిర్వహించి నట్లు జవహర్‌రెడ్డికి వివరించారు. జిల్లాలో మినుము, పెసర. శెనగ కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేస్తామని, ఆదివారం సమావేశం నిర్వహించి ఏ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనేది నిర్ణయిస్తామని తెలిపారు. జేసీ గీతాంజ లిశర్మ, వివి ధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీల ఆదాయం రూ.4.65 కోట్లు

వన్‌టౌన్, మార్చి 2: ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మకు 32 రోజులకు హుండీల్లో భక్తులు రూ.4,65,65,102 కానుకలు సమర్పించారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థా నంలో మహా మండపం ఆరో అంతస్థులో శనివారం హుండీల్లో కానుకలను లెక్కిం చారు. బంగారం 848గ్రాములు, 11 కిలోల వెండిని హుండీల్లో సమర్పించుకున్నారు. 3298 యూఎస్ డాలర్లు, 4.5 ఓమన్ రియాల్స్, 70 యూకే పౌండ్లు, 145 కెనడా డాలర్లు, 110 ఆస్ట్రేలియా డాలర్లు, 20 యూరోలు, 66 సింగ పూర్ డాలర్లు, 12 మలేషియా రింగెట్లు, 139 యూఏఈ దీర్హమ్‌లు, 1.25 కువైట్ దీనార్లు, 35 సౌదీ రియాల్స్, 3 ఖతార్ రియాల్స్‌ను భక్తులు కానుకగా వేశారు. ఈవో రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, పోలీసులు పాల్గొన్నారు.



షర్మిలకు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతులు.

మా సమస్యలు మ్యానిఫెస్టోలో చేర్చండి

● రాజకీయ పార్టీలకు కౌలు రైతు సంఘం వినతి

విజయవాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని రాష్ట్ర కౌలు రైతుల సంఘం అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను విజయవాడలో సంఘ ప్రతినిధులు శనివారం కలిశారు. ప్రతి పేద కౌలు రైతుకి నెలకు రూ.5వేలు పెన్షన్ అందజేయాలని, భూమి లేని అగ్రవర్ణ కౌలు రైతులకు రైతు భరోసా అమలు చేయాలని కోరారు. కౌలు రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సీసీఆర్డీ కార్డులతో సంబంధం లేకుండా సాగు చేస్తున్న కౌలు రైతులకు ఈ క్రాప్ అమలు చేయాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న రైతు, కౌలు రైతుల కుటుంబాలకు రూ.25లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



రెండు పోలియో చుక్కలతో

విజయవాడలో పల్స్ పోలియో ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

అంగవైకల్యాన్ని రూపుమాపుదాం

నేడు ఎన్టీఆర్ జిల్లాలో 2.48 లక్షల మంది చిన్నారులకు చుక్కల మందు

▸▸ 3.11 లక్షల డోసులు సిద్ధం: కలెక్టర్ ఎస్.దిల్లీరావు

వన్‌టౌన్, మార్చి 2: రెండు పోలియో చుక్కలతో చిన్నారుల్లో అంగ వైకల్యాన్ని రూపుమాపుదామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు పిలుపునిచ్చారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో పల్స్ పోలియో సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం పాత ప్రభుత్వాసుపత్రి వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభిం చారు. ఆదివారం జిల్లాలో 1,008 పల్స్ పోలియో కేంద్రాల్లో ఐదేళ్లలోపున్న 2.48 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నామని ఆయన తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో 397, గ్రామీణ ప్రాంతాల్లో 611 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో 35 కేంద్రాలు, 71 మొబైల్ యూనిట్లు ఉన్నాయన్నారు. 4,244 మంది వ్యాక్సినేటర్లు, 3,11, 460 చుక్కల డోస్‌లను సిద్ధం చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఆయన సూచించారు. పల్స్ పోలియో చుక్కలు వేయడం ద్వారా ఐదేళ్లలో ఎక్కడా పోలియో కేసులు నమోదు కాలేదని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం ఎంపిక చేసిన కేంద్రాల్లో పోలియో చుక్కలు వేస్తారని సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి చుక్కలు వేస్తారని మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నగరంలో 1.50లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విమ్స్ నర్సింగ్ విద్యార్థులు, పోలియోతో బాలిక పడే ఇబ్బందులను వీధినాటిక ద్వారా ప్రదర్శించారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బి.సమరం, వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారిణి సుహాసిని, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత, టీబీ కంట్రోల్ అధికారిణి డాక్టర్ ఉషారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, జిల్లా మలేరియా అధికారి మోతీబాబు, డీపీఎంవో డాక్టర్ నవీన్, అప్నా అధ్యక్షుడు డాక్టర్ అనమయ్య, ఐడీసీసీ ప్రాజెక్ట్ అధికారిణి జి.ఉమాదేవి పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో 1.39 లక్షల చిన్నారుల కోసం

1.85 లక్షల డోసులు సిద్ధం

▸▸ డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి

మచిలీపట్నం టౌన్, మార్చి 2: జిల్లాలోని 1,153 పల్స్‌పోలియో కేంద్రాల్లో ఆదివారం నూరుశాతం పోలియో చుక్కలు వేసి జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యసిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ కృష్ణాజిల్లా అధికారి డాక్టర్ జి.గీతాబాయి పిలుపుని చ్చారు. శనివారం నగరంలో నిర్వహించిన ర్యాలీని గీతాబాయి నిర్వహిం చారు. గ్రామీణ ప్రాంతాల్లో 956, పట్టణ ప్రాంతాల్లో 127 పోలియో కేం ద్రాలు ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ఐదేళ్లలోపు 1,39,180 మంది పిల్లలున్నారని, వీరికి కావలసిన 1,85,240 డోసులను సిద్ధం చేశామని తెలిపారు. 62 మొబైల్ పోలియో కేంద్రాలు, 23 ట్రాన్సిట్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. 4,898 మంది సిబ్బందిని ఇందుకు నియమించామన్నారు. మార్చి 3న పల్స్‌పోలియో కేంద్రం స్థాయిలో చుక్కలు వేస్తారని, 4, 5 తేదీల్లో మిగిలిపోయిన పిల్లలకు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ, విద్యాశాఖతో పాటు ఇతర శాఖల ఉద్యోగులు భాగస్వాముల వుతారన్నారు. జిల్లాలో 158 హైరిస్క్ ప్రాంతాలైన ఇటుక బట్టీలు, క్రషర్స్‌లలో, సంచార జాతుల వారిని సర్వే చేసి గుర్తించామని, వారికీ పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఈ ర్యాలీలో ఐడీవో డాక్టర్ సీతాకుమారి, డాక్టర్ నాగభవాని, వైద్యాధికారి డాక్టర్ పి. సుష్మ, నర్సింగ్ కళాశాల సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో పల్స్‌పోలియో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి



కోనేరు సెంటర్‌లో కటౌట్ వద్ద ధర్నా చేస్తున్న పిప్పళ్ల సూర్యప్రకాశరావు, టీడీపీ నాయకులు

వైసీపీ కటౌట్లపై టీడీపీ నేత తండ్రి ఫొటో

కటౌట్లు తొలగించాలని కోనేరు సెంటర్‌లో టీడీపీ ధర్నా

మచిలీపట్నం టౌన్, మార్చి 2: వైసీపీ మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టుతో టీడీపీ నాయకుడి తండ్రి ఫొటోను వైసీపీ కటౌట్లు, ఫ్లెక్సీలపై వేసుకోవడం ఏంటని టీడీపీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా ధ్వజమెత్తారు. టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు తండ్రి సూర్యప్రకాశరావు ఫొటోను కోనేరుసెంటర్, తదితర ప్రాంతాల్లో పెట్టిన వైసీపీ కటౌట్లు, ఫ్లెక్సీల్లో వేయడంపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం కోనేరుసెంటర్‌లో కటౌట్ వద్ద ధర్నా చేశారు. దానిని తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పిప్పళ్ల కాంతారావు, పిప్పళ్ల సూర్యప్రకాశరావు, కట్టా దుర్గ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీలో ఎప్పుడు చేరావంటున్నారు

ఏడాది క్రితం పార్టీ పర్యటనలో భాగంగా మా ఇంటికి వైసీపీ మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టు వచ్చారు. మేము టీ ఇస్తే కిట్టు తాగారు. ఆ సమయంలో నాతో కిట్టు మాట్లాడారు. నాకు తెలియకుండా ఫొటోలు తీశారు. నా అనుమతి లేకుండా నా ఫొటోను నగరంలోని కోనేరుసెంటర్ తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, కటౌట్లపై వేశారు. వడ్డి రంగారావు ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి నేను టీడీపీలో ఉన్నా. నా అనుమతి లేకుండా నా ఫొటో కటౌట్లలో ప్రచురించడం ఏంటి. ఈ కటౌట్ చూసి అందరూ వైసీపీలో ఎప్పుడు చేరావని అడుగుతున్నారు. కటౌట్లను వెంటనే తొల గించాలి.

\- పిపళ్ల సూర్యప్రకాశరావు





ప్లాంట్ కంట్రోల్ రూమ్ పనితీరు, ఉత్పత్తులను వివరిస్తున్న డెయిరీ అధికారులు, బాదం మిల్క్ పౌడర్, మిల్క్‌కోవా

విజయ భేరి

(ఐదో పేజీ తరువాయి)

అక్కడి నుంచి అవి తోడుకోవటానికి వీలుగా బ్లాస్ట్ రూమ్‌ల్లోకి పంపించి మరింత వేడి చేస్తారు. ఆ తర్వాత వాటిని కోల్డ్ చాంబర్లలోకి తీసుకెళ్తారు. అక్కడ పెరుగు గడ్డకట్టుకుపోతుంది. పాల నాణ్యతను పరీక్షించటానికి రెండు క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లు ఉన్నాయి. మంచి బ్యాక్టీరియాను కోల్డ్ బాక్సుల్లో నిల్వచేస్తారు. పాల నుంచి, ఫ్యాట్ నుంచి తయారు చేసిన పౌడర్‌ను కూడా కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేస్తారు. పాల ప్యాకెట్లను ఉంచే ట్రేలను శుభ్రం చేయటానికి ప్రత్యేకమైన విభాగం ఉంది. ఆటోమేషన్ ప్లాంట్‌కు పాలు సరఫరా అయ్యే పైపులు, మెషినరీని శుభ్రపరిచే విధానాన్ని ఆటోమేషన్‌లోనే చేపట్టడం విశేషం. దీనికోసం సిప్ విధానం పనిచేస్తుంది. సురక్షితమైన పాలు, పాల ఉత్పత్తులను ఆటోమేషన్ విధానంలో ఉత్పత్తి చేయడమే ఇక్కడి ప్రత్యేకత.

ఆది నుంచీ విజయపథమే..

యూనిసెఫ్ ఆర్థిక సహకారంతో 1964లో కృష్ణా డిస్ట్రిక్ట్ మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ యూనియన్ (కృష్ణామిల్క్ యూనియన్) ఏర్పడింది. ఈ యూనియన్ నేతృత్వంలో విజయవాడలోని చిట్టినగర్ సమీపంలో మిల్క్‌ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. ఇది పూర్తిగా మాన్యువల్ విధానంలో పనిచేస్తుంది. వీరవల్లిలో ఏర్పాటు చేసిన మిల్క్‌ప్లాంట్ మాత్రం పూర్తి ఆటోమేషన్ విధానంలో పనిచేస్తుంది.

ఆరు దశాబ్దాల్లో అభివృద్ధిబాట

ప్రముఖులు కాకాని వెంకటరత్నం, ముక్కాల రాజా, వల్లభనేని రంగయ్య చౌదరి, పర్వతనేని వెంకటరత్నం, ఎర్నేని వెంకటేశ్వరరావులు కృష్ణామిల్క్ యూనియన్‌ను స్థాపించారు. సుదీర్ఘకాలం చైర్మన్‌గా సాగిన మండవ జానకీరామయ్య విజయా డెయిరీని ముందుకు నడిపించారు. స్థానికేతర డెయిరీల ప్రాబల్యం పెరుగుతున్న దశలో చైర్మన్‌గా వచ్చిన చలసాని ఆంజనేయులు విజయా డెయిరీని పూర్తిగా మార్చేశారు. స్థానిక ముద్రను తొలగించి రాష్ట్రీయంగా, దేశీయంగా పాలసేకరణ, పాల ఉత్పత్తులు తయారు చేయించే సంస్థగా తీర్చిదిద్దారు.

కృష్ణామిల్క్ యూనియన్ బలోపేతం

విజయా డెయిరీ అభివృద్ధి పథాన సాగడానికి కృష్ణామిల్క్ యూనియన్ ప్రధాన కారణం. పాడి రైతులకు జీవనోపాధిని కల్పించటంతో పాటు పాడి ఉత్పాదకతను పెంచటానికి యూనియన్ పనిచేస్తోంది. ఇది ప్రస్తుతం 1,000 గ్రామీణ పాలసేకరణ కేంద్రాలను నిర్వహిస్తోంది. ఇవన్నీ ఆయా సొసైటీలకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన కమిటీల పర్యవేక్షణలో పనిచేస్తాయి. డైరెక్టర్లతో కూడిన సెంట్రల్ బోర్డు విజయా డెయిరీని ఆజమాయిషీ చేస్తుంది.

భారీగా పెరిగిన పాల సేకరణ

విజయా డెయిరీ భారీగా పాలసేకరణ చేపడుతోంది. 2012-13లో 5.81 కోట్ల లీటర్ల పాలను సేకరిస్తే, 2016-17 నాటికి 5.98 కోట్ల లీటర్లకు చేరింది. అలాగే, 2018-19లో 6.04 కోట్ల లీటర్లు, 2019-20లో 7.07 కోట్ల లీటర్లు, 2020-21లో 8.94 కోట్ల లీటర్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 10.1 కోట్ల లీటర్ల పాలను సేకరించింది. ఆరున్నరేళ్లలో విజయా ఎదుగుదలను ఇది ప్రతిబింబిస్తుంది. విస్తరణతో పాటే వృద్ధి కూడా గణనీయంగా పెరుగుతూ వస్తోంది. 2017-18లో రూ.662 కోట్ల టర్నోవర్‌గా ఉన్న విజయా డెయిరీ 2018-19లో రూ.712 కోట్లు, 2019-20లో రూ.794 కోట్లు, 2020-21లో రూ.915 కోట్లు, 2021-22లో రూ.1,007 కోట్లు, 2022-23లో 1,106 కోట్ల టర్నోవర్‌ను సాధించింది.

లాభాలపాలు

విజయా డెయిరీ పాలసేకరణతో ప్రారంభించి పాల ఉత్పత్తులతో మంచి లాభాలనే సాధిస్తోంది. 2014-15లో రూ.72 కోట్ల లాభంలో ఉన్న డెయిరీ అంచెలంచెలుగా ఎదిగింది. 2015-16లో రూ.76 కోట్ల లాభం, 2016-17లో రూ.63 కోట్లు, 2017-18లో రూ.78 కోట్లు, 2018-19లో రూ.84 కోట్లు, 2019-20లో రూ.102 కోట్లు, 2020-21లో రూ.127 కోట్లు, 2021-22లో రూ.159 కోట్ల లాభాన్ని సాధిస్తే, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.180 కోట్ల లాభం వచ్చింది.

రకరకాల పాల ఉత్పత్తులు

విజయా డెయిరీ పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీనే కాకుండా దూద్‌పెడ, మలాయి లడ్డు, ఫెస్టివల్ స్వీట్స్, మిల్క్ కేక్, బటర్ బర్ఫీ, చాక్లెట్ బర్ఫీ, ఖర్జూర కోవా, కళాకానీ, మిక్స్‌డ్ లడ్డు, బాదం మిల్క్ పౌడర్, మిల్క్ పౌడర్, నెయ్యి, కొ మిల్క్ వంటి అనేక రకాల ఉత్పత్తులను తయారు చేస్తోంది. వీటిని లాభాపేక్ష కోసం కాకుండా ఏజెంట్ల వ్యాపారం కోసం మార్జినల్ రేట్లకు అందిస్తోంది.

పాడి రైతుల కోసం...

సంస్థకు మూలాధారమైన పాడిరైతుల సంక్షేమం కోసం కృష్ణామిల్క్ యూనియన్ చాలా చేస్తోంది. ఇటీవల కాలంలో 'పల్లెకు పోదాం.. పాడిని పెంచుకుందాం', 'పల్లెకు పోదాం.. పాడిరైతుల లాభాలను పెంచుదాం' అనే నినాదంతో ముందుకు సాగుతోంది. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని లాభాల్లో 10 శాతం బోనస్‌గా ఇస్తోంది. ఎక్కువ పాలనిచ్చే గేదెలను అందించటం, పౌష్టికరమైన పశుదాణా ఇవ్వడం, సుశిక్షితులైన వెటర్నరీ డాక్టర్లతో క్యాంపులు నిర్వహించటం, సబ్సిడీపై పశువుల కొనుగోలుకు ప్రోత్సాహకాలు ఇవ్వడం చేపడుతోంది. పాలరైతు చనిపోతే రూ.50 వేల సహాయం, పాడిరైతు ఇంట పెళ్లిళ్లు జరిగితే కల్యాణమస్తు పథకం కింద బంగారు కాయిన్ ఇవ్వటం, ప్రతిభ స్కీమ్ కింద రైతుల పిల్లలకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేపడుతోంది.

వైఎస్ వివేకాను హతమార్చింది

జగన్ ముఠానే

▸▸ రాజకీయ లబ్ధి కోసమే హత్య: బొండా ఉమా

పాయకాపురం, మార్చి 2: రాజకీయ లబ్ధి కోసమే మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని జగన్ ముఠా హత్య చేసిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వివేకా హత్య జరిగిన రోజునే బాబాయిని గొడ్డలితో చంపారని సీఎం జగన్ చెప్పారని, అంత కచ్చితంగా జగన్ ఎలా చెబుతారని, సీఎంకు ఏమైనా అతీంద్రియ శక్తులు ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. సీబీఐ విచారణకు వివేకా కుమార్తె సునీత డిమాండ్ చేస్తే జగన్ ఎందుకు ఆపారో చెప్పాలన్నారు. మొదటి సీబీఐ విచారణ కోరిన జగన్ గద్దెనెక్కాక సీబీఐ విచారణ వద్దు అనడానికి కారణం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం అయిన అనంతరం జగన్ సీబీఐ పిటిషన్ ఎందుకు వెనక్కి తీసుకున్నారని ప్రశ్నించారు. బాబాయిని చంపిన అబ్బాయిని జగన్ రక్షించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్ట్ చేయడానికి సీబీఐ అధికారులు కర్నూల్‌కు వస్తే వారిని ఎందుకు అడ్డుకు న్నారన్నారు. జగన్ సోదరి సునీత అడుగుతున్న ప్రశ్న లకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని, తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చి వివేకానందరెడ్డిని చం పిన నిజాన్ని జగన్ ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబానికి చెందిన ఆడబిడ్డకు న్యాయం చేయ లేని సీఎం రాష్ట్రంలో ఉన్న అక్కాచెల్లెమ్మలకు ఏం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. వివేకా కుమార్తె సునీత చేస్తున్న న్యాయపోరాటానికి టీడీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వివేకానందరెడ్డిని అతి క్రూరంగా గొడ్డ లితో చంపిన హంతకులకు శిక్ష పడకపోతే రాష్ట్రంలో పౌరుల మాన, ప్రాణాలకు రక్షణ ఉండదన్నారు. ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ ఉండాలంటే సునీత చెప్పినట్లు వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

సునీతారెడ్డి ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలి

▸▸ కాగిత కృష్ణప్రసాద్ డిమాండ్

బంటుమిల్లి, మార్చి 2: "జగన్‌కు రాజకీయ లబ్ధి చేకూర్చేందుకే మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని జగన్ ముఠా హతమార్చింది. వివేకా హత్యపై ఆయన కుమార్తె వైఎస్ సునీతారెడ్డి సంధిస్తున్న ప్రశ్నలకు సీఎం జగన్ సమాధానం చెప్పాలి." అని టీడీపీ-జనసేన కూటమి పెడన అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం నాగేశ్వరరావుపేటలో స్థానిక స్వపరిపాలన, ఆత్మగౌరవం ఆత్మవిశ్వాసం డిక్లరేషన్ పత్రాన్ని విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వివేకా హత్యకేసులో జగన్ పాత్రపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. మొదట్లో సీబీఐ విచారణ కోరిన జగన్ తరువాత వద్దు అనడానికి కారణాన్ని రాష్ట్ర ప్రజలకు తెలపాలన్నారు. ఇకనైనా శవరాజకీయాల్ని మానుకోవాలన్నారు. సునీతారెడ్డి న్యాయపోరాటానికి 5 కోట్ల ఆంధ్రులు పార్టీలకతీతంగా మద్దతు ఇవ్వాలన్నారు.

జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరపాలి

▸▸ నెట్టెం రఘురాం డిమాండ్

జగ్గయ్యపేట, మార్చి 2: వైఎస్ వివేకా హత్య కేసులో సీఎం జగన్‌రెడ్డి పాత్రపై సమగ్ర విచారణ జరపాలని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతగా సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన జగన్ సీఎం కాగానే యూటర్న్ ఎందుకు తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు. సీబీఐ విచారణకు వివేకా కుమార్తె సునీత పిటిషన్ వేస్తానంటే ఎందుకు నిలువరించారని నిలదీశారు. సోదరుడు ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్టు కాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం బాబాయిను హత్య చేయించిన జగన్.. నిందితులను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, సోదరి సునీత లేవనెత్తిన సందేహాలను సీఎం నివృత్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చెల్లికే న్యాయం చేయలేదు: దేవినేని ఉమా

గొల్లపూడి: "రాజకీయ లబ్ధి కోసం తన తండ్రి వైఎస్ వివేకాను హత్య చేయించారని వైఎస్ సునీతారెడ్డి స్పష్టంగా చెబుతున్నారు. అధికారంలోకి రావాలనే జగన్మోహన్‌రెడ్డి హత్య చేయించారని సునీత వ్యాఖ్యల ఆధారంగా స్పష్టంగా తెలుస్తోంది. వివేకా హత్య కేసులో జగన్ పాత్రపైనా విచారణ జరిపించాలి" అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వివేకా హత్యపై జగన్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సొంత చెల్లికి న్యాయం చేయలేని వాడివి ప్రజలకు ఏం న్యాయం చేస్తావని నిలదీశారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ



గవర్నర్‌పేట, మార్చి 2: ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని నినాదాలు చేస్తూ దుర్గాపురంలోని వాణీ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు శనివారం అరండల్‌పేట అన్నదాన సమాజం రోడ్డు వెంట అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ర్యాలీని ప్రారంభించిన స్కూల్ డైరెక్టర్ ఏ. శేషుబాబు మాట్లాడుతూ అంగవైకల్యం కలగకుండా ముందు జాగ్రత్త చర్యగా తల్లిదండ్రులు తమ పిల్లలకు రెండు పోలియో చుక్కలు తప్పక వేయించాలని అన్నారు.

టీడీపీతోనే బీసీలకు ఉపాధి అవకాశాలు

మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేస్తున్న బొండా ఉమామహేశ్వరరావు, బాలస్వామి తదితరులు

గవర్నర్‌పేట, మార్చి 2: టీడీపీ ఆవిర్భావం తరువాతనే రాష్ట్రంలో బీసీలకు తగిన గుర్తింపు లభించిందని టీడీపీ సెంట్రల్ ఇన్‌చార్జి బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. టీడీపీ విజయవాడ పార్లమెంటు నియోజవర్గం నాయకులు కేశినేని శివనాథ్ సహకారంతో 23వ డివిజన్‌లోని రజక సోదరులకు ఇస్త్రీ పెట్టెల పంపిణీ కార్యక్రమం జరిగింది.

డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో సూర్యారావుపేటలోని టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొండా ఉమా మాట్లాడుతూ బీసీలకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. వైఎస్ జగన్మోహనరెడ్డి అన్ని వర్గాలను మోసం చేశారని, రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలి సొంత ప్రయోజనాలు కాపాడుకునేందుకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. డివిజన్ నేతలు చింతా దుర్గారావు, ఆలపాటి రాము, కోటి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్‌ల పంపిణీ ప్రారంభం



పాయకాపురం, మార్చి 2 : సెంట్రల్ నియోజకవర్గంలోని ఓటర్లకు ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నియోజకవర్గ టీడీపీ శనివారం ప్రారంభించింది. 64వ డివిజన్‌లోని టీడీపీ కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించిన ఓటర్ స్లిప్‌లను టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు నేతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నేతలు పరుచూరి ప్రసాద్, పలగాని భాగ్యలక్ష్మి, పరసా అశోక్, సూరవరపు నాగరాజు, వింజమూరి సతీష్, పలగాని శివ తదితరులు పాల్గొన్నారు.

అవినాష్ రౌడీయిజాన్ని అడ్డుకుంటాం

జనసేన తూర్పు ఇన్‌చార్జి అమ్మిశెట్టి ● జనసేన నేతలు, కార్యకర్తల సమావేశంలో గద్దె, అమ్మిశెట్టి



మాట్లాడుతున్న అమ్మిశెట్టి వాసు

పటమట,మార్చి 2 : తూర్పు ప్రజలంతా ప్రశాంతతను కోరుకుంటున్నారని, దుర్మార్గులకు అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, తూర్పు ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు పేర్కొన్నారు. శనివారం జనసేన పార్టీ తూర్పు కార్యాలయంలో జనసేన నేతలు, కార్యకర్తల సమావేశంలో అమ్మిశెట్టి వాసుతో కలిసి తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ తూర్పులో అవినాష్ రౌడీయిజాన్ని అడ్డుకుంటామని, తాము నిస్వార్థంగా ప్రజలకు మంచి చేస్తున్నామని, మమ్మల్ని విమర్శించే స్థాయి వైసీపీలో ఎవ్వరికీ లేదన్నారు. రాక్షస పాలన అంతమే జనసేన-టీడీపీ ధ్యేయం అని అమ్మిశెట్టి వాసు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనను తరిమికొట్టేందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు పొత్తులతో ముందుకు సాగుతున్నారని, తూర్పులో పోటీ చేసే అర్హత జనసేనకు ఉందని, పొత్తులో భాగంగా నాకు అవకాశం ఇచ్చారన్నారు. ఎవరికీ సీటు వచ్చినా ఒకరి కోసం ఒకరు పనిచేయాలని నేను, అమ్మిశెట్టి వాసు నిర్ణయించుకున్నామని అన్నారు. భవిష్యత్తులో జనసేన నాయకుల సేవలను తప్పకుండా గుర్తుంచుకుంటుందన్నారు. నా వంతుగా వారికి అన్ని రకాలుగా సహకారం అందిస్తానని తెలిపారు. సమావేశంలో జనసేన-టీడీపీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, నగర కమిటీ సభ్యులు, ధార్మికమండలి సభ్యులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

26 ఇస్త్రీ పెట్టెల అందజేత

టీడీపీ కార్యాలయంలో శనివారం 26 మంది రజక కుటుంబాలకు రూ.1.82లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 26 ఇస్త్రీ పెట్టెలను గద్దె సొంత నిధులతో అందజేశారు. కూరగాయల వ్యాపారం నిమిత్తం తాడిశెట్టి రామమోహన్‌రావుకు ప్లాట్‌ఫారం రిక్షాను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ గద్దె రామ్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిని రానున్న ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని అన్నారు. చెన్నుపాటి గాంధీ, పొట్లూరి సాయిబాబు, నర్రా కిషోర్, యలమంచిలి దేవేంద్ర, మాదాల చిన్నతల్లి, ఎం. నాగేశ్వరరావు, ఆర్.శ్రీనివాస్, చలసాని రమణ, హయత్‌ఖాన్, బావిరాజు నానిలు పాల్గొన్నారు.

గద్దె, చిన్నిలను అత్యధిక మెజారిటీతో గెలిపించండి

జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ



రైతుబజార్‌లో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న గద్దె అనురాధ

భారతీనగర్, మార్చి 2: తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ఎవరికి ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి సహాయం చేసే గద్దె రామ్మోహన్‌ను వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే కేశినేని చిన్నిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ కోరారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలోని, రైతుబజార్ ప్రాంతంలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గద్దె అనురాధ, గద్దె క్రాంతి కుమారు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసే సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలను అందజేశారు. అనంతరం గద్దె అనురాధ మాట్లాడుతూ డివిజన్‌లో ఏదైనా సమస్య ఉందని చెప్పిన వెంటనే స్వయంగా పరిశీలించి ఆ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేంత వరకు విశ్రమించని వ్యక్తి గద్దె రామ్మోహన్ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే కేశినేని చిన్నిని కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలో లేకపోయినా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తన సొంత నిధులతో పేదలకు సహాయం చేస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నారు. డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, చెన్నుపాటి ఉషారాణి, కోడూరు ఆంజనేయవాసు, సలిమిశెట్టి రాజామణి, జాస్తి సురేష్, వి.కవిత, ఎం.లక్ష్మీ, శివలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బచ్చుల అర్జునుడుకు ఘన నివాళి



అర్జునుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

విద్యాధరపురం, మార్చి 2: మాజీ ఎమ్మెల్సీ గన్నవరం టీడీపీ మాజీ ఇన్‌చార్జి బచ్చుల అర్జునుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి టీడీపీ శ్రేణులు, నాయకులు నివాళులర్పించారు. రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్, బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మరక శ్రీనివాసరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, కొత్తుల మణికంఠ, పాముర్తి కిషోర్‌బాబు తదితరులు బచ్చుల అర్జునుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పార్టీకి అర్జునుడు చేసిన సేవలను గుర్తు చేశారు.

నగరాభివృద్ధిపై చర్చకు రండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 2 : విజయవాడ నగరం పాలకుల నిర్లక్ష్యానికి గురైందని, నగర అభివృద్ధిపై వైసీపీ నేతలు చర్చకు రావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు సవాల్ చేశారు. 'మార్పు కోసం సీపీఎం' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన అజిత్‌సింగ్‌నగర్‌లోని పలు డివిజన్లలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ఐదేళ్ల పాలనలో పాలకుల నిర్లక్ష్యంతో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిన విధానాన్ని స్థానికులకు వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పూటకో పార్టీ మార్చే నేతలకు కాకుండా రాబోయే ఎన్నికల్లో నిబద్ధత కలిగిన కమ్యూనిస్టులకు నియోజకవర్గంలో ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు.

టీడీపీ- జనసేన ప్రభుత్వాన్ని కోరుకుంటున్న జనం

● జనసేన పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్



ప్రచారంలో పోతిన మహేశ్

వన్‌టౌన్, మార్చి 2: రాష్ట్ర బాగుకోసం టీడీపీ- జనసేన ప్రభుత్వాన్ని జనం కోరుకుంటున్నారని జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ అన్నారు. 39 వ డివిజన్ విద్యాధరపురంలో శనివారం ఆయన ఇంటింటికి రాబోయే జనసేన-టీడీపీ ప్రభుత్వం ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆయన ఓట్లను అభ్యంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సైతాన్ జగన్ పాలన పోవాలని పవన్ కల్యాణ్ - చంద్రబాబుల సుపరిపాలన కావాలని జనం కోరుకుంటున్నట్లు తెలిపారు. డివిజన్ నాయకులు ఏలూరు సాయి శరత్, డివిజన్ కమిటీ సభ్యులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ జగన్‌రెడ్డి పాలనలో చోటు చేసుకున్న అరాచకాలను వివరించి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ప్రభుత్వం రావడం కోసం మద్దతు కూడగట్టారు. లంక నాగరాజు, రాజమల్లు సాయి, ఎన్ లలిత ఆర్యన్, జూపూడి సుధీర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● నియోజకవర్గంలోని ముస్లిం మహిళ వివాహ నిమిత్తం రూ.3వేల ఆర్థిక సహాయం, ఒక కుక్కర్‌ను పోతిన రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తపేట జనసేన కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మహేశ్ పంపిణీ చేశారు. సల్మా, గంగాధర్, మొబీనీ, నసీమా సోమి,గోవింద్ పాల్గొన్నారు.

వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ పాత్రపై విచారణ జరగాలి

టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్

వన్‌టౌన్, మార్చి 2: కడప మాజీ ఎంపీ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్మోహనరెడ్డి పాత్రపై విచారణ జరగాలని టీడీపీ పశ్చిమ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ డిమాండ్ చేశారు. శనివారం టీడీపీ పశ్చిమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ అవినాష్‌రెడ్డి కుటుంబసభ్యులు జగన్ బాబాయిని హత్య చేస్తే వారిని రక్షించడం వెనుక ఆంతర్యం ఏమిటో రాష్ట్ర ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే జగన్ ముఠా వివేకానందరెడ్డిని హత్య చేసిందని ఆధారాలు వెల్లడవుతున్నాయన్నారు. వివేకా ఎలా చనిపోయారన్నది ఇప్పటికే ప్రజలందరికీ తెలిసిపోయిందని అయితే నిజం ఏమిటో బయటకు రాకుండా జగన్‌రెడ్డి ఎందుకు ఆపుతున్నారో తెలియాలన్నారు. జగన్‌రెడ్డి ఇప్పటికైనా తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చి నిజాలు చెప్పాలన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వివేకానందరెడ్డిని చంపిన హంతకులకు శిక్ష పడేలా చేస్తామన్నారు. 49వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొలగాని అశోక్, నాయకులు కంపా రాజేష్ రెడ్డి, దాసరి దేవేంద్ర, షేక్ షబీర్, తుడుము అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నలందలో స్పార్కిల్ 2కే24

లబ్బీపేట, మార్చి 2: నలంద డిగ్రీ కళాశాలలో శనివారం మేనేజ్‌మెంట్ మీట్ స్పార్కిల్ 2కే24 కార్యక్రమం ఘనంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అమరావతి బోటింగ్ క్లబ్ ఫౌండర్ అండ్ సీఈవో కాకాని తరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వివిధ నైపుణ్యాలను పెంచుకోవాలని, తమ కెరీర్‌ను అద్భుతంగా మలచుకోవడంలో కొత్త అంశాలపై దృష్టి సారించాలని అన్నారు. బిజినెస్ ఐడియాలు ఉంటే మాతో పంచుకుంటే వారికి కావలసిన ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, క్విజ్, స్పాట్ ఫొటోగ్రఫీ, డ్యాన్స్, బీబీఏ ఎనలిటిక్స్, తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌వోడీ వై.శ్రీలక్ష్మీ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊర్మిళానగర్‌లో ఆకతాయిల ఆగడాలు

భవానీపురం, మార్చి 2 : 43వ డివిజన్ ఊర్మిళానగర్ పోలేరమ్మ గుడి సమీపంలో ఓ మిక్చర్ బండిని అడ్డాగా చేసుకుని ఆకతాయిలు ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. విద్యార్థులు గంజాయ్ బ్యాచ్‌తో కలిసి హల్‌చల్ చేస్తున్నారు. ఇక్కడ ఖాళీ స్థలాలు, ఇంటి అరుగుల వద్ద ఆకతాయిల మూక స్థానికులను అల్లరి పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. . సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వీరి ఆగడాలకు అంతే లేకుండా ఉందని. ఎవరైనా పెద్దలు కల్పించుకుని ప్రశ్నిస్తే వారిపైన అరుపులతో భయాందోళనకు గురి చేస్తున్నారని అంటున్నారు. జులాయి వెధవల ఆగడాలను అడ్డుకోలేపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. చీకటి పడితే ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారని, ఆకతాయిల ఆగడాలపై పోలీస్‌లు దృష్టి సారించి వీరిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, మార్చి 2: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ కోసం ఆదివారం సీతారామపురం గీతామందిరం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీడర్ పరిధిలోని చుట్టుగుంట రైవస్ కాలువగట్టు, సీతారామపురం కాలువ గట్టు, లాల్‌బహదూర్ శాస్త్రి వీధి, ఓల్డ్ ఎంప్లాయిమెంట్ ఆఫీసు వీధి, కాకాని నగర్, గీతామందిర్ రోడ్డు, మేదర బజారు, కోటిలింగాల వారి వీధి, శాతవాహన కాలేజి రోడ్డు, ఐనవోలు వారి వీధి, రామా కార్పొరేషన్ ఏరియా, నెహ్రూ వీధి, చాపరాల వారి వీధి ఐకాన్ పబ్లిక్ స్కూల్ వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరపరా ఉండదని తెలిపారు.

భారతీనగర్: రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధి వెంకటేశ్వరనగర్ (1,2,3) రోడ్లు, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, స్పెన్సర్ సర్వీస్ రోడ్డు, సెంటీని హాస్పిటల్ ఏరియా పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఎంఎస్ మూర్తి చిత్రకళా ప్రదర్శన

సత్యనారాయణపురం, మార్చి 2: ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎంఎస్ మూర్తి చిత్రకళా ప్రదర్శన నిర్వహిస్తున్నాని ఆ సంస్థ సెక్రటరీ సాయిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్యాలంపాడులోని ఎంఎస్ మూర్తి లలిత కళా ఆర్ట్స్ గ్యాలరీలో కార్యక్రమం జరుగుతుందని అన్నారు. మూర్తి శతజయంతి ఉత్సవాల సందర్భంగా చిత్ర కళా ప్రదర్శన, దృశ్య శ్రవణ చిత్రం ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురిని సత్కరిస్తున్నామని తెలిపారు.

వేమిరెడ్డిపల్లి తండాలో ఎస్ఈబీ దాడులు

విస్సన్నపేట, మార్చి 2: వేమిరెడ్డిపల్లి తండా, నర్మాదానగర్ అటవీ ప్రాంతంలో సెబ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సారా తయారు చేస్తున్న బాణావతు రమేష్, బాణావతు కల్పనలను అదుపులోకి తీసుకొని, వారి వద్ద 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. తండాల్లో సారాయి, గంజాయి నిర్మూలనకు గ్రామస్తులతో పరివర్తన 2.0 నిర్వహించారు. ఏఈఎస్ జి.భార్గవ, సీఐ పి.అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ముంబై పారిశ్రామికవేత్తతో వరలక్ష్మి శరత్‌కుమార్ నిశ్చితార్థం



ప్రముఖ సినీ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ ముంబైకు చెందిన పారిశ్రామికవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ను పెళ్ళి చేసుకోనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం శుక్రవారం ముంబై నగరంలో ఇరు కుటుంబాల సమక్షంలో జరిగింది. వివాహం ఈ ఏడాదిలోపు జరుగనుందని, త్వరలోనే వివాహ తేదీని వెల్లడిస్తామని వరలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, వీరిద్దరూ 14 ఏళ్ళుగా స్నేహితులుగా కొనసాగుతున్నారు. ఎట్టకేలకు త్వరలోనే ఓ ఇంటివారు కాబోతున్నారు. ఈ నిశ్చితార్థంలో సినీ నటుడు శరత్ కుమార్, ఆయన సతీమణి రాధిక శరత్ కుమార్‌తో పాటు వరుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, వరలక్ష్మి శరత్ కుమార్ ఇటు తెలుగు, అటు తమిళ చిత్రసీమల్లో మంచి గుర్తింపుతో పాటు వరుస అవకాశాలు దక్కించుకుంటూ సినీ కెరీర్‌ను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

విదేశాల్లోనూ హను-మాన్‌ను విడుదల చేస్తున్నాం



యువ కథానాయకుడు తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన 'హను-మాన్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ '50 రోజుల పండగ చూసి చాలా రోజులైంది. అది మా సినిమాకు జరగడం ఆనందంగా ఉంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోయే చిత్రాలకు ఈ చిత్ర విజయం పునాది వేసింది. విదేశాల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నాం. 'జై హనుమాన్' వర్క్ మొదలైంది. 'హను-మాన్'లో చివరి ఐదు నిముషాలు ఎలా అందరికీ నచ్చాయో 'జై హనుమాన్' కూడా అలాగే ఉండబోతోంది' అన్నారు. ప్రేక్షకుల వల్లే ఇంత అద్భుత విజయం సాధ్యమైందని హీరో తేజ చెప్పారు. 150 థియేటర్లలో 50 రోజులు ఆడడం సాధారణ విషయం కాదని, అందరూ అంకిత భావంతో పని చేయడం వల్లే ఇది సాధ్యమైందని నిర్మాత నిరంజన్‌రెడ్డి చెప్పారు.

మేం ఆశించిన హిట్ వచ్చింది



'సినిమా మొదలు పెట్టినప్పుడు బాగా వస్తే చాలు అనుకున్నాం. తర్వాత ప్రమోషనల్ మెటీరియల్ ప్రేక్షకులకు రీచ్ అయితే అదే పదివేలు అనుకున్నాం. అన్నింటికి మించి ఒక మంచి హిట్ కొడితే బావుంటుందనే కోరిక మనసులో ఉండేది. అది ఇప్పుడు తీరినందుకు ఆనందంగా ఉంది' అన్నారు శివ కందుకూరి. ఆయన హీరోగా నటించిన 'భూతద్దం భాస్కర్ నారాయణ' శుక్రవారం విడుదలై విజయం సాధించడంతో శనివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. సినిమా చూసి ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారని శివ చెప్పారు. తాము ఊహించిన దానికంటే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందని హీరోయిన్ రాశీ సింగ్ తెలిపారు. నిర్మాతలు స్నేహాల్ శశిధర్ మాట్లాడుతూ 'ప్రతి షోకీ ఆదరణ పెరుగుతోంది. ఇంత మంచి విజయం అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని చెప్పారు

మైనస్ 30 డిగ్రీల్లో షూటింగ్ చేశాం

విశ్వక్ సేన్



'ఈ సినిమా షూటింగ్ ప్రతి రోజూ సవాలే. మైనస్ 30 డిగ్రీల్లో వర్క్ చేశాం. కాళ్లు చేతులు గడ్డ కట్టేవి. ఇప్పుడు అది తలుచుకుంటే ఇంత రిస్క్ చేశామా అనిపిస్తుంది. ఇప్పుడు చేయమంటే మాత్రం చేయను' అన్నారు హీరో విశ్వక్ సేన్. ఆయన నటించిన 'గామి' చిత్రం ఈ నెల ఎనిమిదిన విడుదల కానుంది.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ' లుక్ విషయంలో చాలా కేర్ తీసుకున్నాం. అఘోరా పాత్ర కోసం దర్శకుడు విద్యాధర్ ఎంతో రిసెర్చ్ చేశారు. మూడేళ్ల ముందుగానే ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేశారు. కుంభమేళాలో కొన్ని లక్షల మంది అఘోరాలు ఉంటారు. నేనూ వాళ్లతో కలసిపోయేవాడిని. నా స్టయిల్‌లో ఎక్స్‌ప్లోర్ చేసుకుంటూ వెళ్లా' అని ఆయన చెప్పారు.

దర్శకుడు విద్యాధర్ తను నటించిన 'వెళ్లిపోమాకే' సినిమా చూసి తన దగ్గరకు వచ్చాడని చెబుతూ 'ఈ కథను సినిమాగా మలచడానికి ఐదేళ్లు పడుతుందని నాకు ముందే తెలుసు. ఒక వేళ ఏడాదిలో తీయాలనుకుంటే రూ వంద కోట్లు కావాలి. వారణాసి, కుంభమేళలో గొరిల్లా షూటింగ్ చేశాం. అలా బడ్జెట్ కలసి వచ్చింది. సమయమే దీనికి పెట్టుబడి. ఇప్పటివరకూ ఎవరూ తీయని చిత్రమిది' అని విశ్వక్ సేన్ చెప్పారు. ఈ సినిమాకు తను పారితోషికం తీసుకోకుండా పని చేసినట్లు ఆయన చెప్పారు. మొత్తం 70 రోజులు పని చేసినట్లు తెలిపారు. హీరోయిన్ చాందిని కూడా చాలా కష్టపడిందని చెప్పారు. వీసీఎక్స్ ఫార్మెట్‌లో 'గామి' చిత్రాన్ని విడుదల చేస్తున్నామనీ, తెలుగులో ఈ ఫార్మెట్‌లో వస్తున్న తొలి చిత్రమని ఆయన తెలిపారు.



వెన్నెల కిషోర్... ఈ పేరు వినబడగానే వెటకారం కళ్లముందు కనిపిస్తుంది. సాధారణంగా మీడియాకు దూరంగా ఉండే కిషోర్... 'నేను చాలా ప్రైవేట్ పర్సన్‌ని' అంటారు. 'నేను రైటర్‌పై ఆధారపడ్డ యాక్టర్‌ని. నా అంతట నేను కామెడీ సృష్టించలేను' అనే వెన్నెల కిషోర్ నటించిన 'చారి 116' ఇటీవల విడుదలయింది. ఈ సందర్భంగా ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

కామెడీ చాలా సీరియస్ విషయం

అమెరికా అలా వెళ్లా...

మాది కామారెడ్డి. నాన్న స్కూలు టీచర్. నేను ఏడో తరగతి చదువుతున్నప్పుడే రిటైరైపోయారు. అంటే మాకు ఎంత గ్యాప్ ఉందో అర్థం చేసుకోవచ్చు. నలుగురు అక్కల తర్వాత పదేళ్లకు నేను పుట్టా. అందువల్ల అమ్మ అమ్మమ్మలాగ.. అక్క అమ్మలాగ కనిపించేది. దాంతో అక్కల పట్ల గౌరవం ఎక్కువగా ఉండేది. ఇక చదువంటారా... ముందు ఎంపీసీ తీసుకున్నా. ఏడాది చదివి వదిలేశా. ఆ తర్వాత బైపీసీ తీసుకుని రెండేళ్లు చదివా. ఎంసెట్ రాదనిపించింది. బీకాం చేశా. ఆ తర్వాత అమెరికాకు వెళ్లాలనిపించింది. కానీ అమెరికాకు వెళ్లాలంటే 16 ఏళ్ల చదువు కావాలి. నాలాంటివాళ్ల కోసమే అన్నట్లు అప్పట్లో ఒక ఏడాది కోర్సు ఉండేది. ఆ తర్వాత దాన్ని బ్యాన్ చేశారు. ఆ కోర్సు చేసేసి అమెరికా వెళ్లి చదువుకొని.. ఉద్యోగం తెచ్చుకున్నా.

పక్కా తెలంగాణ...

నేను పుట్టి పెరిగింది కామారెడ్డిలో. అంటే పక్కా తెలంగాణవాడిని. 'బిందాస్' సినిమా దాకా నాకు విపరీతమైన తెలంగాణ యాస ఉండేది. డైలాగ్‌లు చెప్పటం కూడా కష్టంగానే ఉండేది. 'దూకుడు'లో శ్రీను వైట్ల నాకు ఒక భిన్నమైన పాత్ర ఇచ్చారు. మొదట చేయలేననుకున్నా. కానీ శ్రీను వైట్ల గారి ట్రైనింగ్‌లో చేసేశా. ఇప్పుడు నా యాస చూసి మా అక్కావాళ్లు... 'ఒరేయ్.. అసలు నువ్వు ఏం మాట్లాడుతున్నావ్' అంటూ ఉంటారు. ఇప్పుడు నేను తెలంగాణ వాడినని చెప్పినా ఎవరూ నమ్మరు. మీకో ఆసక్తికరమైన సంఘటన చెబుతా. 'జాతిరత్నాలు' తీసిన అనుదీప్ అసిస్టెంట్ ఒకరు సినిమా చేయాలనుకున్నాడు. నా దగ్గరకు వచ్చి... 'సార్.. ఇది ఒక ఛాలెంజింగ్ రోల్. సినిమా మొత్తం తెలంగాణ యాసలోనే మాట్లాడాలి' అన్నాడు. నాది పక్కా తెలంగాణ అని చెబితే షాక్ అయ్యాడు.

రెన్యూవల్ చేసుకోవాలి...

వెబ్ సిరీస్‌లు.. ఓటీటీ సినిమాలవల్ల ప్రస్తుతం కమేడియన్స్‌కు చాలా బాగుంది. అందరికీ అవకాశాలు ఉన్నాయి. అయితే కాసినోలో పోకర్ మాదిరిగా అదృష్టం కూడా కలిసిరావాలి. మేమందరం ప్రతి ఏడాది ప్రేక్షకులకు గుర్తిండిపోయే ఒక సినిమా ఇవ్వాలి. బస్ పాస్‌ల మాదిరిగా మా కెరీర్‌లు రెన్యూవల్ చేయించుకోవాలి. లేకపోతే ప్రేక్షకులు మమ్మల్ని మర్చిపోతారు.

బెస్ట్ కాంప్లిమెంట్...

'గీతగోవిందం' సినిమా తర్వాత మహేష్ గారు.. 'కిషోర్ ఈజ్ వెరీ ఎంటర్‌టైనింగ్' అని ఒక ట్వీట్ పెట్టారు. అలాగే ఒక సభలో చిరంజీవిగారు... 'కిషోర్ మొహంలో ఒక వెటకారం ఉంటుంది' అన్నారు. ఈ రెండూ మర్చిపోలేని ప్రశంసలు.

కామెడీని సృష్టించటం చాలా సీరియస్ విషయమా?

అవును. నేను కామెడీని కూడా సీరియస్ సీన్ లాగానే తీసుకుంటా. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నేను రైటర్‌పై ఆధారపడ్డ యాక్టర్‌ని. సీన్‌లో ఏం చేయాలనే విషయం కనీసం 50 శాతమైన రైటర్ నుంచి రావాలి. నా అంతట నేను కామెడీని సృష్టించలేదు. బ్రహ్మానందంగారు.. ఆలీగారు.. సునీల్‌గారు.. తాజాగా సత్యలాంటి కమేడియన్స్ వేరు. వాళ్లు ఇతరులను బాగా ఇమిటేట్ చేస్తారు. కానీ నేను అలా కాదు. టైమింగ్ మీద ఆధారపడ్డ నటుడిని.

కిషోర్... 'వెన్నెల' కిషోర్ కావటం వెనకున్న కథేమిటి?

ఈ క్రెడిటంతా దర్శకుడు దేవ కట్టకు చెందుతుంది. 'వెన్నెల' సినిమాకు నేను సహ రచయితను. అమెరికాలో షూటింగ్. ఆ సినిమాలో నేను



వేసిన పాత్ర శివారెడ్డిగారు వేయాలి. కానీ ఆయనకు వీసా రిజెక్ట్ అయింది. అప్పటికే సీనియర్ యాక్టర్స్ అందరూ డేట్‌లు ఇచ్చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో నేను నటించా. వాస్తవానికి నటన నా గోల్ కాదు. ఆ సమయంలో నేను ఒక విధమైన రెక్లెస్‌గా ఉండేవాడిని. చేస్తే పోయిందేమీ లేదనుకున్నా. ఆ సినిమాలో పాత్ర కూడా రెక్లెస్‌గా ఉంటుంది. అందువల్ల బాగా నప్పింది. ఆ తర్వాత 'ఇందుమతి, బిందాస్' వంటి చిత్రాలు మంచి పేరు తెచ్చాయి. 'దూకుడు' తర్వాత ఉద్యోగం మానేసి నటనలో స్థిరపడిపోయా!

మీరు డైరక్టర్లను పూర్తిగా ఫాలో అయిపోతారా?

అవును. యాక్టర్ సీను గురించి ఆలోచిస్తాడు. డైరక్టర్ మొత్తం సినిమా గురించి ఆలోచిస్తాడు. నేను ప్రేక్షకుల కోసం నటించను. షూటింగ్ పూర్తయిన తర్వాత రషస్ చూసి డైరక్టర్ సంతృప్తి చెందాడా? లేదా అని మాత్రమే ఆలోచిస్తా. కిషోర్ బాగా చేశాడన్నా.. ఓవర్ యాక్షన్ చేశాడన్నా... అన్ని కామెంట్స్ డైరక్టర్‌కే చెందుతాయి. 'గీతగోవిందం'లో అందరికీ కాళ్లు మొక్కే క్యారక్టర్ నాకు ముందు పెద్దగా నచ్చలేదు. కానీ ఆ క్యారెక్టర్ పెద్ద హిట్ అయింది.

అందరూ కలిసి

మేము మొత్తం 12 మంది కమేడియన్స్ ప్రతి నెలా రెండో శనివారం రాత్రి లేదా ఆదివారం కలుస్తాం. షూటింగ్‌లు.. పాత్రల గురించి తప్ప మిగిలిన విషయాలన్నీ మాట్లాడుకుంటాం. ఒక విధంగా ఇది మాకు డిటాక్స్ లాంటిది.

ఒకప్పుడు కామెడీ ట్రాక్‌లు ఉండేవి. ఇప్పుడు ఉండటం లేదు కదా..!

ఇప్పుడు ప్రేక్షకులు కమేడియన్స్‌ను కేవలం హాస్యం పడించేవారుగా మాత్రమే చూడటం లేదు. వాళ్లు కథను ముందుకు తీసుకువెళ్లటంలో ఒక భాగం కావాలి. హీరోయిన్ బ్రదర్ కావచ్చు.. విలన్ పక్కన ఉండే చెంచా కావచ్చు. కానీ వాళ్లు కథ ముందుకు సాగటంలో ముఖ్యపాత్ర వహించాలి. ప్రేక్షకులు ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటారు. వారికి తగ్గట్టుగా కామెడీ ట్రాక్‌లు కూడా మారాలి. ఉదాహరణకు ఒక వ్యక్తిని బకరా చేయటం ఒకప్పుడు ప్యాషన్. సాధారణంగా ఈ పాత్రలు బ్రహ్మానందంగారు వేసేవారు. ప్రేక్షకులు విసిగిపోయారు. 'లక్ష్యం' తర్వాత బకరా క్యారెక్టర్లు హిట్ కావటం మానేసాయి. దీనితో రైటర్లు రాయటం మానేశారు. ఇలాగే ఎన్నారై పెళ్లికొడుకులు. ఈ ట్రాక్ కూడా ఈమధ్య కాలంలో కనిపించటంలేదు.

ఒక కమేడియన్‌కు ఏం కావాలి?

నా ఉద్దేశంలో టైమింగ్ చాలా ముఖ్యం. నేను నా డైలాగ్స్ మాత్రమే కాదు... ఇతరుల డైలాగ్స్ కూడా వింటాను. దీనివల్ల సీన్ చేసేటప్పుడు ఏదైనా గ్యాప్ వస్తే... దానిని పూరించటానికి వీలవుతుంది.

మీరు హీరో పాత్రలు వేయాలని ఎప్పుడూ అనుకోలేదా?

లేదు. ఎప్పుడూ నన్ను ఎవరైనా వెటకారం చేయాలి. నేను వేరేవాళ్లనైనా వెటకారం చేయాలి. భగ్నప్రేమికుల పాత్రలు.. అమ్మాయిల వెనక తిరిగే పాత్రలు నేను చేయలేను.

రైటర్స్ కనుమరుగవుతున్నారు

నేను రైటర్స్‌ను నమ్ముకున్న వాడిని. నా ఉద్దేశంలో మంచి రైటర్స్ కనుమరుగవుతున్నారు. మన ఇండస్ట్రీకి మరింత మంది రైటర్స్ అవసరం.

మీరు మీడియాలో ఎక్కువగా కనిపించరు...

నేను చాలా ప్రైవేట్ వ్యక్తిని. నా వ్యక్తిగత వివరాలు అందరితోనూ పంచుకోవటం నాకు ఇష్టం ఉండదు. విజయోత్సవ సభలకు కూడా వెళ్లను. దీనికి ఒక కారణం ఉంది. సాధారణంగా ఇలాంటి సభలకు కమేడియన్లను ఎందుకు పిలుస్తారంటే... వాళ్లు కొద్దిసేపు ప్రేక్షకులకు అలరిస్తారని. పైన చెప్పినట్లు నా అంతట నేను కామెడీ పండించలేను. ఎందుకంటే నేను స్టాండప్ కమేడియన్‌ను కాదు. బ్రహ్మానందంగారు, ఆలీగారు, బ్రహ్మాజీగారు తమ స్పీచ్‌ల ద్వారా కూడా ప్రేక్షకులను రంజిపచేయగలరు. నేను అలాంటి నటుడిని కాను. మొదట్లో ఒకటి రెండు ఫంక్షన్స్‌కు వెళ్లా. నాకు తత్వం బోధపడింది. ఇక్కడ మీకో సంఘటన చెబుతా. ఒక ప్రీరిలీజ్ ఫంక్షన్‌కు పేరు మోసిన కమేడియన్‌ను పిలిచారు. ఆయన తన స్పీచ్ మొదలుపెట్టాడు. 'హీరో గారి కళ్లు చూస్తే చాలు... ఆయన కమిట్‌మెంట్ అర్థమవుతుంది'... లాంటి మాటలతో స్పీచ్ దంచుతున్నాడు. కింద కూర్చుని ఉన్న ప్రొడ్యూసర్ పైకి వచ్చి మైకు లాక్కొని... 'నువ్వు కమేడియన్‌లా మాట్లాడు. హీరోలా మాట్లాడకు' అన్నాడు. ఇలాంటి సంఘటనలు మనకు జరగకుండా ఉండాలంటే మనకు తెలియని విషయాలలో తల దూర్చకూడదు.

మీరు సోషల్ మీడియాలో కూడా ఎక్కువగా కనిపించరు..!

ఇన్‌స్టాలో మాత్రమే ఉన్నా. ఒకప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గానే ఉండేవాడిని. రోజుకు ఏడెనిమిది గంటలు ఫోన్ మీదే గడిపేవాడిని. దీనివల్ల ఒక ప్రమాదం ఉంది. ఉదాహరణకు కమేడియన్ సత్య... అని సెర్చ్ మొదలుపెట్టి... సత్య నాదెళ్ల వివరాలు తెలుసుకొని... ఆయన తినే చిరుధాన్యాల మీద పరిశోధన చేసి... ఇలా ఒక దానివెనక మరొకటి చూసుకుంటూ వెళ్లిపోతాం. ఈ విషయాన్ని గ్రహించిన తర్వాత ఫోన్ చూడటం మానేశా. ఈమధ్య రెండు రోజులు ఇంట్లో ఫోన్ వదిలేసి వెళ్లిపోయా.

మీరు విమర్శలను సహృదయంతో తీసుకొంటారా?

విమర్శలు నన్ను పెద్దగా బాధించవు. వాటిని పట్టించుకోను. అదే సమయంలో వాటిలో ఏదైనా



నిజం ఉందా అనే విషయాన్ని గమనించి, గుణపాఠం నేర్చుకుంటా. నేను వచ్చిన కొత్తల్లో సోషల్ మీడియాలో.. 'మీరు చాలా వేగంగా మాట్లాడతారు' అనే విమర్శ ఎక్కువగా వినిపించేది. నాకు నిజమేననిపించింది. ఆ తర్వాత రోజూ తెలుగు పేపర్ గట్టిగా చదివేవాడిని. కొన్ని మంత్రాలు ఉచ్చరించేవాడిని. అలా నా తీరు మార్చుకున్నా. టాలీవుడ్‌లో ఎక్కువ మంది విమర్శలను తీసుకోలేరు. చిన్న మాట అన్నా హర్ట్ అవుతారు. నేను అలా కాదు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్



అలనాటి కథ

నిజాం నుంచి ప్రశంస

ఒకప్పుడు జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్ సిరిసంపదలతో తులతూగుతూ ఉండేది. 300 ఎకరాల్లో ఈ ప్యాలెస్‌ను మా పూర్వీకుడు రాజా జ్ఞాన్‌గిర్ నిర్మించారు. ఈ ప్యాలెస్‌లో అణువణువు నాకు తెలుసు. వాటితో నాకు అనేక జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి. వాటిలో నిజాంను కలవటం ఒక అపురూపమైన జ్ఞాపకం. మా కుటుంబానికి ఆసఫ్‌జాహీ వంశ రాజులకు మధ్య మంచి స్నేహసంబంధాలు ఉండేవి. నిజాం సైన్యంలోని ఐదు వేల మంది మా అధీనంలో ఉండేవారు. అందువల్ల వారి వద్ద మాకు ప్రాధాన్యత ఉండేది. ఆ రోజుల్లో మహారాజులకు కూడా నిజాం దర్శనం అరుదుగా లభించేది. చాలా మంది నిజాంను చూడటమే గొప్పగా భావించేవారు. అలాంటి కాలంలో- నిజాంను కలవటం- ఆ తర్వాత మా నాన్నకు రాసిన లేఖలో నన్ను ఆయన- "మోస్ట్ హ్యాండ్సమ్ డాటర్" అని సంబోధించటం ఇంకా గుర్తున్నాయి.

నా చిన్నతనం ఒక అద్భుతమైన రంగుల కల. ఇంటి చుట్టూ గుర్రాల మీద.. ఒంటెల మీద.. ఏనుగుల మీద సవారీ చేయటం.. ఉదయాన్నే లేచి నాన్నతో పాటు కాస్‌కంట్రీ రైడ్స్ వెళ్లటం.. ఇవన్నీ అందమైన అనుభవాలు. ఆ సమయంలో నా అంగరక్షకుడి పేరు ఇబ్రహీంఖాన్. ఆరడుగుల మనిషి. నేను ఎక్కడికి వెళ్లినా నా వెంటే ఉండేవాడు. నా చిన్నప్పటి ఫోటోలలో కూడా నా వెనకే అతను కనిపిస్తాడు. మహబూబియా కాలేజీలో చదివే రోజుల్లో కూడా- నాతో పాటే వచ్చేవాడు. ఇక మా ప్యాలెస్‌లో సంక్రాంతి వచ్చిందంటే సందడి మొదలయ్యేది. పిల్లలందరం పతంగులు ఎగరవేసేవాళ్లం. నాకు 13 ఏళ్ల వయస్సులో అనుకుంటా- సంక్రాంతి పండుగ రోజు నేను మా తమ్ముడు పతంగులు ఎగరవేస్తున్నాం. ఇంతలో మా యూరోపియన్ ఆయా వచ్చి- "రాజావారు మిమల్ని 11 గంటలకు బిలియర్డ్స్ రూమ్‌కు రమ్మన్నారు" అని చెప్పింది. మాకు ఒకటే టెన్షన్. ఏదైనా తప్పు చేస్తే తప్ప నాన్న దగ్గర నుంచి పిలుపురాదు. నాన్న ఎక్కడున్నారని దొంగతనంగా తొంగిచూశాం. నవాబ్ ఖుస్రూజంగ్‌తో బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నారు. ఇద్దరు నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. అంటే సీరియస్ విషయం కాదని తేలిపోయింది. కానీ మనసులో ఇంకా ఏదో సంశయం. సమయం గడిచింది. ఠంచనుగా 11 గంటలకు పిల్లలం ముగ్గురం- బిలియర్డ్స్ రూమ్‌కు వెళ్లాం. నాన్న- నవాబ్ అహ్మద్‌బేగ్‌తో కలిసి రూంలోకి వచ్చారు. ఆయన పర్సనల్ సెక్రటరీ డీవేటియా బంగారు పాన్దాన్ డబ్బా ఆయన ముందు పెట్టారు. నాన్న ఒక పాన్ తీసుకుంటూ- "రేపు దారుపిషా (కింగ్‌కోఠి ప్యాలెస్)లో మనం నిజాంను కలవబోతున్నాం" అని చెప్పారు. మాకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. బయటకు వచ్చేసిన తర్వాత డీవేటియా మాకు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు చెప్పారు. వాటిలో మొదటిది- నిజాంను నేరుగా కళ్లెత్తి చూడకూడదు. రెండోది- ఆయన అడిగితే కానీ సమాధానం చెప్పకూడదు. వీటితో పాటుగా నిజాంకు పర్షీ ఆదాబ్ ఎలా చెప్పాలో కూడా నేర్పించారు. (నడుం సగం దాకా వంచి ఏడు సార్లు ఆదాబ్ చేయటాన్ని పర్షీ ఆదాబ్ అంటారు). ఆ రోజంతా నాకు అనేక ఆలోచనలు. నేను అప్పటి దాకా నిజాంను చూడలేదు. కానీ ఆయన పెయింటింగ్ మా డ్రాయింగ్‌రూమ్‌లో ఉండేది. దాన్ని చూస్తూ పెరిగాను. టైం మ్యాగజైన్‌పై నిజాం కవర్ ఫోటో వచ్చింది. అది కూడా నాకు గుర్తుంది. 'నిజాం అలాగే ఉంటారా? నాతో మాట్లాడతారా?'- ఇలా ఎన్నో ఆలోచనలు. అమ్మ ఆ రోజు రాత్రి మా చేత రిహార్సల్స్ చేయించింది.



మా మర్నాడు అమ్మ షిఫాన్ చీర, నాన్నమ్మకు చెందిన పది క్యారెట్ల కేటియర్ డైమండ్ రింగ్స్. చేతికి డైమండ్ గాజులు, ఉంగరాలు పెట్టుకున్నా. తమ్ముళ్లు కూడా నాన్నలాగానే వజ్రాల నగలు పెట్టుకున్నారు. రోల్స్ రాయిల్స్‌లో నాన్న, మేము ముగ్గురం.. రెండో కారులో నాన్న సెక్రటరీ డీవేటియా, ఇతర సేవలకులు బయలు దేరాం. కారు పర్దా గేటు దాకా మాత్రమే వెళ్తుంది. అక్కడ నుంచి అందరూ నడిచే వెళ్లాలి. కారు గేటు దగ్గరకు చేరుకున్న తర్వాత నాన్న- "మీరు కూడా నిజాంకు నజర్ ఇవ్వాలి" అని గుర్తుచేశారు. మేము గేటు లోపలికి ప్రవేశించాం. లోపల పెద్ద మైదానంలా ఉంది. ఒక వైపు వరుసగా కార్లు ఉన్నాయి. వాటికి పసుపు నెంబర్ ప్లేట్లు మెరుస్తున్నాయి. మరో వైపు ఆసిఫ్ జాహీల జెండా ఠీవీగా ఎగురుతోంది. నా కళ్లు నిజాం కోసం వెతుకుతున్నాయి. కొద్దిగా ముందుకు వెళ్లాం. అక్కడ టెంట్ వేసి ఉన్న ఎత్తైన ప్లాట్‌ఫాం కనిపించింది. దాని మీద ఒక సన్నని వ్యక్తి రూమీ టోపీ పెట్టుకొని నిలబడి మా వైపే చూస్తున్నాడు. ఆయన మొహంలో గర్వం తొణికిసలాడుతోంది. కంఠంలో రాజసం ఉంది. నాన్న ఆయన దగ్గరకు వెళ్లి- పర్షీ ఆదాబ్ చేశారు. మేమందరం కూడా ఆయనను అనుకరించాం. నాన్న- ఒక తెల్ల రుమాలులో పదకొండు అష్రఫీలు(బంగారు నాణేలు).. ఒక హాలీ రూపాయి (వెండి నాణెం) ఉంచిన నజర్‌ను నిజాం ముందు ఉంచి స్వీకరించమని కోరారు. మేము ఒక అష్రఫీ.. ఐదు హాలీ రూపాయలులు ఉన్న రుమాలును నిజాంకు సమర్పించాం. ఆయన వాటిని తీసుకొని- ఒక సంచిలో బంగారు నాణేలు, మరో సంచిలో వెండి నాణేలు వేశారు. మేమందరం తల వంచుకొని నేల కేసే చూస్తున్నాం. నాకు తలెత్తి నిజాం వైపు చూడాలని కోరిక పెరిగిపోతోంది. పిల్లలమందరం దొంగ చూపులు చూడటానికి ప్రయత్నిస్తున్నాం. నిజాం మా నాన్నతో- "వీరు నీ సంతానమా?" అని అడిగారు. "జీ సర్కార్. ఈ ఇద్దరూ నా కుమారులు. ఆమె నా పెద్ద కుమార్తె ఇందిర. చిన్న కుమార్తె రేణుక చిన్నపిల్ల. అందుకని తీసుకురాలేదు" అని నాన్న సమాధానమిచ్చారు. నిజాం నా వైపు తిరిగి - "స్కూలుకు వెళ్తున్నావా?" అని అడిగారు. నా గొంతు తడిఆరిపోయింది. "జీ యువర్ హైనెస్" అని సమాధానమిచ్చా. "బొంబాయిలోనా.. ఇక్కడా?" అని సంభాషణ పొడిగించారు. "బొంబాయిలో ఉండేవాళ్లం.. ఇప్పుడు మహబూబియా కాలేజీలో చేరాను" అని సమాధానమిచ్చా. "నీకు హైదరాబాద్ ఇష్టమేనా? చదువులో బొంబాయికి... ఇక్కడికి ఏదైనా తేడా ఉందా?" అని వేరే ప్రశ్న సంధించారు. అప్పటికి నాకు కొద్దిగా ధైర్యం వచ్చింది. కొద్దిగా తలెత్తి- "నాకు హైదరాబాద్ అంటే చాలా ఇష్టం. కొత్తగా వచ్చాను కదా.. మహబూబియాలో చదువుకోవటం వేరేగా ఉంది" అని సమాధానమిచ్చా. "ఏ క్లాసు చదువుతున్నావు" అని నిజాం అడిగారు. "జూనియర్ క్రేంబ్రిడ్జి చదువుతున్నా" అన్నా. "మంచిది.. మంచిది.. అమ్మాయిలకు చదువు చాలా ముఖ్యం" అన్నారు. నాకు ఆయన అలా అనటం చాలా ఆశ్చర్యమేసింది. నిజాం నాన్న వైపు తిరిగి- "బొంబాయి నుంచి మీరంతా ఎప్పుడు వచ్చారు?" అని అడిగారు. "సర్కార్.. రెండు నెలల క్రితం మేము హైదరాబాద్ వచ్చాం" అని నాన్న సమాధానమిచ్చారు. నాన్న ఇక సంభాషణ పూర్తయిందని తెలుసుకొని- సెక్రటరీ దివేటియాకు - నిజాం కోసం తెచ్చిన బహుమతిని తెమ్మని సంకేతమిచ్చారు. దివేటియా మరకత మణులతో పొదిగిన పాన్దాన్‌ను నాన్నకు తెచ్చి ఇచ్చారు. దానిని నాన్న నిజాం ముందు ఉంచి- "సర్కార్.. దీనిని ప్రత్యేకంగా మీ కోసం చేయించాను.. స్వీకరించండి" అన్నారు. నిజాం ముఖంలో చిరునవ్వు వచ్చింది. పాన్దాన్‌ను తెరిచి- దానిలోని బంగారు సుపారీ, ఎలకులు, లవంగాలు, దస్తార్‌లను ముట్టుకొని చూశారు. "దీన్ని ఎక్కడ చేయించావు?" అని అడిగారు. "బెంగుళూరులో..సర్కార్.." అని నాన్న సమాధానమిచ్చారు. "ఇది నాకు నచ్చింది. జూబ్లీ హాల్లో పెడతాను" అని నిజాం అన్నారు. ఆ మాటలు వినగానే నిజాం వెనక నిలబడి ఉన్న ఏడీసీ ముందుకు వచ్చి పాన్దాన్‌ను తీసుకున్నాడు. ఆ లోపులో నిజాం దృష్టి నాన్న వేలికి ఉన్న మరకత ఉంగరంపై పడింది. దానివైపే రెండు, మూడుసార్లు చూశారు. ఆ తర్వాత చప్పట్లు కొట్టగానే- దూరంగా ఉన్న నిజాం కుమార్తె రాణీ షెహజాదీ- ఒక సాధారణ చైనా కప్పును తీసుకువచ్చారు. నిజాంకు చార్మినార్ సిగరెట్లు తాగే అలవాటు ఉంది. సిగరెట్టు బూడిదను వేయటానికేమో అనుకున్నా. రాణీ ఆయన దగ్గరకు వచ్చిన వెంటనే- మేము మరోసారి పార్షీ ఆదాబ్ చేసి వెనక్కి నడుస్తూ వచ్చేసాం. (నిజాంకు సందర్శకులు తమ వీపును చూపించకూడదు. వెనక్కి నడుచుకుంటూ వెళ్లాలి).

ఆ మర్నాడు మాకు కింగ్‌కోఠి నుంచి ఒక లేఖ వచ్చింది. దానిలో తనను కలిసినందుకు.. యువర్ హ్యాండ్సమ్ డాటర్ ను తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు అని ఉంది. సాధారణంగా మగవారిని ఉద్దేశించినప్పుడు మాత్రమే హ్యాండ్సమ్ అంటారు. నిజాం నన్ను అలా ఎందుకు ప్రస్తావించారో ఇప్పటికీ నాకు తెలియదు. అంతే కాదు.. నాకు ఇతరుల నుంచి దక్కిన తొలి ప్రశంస అది. అది కూడా నిజాం నుంచి.. అందుకే ఆ జ్ఞాపకాలు ఇప్పటికీ గుర్తుండిపోయాయి.

• ప్రిన్సెస్ ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

ఇమ్యూనిటీని పెంచే బెర్రీస్

చూడటానికి అందంగా, కలర్‌ఫుల్‌గా కనిపించే పండ్లు స్ట్రాబెర్రీస్. బెర్రీస్ అని పిలుస్తారు. న్యూట్రిన్ల పవర్ హౌస్ అయిన బెర్రీస్ వల్ల కలిగే ఉపయోగాలివి.

- హార్ట్‌షేప్‌లో ఉండే ఈ బెర్రీస్ తింటే గుండెకూ మంచిదే. రక్తప్రసరణ సాఫీగా ఉండేట్లు, ప్లేట్‌లేట్స్ సంఖ్య తగ్గకుండా కాపాడతాయి. రక్తపోటును అదుపులో ఉంటే గుణం వీటికి ఉంది. ఇందువల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయివి.
- మధుమేహగ్రస్తులూ వీటిని తినొచ్చు. ఎలాంటి ఇబ్బంది కలిగించవు.
- విటమిన్-సి ఉండే ఈ పండ్లను తరచుగా తినటం వల్ల క్యాన్సర్ కణాలు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి.
- ముఖ్యంగా నారింజ కంటే ఎక్కువగా విటమిన్-సి కలిగి ఉండటం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. దీనివల్ల ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉండదు.
- వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలం. మెదడులో ఉండే కణాలను ఫ్రీరాడికల్స్ బారిన పడకుండా కాపాడతాయివి. దీని వల్ల మెదడు ఆరోగ్యంగా ఉంటుంది.
- నొప్పులు, ఆర్థరైటిస్ లాంటి సమస్యలుంటే తగ్గిపోతాయి.



'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/kBxfVw0లో చదవండి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/qelHJre లో చదవండి.



'కష్టే ఫలి' అన్నారు. అందుకే జయాపజయాలతో సంబంధం లేకుండా తన కష్టాన్ని నమ్ముకొని ముందుకు వెళుతున్నారు మేధా శంకర్. 'ట్వల్త్ ఫెయిల్' చిత్రంతో అనూహ్య విజయాన్ని అందుకున్న ఈ తార... ఇప్పుడు నవతరం నాయికగా జనహృదయాలలో స్థానం సంపాదించుకున్నారు.

ఈ విజయం.. ఊహించనిది

కేవలం ఒకే ఒక్క సినిమాతో మేధా శంకర్ జీవితం రాత్రికి రాత్రే మారిపోయింది. సెలబ్రిటీ అయింది. అవును మరి! మొన్నీ మధ్య వచ్చిన 'ట్వెల్త్ ఫెయిల్'తో ఆమె జాతకమే మారిపోయింది. యువతకు క్రష్‌గా మారింది. మంచి నటిగా పేరు తెచ్చుకుంది. 'ఇలాంటి క్రేజ్ ఎన్నడూ ఊహించలేదు. ఇదో కలలా వచ్చిందేమో' అంటుంది మేధా.

సోషల్ మీడియాలో క్రేజ్..

గతేడాది అక్టోబర్‌లో ఆమె గురించి చాలా మందికి తెలీదు. '12 ఫెయిల్' సినిమా రిలీజ్ కాగానే మేధా పేరు మార్మోగిపోయింది. నిజ జీవితం (ముంబై కేడర్‌కు చెందిన అసిస్టెంట్ కమీషనర్ మనోజ్ శర్మ) ఆధారంగా విధు వినోద్ చోప్రా తెరకెక్కించిన ఈ సినిమాలో క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, అభినయం ప్రేక్షకులను కట్టేసింది. ఈ చిన్న సినిమా బాక్సాఫీస్ వద్ద డెబ్బయ్ కోట్ల రూపాయల దాకా వసూలు చేసింది. ఓటీటీలోనూ సూపర్ హిట్ అయింది. దీంతో ఈమెకు ఇన్‌స్టాలో అమాంతం క్రేజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం 2.2 మిలియన్ల మంది ఆమె ఇన్‌స్టాను ఫాలో అవుతున్నారు. ఐఎమ్‌డిబీ బెస్ట్ యాక్ట్రెస్‌గా ఎంపికైంది. మేధాకు యాడ్స్‌తో పాటు సినిమాలు క్యూ కట్టాయి. అలా ఫెయిల్ క్యాప్టన్ మూవీతో ఆమెకు సక్సెస్ వరించింది.

అలా సినిమాల్లోకి...

నోయిడాలో ఈమె పుట్టి పెరిగింది. సంగీతమంటే ఆమెకు చిన్నప్పటి నుంచీ మక్కువే. హిందూస్థానీ సంగీతంలో శిక్షణ తీసుకుంది. మంచి స్వరం ఉంది. హార్మోనియం, కీబోర్డు, సితార్‌లను ప్లే చేస్తుంది. ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివింది. మోడలింగ్‌లో రాణించింది. ఆ సమయంలో మెయిన్ టార్గెట్ సినిమాల్లో నటించాలని. అయితే అంత సులువుగా అవకాశాలు రాలేదు. నటనమీద ఉండే ఆసక్తితో 'విత్ యు ఫర్ యువర్ ఆల్వేస్' అనే షార్ట్‌ఫిల్మ్‌లో నటించింది. ఆ తర్వాత 'బీచమ్ హౌస్' 'దిల్ బేకరార్' సిరీస్‌లతో మంచి పేరు తెచ్చుకుంది. అలా ఆమెకు 'శాదిస్తాన్' అనే చిత్రంలో నటించే అవకాశం దక్కింది. 'మాక్స్ మిన్ అండ్ మ్యూజికీ' చిత్రంతో యూత్‌లో క్రేజ్ సంపాదించింది. ఆ తర్వాత 'ట్వెల్త్ ఫెయిల్'లో అవకాశం వచ్చింది. ప్రూవ్ చేసుకున్నా. వాస్తవానికి అప్పటికే మూడు పెద్ద చిత్రాల్లో అవకాశాలొచ్చాయి. అయితే.. నా బదులు వేరే వాళ్లను రీప్లేస్ చేశారు. ఏనాడైనా సరే మంచి సినిమా రాదా? అవకాశం దొరక్కపోదా? అనే పాజిటివ్‌నెస్‌తో ముందుకు అడుగులేశా. అప్పుడలా లేకుంటే.. ఈ విజయం వచ్చేది కాదు!

ఆ రోజులను మర్చిపోలేను...



ఒకప్పుడు డాక్టర్ కావాలని అనుకునేదాన్ని. మెరిట్ విద్యార్థిని అయినప్పటికీ వైద్య విద్య అభ్యసించటం కష్టమే అనిపించింది. ఆర్ట్ వైపే వెళ్లాలని అనుకున్నా. ఇప్పుడయితే లక్షల రూపాయలు వస్తున్నాయి. అయితే కరోనా టైంలో ఇలా లేదు. ఆ సమయంలో.. నా అకౌంట్‌లో ఒక రోజు కేవలం 257 రూపాయలు మాత్రమే ఉన్నాయి. అయినా భయపడలేదు. ఆ రోజులు మర్చిపోలేను. 'హృతిక్ రోషన్, దీపికా పదుకోన్, అలియా భట్‌లకు అభిమానిని. వారి స్క్రీన్ ప్రజెన్స్ బావుంది. స్ట్రాంగ్ పర్సన్స్. అందుకే స్ఫూర్తిగా నిలుస్తారు నాలాంటి వారికి. ఓటీటీల వల్ల నాలాంటి వారికి మంచి ఆదరణ దక్కింది. సినిమాలైనా, వెబ్ సిరీస్‌లయినా పట్టింపులేదు. పదికాలాల పాటు నిలబడే చిత్రాల్లో నటించాలన్నదే నా కల' అంటుంది మేధా శంకర్.

బిజినెస్

విజయవాడ ● ఆదివారం 3 మార్చి 2024



ప్రవాస టెకీలు చలో భారత్!

స్వదేశంలో ఉద్యోగావకాశాలపై క్రమంగా పెరుగుతున్న ఆసక్తి

న్యూఢిల్లీ: అమెరికా, యూరప్, తదితర దేశాల్లో పనిచేస్తున్న భారత టెకీల్లో స్వదేశంలో ఉద్యోగావకాశాలపై ఆసక్తి పెరుగుతున్నదని రిక్రూటింగ్, స్టాఫింగ్ సేవల రంగ ప్రతినిధులు అంటున్నారు. భారత్‌లో ఉద్యోగావకాశాల కోసం తమను సంప్రదిస్తున్న ప్రవాస టెకీల సంఖ్య గడిచిన కొద్ది నెలల్లో గణనీయంగా పెరిగిందని వారన్నారు. ప్రముఖ జాబ్ పోర్టళ్లతో పాటు లింక్డ్ఇన్ నుంచి తన స్టాఫింగ్ కంపెనీ సేకరించిన డేటాను బట్టి చూస్తే, ప్రస్తుతం దేశీయ జాబ్ మార్కెట్లో 38,000 మంది ప్రవాస టెకీలు ఉద్యోగాల కోసం చూస్తున్నారని.. క్రితం నెలతో పోలిస్తే వీరి సంఖ్య రెట్టింపైందని ఎక్స్‌ఫెనో సహ-వ్యవస్థాపకుడు అనిల్ ఏతనూరు అన్నారు. ఏడాది క్రితం 65,000 స్థాయిలో ఉన్న వీరి సంఖ్య ఆ తర్వాత గణనీయంగా తగ్గినప్పటికీ, మళ్లీ కొద్ది నెలలుగా క్రమంగా పెరుగుతూ వస్తోందన్నారు.

స్వదేశానికి తిరిగి వచ్చే ఆలోచనలో ఉన్న ప్రవాస టెకీల నుంచి ఎంక్వైరీలు 15-30 శాతం పెరిగాయన్నారు. అందులో ఐటీ, కన్సల్టింగ్ సేవలు, ఇంజనీరింగ్ రంగాలకు చెందినవారే అధికమని ఆయన పేర్కొన్నారు. నిర్మాణం, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలకు చెందిన వారు కూడా ఉన్నారన్నారు. అమెరికాలో పనిచేస్తున్న భారత ఐటీ నిపుణుల నుంచి స్వదేశంలో ఉద్యోగం కోసం దరఖాస్తులు 15 శాతం పెరిగాయని ఎగ్జిక్యూటివ్ సెర్చ్ అండ్ రిక్రూట్‌మెంట్ సర్వీసెస్ కంపెనీ మైకేల్ పేజ్ ఇండియా తెలిపింది. భారత్‌లో ఆధునిక సాంకేతికత ఆధారిత ప్రాజెక్టులు పెరగడం, ప్రస్తుత మందగమనం భారత్ కంటే అమెరికాపై అధిక ప్రభావం చూపుతున్న నేపథ్యంలో మన ఐటీ నిపుణులు స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ఇదే మంచి సమయమని మైకేల్ పేజ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ ప్రన్ను ఉపాధ్యాయ్ అన్నారు. ముఖ్యంగా ఏదైనా ప్రొడక్ట్ లేదా ఇంజనీరింగ్ విభాగానికి అధిపతిగా పనిచేస్తున్నవారు, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్లకు తిరిగి స్వదేశంలో స్థిరపడేందుకు మంచి అవకాశమన్నారు. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లిన భారతీయ విద్యార్థుల్లోనూ కొందరు అక్కడ ఉద్యోగావకాశాలు లేకపోవడంతో స్వదేశానికి తిరిగి వచ్చేయాలనుకుంటున్నారని కెరీర్‌నెట్ సహ వ్యవస్థాపకులు అన్షుమన్ దాస్ అన్నారు.

కారణాలు..

- ప్రపంచ ఐటీ రంగం మందగమనంలోకి జారుకున్నప్పటికీ అమెరికా, ఐరోపాతో పోలిస్తే భారత ఐటీ రంగంలోనే పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయి.
- విదేశీ టెక్నాలజీ మార్కెట్లో పెరిగిన అనిశ్చితి, బడా కంపెనీల్లో భారీ సంఖ్యలో తీసివేతలు, బాగా తగ్గిన కొత్త నియామకాలతో పాటు జీవన వ్యయం అనూహ్యంగా పెరగడం కూడా ప్రవాస టెకీలకు ఇబ్బందికరంగా మారింది.
- కొన్ని దేశాలు మాంద్యం ముప్పును ఎదుర్కొంటున్నాయి. దాంతో ఆ మార్కెట్లు మరింత గడ్డు పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉంది.
- భారత జీడీపీ జోరందుకుంది. విదేశాల్లో కంటే దేశీ ఐటీ రంగంలోనే ఉద్యోగావకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. పైగా, భారత మార్కెట్లో సీనియర్ టెకీలకు ఆకర్షణీయ వేతన ప్యాకేజీలు లభిస్తున్నాయి.
- ఇండియాలో కార్యకలాపాలు సాగిస్తున్న ఎంఎన్‌సీల్లో కీలక పదవులకు ఆఫర్ చేస్తున్న ప్యాకేజీలు.. అమెరికాలో లభిస్తున్న వేతనానికి దరిదాపుల్లో ఉంటుండటం కూడా మరో కారణం.

ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో సరికొత్త రికార్డు స్థాయికి సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో ప్రామాణిక సూచీలు సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 249.35 పాయింట్ల వృద్ధితో 73,994.70 వద్ద, నిఫ్టీ 80.8 పాయింట్ల పెరుగుదలతో 22,419.55 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేశాయి. చివరకు సెన్సెక్స్ 60.80 పాయింట్ల లాభంతో 73,806.15 వద్ద, నిఫ్టీ 39.65 పాయింట్ల లాభంతో 22,378.40 వద్ద క్లోజయ్యాయి. సూచీలకు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిలు కూడా ఇవే. భారీ అంతరాయాలు లేదా వైఫల్యాలను ఎదుర్కొనే విషయంలో తమ సంసిద్ధతను పరీక్షించుకునేందుకు బీఎస్ఈ, సెన్సెక్స్ ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లలో ఈ ప్రత్యేక ట్రేడింగ్‌ను నిర్వహించాయి.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు సరుకు రవాణాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియక ముందే రికార్డు సాధించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 73.73 మిలియన్ టన్నుల సరకును రవాణా చేసి రికార్డు నమోదు చేసింది. పోర్టు చరిత్రలో ఇదే అత్యధిక సరుకు రవాణా. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) ముగియడానికి ఇంకో నెల రోజులు ఉండగానే పోర్టు గత ఆర్థిక సంవత్సర రికార్డును అధిగమించింది. ఫిబ్రవరితో ముగిసిన కాలానికి 73.78 మిలియన్ టన్నుల సరుకును పోర్టు రవాణా చేసింది.

యాప్ ద్వారా షాపింగ్‌కే మొగ్గు



60% ఆన్‌లైన్ కొనుగోలుదారుల ప్రాధాన్యమిదే..

పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయ ఆన్‌లైన్ కొనుగోలుదారుల్లో 60 శాతం మంది వెబ్‌సైట్ కంటే యాప్ ద్వారా కొనుగోలుకే మొగ్గుచూపుతున్నట్లు పీడబ్ల్యూసీ ఇండియా తాజా సర్వే రిపోర్టు వెల్లడించింది. సులువైన నావిగేషన్, యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్, స్థానిక భాషలో సమాచారం వంటి అంశాలు యాప్‌లకు ప్రాధాన్యం పెంచే అంశాలని నివేదిక పేర్కొంది. బయట షాపుల్లో కంటే చౌకగా లభిస్తుండటం, సౌలభ్యం కారణంగా నగరవాసులు ఆన్‌లైన్ షాపింగ్‌ను ఎంచుకుంటుండగా.. దేశంలోని మిగతా ప్రాంతాల వినియోగదారులు పరిమిత ఉత్పత్తుల లభ్యత, షాపుల్లో స్టాక్ అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల ఈ-కామర్స్ పోర్టళ్ల వైపు మళ్లుతున్నారని నివేదిక తెలిపింది. గడిచిన కొన్నేళ్లలో 12.5 కోట్ల మంది భారతీయులు ఆన్‌లైన్ షాపింగ్ సేవలను ఉపయోగించుకున్నారని, అందులో గణనీయ వాటా ద్వితీయ, తృతీయ, నాలుగో శ్రేణి ప్రాంతాలకు చెందినవారేనట. దేశవ్యాప్తంగా 2,100 మందిని సర్వే చేయడంతో పాటు ఇండస్ట్రీ భాగస్వాములు, నిపుణులతో 100 ఇంటర్వ్యూలు, 400 ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు పీడబ్ల్యూసీ ఇండియా తెలిపింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ-కామర్స్ రంగ తదుపరి దశ వృద్ధిలో ద్వితీయ, తృతీయ, నాలుగో శ్రేణి ప్రాంతాల వినియోగదారులే కీలక పాత్ర పోషించనున్నారు.
- ఆన్‌లైన్‌లో ఉత్పత్తుల ఎంపికలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా సైట్లు కీలకంగా మారుతున్నాయి. 62 శాతం మంది ఆన్‌లైన్ షాపర్లు సోషల్ మీడియా సైట్లలో కన్పించి, నచ్చిన ఉత్పత్తులనే ఈ-కామర్స్ సైట్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు.
- చెల్లింపుల విషయానికొస్తే, యూపీఐ, క్యాష్ ఆన్ డెలివరీ ప్రాధాన్య మార్గాలుగా ఉన్నాయి.

జీఎస్‌టీ అప్పీలు దాఖలు చేయటం ఎలా..?

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీకి సంబంధించి ఏవేనీ ఉల్లంఘనలకు పాల్పడినట్లు భావిస్తే డిపార్ట్‌మెంట్ ఒక వ్యక్తికి లేదా వ్యాపార సంస్థకు ముందుగా ఒక నోటీస్ పంపిస్తుంది. ఈ నోటీస్ అనేది ట్యాక్స్‌కు సంబంధించినదై ఉండవచ్చు లేదా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ), రిఫండ్, వడ్డీ లేదా ఇతర కారణాలైనా అయి ఉండవచ్చు. నోటీస్‌లోని అభియోగాలు, దానికి సంబంధించి సదరు వ్యక్తి లేదా సంస్థ ఇచ్చిన జవాబులను, సంబంధిత ఆధారాలను బట్టి ఒక ఆర్డర్ ఇవ్వటం జరుగుతుంది. ఈ ఆర్డర్ లేదా నిర్ణయం తనకు అనుకూలంగా లేదని భావిస్తే ఆ వ్యక్తి లేదా సంస్థ ఆ ఆర్డర్ మీద అప్పీల్ చేసుకోవచ్చు. సాధారణ భాషలో చెప్పాలంటే ఇది దిగువ కోర్టు ఇచ్చిన ఆర్డర్‌కు వ్యతిరేకంగా ఎగువ కోర్టుకు వెళ్లినట్లు. అప్పీల్ దాఖలు చేయటానికి నిర్దిష్ట నియమ నిబంధనలు ఉన్నాయి. అవి పాటించకపోతే అప్పీల్ స్వీకరణ తీసుకోబడదు. అలాంటప్పుడు తనకు అనుకూలంగా వాదనలు ఉన్నప్పటికీ, అప్పీల్ ప్రాథమిక దశలోనే తిరస్కరణకు గురి కావటం జరుగుతుంది. కాబట్టి అప్పీల్ దాఖలు చేసే వ్యక్తులు ఆయా నియమ నిబంధనలను సరిగ్గా తెలుసుకుని ఉండాలి. వీటికి సంబంధించి కొన్ని ముఖ్య నియమ నిబంధనలు ఉన్నాయి.

మొదటిది.. అప్పీల్ దాఖలు చేయటమనేది నిర్ణీత గడువులోపు జరగాలి. తాను ఏ ఆర్డర్ లేదా నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పీల్ దాఖలు చేస్తున్నాడో ఆ ఆర్డర్ లేదా నిర్ణయం తనకు అందిన దగ్గర నుంచి మూడు నెలల లోపు సంబంధిత అప్పిలేట్ అథారిటీ వద్ద దాఖలు చేయాలి. ఏదేనీ అనివార్య కారణాలతో మూడు నెలల లోపు దాఖలు చేయలేకపోతే తగు కారణాలు చూపటం ద్వారా అప్పిలేట్ అథారిటీ నుంచి అదనంగా ఒక నెల గడువు పొందవచ్చు. అయితే కారణాలు సహేతుకంగా అనిపించకపోతే ఈ అభ్యర్థనను తిరస్కరించే అధికారం అప్పిలేట్ అథారిటీకి ఉంటుంది.

మరొక ముఖ్యమైన విషయం ప్రీ డిపాజిట్ చెల్లించటం. దీనికోసం ముందుగా ఏ ఆర్డర్ మీద అప్పీల్ చేస్తున్నాడో, ఆ ఆర్డర్‌కు సంబంధించి తాను ఆమోదించే విషయాలు అంటే అడ్మిట్ చేసే విషయాలు, విభేదించే విషయాలు అంటే డిస్ప్యూట్ చేసే విషయాలు విడివిడిగా చూపాలి. తాను అడ్మిట్ చేసే వాటికి సంబంధించిన మొత్తం అంటే పన్ను, వడ్డీ, పెనాల్టీ మొదలైనవి మొత్తంగా చెల్లించాలి. విభేదించే వాటిలో పన్ను మీద మాత్రం 10 శాతం చెల్లించాలి. దీనిని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

ఒక వ్యాపార సంస్థకు వ్యతిరేకంగా ఒక ఆర్డర్ ఇవ్వటం జరిగింది. ఇందులో ఒక రూ.లక్ష ట్యాక్స్, మరొక రూ.లక్ష పెనాల్టీతో పాటుగా వడ్డీ కూడా డిమాండ్ చేయటం జరిగిందనుకుందాం. ఇందులో రూ.40,000కు సంబంధించి ట్యాక్స్ దానికి సంబంధించిన పెనాల్టీ, వడ్డీకి సంబంధించి తాను ఆమోదిస్తున్నాడు. మిగతా రూ.60,000కు సంబంధించిన ట్యాక్స్, పెనాల్టీ, వడ్డీ మీద తాను అప్పీల్ చేస్తున్నాడనుకుంటే.. ముందుగా తాను ఆమోదించే మొత్తాన్ని ట్యాక్స్, పెనాల్టీ, వడ్డీతో సహా చెల్లించటంతో పాటుగా తాను అప్పీల్ చేసుకునే రూ.60,000 లలో 10 శాతం అంటే రూ.6,000 ప్రీ డిపాజిట్‌గా చెల్లించాలి. ఇక్కడ చాలా మంది పొరపాటు పడే అంశం ఏమిటంటే డిస్ప్యూట్ చేసే పన్నులో 10 శాతం కడితే ప్రీ డిపాజిట్ కింద సరిపోతుందనుకుంటారు. కానీ, ఆ మొత్తంతో పాటుగా తాము అడ్మిట్ చేసే అంశాల మొత్తాన్ని చెల్లించాలనే విషయాన్ని విస్మరిస్తుంటారు. ఇంకా వివరంగా చెప్పాలంటే ప్రీ డిపాజిట్‌గా చెల్లించే 10 శాతం తాను ఆమోదించని అంశాల్లో కేవలం పన్ను మీద చెల్లిస్తే సరిపోతుంది. అదే ఆమోదించే అంశాలకు సంబంధించి మాత్రం మొత్తం చెల్లించాలి. అందుకే అప్పీల్ కోసం వాడే నిర్ణీత ఫారమ్ (జీఎస్‌టీ ఏపీఎల్ 01)లో మొత్తం ఆర్డర్‌కు సంబంధించిన పన్ను, వడ్డీ, పెనాల్టీ, ఫైన్ మొదలగు వివరాలతో పాటుగా వీటిలో అడ్మిట్ చేసే అంశాలు, డిస్ప్యూట్ చేసే అంశాలు వివరంగా చూపి తగు మొత్తాలను విధిగా చెల్లించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఓఎన్‌జీసీ కేజీ బేసిన్ ప్రాజెక్ట్ నుంచి క్రూడాయిల్ సరఫరా షురూ

తొలి ట్యాంకర్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి చెందిన కృష్ణా-గోదావరి (కేజీ) డీప్ వాటర్ ప్రాజెక్ట్ నుంచి క్రూడాయిల్‌ను రవాణా చేస్తున్న స్వర్ణ సింధు ట్యాంకర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. శనివారం నాడు బిహార్‌లోని బెగుసరాయ్ నుంచి ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా మొత్తం రూ.1.62 లక్షల కోట్ల విలువైన చమురు, సహజ వాయువు ప్రాజెక్టులను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టులు బిహార్, హరియాణా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్నాయి. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ కేజీ బేసిన్‌లో ఓఎన్‌జీసీ చెందిన కేజీ-డిడబ్ల్యూఎన్-98/2 క్షేత్రం నుంచి వెలికి తీసిన చమురును రవాణా చేసే ట్యాంకర్‌ను ప్రారంభించారు. ఈ ఏడాది జనవరిలో ఓఎన్‌జీసీ ఈ క్షేత్రంలో ఉత్పత్తిని ప్రారంభించింది. ఫ్లోటింగ్ ప్రొడక్షన్, స్టోరేజ్ ఆఫ్‌లోడింగ్ (ఎఫ్‌పీఎస్‌ఓ) ద్వారా ప్రస్తుతం రోజుకు 12,000 నుంచి 12,500 బ్యారళ్ల క్రూడాయిల్‌ను ఉత్పత్తి చేస్తోంది. ఇక్కడ ఉత్పత్తి చేసే ముడి చమురు కీలక స్థాయి చేరుకోగానే దాన్ని నౌకలోకి తరలించి రిఫైనరీకి చేరుస్తోంది. కాగా ప్రధాని మోదీ విశాఖపట్నంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)కి శంకుస్థాపన చేశారు. అలాగే కృష్ణా గోదావరి నాగాయలంక ఎన్‌ఈఎల్‌పీ క్షేత్రంలో ఫేజ్-2 డెవలప్‌మెంట్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ		విజయవాడ	463
హైదరాబాద్	463	విశాఖపట్నం	500
3వ తేదీ		వరంగల్	465
చిత్తూరు	523		
గోదావరి	463		

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126	గోదావరి	134
వరంగల్	126	విజయవాడ	134
కరీంనగర్	126	గుంటూరు	134
మహబూబ్‌నగర్	126	ఒంగోలు	134
కర్నూలు	126	చిత్తూరు	135
విశాఖపట్నం	127		

స్పోర్ట్స్

పారిస్ బెర్త్‌పై హుస్సామ్ గురి

నేటి నుంచి వరల్డ్ క్వాలిఫికేషన్ టోర్నీ



బుస్తో అర్సిజియో (ఇటలీ): పారిస్ ఒలింపిక్స్ బెర్తే లక్ష్యంగా తెలుగు బాక్సర్ హుస్సాముద్దీన్ (57 కిలోలు).. వరల్డ్ క్వాలిఫికేషన్ బాక్సింగ్ టోర్నీ బరిలోకి దిగనున్నాడు. ఆదివారం ఇక్కడ మొదలయ్యే ఈ టోర్నమెంట్‌లో హుస్సామ్‌తో పాటు భారత్‌కు చెందిన మొత్తం 9 మంది బాక్సర్లు అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ టోర్నీ నుంచి 49 ఒలింపిక్ బెర్త్‌లు అందుబాటులో ఉండగా.. సెమీస్ చేరితే చాలు పారిస్ టికెట్ ఖరారవుతుంది. రెండుసార్లు కామన్వెల్త్ కాంస్య పతక విజేత హుస్సామ్.. మోకాలి ఆపరేషన్ తర్వాత తొలిసారి రింగ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. మిగతా బాక్సర్లలో శివ థాపా, దీపక్ భోరియా, నిషాంత్ దేవ్‌పై భారీ అంచనాలున్నాయి.

ప్లేఆఫ్స్ నుంచి హైదరాబాద్ అవుట్

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. శనివారం హోరాహోరీగా జరిగిన లీగ్ మ్యాచ్‌లో కాలికట్ హీరోస్ జట్టు 15-13, 18-16, 16-14తో వరుస సెట్లలో హైదరాబాద్‌ను ఓడించింది. ఈ విజయంతో కాలికట్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోగా, హైదరాబాద్ నాకౌట్ రేసు నుంచి తప్పుకుంది. ఈ సీజన్‌లో హైదరాబాద్ ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఒకే ఒక మ్యాచ్ గెలిచింది.



ఆనందంలో అమ్మానాన్నతో..

జురెల్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకొన్నాడు. అయితే, తనకు లభించిన 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'ను ధ్రువ్ తన తల్లిదండ్రులతో పంచుకొన్నాడు. నాన్న నేమ్ చంద్, తల్లి రజనీతో కలసి ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసిన జురెల్.. 'తన జీవితంలో నిజమైన ఎంవీపీలు (మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్లు) వీరే' అని ఫొటో కింద రాశాడు.

హై హై ముంబై

ఆర్‌సీబీపై 7 వికెట్ల తేడాతో విజయం

సత్తా చాటిన కెర్, బ్రంట్, పూజ

మహిళల ప్రీమియర్ లీగ్



అమెలియా కెర్ (40 నాటౌట్)



బ్రంట్ (2/27)

సంక్షిప్త స్కోర్లు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: 20 ఓవర్లలో 131/6. (ఎలిస్ పెర్రీ 44 నాటౌట్, వేర్‌హమ్ 27; పూజా వస్త్రాకర్ 2/14, సివర్ బ్రంట్ 2/27).

ముంబై ఇండియన్స్: 15.1 ఓవర్లలో 133/3. (అమెలియా కెర్ 40 నాటౌట్, యాస్తిక 31, బ్రంట్ 27, హేలీ మాథ్యూస్ 26; శ్రేయాంక పాటిల్ 1/15, సోఫీ డివైన్ 1/16).

నేటి మ్యాచ్

గుజరాత్ x ఢిల్లీ

రాత్రి 7.30 గం. నుంచి

బెంగళూరు: సొంత మైదానంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నుంచి మరోసారి పేలవ ప్రదర్శన ఎదురు కాగా.. అటు ముంబై ఇండియన్స్ మాత్రం ఆల్‌రౌండ్‌షోతో చెలరేగింది. ఫలితంగా శనివారం జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌లు.. మూడు విజయాలు.. ఆరు పాయింట్లతో పట్టికలో ముంబై టాప్‌లో కొనసాగుతోంది. మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 131 పరుగులే చేసింది. వీరి ఇన్నింగ్స్‌లో స్టార్ బ్యాటర్లు విఫలమయ్యారు. ముంబై బౌలర్లు నాట్ సివర్ బ్రంట్ (2/27), పూజా వస్త్రాకర్ పొదుపైన బౌలింగ్‌తో పాటు వరుస విరామాల్లో వికెట్లు తీశారు. ఎలిస్ పెర్రీ (38 బంతుల్లో 5 ఫోర్లతో 44 నాటౌట్) ఆట మాత్రమే హైలైట్‌గా నిలిచింది. పవర్‌ప్లేలోపు 33 పరుగులకే కెప్టెన్ స్మృతీ మంధాన (9), సోఫీ డివైన్ (9), సబ్బినేని మేఘన (11) పెవిలియన్‌కు చేరారు. అటు రిచా ఘోష్ (7), మోలినెక్స్ (12)ను పూజా వస్త్రాకర్ అవుట్ చేయడంతో ఆర్‌సీబీ 71/5 స్కోరుతో దయనీయంగా కనిపించింది. వంద పరుగులు కూడా కష్టమే అనుకున్న స్థితిలో పెర్రీ నిలకడ జట్టును ఆదుకుంది. జార్జియా వేర్‌హమ్ (27)తో కలిసి పెర్రీ ఆరో వికెట్‌కు 52 పరుగులు జోడించడంతో ఆర్‌సీబీ ఓ మాదిరి స్కోరైనా చేయగలిగింది. ముంబై మిగతా బౌలర్లలో ఇస్సీ వాంగ్, సైకా ఇషాక్ చెరో వికెట్ తీశారు.

జోరుగా...: స్వల్ప ఛేదనను ముంబై తుఫాను వేగంతో ఆరంభించింది. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ బ్యాట్‌కు పనిచెప్పడంతో 15.1 ఓవర్లలో 133/3 స్కోరు చేసి సునాయాసంగా నెగ్గింది. అమెలియా కెర్ (24 బంతుల్లో 7 ఫోర్లతో 40 నాటౌట్) అదరగొట్టింది. అంతకుముందు ఓపెనర్ యాస్తిక భాటియా (15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 31) రెండో ఓవర్‌లోనే 6,4తో కదం తొక్కింది. తర్వాతి ఓవర్‌లోనూ యాస్తిక సిక్సర్ బాదగా.. మరో ఓపెనర్ హేలీ మాథ్యూస్ (26) సైతం రెండు ఫోర్లు సాధించడంతో 16 పరుగులు వచ్చాయి. వీరి దూకుడుతో ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో స్కోరు దూసుకెళ్లింది. అయితే నాలుగో ఓవర్‌లో యాస్తికను డివైన్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 23 బంతుల్లో 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే మాథ్యూస్‌ను శ్రేయాంక అవుట్ చేయగా, కెర్ మరింత ధాటిగా ఆడింది. చకచకా ఫోర్లు బాదేస్తూ లక్ష్యాన్ని వేగంగా తగ్గించడంతో మరో 29 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. అమెలియా కెర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.

తుషార్, శార్దూల్ కూల్చేశారు

- తమిళనాడు 146 ఆలౌట్
- ముంబై 45/2 ● రంజీ సెమీస్



తుషార్ దేశ్‌పాండే (3/24)

ముంబై: పేసర్లు తుషార్ దేశ్‌పాండే (3/24), శార్దూల్ ఠాకూర్ (2/48) విజృంభించడంతో.. ముంబైతో శనివారం ఆరంభమైన రంజీ సెమీస్‌లో తమిళనాడు తడబడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే కుప్పకూలింది. టాపార్డర్ బ్యాటర్లు సాయి సుదర్శన్ (0), నారాయణ్ జగదీశన్ (4), ప్రదోష్ రంజన్ పాల్ (8), కెప్టెన్ సాయి కిషోర్ (1) స్వల్ప స్కోరుకే వెనుదిరిగారు. 17/4తో పీకల్లోతు కష్టాల్లోపడ్డ తమిళనాడును విజయ్ శంకర్ (44), వాషింగ్టన్ సుందర్ (43) ఆరో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. ఇక శంకర్ అవుట్‌తో తమిళనాడు పతనం వేగంగా జరిగిపోయింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ముంబై తొలిరోజు ఆట ముగిసేసరికి 45/2 స్కోరు చేసింది. ముషీర్ ఖాన్ (24), మోహిత్ అవస్థీ (1) క్రీజులో ఉన్నారు. ఓపెనర్లు పృథ్వీ షా (5), భూపేన్ లాల్వాణి (15) తక్కువ స్కోర్లకే అవుటయ్యారు.

అవేశ్ అదుర్స్.. విదర్భ 170



అవేశ్ ఖాన్ (4/49)

పేసర్ అవేశ్ ఖాన్ (4/49) నిప్పులు చెరగడంతో.. విదర్భతో జరుగుతున్న రెండో సెమీస్ మ్యాచ్‌లో తొలిరోజు మధ్యప్రదేశ్‌దే పైచేయిగా నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న విదర్భ మొదటి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకు కుప్పకూలింది. కరుణ్ నాయర్ (63) అర్ధ శతకం సాధించగా.. అథర్వ (39) ఫర్వాలేదనిపించాడు. వెంకటేష్ అయ్యర్, కుల్వంత్ కేజ్రోలియా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ మొదటి రోజు ఆఖరికి 47/1 స్కోరు చేసింది. హిమాన్షు మంత్రి (26), హర్ష్ గావ్లీ (10) క్రీజులో ఉన్నారు.

అర్జున్ రెండో గెలుపు



షెన్‌జెన్ (చైనా): తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ షెన్‌జెన్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో రెండో విజయాన్ని నమోదు చేశాడు. శనివారం ముగిసిన మూడో రౌండ్లో నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ అనీష్ గిరిపై అర్జున్ గెలుపొందాడు. ఈ రౌండ్ తర్వాత అర్జున్ 2 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ టోర్నీలో మరో నాలుగు రౌండ్లు మిగిలున్నాయి.

కివీస్ విజయ లక్ష్యం 369

ప్రస్తుతం 111/3

ఆసీస్‌తో తొలి టెస్టు

వెల్లింగ్టన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్‌కు 369 పరుగుల భారీ లక్ష్యం ఎదురైంది. ఈ ఛేదనలో కివీస్ శనివారం ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 111 పరుగులు చేసింది. క్రీజులో రచిన్ (56), మిచెల్ (12) ఉన్నారు. లియోన్‌కు రెండు వికెట్లు పడగొట్టాడు. ఆటకు ఇంకా రెండు రోజుల సమయం ఉండగా, కివీస్ విజయానికి 258 పరుగుల దూరంలో ఉంది. అంతకుముందు స్పష్టమైన ఆధిక్యంతో దూసుకెళుతున్న ఆసీస్‌ను మూడో రోజున కివీస్ కట్టడి చేసింది. స్పిన్నర్ గ్లెన్ ఫిలిప్స్ (5/45) విజృంభించడంతో రెండో ఇన్నింగ్స్‌లో కంగారూలు 164 పరుగులకే పరిమితమయ్యారు. 2008 తర్వాత స్వదేశంలో కివీస్ స్పిన్నర్‌కు ఐదు వికెట్లు దక్కడం ఇదే తొలిసారి. బ్యాటింగ్‌లో లియోన్ (41), గ్రీన్ (39) మాత్రమే రాణించారు. హెన్రీకి 3, సౌథీకి 2 వికెట్లు దక్కాయి.

కమిన్స్‌కు సన్‌రైజర్స్ పగ్గాలు?



హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఈ ఐపీఎల్ సీజన్‌కు కొత్త కెప్టెన్‌తో బరిలోకి దిగనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటిదాకా సారథిగా వ్యవహరించిన మార్క్‌రమ్‌కు ఉద్వాసన పలికి అతని స్థానంలో ఆస్ట్రేలియా స్టార్ ప్యాట్ కమిన్స్‌కు పగ్గాలు అప్పగిస్తారని సమాచారం. రికార్డుస్థాయిలో రూ. 20.50 కోట్లు వెచ్చించి వేలంలో కమ్మిన్స్‌ను సన్‌రైజర్స్ కొనుగోలు చేసుకున్న సంగతి తెలిసిందే. గతేడాది కమిన్స్ సారథ్యంలోనే ఆస్ట్రేలియా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌తో పాటు వన్డే వరల్డ్‌కప్‌ను గెలుచుకుంది. ఈ అనుభవం దృష్ట్యా కమిన్స్‌ను కెప్టెన్‌గా నియమించాలని ఫ్రాంచైజీ నిర్ణయించిందనీ, ఒకట్రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడనుందని సన్‌రైజర్స్ వర్గాలు తెలిపాయి. నిరుడు మార్‌క్రమ్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ 14 మ్యాచుల్లో 4 మాత్రమే గెలవడం గమనార్హం.

జెస్విన్‌కు నిరాశ

గ్లాస్గో: ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాణించడంలో భారత లాంగ్ జంపర్ జెస్విన్ అల్‌డ్రిన్ విఫలమయ్యాడు. జాతీయ రికార్డు గ్రహీతైన జెస్విన్ లాంగ్ జంప్‌లో 7.69 మీటర్ల దూరం లంఘించి 13వ స్థానంలో నిలిచాడు. గతేడాది ప్రపంచ టోర్నీలో ఏకంగా 8.42 మీటర్ల ప్రదర్శనతో అదరగొట్టిన 22 ఏళ్ల జెస్విన్.. ఇక్కడ మాత్రం పూర్తిగా నిరాశపరిచాడు.

వెర్‌స్టాపెన్‌దే బహ్రెయిన్ గ్రాండ్ ప్రీ



సాఖిర్ (బహ్రెయిన్): ఫార్ములావన్ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌ను తనదైన శైలిలో ప్రారంభించాడు. ఈ రెడ్‌బుల్ డ్రైవర్ సీజన్ మొదటి ఎఫ్1 రేసు బహ్రెయిన్ గ్రాండ్ ప్రీలో చాంపియన్‌గా నిలిచాడు. శనివారం జరిగిన ఫైనల్ రేసును వెర్‌స్టాపెన్ అగ్రస్థానంతో ముగించాడు. రెడ్‌బుల్‌కే చెందిన సెర్జియో పెరెజ్ రెండు, ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ మూడు స్థానాలతో పోడియం ఫినిష్ చేశారు. వరుసగా ఎనిమిదో రేసు నెగ్గిన వెర్‌స్టాపెన్‌కు కెరీర్‌లో ఇది 55వ విజయం.



నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో వేదికపై చంద్రబాబు సమక్షంలో వైసీపీ నేత వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అభివాదం



వీపీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు



టీడీపీలో చేరిన వేమిరెడ్డి సతీమణి ప్రశాంతి రెడ్డికి కండువా కప్పుతున్న చంద్రబాబు

"నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరికీ ఇవ్వనంత గౌరవం పవన్ కల్యాణ్‌కు ఇస్తున్నా. ఇప్పటికి ఎన్నో పార్టీలతో పొత్తులు పెట్టుకున్నాగానీ వారెవరికీ ఇవ్వనంత గౌరవం ఆయనకు ఇస్తున్నా. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా తెలుగుదేశం, జనసేనలకు చెందిన ఒక్క ఓటు కూడా మరో పార్టీకి బదిలీ కాకూడదనే ఉద్దేశంతో నేను, పవన్ చాలా జాగ్రత్తగా ముందుకు వెళుతున్నాం. భవిష్యత్తులో కూడా ఇలాగే వ్యవహరిస్తాం" - చంద్రబాబు

భావితరాల కోసం ధర్మయుద్ధమిది

జగన్‌ను చిత్తుచేయడానికి 'సిద్ధం' కావాలి

నెల్లూరు సభలో చంద్రబాబు పిలుపు

వేమిరెడ్డిని గౌరవించడానికే నెల్లూరు వచ్చా

వందలాది మందితో టీడీపీలోకి వీపీఆర్

నెల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): "వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించాలి. అది నా కోసం కాదు. పవన్ కల్యాణ్ కోసం కాదు. రాష్ట్ర ప్రజల కోసం, భావితరాల భవిష్యత్తు కోసం. అందరూ ధర్మయుద్ధానికి సిద్ధం కండి" అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. మరోసారి పొరబాటు జరిగితే రాష్ట్రానికి ఉనికి ఉండదని, ఒక్కసారి ముద్దులకు ఏమారినందుకు రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డితోపాటు ఆయన అనుచరులు, అభిమానులు టీడీపీలో చేరిక సందర్భంగా శనివారం చంద్రబాబు నెల్లూరు వచ్చారు. 'వీపీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సభకు తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. 'వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గౌరవించడం నా బాధ్యతగా భావించి నెల్లూరుకు వచ్చాను" అని చంద్రబాబు అన్నారు. ఫ్లెక్సీలు మార్చినంత తేలిగ్గా అభ్యర్థులను వైసీపీ అధినేత జగన్ మార్చేస్తున్నారని మండిపడ్డారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

జగన్ 'సిద్ధం' అంటే అభ్యర్థులు పరార్

"జగన్ 'సిద్ధం' అంటే అభ్యర్థులు పారిపోతున్నారు. ఇప్పటికి ఆరుగురు ఎంపీలు వైసీపీని వదిలి టీడీపీలోకి వచ్చారు. 10 మంది ఎమ్మెల్యేలు పారిపోయారు. నెల్లూరులో ఒక నాయకుడు (అనిల్‌కుమార్ యాదవ్) 'బుల్లెట్ దిగిందా లేదా..!' అనేవాడు. పాపం ఆయనను ఒక తన్ను తంతే మూడు జిల్లాల అవతల పడ్డాడు. అక్కడ ప్రజలు తన్నడానికి సిద్ధంగా ఉన్నారు. అక్కడ తంతే నేరుగా చెన్నైలో పడిపోతాడు. ఐదు నుంచి ఆరుమంది ఎమ్మెల్సీలు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వైసీపీకి రాజీనామా చేశారు. మంచి వాళ్లంతా టీడీపీలో కి వచ్చేస్తున్నారు. ఇది చూసి జగన్‌కు పిచ్చిపడుతోంది. తాడేపల్లి ప్యాలెస్‌కు వణుకు పుడుతోంది"

చెల్లెళ్ల ప్రశ్నలపై జవాబుకు సిద్ధమా?

"జగన్ ఊరికే సిద్ధం.. సిద్ధం అని అరుస్తున్నారు. నిన్న ఆయన సోదరి ఒకమాట అడిగింది. హంతకులకు పరిపాలించే అర్హత లేదు అంది. 'సిద్ధం' అంటున్న జగన్ దీనికి జవాబివ్వాలి. 'ఏ కేసులైనా నాలుగు, ఐదు రోజుల్లో తేలిపోతాయి. కానీ వివేకా కేసు ఎందుకు ఐదేళ్లయినా తేలలేదు' అని ఆమె అడిగారు. సమాధానం చెప్పడానికి జగన్ సిద్ధమా..!? బాబాయ్ హత్య కేసులో సమాధానం చెప్పడానికి సిద్ధమా!? హూ కిల్డ్ బాబాయ్? సమాధానానికి సిద్ధమా? మరో చెల్లెలు షర్మిళ. పాపం ఆమెకు ఆస్తుల్లో వాటా ఇవ్వలేదు. ఆమె అడుగుతున్న దానిపై సమాధానం ఇవ్వడానికి సిద్ధమా?! చివరికి సామాజిక మాధ్యమాల్లో ఆమె పుట్టుక గురించి కూడా నీచంగా పోస్టింగులు పెట్టించాడు. 'నిన్ను మనిషి అంటారా జగన్. ఇది నీ తల్లికి, నీ చెల్లికి అవమానం కాదా!? దీనిపై ఎందుకు స్పందించలేదు? జగన్ 'సిద్ధం' అంటే అందరినీ అరెస్టు చేసి ఆ తరువాత సిద్ధం సభకు బయలుదేరుతారు. అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా సంఘాలు, ఉద్యోగులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఇలా అందరినీ అరెస్టులు చేసిన తరువాత కానీ జగన్ సిద్ధం సభకు బయలుదేరడు"

ఊరూరా చీలిన వైసీపీ ఓటు!

వీపీఆర్ రాజీనామాను తేలిగ్గా తీసుకున్న వైసీపీ అధిష్ఠానం అందుకు తగిన మూల్యమే చెల్లించుకోవాల్సి వచ్చిందన్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. వీపీఆర్ వెంట ఉమ్మడి నెల్లూరు జిల్లా కందుకూరుతో సహా మొత్తం 11 నియోజకవర్గాల నుంచి వందల సంఖ్యలో స్థాయి కలిగిన వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరిని సాదరంగా ఆహ్వానించిన చంద్రబాబు మాట్లాడుతూ... ఈ చేరికలను చూస్తుంటే నెల్లూరు జిల్లాలో వైసీపీ ఖాళీ అయిపోయినట్లుగానే ఉందని వ్యాఖ్యానించారు. వీపీఆర్ వెంట టీడీపీలో చేరిన నాయకులందరూ మండల, గ్రామ స్థాయుల్లో పట్టు కలిగిన వారే. వీరి చేరికతో ఊరూరా వైసీపీ ఓటు బ్యాంకు చీలినట్టు కనిపిస్తోందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

ఎవరికీ ఇవ్వనంత గౌరవం పవన్‌కు ఇస్తున్నా!

"జగన్ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాడు. కులాల మధ్య చిచ్చుపెట్టాడు. కుటుంబాల మధ్య చిచ్చు పెట్టాడు. ఇప్పుడు నాకు, పవన్‌కు మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాడు. నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరికి ఇవ్వనంత గౌరవం పవన్‌కు ఇస్తున్నా. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా టీడీపీ, జనసేనలకు చెందిన ఒక్క ఓటు కూడా మరో పార్టీకి బదిలీ కాకూడదనే ఉద్దేశంతో నేను, పవన్ జాగ్రత్తగా ముందుకు వెళుతున్నాం"

భారీగా చేరికలు.. మధ్యాహ్నం 12.45 గంటలకు సభా ప్రాంగణానికి చంద్రబాబు చేరుకున్నారు. తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలతో పాటు తెలుగుదేశం పార్టీలో చేరడానికి వందలాదిగా తరలివచ్చిన వైసీపీ నాయకులు, వారి అనుచరులు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. సభ ఆరంభంలోనే వేమిరెడ్డి దంపతులకు కండువాలు కప్పి పార్టీలోకి చంద్రబాబు ఆహ్వానించారు. అనంతరం నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సభ అనంతరం ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన పలు ప్రాంతాల నుంచి వందలాదిగా తరలివచ్చిన వీపీఆర్ అభిమానులు, స్థానిక వైసీపీ నాయకులను చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు.



వైసీపీ ఎంపీ లావు కృష్ణదేవరాయలును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బాబు

పల్నాడులో నరహంతకులను అణిచేస్తా

మర్యాదకు మర్యాద... దెబ్బకు దెబ్బ

- జగన్..శాశ్వతంగా నీ నోరు మూయిస్తా
- ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదు
- 'దాచేపల్లి రా... కదలిరా' సభలో చంద్రబాబు ఆగ్రహం
- టీడీపీలో చేరిన ఎంపీ లావు

పిడుగురాళ్ల(గుంటూరు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): పల్నాడులో హత్యా రాజకీయాలు చేస్తున్న వైసీపీ ఎమ్మెల్యేలకు టీడీపీ అధినేత చంద్రబాబు మాస్ వార్నింగ్ ఇచ్చారు. "నేను కన్నెర్రచేస్తే మీరు ఇంట్లో నుంచి బయటకు రాలేరు. పల్నాడులో నరహంతకులను అణగదొక్కి తీరతా. ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోను. తీవ్రవాదులు, ముఠానాయకులు, మత విద్వేషశక్తులను అణచివేసిన చరిత్ర టీడీపీకి ఉందన్న విషయాన్ని మరిచిపోవద్దు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. మర్యాదకు మర్యాద... దెబ్బకు దెబ్బ తప్పదన్నారు. శనివారం పల్నాడు జిల్లా దాచేపల్లిలో జరిగిన రా... కదలి రా బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. వైసీపీకి ఇటీవలే రాజీనామాచేసిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు.... చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఎక్కడ చూసినా ఆడబిడ్డలు రాణి రుద్రమదేవిలా యుద్ధానికి సై అంటున్నారని వ్యాఖ్యానించారు. "యువత రణరంగంలోకి దూకుతోంది. ఈ ఉత్సాహం చూస్తుంటే ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపును ఎవరూ ఆపలేరని అనిపిస్తోంది. అడ్డంవస్తే తొక్కుకొంటూ పోతాం. టీడీపీ-జనసేన అన్‌స్టాపబుల్" అంటూ శ్రేణులను ఉత్సాహపరిచారు. శ్రీకృష్ణదేవరాయలు గురించి ఐవీఆర్ఎస్ సర్వే చేయిస్తే అందరూ బ్రహ్మాండమైన వ్యక్తి అని సమాధానం చెప్పారన్నారు. రేపో, ఎల్లుండో మరో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి టీడీపీలోకి రాబోతోన్నారన్నారు. ఇంకా ఏమన్నారంటే..

'హూ కిల్డ్ బాబాయ్'... "పల్నాడుకు వస్తే మనసంతా భారంగా మారుతుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచీ ఇక్కడ అరాచకాలకు అంతులేదు. వైసీపీకి ఓటు వేయని వాళ్లని ఊళ్ల నుంచి తరిమేశారు. టీడీపీలో ఉన్నవారిని పొట్టన పెట్టుకొంటున్నారు. నాకు ప్రాణసమానమైన తమ్ముళ్లను పోగొట్టుకున్నాను. చంద్రయ్య అనే వ్యక్తిని జై జగన్ అంటే వదిలేస్తామని చెప్పినా... ఆయన జై చంద్రబాబు... జై టీడీపీ అన్నందుకు హత్య చేశారు. అది తెలిసి చలించి పోయి వచ్చి చంద్రయ్య పాడె మోశాను. రెంటచింతలలోని మల్లవరంలో సామినిబాయిని ట్రాక్టర్‌తో గుద్దించి చంపేశారు. జగన్ గుర్తు పెట్టుకో! ఇదే నా హెచ్చరిక. ప్రజల నిండు ప్రాణాలు పోతే కనీసం విచారణ చేయించవా? నీకు సీఎం కుర్చీలో కూర్చునే అర్హత ఉందా? నీ నోరు మూయించే శక్తి మాకు ఉంది. శాశ్వతంగా నీ నోటికి సీసం అరగబెట్టి బ్లాక్ చేసే శక్తి మాకు ఉంది. ఏ తప్పూ చేయని ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడిని అరెస్టు చేయిస్తావా? జగన్ ఇప్పటికైనా చెప్పు... హూ కిల్డ్ బాబాయి. ఇది నేను అడగడం లేదు. నీ చెల్లి అడుగుతోంది"

మీ ఆదాయం పెంచడానికే 'సూపర్ సిక్స్'

"ఈ ఎన్నికలు పేదలు, పెత్తందార్లకు మధ్య అని జగన్ అంటున్నారు. ఈ దేశంలో ఉన్న సీఎంలందరి ఆస్తుల కంటే జగన్ ఆస్తి ఎక్కువ. జేగన్ రూ. 10 ఇచ్చి రూ. 200 దోచుకొంటున్నారు.. నేను అధికారంలోకి వచ్చాక రూ. 15ఇచ్చి దాంతో రూ. 100 అక్కడినుంచి రూ.వెయ్యి, రూ.10వేలు సంపాదించే మార్గాలను చూపిస్తాను. అందుకే సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించాను. మహిళలకు నెలకు రూ. 1500, విద్యార్థులకు రూ.15వేలు, ఏటా 3వంట గ్యాస్ సిలిండర్లు ఉచిత పంపిణీ, నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేవరకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతులకు ఏటా రూ.20వేల ఆర్థికసాయం ఇస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

పోటెత్తిన జన..వనం

వైసీపీ నేతల బెదిరింపులు.. మండుటెండను లెక్క చేయక జనం తరలొచ్చి పల్నాడు జిల్లా దాచేపల్లిలో శనివారం జరిగిన రా.. కదలిరా బహిరంగ సభను సూపర్ హిట్ చేశారు. తెలుగు తమ్ముళ్లు, జన సైనికులు కలసికట్టుగా కదం తొక్కారు. సభా ప్రాంగణం కిటకిటలాడింది. ప్రభుత్వం బస్సులు కేటాయించక పోయినా, పోలీసులు సరైన భద్రత కల్పించకున్నా.. ప్రైవేట్ వాహనాలపై ఆంక్షలు విధించినా టీడీపీ, జనసేన అభిమానులు ప్రత్యామ్నాయ మార్గాల్లో సభా ప్రాంగణానికి భారీగా చేరుకున్నారు.

టీడీపీలో వసంత కృష్ణ ప్రసాద్ చేరిక



అమరావతి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీలోని వైసీపీ ఎమ్మెల్యేల చేరికల పరంపర కొనసాగుతూనే ఉంది. మరో వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లో చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పెనమలూరు శాసనసభ్యుడు కొలుసు పార్థసారధి ఇప్పటికే చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. తాజాగా అదే జిల్లాకు చెందిన మైలవరం శాసనసభ్యుడు వసంత కూడా అదే బాట పట్టారు. దీంతో కృష్ణాలో టీడీపీలో జోష్ ఏర్పడింది.

పోటీ నుంచి తప్పుకొంటున్నా: మహాసేన రాజేశ్



అమలాపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): 'పీ గన్నవరం నియోజకవర్గానికి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా నన్ను ప్రకటించారు. అయితే అనివార్య కారణాల వల్ల పోటీ నుంచి తప్పుకొనేందుకు సిద్ధంగా ఉన్నా' అని సరిపెల్ల రాజేశ్ (మహాసేన రాజేశ్) ప్రకటించారు. శనివారం సోషల్ మీడియాలో ఆయన ఓ వీడియోని పోస్ట్ చేశారు. దానిలో... 'నా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఏడేళ్ల క్రితం నేను విడుదల చేసిన ఒక వీడియోను సాకుగా చూపి బ్రాహ్మణులు విశాఖ టీడీపీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాను. ఈ పరిణామాలు ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు నష్టం కలిగించేలా ఉన్న దృష్ట్యా పోటీ నుంచి నిష్క్రమించడానికి నిర్ణయించుకున్నా. నేను ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలు లేకుండా జగన్ చేస్తున్న కుట్రల్లో భాగమే ఈ పరిణామాలు. హిందూ వ్యతిరేకిగా నాపై ముద్ర వేస్తూ బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారంతో పార్టీకి నష్టం జరగకూడదని భావిస్తున్నా. కుల రక్కసి చేతిలో నేను బలయ్యా. ఈ వ్యవహారంపై టీడీపీ, జనసేన తీసుకునే నిర్ణయం ఏదైనా నేను స్వాగతిస్తా' అని రాజేశ్ తెలిపారు.

వినూత్నంగా చంద్రబాబు 'ప్రజా గళం'

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వినూత్న తరహాలో ప్రజా గళం పేరుతో ఒక కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడానికి టీడీపీ అధినేత చంద్రబాబు సమాయత్తం అవుతున్నారు. ఈ కార్యక్రమం 6 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటిదాకా తన సభలు, సమావేశాలకు వచ్చిన వారిని ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించడం అనవాయితీ. ప్రజాగళంలో ఈ నమూనాను మార్చివేస్తున్నారు. వివిధ వర్గాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి ఏ విధంగా పరిష్కారం చూపిస్తామో చంద్రబాబు చెబుతారు. అందుకే ఈ కారక్రమానికి ప్రజా గళం అని పేరు పెట్టినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశాలకు పార్టీ శ్రేణులతోపాటు వివిధ వర్గాలకు చెందిన వారిని.. సమాజంలో ప్రభావం చూపుతున్న ప్రముఖులను కూడా పిలుస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రభావశీలురుగా గుర్తింపు పొందినవారిని కూడా ఆహ్వానిస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఆరేడు వేల మందితో మాత్రమే ఈ సమావేశాలు జరుపనున్నారు. రోజుకు రెండు నియోజకవర్గాల్లో ఈ సమావేశాలు పెట్టనున్నారు. 6న నంద్యాల, కడప జిల్లా మైదుకూరులో, 7న వేమూరు, పామర్రు, 8న పలాస, పాడేరు, 9న రామచంద్రాపురం, ప్రత్తిపాడు, 10న మార్కాపురం, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఈ సమావేశాలు జరుగుతాయి. కాగా, టీడీపీ యువ నేత లోకేశ్ నిర్వహిస్తున్న శంఖారావం సమావేశాలు 3న ప్రారంభం కావాల్సి ఉండగా వాయిదా పడ్డాయి. మంగళగిరి పరిధిలో 5న జయహో బీసీ సభ ఉండటంతో దానికోసం వాయిదా వేశారు. ఈ నెల 7నుంచి ఇవి ప్రారంభం అవుతాయని అంటున్నారు.

నేడు పల్స్ పోలియో.. సర్వం సిద్ధం

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇమ్యూనైజేషన్ డేను పురస్కరించుకుని ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసినట్లు ఆరోగ్యశాఖ కమిషనర్ నివాస్ తెలిపారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా ఏర్పాట్లపై ఆయన అధికారులతో చర్చించారు. రాష్ట్రంలో 53,35,519 లక్షల మంది పిల్లల కోసం 67,76,100 డోస్‌లు సిద్ధం చేశారు. 1,68,660 మంది వ్యాక్సినేటర్లు, 37,921 పోలియో బూత్‌లు, ఇంటింటికి వెళ్లేందుకు 73,581 టీమ్స్ సిద్ధం చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. 3న పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన పిల్లల వివరాల్ని తీసుకుని 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నారు. 6న మొబైల్ టీమ్స్ ఇంటింటి సర్వే చేపట్టి వ్యాక్సిన్ వేయించుకోని వారిని గుర్తించి, అక్కడే పోలియో చుక్కలు వేస్తారు. కాగా, పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కాగా, వేసవి దృష్ట్యా ఎక్కడా తాగు నీటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కనీస మద్దతు ధరకు రైతుల నుంచి మినుములు, పెసలు, వేరుశెనగ వంటి పంటలు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎరువులు కొరత లేకుండా చూడాలని, నిరంతరం ధరలను పర్యవేక్షించాలన్నారు.

కాంగ్రెస్‌లో ఎన్నికల సందడి

- 7న అమరావతికి మద్దతుగా డీకే శివకుమార్ పర్యటన
- 11న విశాఖకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



విజయవాడ కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ ఎన్నికల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికలకు సర్వసన్నద్ధమవుతోంది. విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో శనివారం ఏపీసీసీ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి పలువురు ముఖ్యనేతలతో సమీక్షించారు. ఈ సమీక్షలో పార్టీ సీనియర్ నాయకులు కేవీపీ రామచంద్రరావు, పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరావతి రాజధానికి మద్దతుగా కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మార్చి 7న గుంటూరు జిల్లాలో పర్యటిస్తారని, కాంగ్రెస్ ఇచ్చే గ్యారెంటీలను మార్చి 11న విశాఖలో జరిగే సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తారని తెలిపారు. త్వరలోనే వైసీపీకి చెందిన కొందరు ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరుతారని సంకేతాలు వస్తున్న తరుణంలో.. ఈ నెల ఐదో తేదీ వరకూ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను నిలుపుదల చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు 1,351 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించిన మాణిక్యం ఠాగూర్, షర్మిలరెడ్డి.. కుల, జన, ఆర్థిక బలాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. ఇదే సమయంలో మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ పల్లంరాజు కాంగ్రెస్ తరఫున గ్యారెంటీలను ఇవ్వడంపై సమీక్షించారు. అభ్యర్థుల జాబితాపై తుది కసరత్తును స్క్రీనింగ్ కమిటీ జాతీయ అధ్యక్షుడు మధుసూదన్ మిస్త్రీ పూర్తి చేసి, అధిష్ఠానానికి నివేదిక ఇస్తారు.

పొత్తునుబట్టే అభ్యర్థులు!

కసరత్తు చేస్తున్న కమలం

- ప్రతి అసెంబ్లీకి ముగ్గురు ఎంపిక


అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో పొత్తులపై ఇంకా స్పష్టత రాలేదు. జనసేన, టీడీపీ కలిసి పోటీచేస్తున్నామని ప్రకటించాయి. బీజేపీ కూడా ఈ కూటమితో కలసి సాగుతుందన్న వార్తలు వెలువడ్డా దానిపై కమలనాథుల నుంచి ఇంకా స్పష్టత రాలేదు. ఈ సందిగ్ధం కొనసాగుతుండగానే రాష్ట్ర బీజేపీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ ఎంపికల తుది నిర్ణయం మాత్రం కేంద్ర నాయకత్వం పొత్తులపై తీసుకొనే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటాయని సమాచారం. కాగా, శనివారం విజయవాడ పార్టీ కేంద్ర కార్యాలయంలో అధ్యక్షురాలు పురందరేశ్వరి నేతృత్వంలో అభ్యర్థుల దరఖాస్తుల వడపోత జరిగింది. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి గత నెలలో రాష్ట్ర బీజేపీ దరఖాస్తులు ఆహ్వానించింది. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 2,500 అప్లికేషన్స్ ఫిబ్రవరి 29 నాటికి వచ్చాయి. వాటిని శనివారం పురందేశ్వరి, జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్‌తో కూడిన బృందం పరిశీలించింది. రాయలసీమ, ఉత్తరాంధ్రతోపాటు గుంటూరు, బాపట్ల పార్లమెంటు పరిధిలోని అభ్యర్థుల బలా బలాలపై స్క్రీనింగ్ కమిటీ బేరీజు వేసింది. అందులో క్షేత్రస్థాయి బలం, ఆర్థిక పుష్టి, పార్టీలో సానుకూలత తదితర అంశాలపై క్షుణ్నంగా పరిశీలించి ప్రతి అసెంబ్లీకి ముగ్గురి చొప్పున జాబితా సిద్ధం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కొన్ని నియోజకవర్గాల్లో పదికి మించి దరఖాస్తులు రాగా చాలా చోట్ల ఒకటి రెండే వచ్చినట్లు సమాచారం. రాయలసీమలో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి జమ్మలమడుగు నుంచి, తిరుపతి నుంచి భానుప్రకాశ్, శ్రీకాళహస్తి నుంచి కోలా ఆనంద్, రాజంపేట నుంచి సాయి లోకేశ్, చిత్తూరు జగదీశ్వర నాయుడు, ధర్మవరం నుంచి వరదాపురం సూరి, గుంతకల్ నుంచి సందిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నంద్యాల నుంచి బైరెడ్డి శబరి, గుంటూరు పశ్చిమానికి వల్లూరు జయప్రకాశ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఎచ్చెర్ల రమ్య దొనేపూడి, అరకు పాంగి రాజారావు, విశాఖపట్నం నార్త్ విష్ణుకుమార్ రాజు పేర్లు మూడింట్లో మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిసిసింది. పార్లమెంటు స్థానాల్లో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి రాజంపేట, సత్య కుమార్ హిందూపురం పార్లమెంటు, సీఎం రమేశ్ విశాఖపట్నం పార్లమెంటు, సుజనా చౌదరి విజయవాడ ఎంపీగా, అరకు నుంచి కొత్తపల్లి గీత పేర్లు వినిపించాయి. ఆదివారం నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల అభ్యర్థుల పేర్లు పరిశీలించి తుది జాబితా సిద్ధం చేసి పార్టీ అధిష్ఠానానికి పంపుతారు. కొన్ని నియోజకవర్గాలపై సంతృప్తి చెందని పార్టీ జాతీయ ప్రతినిధి శివప్రకాశ్... చేరికలపై దృష్టి సారించాలని నేతలకు సూచించారు. పారిశ్రామిక వేత్తల్ని, వ్యాపార వేత్తల్ని ఆకర్షించాలని, చివరిదశలో బలమైన అభ్యర్థులు చేరితే వారికి అవకాశం కల్పిద్దామని నిర్ణయించినట్లు తెలిసింది.

రిమాండుకు వెళ్లిన రెండ్రోజులకు.. అరెస్టుపై ప్రకటన?

- మాజీ మంత్రి ప్రత్తిపాటి కుమారుడి అరెస్టుపై పోలీసుల తీరిది

విజయవాడ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పన్ను ఎగవేత కేసులో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌కు రిమాండ్ విధించి రెండురోజులు కావస్తోంది. ఇప్పుడు పోలీసు శాఖ ఈ కేసుకు సంబంధించిన వివరాలతో శనివారం ప్రకటన విడుదల చేసింది. ఏపీఎస్‌డీఆర్ఐ డిప్యూటీ డైరెక్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో శరత్‌పై కేసు నమోదు చేశామని తెలిపింది. 'అవెక్సా కంపెనీ బ్యాంకు ఖాతాల నుంచి ఎల్లో స్టోన్ ఎస్టేట్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్లు ప్రత్తిపాటి స్వాతి, ప్రత్తిపాటి వెంకాయమ్మ, ప్రత్తిపాటి ఎస్టేట్స్ ప్రైవేటు లిమిటెడ్ అదనపు డైరెక్టర్లు ప్రత్తిపాటి స్వాతి, ప్రత్తిపాటి శరత్, ప్రత్తిపాటి వెంకాయమ్మకు ఒక్కొక్కరికి రూ.10 కోట్లపైగా లావాదేవీలు జరిగినట్లు డీజీజీఐ గుర్తించింది. ఈ అక్రమాల్లో కంపెనీ మాజీ డైరెక్టర్ క్రియాశీలకంగా వ్యవహరించినట్టు తేలడంతో ప్రత్తిపాటి శరత్‌ను అరెస్టు చేశాం' అని పోలీసులు తెలిపారు.

నీళ్లు అడిగితే చంపేస్తారా?: పవన్



అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాగునీళ్లు పట్టుకొనేందుకు కూడా పార్టీల లెక్కలు చూసే పరిస్థితి రావడం దురదృష్టకరమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం మల్లవరంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన బాణావత్ సామునిబాయిని ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన ఘటనపై ఆయన శనివారం స్పందిస్తూ... 'సంఘటన నన్ను కలచివేసింది. ట్యాంకర్ దగ్గరకు తాగు నీరు పట్టుకొనేందుకు వెళ్తే వైసీపీ వాళ్లు పట్టుకోరాదు అని అడ్డుపడటం, ఇంట్లో నీళ్లు లేవని ఆమె ప్రాథేయపడ్డా వినకుండా ట్రాక్టర్‌తో ఢీ కొట్టి చంపడం చూస్తే రాష్ట్రంలో ఎలాంటి దుర్మార్గపు పాలన నడుస్తుందో అందరూ అర్థం చేసుకోవాలి. వైసీపీ వాళ్లే నీళ్లు తాగాలి, గాలి పీల్చాలి అని జీవో ఇవ్వడం ఒక్కటే మిగిలి ఉంది. పంచ భూతాలకు పార్టీ రంగులు పులిమే దుర్మార్గం రాజ్యమేలుతోంది. మల్లవరం ఘటనపై పోలీసులు నిష్పాక్షికంగా అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగకుండా విచారణ చేయాలి. మూడేళ్ల కిందట ఇదే తరహాలో పల్నాడు జిల్లాలోని నకరికల్లు ప్రాంతంలో ఎస్టీ మహిళను వైసిపి నాయకుడు ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారు. ఎస్సీలను చంపి డోర్ డెలివరీ చేస్తూ, ఎస్టీ మహిళలను ట్రాక్టర్లతో తొక్కించేస్తూ హత్యాకాండ సాగించేవాళ్లను వెనకేసుకొచ్చే వ్యక్తికి 'నా ఎస్టీ, నా ఎస్సీ' అనే అర్హత ఉందా? అని పవన్ ప్రశ్నించారు.

10న మేదరమెట్లలో 'సిద్ధం' మహాసభ

- త్వరలోనే మేనిఫెస్టో విడుదల చేస్తాం: విజయసాయిరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 2: ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని మేదరమెట్ల జాతీయ రహదారి పక్కన ఈ నెల 10న నాల్గవ సిద్ధం మహాసభ జరుగుతుందని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి తెలిపారు. ఈ సభ అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందని చెప్పారు. ఒంగోలులో శనివారం ఆయన 'సిద్ధం' సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మేదరమెట్ల సభకు తిరుపతి, నెల్లూరు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలోని 43 నియోజకవర్గాల నుంచి 15 లక్షల మంది హాజరవుతున్నట్లు తెలిపారు. వంద ఎకరాల స్థలంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. త్వరలో మేనిఫెస్టోను విడుదల చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన వాటి కంటే భారీస్థాయిలో ప్రజలు హాజరయ్యేలా మేదరమెట్ల సభ నిర్వహిస్తామన్నారు.

మోదీని వ్యతిరేకిస్తే జగన్ జైలుకే

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



కర్నూలు న్యూసిటీ, మార్చి 2: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఏమాత్రం వ్యతిరేకించినా సీఎం జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. శనివారం కర్నూలులో జరిగిన ఉమ్మడి కర్నూలు జిల్లా సీపీఐ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ జగన్ 11 కేసుల్లో ముద్దాయిగా ఉంటూ ప్రస్తుతం బెయిలుపై ఉన్నాడన్నారు. జగన్ ఎక్కడ సమావేశాలు పెడితే అక్కడ చెట్లను నరికేస్తున్నాడన్నారు. సొంత చిన్నాన్నను చంపిన జగన్‌కు చెట్లు నరకడం పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, ఉద్యోగులు పోరాటాలు చేస్తే అరెస్టు చేసి జైల్లో పెట్టడం జగన్‌కే సాధ్యమైందన్నారు. జగన్ నిజమైన నాయకుడైతే బందోబస్తు లేకుండా జనాల్లోకి రావాలని సవాల్ విసిరారు.

5న తుది విచారణకు రండి

- వైసీపీని వీడిన ఎమ్మెల్సీలకు మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు నోటీసు

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీని వీడిన ఎమ్మెల్సీలు సి.రామచంద్రయ్య, వంశీకృష్ణకు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోసేన్‌రాజు నోటీసు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోరాదో తెలపాలని స్పష్టం చేశారు. ఈ నెల ఐదో తేదీన జరిపే తుది విచారణకు హాజరు కావాలని వీరిద్దరినీ కోరారు. ఇటీవల ఎనిమిది మంది తెలుగుదేశం, వైసీపీ ఎమ్మెల్యేలపై సభాపతి తమ్మినేని సీతారాం వేటు వేశారు. ఇప్పుడు ఎమ్మెల్సీలు ఇద్దరిపైనా అనర్హత వేటు వేయడం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య టీడీపీలోనూ .. వంశీకృష్ణ జనసేనలోనూ చేరిన విషయం తెలిసిందే.



ఫ్లోటింగ్ బ్రిడ్జిపై తూలి పడిపోతున్న లైఫ్‌గార్డు

మళ్లీ ఫ్లోటింగ్.. టింగ్!

›› మరోసారి కొట్టుకుపోయిన టి-జంక్షన్ వ్యూ పాయింట్

విశాఖపట్నం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన అలల వంతెన(ఫ్లోటింగ్ బ్రిడ్జి) వారం తిరక్కుండానే మరోసారి తెగిపోయింది. శనివారం ఉదయం 'టి-జంక్షన్ వ్యూ పాయింట్' బ్రిడ్జి నుంచి విడిపోయి దూరంగా కొట్టుకుపోయింది. దానిని పట్టుకోవాలని యత్నించిన లైఫ్‌గార్డ్ సముద్రంలో పడిపోయారు. వీఎంఆర్‌డీఏ అధికారులు, వైసీపీ నాయకులు ఫిబ్రవరి 25న దీనిని ప్రారంభించారు. ఆ మరుసటి రోజు నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అయితే దానికి ముందే 'టి' జంక్షన్ వ్యూ పాయింట్ అలల ఉధృతికి కొట్టుకుపోయింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయింది. అధికారులు దీనిని ఖండించారు. మాక్ డ్రిల్‌లో భాగంగా దానిని తామే దూరంగా తీసుకువెళ్లి లంగరు వేశామంటూ ఓ వీడియో విడుదల చేశారు. కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆరోపించారు. ఆ తర్వాత 24 గంటల్లో పర్యాటకులను అనుమతిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటివరకూ దానిని అందుబాటులోకి తేలేదు. ప్రాజెక్టును ఏర్పాటు చేసిన సంస్థ రోజూ దానితో తిప్పలు పడుతునే ఉంది. రెండు రోజుల క్రితం ముంబై నుంచి ఓ బృందాన్ని తీసుకువచ్చి తనిఖీ చేయించింది. అయినా ప్రయోజనం శూన్యం. ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఎలాగైనా ప్రారంభించాలని అధికారులు చాలా పట్టుదలగా ఉన్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

జగన్ సాక్ష్యం చెప్పకపోతే కేసుపెడతాం

›› కోడికత్తి శ్రీను న్యాయవాది అబుసలీమ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 2: కోడికత్తి శ్రీను కేసులో సీఎం జగన్ హైకోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పకపోతే ఆయనపై 228 ఐపీసీ కింద కేసు పెడతామని శ్రీను తరఫు న్యాయవాది అబుసలీమ్ హెచ్చరించారు. మాజీ ఎంపీ జీవీహర్షకుమార్‌ను శనివారం శ్రీను, ఆయన న్యాయవాది అబుసలీమ్, శ్రీను అన్న సుబ్బారావు కలిశారు. ఈ సందర్భంగా సలీమ్ మీడియాతో మాట్లాడుతూ శ్రీనును అన్యాయంగా జైలులో పెట్టారన్నారు. 9 సార్లు బెయిల్ పిటిషన్ వేస్తే పదోసారి బెయిల్ మంజూరు చేశారన్నారు. ఇప్పటికైనా ఈ కేసులో సాక్ష్యం చెప్పడానికి సీఎం జగన్ కోర్టుకు రావాలన్నారు. మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ మాట్లాడుతూ దళిత యువకుడిని జగన్ అన్యాయంగా జైలుపాలు చేశాడని అన్నారు. 2019 ఎన్నికల్లో కోడి కత్తి శ్రీను ఘటన, బాబాయి హత్య ఘటనలను సింపతీగా చూపించుకుని జగన్ అధికారంలోకి వచ్చాడన్నారు. శుక్రవారం వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె పెట్టిన ప్రెస్‌మీట్‌తో జగన్ నిజస్వరూపం బయట పడిందన్నారు.

తాకట్టులో సచివాలయం!

(మొదటి పేజీ తరువాయి)

అప్పుల కోసం వాడుకున్నారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2.86 లక్షల కోట్లు. కానీ, కేవలం రూ.370 కోట్ల కోసం నవ్యాంధ్ర ఆత్మ గౌరవ ప్రతీక, ప్రభుత్వ కార్యకలాపాలకు ప్రధాన వేదిక అయిన సచివాలయాన్ని తాకట్టు పెట్టడం జగన్ సర్కారు దా'రుణ' దాహానికి నిదర్శనం. సచివాలయంలో ఐదు బ్లాకులు (భవంతులు) ఉన్నాయి. శాసన సభ, శాసనమండలి భవనాలు విడిగా ఉన్నాయి. ప్రస్తుతం సచివాలయంలోని ఐదు బ్లాకులు తాకట్టు పెట్టినట్లు తెలుస్తోంది. అప్పు కోసం తొలుత ఐసీఐసీఐ బ్యాంకును ఆశ్రయించినట్లు సమాచారం. 'కుదరదు' అని ఐసీఐసీఐ తేల్చడంతో, హెచ్‌డీఎఫ్‌సీకి వెళ్లారు. 'ఊరికే కాగితాలు చూపిస్తే సరిపోదు. సచివాలయ భవనాలను తాకట్టు రిజిస్ట్రేషన్ చేసిస్తే... మొత్తం నిర్మాణ వ్యయంలో సగం అప్పుగా ఇస్తాం' అని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. దీంతో... గుట్టుచప్పుడు కాకుండా సచివాలయ భవనాలను హెచ్‌డీఎఫ్‌సీకి తాకట్టు రిజిస్ట్రేషన్ చేసి చ్చేశారు.

త్వరలో ఆ భవనాలూ...

జగన్ అధికారంలోకి రాగానే అమరావతిని అటకెక్కించిన సంగతి తెలిసిందే. చివరికి... 90 శాతం పూర్తయిన అఖిలభారత సర్వీసు అధికారులు, ఉద్యోగుల భవన సముదాయాలను కూడా గాలికి వదిలేశారు. కానీ... ఇటీవల ఆ భవనాల్లో అధికారాలు నివసిస్తున్నారని, సీఆర్డీయేకు రూ.70 కోట్లు అద్దె కూడా చెల్లించామంటూ జీవో విడుదల చేశారు. నిర్మాణం పూర్తికాని భవనాల్లో నివాసం ఉండటమేంటి... దానికి అద్దె చెల్లించడమేమిటనే అనుమానాలు అప్పట్లోనే తలెత్తాయి. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోతే తీసుకున్న అప్పు మొత్తం తిరిగి చెల్లించాలనే షరతుతో రుణం సేకరించి ఈ ప్రాజెక్టు మొదలుపెట్టారు. మొత్తం అప్పు కట్టలేక, అవి పూర్తయినట్లుగా తప్పుడు జీవోలు సృష్టించారని అప్పుడు భావించారు. కానీ, ఇప్పుడు అసలు విషయం బయట పడింది. ఈ భవనాలను కూడా తాకట్టు పెట్టి అప్పు తెచ్చేందుకే 'అద్దె' నాటకం ఆడినట్లు తెలుస్తోంది. సచివాలయ భవనాల తాకట్టు అనంతరమే... అధికారుల భవన సముదాయాలనూ తాకట్టు పెట్టి అప్పు తెచ్చే ప్రక్రియ మొదలైనట్లు సమాచారం.

'ఎడారి'లో నేడు కాసుల వేట!

చంద్రబాబు హయాంలో అమరావతి కోసం భూసమీకరణ జరిపారు. తర్వాత సచివాలయం, అసెంబ్లీ నిర్మించి 2017లో ప్రారంభించారు. 2019లో హైకోర్టు భవనం పూర్తి చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్ల నిర్మాణం 90 శాతం పూర్తయింది. మిగతా ఉద్యోగుల క్వార్టర్లు 75 శాతం పూర్తయ్యాయి. కొంత విఎనహా సీడ్ యాక్సెస్ రోడ్డు కూడా పూర్తయింది. శాశ్వత సచివాలయ భవనాలు, జడ్జీల క్వార్టర్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇంత జరిగినా... 'అమరావతిలో ఒక్క ఇటుక కూడా పడలేదు. అది ఎడారి, శ్మశానం' అని వైసీపీ పెద్దలు దుష్ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే... అమరావతిని అటకెక్కించి, అక్కడి భూములు, నిర్మాణాలతో అప్పులు తెచ్చుకునే పనిలో పడ్డారు. దొండపాడు, పిచ్చుకలపాలెం వద్ద భూములను ఎకరం రూ.4 కోట్ల చొప్పున విక్రయించాలని ప్రయత్నించారు. కానీ, అప్పటికే మూడు రాజధానుల వ్యవహారం బయటికి రావడంతో, స్థిరమైన విధానాలు లేని జగన్ సర్కారును ఎవరూ నమ్మలేదు. తర్వాత రాజధాని రైతులు కోర్టును ఆశ్రయించి భూముల విక్రయాన్ని అడ్డుకున్నారు. ప్రజల ఆస్తులు, సంపదను తాకట్టు పెట్టి అప్పులు తేవడం జగన్ సర్కారుకు కొత్తేమీ కాదు. రాష్ట్రంలో లిక్కర్ వ్యాపారాన్ని తాకట్టు పెట్టి రూ.48 వేల కోట్ల అప్పులు తెచ్చారు. వైజాగ్‌లో 13 ప్రభుత్వ ఆస్తులు, భవనాలు, భూములు, కాలేజీలు తాకట్టు పెట్టి ఏపీఎస్డీసీ ద్వారా రూ.25 వేల కోట్లు అప్పులు తెచ్చారు. రోడ్లు, భవనాల శాఖ ఆస్తులు తాకట్టు పెట్టి రూ.7000 కోట్లు తెచ్చుకున్నారు. చివరికి.. రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకుంటే తప్ప పూట గడవని దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారు.

జగన్‌కు విశాఖ గుర్తొచ్చింది!

(మొదటి పేజీ తరువాయి)

ఈనెల 5, 7 తేదీల్లో విశాఖలో పర్యటించనున్నారు. రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో 'వైజాగ్ విజన్... ఫ్యూచర్ విశాఖ' పేరుతో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. పారిశ్రామిక అభివృద్ధికి ఇప్పటిదాకా ఏం చేశారో, ఇకపై ఏం చేయనున్నారో జగన్ చెబుతారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, రియల్ ఎస్టేట్, టూరిజం, లాజిస్టిక్స్ రంగాలకు చెందిన వారందరినీ ఈ సమావేశానికి తీసుకురావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా పారిశ్రామికవేత్తలు వస్తారన్నారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత వివిధ రంగాల్లో ఉపాధి పొందిన యువతతో పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ సెంటర్‌లో సీఎం జగన్ ముచ్చటిస్తారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లను పర్యవేక్షించడానికి పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి శనివారం విశాఖపట్నం వచ్చారు.

7న విశాఖలో కేబినెట్ భేటీ?

విశాఖపట్నంలో ఈ నెల 7న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముచ్చటపడి సాగర తీరాన రుషికొండపై రూ.450 కోట్లతో నిర్మించుకున్న భవనంలోనే ఈ భేటీ నిర్వహిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ భవనాన్ని రెండు రోజుల క్రితం శారదా పీఠాధిపతితో పూజలు చేయించి పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. ఈ నెల 5న జగన్ విశాఖ విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో రుషికొండ బీచ్‌లో నిర్మించిన హెలిప్యాడ్ వద్ద దిగుతారు. ఆ క్రమంలోనే కొత్త 'ప్యాలెస్'ను పరిశీలిస్తారని తెలుస్తోంది. 7వ తేదీన మళ్లీ విశాఖకు వచ్చి... రుషికొండ ప్యాలెస్‌లో కేబినెట్ భేటీ ఏర్పాటు చేసే అవకాశమున్నట్లు సమాచారం.

టీడీపీ జెండా కట్టాడని..
కార్యకర్తను చితకబాదిన పోలీసులు



హనుమంతు ఇంటిపై ఏర్పాటు చేసిన టీడీపీ జెండా

గోరంట్ల, మార్చి 2: ఇంటిపై టీడీపీ జెండా కట్టుకున్నందుకు శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం జీనవాండ్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త హనుమంతును పోలీసులు చితకబాదారు. గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు హనుమంతు, లక్ష్మీపతి స్నేహితులు. లక్ష్మీపతి ఇటీవల వైసీపీలో చేరి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. మంత్రి ఉష శ్రీచరణ్ భర్త, వైసీపీ నాయకుడు చరణ్‌రెడ్డి శుక్రవారం జీనవాండ్లపల్లిలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో హనుమంతు ఇంటిపై టీడీపీ జెండా ఉండటంతో లక్ష్మీపతి అభ్యంతరం తెలిపాడు. ఆయన కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం రాత్రి పోలీసులు హనుమంతును స్టేషన్‌కు పిలిపించి చితకబాదారు. మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, పెనుకొండ ఇన్‌చార్జి సవితమ్మ.. పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్ చేయడంతో హనుమంతును వదిలేశారు. ఈ విషయంపై సీఐ సుబ్బరాయుడును వివరణ కోరగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినందున ఇరువర్గాల వారిని పిలిచి మందలించామే తప్ప.. కొట్టలేదని చెప్పారు.

ఐఐపీఈ క్యాంపస్‌కు శంకుస్థాపన

›› పట్నా నుంచి వర్చువల్‌గా నిర్వహించిన మోదీ

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి), సబ్బవరం, మార్చి 2: అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలిలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం పాట్నా నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. 201.8 ఎకరాల విస్తీర్ణంలో రూ.600 కోట్ల వ్యయంతో క్యాంపస్ నిర్మాణం చేపడుతున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ బాధ్యతను సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ (సీపీడబ్ల్యూడీ)కు అప్పగించినట్టు పేర్కొన్నారు. ఐఐపీఈలో అత్యాధునిక పరిశోధన ప్రయోగాలు కొనసాగుతాయన్నారు. వీటిల్లో సెంటర్ ఫర్ నెట్ జీరో, సెంటర్ ఫర్ హైడ్రోజన్, టెక్నాలజీ సెంటర్ ఫర్ హైడ్రోజన్ టెస్టింగ్ వాలిడేషన్, ఇంకా అకడమిక్, హాస్టల్ భవనాలు ఉంటాయన్నారు.



నాగాయలంక ఫీల్డ్ ఫేజ్-2 జాతికి అంకితం

ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం అసెట్‌లో భాగంగా ఉన్న కేజీ బేసిన్‌లోని నాగాయలంక ఫీల్డ్ ఫేజ్-2ను మోదీ బిహార్‌లోని బెగుసరాయి నుంచి వర్చువల్‌గా జాతికి అంకితం చేశారు. ఈ విషయాన్ని ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం అసెట్ ఈడీ శాంతన్‌దాస్ వెల్లడించారు. నాగాయలంకలో వేడుకలు నిర్వహించినట్టు తెలిపారు.

విహారయాత్రలో 'అల'జడి!

(మొదటి పేజీ తరువాయి)



సముద్రంలో గల్లంతైన పెద్దిరాజు, శేషారెడ్డి, మౌనిష్, ప్రభు | మృతి చెందిన విజయ్‌కుమార్

బృందాలు గాలిస్తున్నాయి. బాధితులంతా అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన వారే. పోలీసుల కథనం మేరకు... అనంతపురం జిల్లా యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్‌లో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు 26 మంది తొమ్మిది రోజుల విహార యాత్ర నిమిత్తం శుక్రవారం రాత్రి బయలుదేరారు. వీరు శనివారం ఉదయం మహాబలిపురం చేరుకున్నారు. అందరూ కలిసి బీచ్‌లో గ్రూప్ ఫొటో తీసుకున్నారు. అక్కడి పర్యాటక ప్రాంతాలను సందర్శించాక, కొందరు సముద్ర స్నానానికి వెళ్లారు. అలాగే చిత్తూరు జిల్లా పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం రాత్రి మహాబలిపురానికి విహారయాత్రకు వచ్చారు. శనివారం ఉదయం వీరు కూడా సముద్ర స్నానానికి వెళ్లారు. రెండు జిల్లాల విద్యార్థులు వేర్వేరుగా సముద్రంలోకి దిగారు. అదే సమయంలో భారీగా అలలు రావడంతో ఈతకు వెళ్లినవారిలో తొమ్మిది మంది విద్యార్థులు కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న జాలరులు వారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. నలుగురిని మాత్రమే కాపాడగలిగారు. ఆతర్వాత కొంతసేపటికి బంగారుపాళ్యం మండలం నలగాంపల్లె పంచాయతీ కేసీ కండ్రిగకు చెందిన విజయ్‌కుమార్(19) మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. యాడికి మండలం కుందనకోటకు చెందిన పెద్దిరాజు(21), పెద్దవడుగూరు మండలం అప్పేచర్లకు చెందిన శేషారెడ్డి(21), కేసీ కండ్రిగకు చెందిన మౌనిష్(19), సదుం మండలం పెడకంటివారిపల్లెకు చెందిన ప్రభు(18) గల్లంతయ్యారు. ఈ నలుగురి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

తల్లిదండ్రుల ఆందోళన

పిల్లలు గల్లంతైన సమాచారం తెలుసుకున్న పెద్దిరాజు తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు కళాశాల వద్దకు ప్రిన్సిపాల్, సిబ్బందితో తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు. కళాశాల ఆవరణలో కుర్చీలను ధ్వంసం చేశారు. పోలీసులు వారికి సర్దిచెప్పారు. తమ కాలేజీ విద్యార్థులు ఇద్దరు గల్లంతయ్యారని తెలియగానే మిగిలిన విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఎప్పటికప్పుడు ఘటన స్థలంలో ఉన్నవారికి ఫోన్లు చేసి సమాచారం తెలుసుకున్నారు.

సంక్షోభంలో ప్రజాస్వామ్యం!

›› ఎన్నికల అక్రమాల విశ్వవిద్యాలయంలా ఏపీ

›› వలంటీర్ల వినియోగంపై న్యాయపోరాటం చేస్తా

›› సీఎఫ్‌డీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్



కళాజాతా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎఫ్‌డీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్

విజయవాడ(ఆంధ్రజ్యోతి), గుంటూరు కార్పొరేషన్, మార్చి 2: ఎన్నికలకు వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా, వారిని పోలింగ్ ఏజెంట్లుగా వాడుకుంటామంటూ అధికార పార్టీ చేస్తున్న ధిక్కారంపై న్యాయపోరాటం చేస్తామని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ(సీఎఫ్‌డీ) ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తెలిపారు. 'ఓటు వేద్దాం - ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' పేరిట శనివారం విజయవాడ, గుంటూరుల్లో కళాజాతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ పార్టీకి, ప్రభుత్వానికి ఉన్న లక్ష్మణరేఖను ఈ ప్రభుత్వం ధ్వంసం చేసిందన్నారు. యంత్రాంగాన్ని ఉపయోగించుకుని ఓటర్ల జాబితాను లోపభూయిష్టంగా మార్చిందని ఆరోపించారు. వలంటీర్లను ఎన్నికల విధులకు ఉపయోగించుకుంటామని సీఎం దగ్గర నుంచి మంత్రుల వరకు చెప్పడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి భంగం కలిగించడమేనన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు రాష్ట్రం ఒక ప్రయోగశాలగా కాకుండా విశ్వవిద్యాలయంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 నుంచి 329 వరకు ఎన్నికల కమిషన్‌కు సంక్రమించిన విశేష అధికారాలతో వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించినా, ప్రభుత్వం మాత్రం అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడిందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి, సుపరిపాలనకు, ఉపాధి కల్పనకు తోడ్పడే నేతలను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎఫ్‌డీ సంయుక్త కార్యదర్శి వి.లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, ఎంసీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీ ప్రేక్షక పాత్ర..

ఎన్నికల కోడ్ రాకముందే రాజకీయ పార్టీల నేతలు ఓటర్లకు చీరలు, కుక్కర్లు, డబ్బులు పంచుతూ ఉంటే ఎన్నికల కమిషన్ ప్రేక్షక పాత్ర పోషిస్తోందని నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదికలు కూడా పంపడం లేదన్నారు. రాష్ట్ర సీఈఓ దీర్ఘ నిద్ర నుంచి మేల్కొని పనిచేయాలని సూచించారు.

టీడీపీలో చేరినందుకు పింఛను ఆపేశారు!



రామాంజనేయులు

విడపనకల్లు, మార్చి 2: కొడుకులు టీడీపీలో చేరినందుకు తండ్రి వృద్ధాప్య పింఛన్‌ను వైసీపీ నాయకులు నిలిపివేయించిన ఘటన అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం చీకలగురికిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దళితుడు రామాంజినేయులు కుమారులు తిరుమలేశ్, బాబు.. రెండు రోజుల కిందట పయ్యావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు.. రామాంజినేయులు పింఛన్‌ను నిలిపివేయాలని వలంటీరుకు సూచించారు. దీంతో రామాంజినేయులు పింఛను అడిగితే 'నీ కొడుకులు టీడీపీ కండువాలు వేసుకున్నారు కదా? వాళ్ల వద్దనే పింఛన్ తీసుకో.. నీ పింఛన్ తొలగించాం' అంటున్నారని వాపోయాడు. అధికారులు స్పందించి తనకు పింఛన్ ఇప్పించాలని కోరాడు.

తాడిపత్రిలో వైసీపీ కవ్వింపు చర్యలు

›› తాగునీటి పైప్‌లైన్ పనుల పరిశీలనకు వెళ్లిన జేసీ ప్రభాకర్ రెడ్డి

›› అరుపులు.. కేకలు వేస్తూ.. దూషిస్తూ వెంబడించిన వైసీపీ వర్గీయులు



పనులను పరిశీలిస్తున్న జేసీ ప్రభాకర్ చుట్టుముట్టిన వైసీపీ శ్రేణులు

తాడిపత్రి, మార్చి 2: అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని పెన్నానదిలో జరుగుతున్న తాగునీటి సరఫరా పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలించేందుకు వెళ్లిన మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని వైసీపీ వర్గీయులు దూషిస్తూ.. అడుగడుగునా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది. వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా పైప్‌లైన్ మరమ్మతు పనులను అధికారులు చేపట్టారు. ఆ పనులను పరిశీలించేందుకు మున్సిపల్ ఛైర్మన్, టీడీపీ కౌన్సిలర్లు, పలువురు కార్యకర్తలు శనివారం వెళ్లారు. వైసీపీ వర్గీయులు బాబా, తేజ తదితరులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అరుపులు, కేకలు వేస్తూ జేసీ ప్రభాకర్ రెడ్డిని వెంబడించారు. 'ఇక్కడికెందుకు వస్తున్నారు..? ఇక్కడ మీకేం పని?' అని జేసీ ప్రభాకర్ రెడ్డిని ప్రశ్నించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు వారికి సమాధానం చెప్పేందుకు ప్రయత్నించగా.. సంయమనం పాటించాలని ప్రభాకర్ రెడ్డి సూచించడంతో మౌనం వహించారు. పోలీసులు అక్కడికి వచ్చి వైసీపీ శ్రేణులను అదుపుచేశారు.

ఈయనేం 'నాయకుడు?'

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు, డిమాండ్ల సంగతి పక్కనపెట్టి... శ్రుతిమించిన స్వామిభక్తి ప్రదర్శిస్తున్నారు. ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ... తాను ఒక ప్రభుత్వ ఉద్యోగిననే విషయం మరిచి పక్కా వైసీపీ కార్యకర్తలా మారిపోయారు. అంతేకాదు... గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులూ అలాగే మారిపోవాలని నూరిపోస్తున్నారు. 'జగన్ ఓడిపోతే గ్రామ సచివాలయ ఉద్యోగులు ఓడిపోయినట్లే' అంటూ వింత భాష్యం చెప్పారు. పైగా... ఇంటింటికీ వెళ్లి ప్రచారం కూడా చేయాలట! డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎంపీడీవో ఆఫీసు వద్ద శనివారం వార్డు సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. 'వచ్చే ఎన్నికల్లో జగన్ ఓడిపోతే మనం ఓడిపోయినట్లే. ప్రతి సచివాలయ ఉద్యోగి వార్డు, గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి జగన్‌ను గెలిపించేలా ఎన్నికల ప్రచారం చేపట్టాలి. సచివాలయాల ద్వారా ప్రజలకు మంచి జరిగిందా లేదా అనేది రేపు జరిగే ఎన్నికల్లో నిరూపించేలా పని చేయాలి. జగన్‌కు నష్టం జరిగితే మనం ప్రజలకు మంచి సేవలు ఇవ్వనట్లే అవుతుంది" అని వెంకట్రామి రెడ్డి అన్నారు. అంతేకాదు... అచ్చం తన 'వైసీపీ బాస్'లాగా మీడియాపైనా విమర్శలు గుప్పించారు. "ఈనెల 10 నుంచి 'మన ప్రభుత్వం-మన ప్రజలు' పేరుతో ర్యాలీలు చేయండి. ఇంటింటికీ తిరిగి జగన్ విజయం కోసం ప్రచారం చేయండి. ప్రభుత్వం ప్రతి సచివాలయానికి 'సాక్షి' పత్రిక పంపిస్తోంది. వాటిలో మంచి విషయాలను ప్రజలకు తెలియచేయండి" అని పిలుపునిచ్చారు. ఇప్పటిదాకా వలంటీర్లను మాత్రమే 'సొంత కార్యకర్తల్లా' వాడుకుంటుండగా... తాజాగా ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన, సర్వీసు నిబంధనలు వర్తించే వార్డు సచివాలయ ఉద్యోగులనూ వైసీపీ కార్యకర్తలుగా మార్చే ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం!

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

తాయి'లాలిస్తూ'..!

● ఎన్నికల వేళ వైసీపీ సెంట్రల్ ఇన్‌చార్జి వెలంపల్లి కొత్త ఎత్తులు ● ఓట్ల కోసం అక్రమ నిర్మాణానికి అనుమతి

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 2: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎలాగైన ఓట్లు రాబట్టుకునేందుకు వైసీపీ సెంట్రల్ ఇన్‌చార్జ్ వెలంపల్లి కొత్త ఎత్తులు వేస్తున్నారు. కులాలు, మతాల వారీగా ఓటర్లను విడగొట్టి తాయిలాలిస్తూ ఓటర్లను ప్రలోభ పెడుతున్నాడు. అడిగిందే తడవుగా చేతిలో రూపాయి ఖర్చు కాకుండా ప్రభుత్వ స్థలాలు ప్రార్థనా మందిరాలు, కుల సంఘాలకు ధారాదత్తం చేస్తున్నాడు. ఇలాంటి సంఘటనే అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో మరొకటి వెలుగు చూసింది. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో పైపుల రోడ్డు సెంటర్ నుంచి నందమూరినగర్ వరకు బుడమేరు కరకట్ట విస్తరించి ఉంది. ఇప్పటికే కరకట్ట ఆలయాలు, మసీదులు, చర్చిలు, దర్గాల ఆక్రమణలతో నిండిపోయింది. ఇప్పుడు వెలంపల్లి పుణ్యమాని మరో అక్రమ నిర్మాణం జరుగుతోంది. కరకట్టపై ఇప్పటికే ఓ ఆలయం ఆక్రమణలో ఉన్న స్థలంలో భారీ నిర్మాణాలు ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్నారు.



కరకట్టపై ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణం

సుమారు 300 గజాల స్థలంలో బహిరంగంగానే నిర్మాణం జరుగుతున్నా అధికారులెవరూ అటు వైపు వెళ్లడం లేదు. కేవలం ఓట్ల కోసం వెలంపల్లి అనధికారిక నిర్మాణాలకు పచ్చజెండా ఊపేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా నిర్మాణాలు చేసుకుంటూ పోతే ప్రభుత్వాదాయానికి గండిపడటమే కాక భవిష్యత్తులో ప్రభుత్వ స్థలాలు కనుమరుగయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దుర్గగుడి సెల్ ఫోన్ కౌంటర్ సిబ్బందిపై.. పరుష పదాలతో ఏఎస్ఐ దౌర్జన్యం

వన్‌టౌన్, మార్చి 2: దుర్గగుడి మహామండపం దిగువన క్యూల వద్ద ఉన్న సెల్‌ఫోన్ సిబ్బంది కౌంటర్‌పై వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ శారద పరుష పదాలతో విరుచుకుపడ్డారు. ఆమె శనివారం కొంతమందిని అమ్మవారి దర్శనానికి తన వెంట బెట్టుకుని మహామండపం లిఫ్ట్‌ల వైపునకు బయలుదేరింది. క్యూ మొదట్లో ఉన్న సెల్‌ఫోన్ కౌంటర్ సిబ్బంది వారిని నిలిపేసి ఒక సెల్‌ఫోన్‌ను తీసుకు పోవచ్చునని మిగతా సెల్‌ఫోన్‌లను కౌంటర్‌లో భద్రపరచాలని సూచించారు. దీంతో ఆమె తానెవరినో తెలుసా అంటూ సిబ్బందితో గొడవ పడి పరుషపదాలతో దూషించింది. అక్కడున్న భక్తులు ఆమె మాటలకు అవాక్కయ్యారు. సెల్‌ఫోన్‌లు ఆలయంలోకి తీసుకువెళ్లడానికి వీల్లేదని సిబ్బంది ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఇదే సమయం లో మరో ముగ్గురు భక్తులను కూడా వారి సెల్‌ఫోన్లను కౌంటర్‌లో పెట్టాలని సిబ్బంది కోరారు. వారు కూడా సెల్‌ఫోన్లును పెట్టేందుకు నిరాకరించడంతో మాటామాటా పెరిగింది. దుర్భాషలాడారు. వారెవరన్న సమాచారాన్ని ఇవ్వకుండా విరుచుకుపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా సెల్‌ఫోనను ఆలయంలోకి తీసుకువెళతామన్నారు. సెక్యూరిటీ గార్డు, అక్కడున్న వారెవరూ చెప్పినా వినిపించుకోలేదు. చివరికి వారినుద్దేశించి సారీ, ఇక వెళ్లండని సిబ్బంది అన్నారు. అయితే సారీ కాదు కాళ్లు పట్టుకోవాలని హుకుం జారీ చేయడంతో సిబ్బంది ఇక గొడవెందుకులే అనుకుంటూ వంగి కాళ్లను పట్టుకోవడంతో గొడవకు తెరపడింది.



సెల్‌ఫోన్ కౌంటర్ సిబ్బందిపై గొడవ పడుతున్న వన్‌టౌన్ మహిళా ఏఎస్ఐ (సర్కిల్‌లో)

ఖతార్‌లో ఎన్నికల శంఖారావం సభ

● ఘనంగా నిర్వహించిన టీడీపీ-జనసేన నాయకులు ● నినదించిన శ్రేణులు

వన్‌టౌన్, మార్చి 2: ఖతార్‌లో ఎన్ఆర్ఐ టీడీపీ-జనసేన నేతల ఆధ్వర్యంలో ఎన్నికల శంఖారావం సభను స్థానిక నేతలు, అభిమానులు కలిసి ఘనంగా నిర్వహించారు. మా తెలుగుతల్లికి మల్లెపువ్వు దండ గేయంతో ప్రారంభించగా, టీడీపీ-జనసేన జెండాలతో ప్రాంగణంలోని జనం జిందాబాద్‌లు కొట్టారు. టీడీపీ-జనసేన గెలవాలంటూ నినాదాలు చేశారు. ఖతార్‌లోని టీడీపీ అధ్యక్షుడు గొట్టిపాటి రమణయ్య మాట్లాడుతూ ఖతార్ తెలుగుదేశం విభాగం అందించిన సేవలను గుర్తు చేశారు. సహకరించిన వారందరికీ అభినందనలు తెలిపారు. తెలుగుదేశం-జనసేన అభ్యర్థులను గెలిపించుకునేందుకు శ్రమించాలన్నారు. జనసేన కన్వీనర్ జీకే దొర మాట్లాడుతూ పొత్తులు, సీట్లు నేతలు నిర్ణయిస్తారన్నారు. పవన్‌కల్యాణ్ అడుగుజాడల్లో నడిచి పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఆర్ఐ టీడీపీ ఉపాధ్యక్షుడు మద్దిపోటి నరేష్, జీసీసీ కౌన్సిల్ మెంబర్ మల్లిరెడ్డి సత్యనారాయణ, సీనియర్ లీడర్ శాంతయ్య, యలమంచిలి ఆంజనేయులు, జనసేన కన్వీనర్ మెడిది సత్యం, సీనియర్ మెంబర్ లోనిశెట్టి వీరబాబు, నందిగామ సుధాకర్, మల్లిఖార్జున, గౌతమ్, అనిల్, నగేష్, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రధాన కార్యదర్శి పొనుగుమాటి రవి, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌లు దాసరి రమేష్, రవీంద్ర, రజని, నాయుడు, రమణకుమార్, సాయి, మోహన్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సత్తా చాటడానికి ఎన్ఆర్ఐలు సిద్ధంగా ఉండాలన్నారు. యలమంచిలి శాంతయ్య, రవి, సాయి, మోహన్, రమేష్, రవీంద్ర, రజని, కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.



ఖతార్‌లో టీడీపీ-జనసేన ఎన్నికల శంఖారావం సభలో పాల్గొన్న పార్టీ అభిమానులు, నేతలు



దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

ధర్నాచౌక్, మార్చి 2: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు, వృద్ధులు, ఇతర సామాజిక పెన్షన్లు రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు వీరికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఐదేళ్లుగా నిబంధనల సాకుతో తొలగించిన సుమారు 95వేల మంది పెన్షన్లను పునరుద్ధరించాలన్నారు. వైఎస్సార్ కాలనీలో దివ్యాంగులకు 5శాతం గృహాలు కేటాయించాలని, ఆరు సిలిండర్లు ఉచితంగా అందించాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ కో-ఛైర్మన్ అందె రాంబాబు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుజాత నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య, ఉపాధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు.

మితిమీరుతున్న సీఎం జగన్‌రెడ్డి అరాచకాలు: సుచిత్ర

విద్యాధరపురం: ఎన్నికలు సమీపించే కొద్దీ జగన్‌రెడ్డి అరాచకాలు మితిమీరుతున్నాయని టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాచర్లలో మంచినీరడిగిన మహిళను వైసీపీ గుండాలు ట్రాక్టర్‌తో గుద్ది చంపడం రాక్షసపాలనకు పరాకాష్ట అన్నారు. రాష్ట్రంలో బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తోందా లేక రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందా అని ప్రశ్నించారు. ఏలూరులో వైసీపీ గుండాలు కబ్జాలకు బరితెగించారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వైసీపీ గుండాలు కలిసి పేదల ఇళ్లను, ఇళ్ల స్థలాలను కబ్జా చేయాలని చూస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి జగన్‌రెడ్డి లాంటి రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి జగన్‌రెడ్డికి వైసీపీ నేతలకు గోరి కట్టడానికి మహిళలు సిద్ధంగా ఉన్నారన్నారు.

చదువులు ఆగిపోతాయని బెదిరిస్తున్న జగన్: కోగంటి

విద్యాధరపురం: రానున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపించుకోకపోతే విద్యార్థుల చదువులు ఆగిపోతాయని, పథకాలు నిలిచిపోతాయని జగన్‌రెడ్డి బెదిరిస్తున్నాడని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోగంటి రామారావు అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఎదుట రాజకీయ ప్రసంగాలు చేస్తూ జగన్‌రెడ్డి నీచ రాజకీయానికి ఒడిగట్టాడన్నారు. సంక్షేమ పథకాలు ఎన్టీఆర్ హయాం నుంచి ఉన్నాయని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చంద్రబాబు రెండింతలు చేశారని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి సీఎం అయ్యాక విద్యావ్యవస్థ భ్రష్టు పట్టిందని విమర్శించారు. ఏపీని గంజాయికి అడ్డగా మార్చారన్నారు. జగన్‌రెడ్డి మోసపూరిత విధానాలకు విద్యార్థులు, తల్లితండ్రులు బలవుతున్నారన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని మాయ మాటలు చెప్పినా ప్రజలు వినే పరిస్థితిలో లేరని తెలిపారు.

రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడికి సత్కారం

ధర్నాచౌక్: రాష్ట్రంలో బీసీలకు సీఎం జగన్ సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సముచిత కల్పిస్తున్నారని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. గాంధీనగర్‌లోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో బీసీ కులాల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ బీసీ కమిషన్ సభ్యుడిగా నియమించబడిన డాక్టర్ ఎస్.మారేష్‌ను ఘనంగా సత్కరించారు. ఎంపీ కేశినేని నాని, మేయర్ భాగ్యలక్ష్మి, వేముల బేబిరాణి, పలువురు బీసీ సంఘాల నేతలు పాల్గొని ఆయన్ను అభినందించారు.

జేబీఎన్‌పీ కార్యదర్శిగా రవికిరణ్

విజయవాడ: జై భారత్ నేషనల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.రవికిరణ్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆయన రాష్ట్ర సమన్వయకర్తగా ఉన్నారు. ఆయన్ను కార్యదర్శిగా నియమించినట్టు పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ వెల్లడించారు.

ప్రపంచ సదస్సులో శ్రీనివాసరావు ప్రసంగం

పాయకాపురం: బెంగళూరులోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ కార్యాలయంలో శనివారం జరిగిన ఇన్వోక్ ఈడీ 3.0 ప్రపంచ సదస్సులో ఏపీ ఎస్సీడీ బి.శ్రీనివాసరావు ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపడుతున్న విద్యా సంస్కరణలు, దీక్ష, విద్యా అమృత్ మహోత్సవ్, ఎఫ్ఎల్ఎన్, టీచ్ టూల్‌తో పాటు విద్యాశాఖ నిర్వాహణలో ఎదురవుతున్న సవాళ్లపై సమగ్ర శిక్షా రాష్ట్ర పథ సంచాలకుడు బి.శ్రీనివాసరావు వివరించారు. రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తూ అమృత్ మహోత్సవ్‌లో భాగంగా లక్ష ప్రాజెక్ట్‌లు సమర్పించి రాష్ట్రాన్ని ప్రథమస్థానంలో నిలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీ దీక్షా కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.మహ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలి

● క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు

మొగల్రాజపురం: సమాజంలో ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలని అప్పుడే సమాజం బావుంటుందని క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రమణారావు అన్నారు. క్రెడాయ్ నేషనల్ సిల్వర్ జూబ్లీని పురస్కరించుకుని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (కార్పొరేట్ కంపెనీల సామాజిక బాధ్యత)లో భాగంగా క్రెడాయ్ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో మొగల్రాజపురం బీఎస్ఆర్‌కే పాఠశాలలో 30 క్లాస్ రూమ్‌లలో ఉపాధ్యాయులకు 30 కుర్చీలు, ఎలక్ట్రిక్ బెల్, చలసాని వెంకటరత్నం వీఎంసీ పాఠశాలలో 60 మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, కాపీ రైటింగ్ పుస్తకాలు, చాక్‌లెట్‌లు, బిస్కట్‌లు, ఎలక్ట్రిక్ బెల్ బహూకరించారు. విజయవాడ చాప్టర్ అధ్యక్షుడు డి.రాంబాబు, ఉపాధ్యక్షుడు సీహెచ్ సతీష్‌బాబు, క్రెడాయ్ కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, వియ్యపు అమర్, అమ్మ మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటోలో మహిళ మృతి

● మరో ముగ్గురికి గాయాలు

నగరంలోని రెండు వేర్వేరు చోట్ల ఆర్టీసీ బస్సుల కారణంగా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు గాయపడి ఆసుపత్రుల పాలయ్యారు.

విద్యాధరపురం, మార్చి 2: గొల్లపూడి ఆంధ్ర హాస్పిటల్ వద్ద జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ఢీకొనడంతో ఒక మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మృతురాలి భర్త గడ్డం జనార్థనరావు ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. చందర్లపాడు మండలం కొనాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం జనార్థనరావు భార్య మల్లేశ్వరి (40) ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శనివారం ఉదయం 5.30 గంటలకు మల్లేశ్వరి మరికొందరు కలిసి ఆటోలో నగరంలోని పటమట పంటకాలువ రోడ్డులోని ప్రార్థనా మందిరానికి వెళ్లారు. ప్రార్థనల అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు తిరిగి ఆటోలో కొనాయపాలెం బయలుదేరారు. గొల్లపూడి ఆంధ్ర హాస్పిటల్ వద్దకు వచ్చేసరికి విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడుపుతూ మల్లేశ్వరి మరికొందరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ పక్కన కూర్చున్న మల్లేశ్వరికి తీవ్రగాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు పక్కనే ఉన్న ఆంధ్ర హాస్పిటల్‌కు బాధితులను తీసుకుని వెళ్లగా వైద్యులు వారిని పరీక్షించి మల్లేశ్వరి చనిపోయినట్టు నిర్ధారించారు. గాయాలపాలైన ముగ్గురు బాధితులు చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మల్లేశ్వరి భర్త, పిల్లలు, బంధువులు హాస్పిటల్‌కు చేరుకున్నారు.



బస్సు ఢీకొనడంతో ధ్వంసమైన ఆటో

మరో ఘటనలో వ్యక్తి మృతి

గొల్లపూడి పైపుల కంపెనీ వద్ద జాతీయ రహదారి దాటుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో చనిపోయినట్టు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గొల్లపూడి పైపుల కంపెనీ వద్ద ఎలకల గురునాయుడు (58) భార్యతో కలిసి ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం గురునాయుడు తానుంటున్న ఇంటి ఎదురుగా జాతీయ రహదారి దాటి పనిమీద వెళ్లాడు. అనంతరం తిరిగి రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి ఇబ్రహీంపట్నం వైపునకు వేగంగా వెళుతున్న ఆర్టీసీ బస్సు గురునాయుడిని ఢీకొంది. ఈ సంఘటనలో గురునాయుడికి తీవ్ర గాయాలవగా స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వెళ్లారు. వైద్యులు పరీక్షించి గురునాయుడు మరణించినట్టు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కుమారుడు చంటి, బంధువులు ఆసుపత్రి వద్దకు వెళ్లారు. మృతుడు కుమారుడి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

జగనన్న కాలనీ వద్ద ఉద్రిక్తత

● డైరీఫాం పేరుతో దేవన్న చెరువు పంట కాల్వలో భారీగా పైపుల ఏర్పాటు
● ఆ వ్యక్తికి వైసీపీలోని ఒక వర్గం వత్తాసు, మరో వర్గం అడ్డు
● రెవెన్యూ శాఖతో చర్చించి పరిష్కరించుకోవాలని పోలీసుల సూచన

పెనమలూరు, మార్చి 2: పెనమలూరు జగనన్న కాలనీ వద్ద అవనిగడ్డకు చెందిన ఓ వ్యక్తి దేవన్నచెరువు పంట కాల్వలో భారీగా పైపులను వేసి డైరీఫాం ఏర్పాటుకు ప్రయత్నిస్తుండం, గ్రామ వైసీపీలోని ఒక వర్గం అతడికి వత్తాసు పలుకుతుండగా రెండోవర్గం అడ్డుకోవడంతో కాలనీ వద్ద శనివారం సాయంత్రం కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగప్రవేశం చేసి రెవెన్యూ స్థలంలో కుదరదని, అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పడంతో వివాదం చల్లారింది.

వివాదం నేపథ్యమిదీ..!

అవనిగడ్డ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి గ్రామ జగనన్న కాలనీలో 3 నుంచి 4 ప్లాట్లను అనధికారికంగా కొనుగోలు చేసి డైరీ ఫాం నిర్మించే పేరుతో సమీపంలోని దేవన్న చెరువు పంట కాల్వలో పైపులు వేశాడు. దీంతో గ్రామంలోని కొంతమంది రైతులు వర్షాకాలం చెరువు పొంగినప్పుడు మురుగు కాల్వ నుంచి పంటకాల్వలోకి నీరు చేరుతుందని, తూముల ఏర్పాటుతో నీరు ప్రవహించక చేలలోకి నీళ్లు చేరతాయని దాంతో తీవ్ర ఇబ్బందులు పడతామని అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే గ్రామ వైసీపీలోని ఒక వర్గం ఆ వ్యక్తికి సపోర్టు చేస్తూ రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తోందని వైసీపీలోని రెండో వర్గం భీష్మించింది. ఇరువర్గాలు కాలనీ వద్ద ఏర్పాటు చేసిన పైపుల వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకొన్న పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలతో మాట్లాడి స్థలంలో పైపుల ఏర్పాటుపై అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

దుర్గమ్మ సన్నిధిలో మాడుగుల నాగఫణిశర్మ

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను ప్రముఖ అవధాని మాడుగుల నాగఫణిశర్మ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ మర్యాదలను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం ఈవో రామారావు ప్రసాదం, శేషవస్త్రం అందించగా. పండితులు ఆశీస్సులు అందజేశారు.



కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మ దర్శనానికి వచ్చిన నాగఫణిశర్మ

సమస్యల పరిష్కారానికి బ్యాంకు ఉద్యోగుల ధర్నా

ధర్నాచౌక్, మార్చి 2: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో బ్యాంక్ ఉద్యోగులు భాగస్వాములు కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. బ్యాంకింగ్ రంగంలోని అన్ని క్యాడర్లలో తక్షణమే నియామకాలు చేపట్టాలని కోరుతూ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫి) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో శనివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ టెంపరరీ క్యాజువల్ ఉద్యోగులను తక్షణమే పర్మినెంట్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ నిలుపుదల చేయాలని, బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించాలని డిమాండ్ చేశారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ బ్యాంకులపై స్పాన్సర్డ్ బ్యాంకు పెత్తనం తొలగించాలని డిమాండ్ చేశారు. బెఫి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సి.వేణుగోపాల్, ఎఆర్ అజయ్‌కుమార్ అధికసంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు

భృంగి వాహనంపై మల్లన్న విహారం



భృంగి వాహనంపై విహరిస్తున్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, మార్చి 2: శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు భ్రమరాంబ మల్లికార్జునస్వామి, అమ్మవార్లు భృంగి వాహనంపై విహరించారు. శ్రీశైలంలోని ఉభయ దేవాలయాల్లో స్వామి, అమ్మవార్లకు ఉదయం నుంచి ప్రత్యేక పూజాక్రతువులను నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు భృంగి వాహనంపై క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీగిరికి భక్తులు వేలాదిగా సంఖ్యలో తరలివస్తున్నారు. నల్లమల అటవీమార్గం మీదుగా కాలినడకన వచ్చే భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి శివస్వాములు తరలిరావడంతో శ్రీశైల క్షేత్రంలోని ప్రధాన వీధులన్నీ రద్దీగా దర్శనమిస్తున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజైన ఆదివారం స్వామిఅమ్మవార్లు హంసవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. ఆదివారం విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం తరపున స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పిస్తారు.

మమతా బెనర్జీ తక్షణమే రాజీనామా చేయాలి

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని



ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు, శ్రేణులు

ధర్నాచౌక్, మార్చి 2: పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ నేతలు చేస్తున్న దమనకాండకు మమతా బెనర్జీ బాధ్యత వహిస్తూ సీఎం పదవికి తక్షణమే రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. పార్టీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో శనివారం మహాధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాక గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్ర మైనార్టీ మోర్చ అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ అత్యాచారాలు, భూకబ్జాలు, గృహదహనాలకు కేరాఫ్ అడ్రస్‌గా తృణమూల్ కాంగ్రెస్ మారిందని ధ్వజమెత్తారు. జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మమతా బెనర్జీని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నేతలు ఉప్పలపాటి శ్రీనివాసరాజు, మువ్వల సుబ్బయ్య, బొడ్డు నాగలక్ష్మీ, ఆర్ముగం పాల్గొన్నారు.

విశ్రాంతి గృహాల్లో బొద్దింకలున్నాయి..!

» వసతులు సరిగాలేవు..
టీటీడీ ఈవోకు భక్తుల ఫిర్యాదు

తిరుమల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని సప్తగిరి విశ్రాంతి గృహాలు, ఏఎన్సీ, జీఎన్సీ వసతి గదుల్లో గీజర్లు పనిచేయడం లేదని, పాంచజన్యంలో బొద్దింకలు అధికంగా ఉండడంతో పాటు వసతులు కూడా సక్రమంగా లేవంటూ పలువురు భక్తులు ఈవో ధర్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. తిరుమలలో శనివారం ఉదయం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమం ద్వారా భక్తులు ఫిర్యాదు చేయగా ఈవో స్పందిస్తూ.. దాదాపు 50 ఏళ్ల క్రితం నిర్మించిన సప్తగిరి విశ్రాంతి గృహాలను ఆధునికీకరిస్తామన్నారు. కొత్త గీజర్లు పెట్టిన అన్ని గదుల్లో వెంటనే కనెక్షన్ ఇస్తామన్నారు. పాంచజన్యంలో బొద్దింకల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడారు. వేసవి సెలవుల్లో తిరుమలకు వచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు భక్తుల రద్దీ అధికంగా ఉండే క్రమంలో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వీఐపీ బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300 దర్శన టికెట్లను తగ్గించామన్నారు.

ఇగ్నోతో అందరికీ చేరువగా విద్య

వన్‌టౌన్, మార్చి 2: ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ద్వారా ఎందరికో విద్య చేరువవుతోందని ఇగ్నో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు అన్నారు. రాజధాని ప్రాంతంలోని రాయపూడి ప్రాంతంలో నిర్మితమవుతున్న ఇగ్నో భవనాల పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీలైనంత త్వరగా నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన చేసేందుకు కృషి చేయాలన్నారు. బాపట్ల, పల్నాడు, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో నూతన అధ్యాయన కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రాంతీయ కేంద్రం పరిధిలో మరి కొన్ని కొత్త కోర్సులను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడంతో పాటు దూర విద్య, ఆన్‌లైన్ కోర్సులనూ అందిస్తున్నట్టు తెలిపారు. ప్రాంతీయ డైరెక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ, డాక్టర్ సుమలత, ప్రసాద్‌బాబు, బాలచందర్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

గాల్లో దీపంలా ప్రజారోగ్యం

- తాగునీరు సరఫరా చేయలేని దుస్థితిలో రాష్ట్రం
- సర్కార్ నిర్లక్ష్యంతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు
- సీఎం జగన్‌కు బహిరంగ లేఖలో అచ్చెన్న

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ పంచాయతీ నిధులు దారి మళ్లించడం, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, తాగునీటి పథకాలను సక్రమంగా నిర్వహించకపోవడం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను అర్థాంతరంగా నిలిపేయడం వంటి చర్యలతో ప్రజల ఆరోగ్య పరిస్థితి గాల్లో దీపంలా మారిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్‌కు శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. 'ప్రజలకు తాగునీరు సరఫరా చేయలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటు. లక్షలాది మంది ఆసుపత్రులపాలవుతున్నా.. ఏమీ పట్టనట్లు అధికార యంత్రాంగం వ్యవహరించడం ప్రభుత్వ వైఫల్యం కాదా? నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో సురక్షిత నీరు అందక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న విషయం జగన్‌కు తెలుసా? కలుషిత నీటి సరఫరాతో గుంటూరులో డయేరియా బారిన పడి నలుగురు మృతి చెందారు. వందల మంది ఆసుపత్రుల పాలయ్యారు. అవే కలుషిత జలాల కారణంగా కలరా మహమ్మారి గుంటూరును వణికిస్తోంది. ముగ్గురికి కలరా సోకింది. ఇంతటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తితే చర్యలు తీసుకోవాల్సిన మంత్రి విడదల రజని అసలు విషయం బయటకు రాకుండా తొక్కిపెట్టడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమే. రాజకీయ లబ్ధి కోసం విపక్షాలపై విమర్శలు చేయడం మానేసి ప్రజల ప్రాణాలను కాపాడటంపై దృష్టి పెట్టాలి. డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలి. శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలిజ అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలి' అని అచ్చెన్న కోరారు.

5న టీడీపీ బీసీ డిక్లరేషన్

- ఏఎన్‌యూ సమీపంలో భారీ సభ: కొల్లు

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న బలహీనవర్గాల ప్రజల సమక్షంలో టీడీపీ అధినేత చంద్రబాబు బీసీ డిక్లరేషన్ ప్రకటించనున్నట్లు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జగన్ దుర్మార్గపు పాలనలో దారుణంగా దెబ్బతిన్న బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా తిరిగి ఉన్నతస్థానాల్లో నిలపాలన్నదే చంద్రబాబు ఆలోచన అన్నారు. ఈ నెల 5న మంగళగిరి సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో నిర్వహించే బీసీ మహా సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు డిక్లరేషన్ ప్రకటిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో బీసీలు హాజరై ఈ మహాసభను విజయవంతం చేయాలి. బీసీల నినాదాలతో తాడేపల్లి క్యాంపస్ కంపించి పోవాలి. అలాగే పార్టీ తరపున ఎస్సీ డిక్లరేషన్, ఎస్టీ డిక్లరేషన్ ఉంటుంది' అని కొల్లు తెలిపారు.

కౌలు రైతులకు కార్డులివ్వాలి

ఏపీ కౌలు రైతు సంఘం

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం ప్రతినిధులు టీడీపీ జాతీయ కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు. శనివారం కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, కృష్ణా జిల్లా కార్యదర్శి పి రంగారావు తదితరులు టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రిని కలిసి మెమోరాండం అందజేశారు. వచ్చే టీడీపీ ప్రభుత్వంలో కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, భూమిలేని ఓసీ కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీసీఆర్ కార్డుతో సంబంధం లేకుండా సాగు చేస్తున్న వారందరికీ ఈ-క్రాపింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ వికృత క్రీడకు బలైన చెల్లెళ్లు: గాయత్రి

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విచక్షణ, విలువల్లేని జగన్ వికృత క్రీడకు సొంత చెల్లి, బాబాయ్ కూతురు బలి అయ్యారని టీడీపీ మహిళా నేత సందిరెడ్డి గాయత్రి అన్నారు. శనివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాటాడారు. 'చేతిలో ఉన్న లక్ష మంది పేటీఎం సైన్యంతో తరతమ బేధం లేకుండా నీతిమాలిన ప్రచారం చేయిస్తున్నారు. తన తండ్రి హత్య కేసుపై మాట్లాడారన్న అక్కసుతో జగన్ అధీనంలోని వైసీపీ పేటీఎం బ్యాచ్ సునీతపై దారుణమైన విష ప్రచారానికి తెగబడింది. సొంత చెల్లెళ్లను అసభ్య పదజాలంతో అనరాని మాటలను అనిపిస్తూ జగన్ తన సైకోయిజాన్ని సంతృప్తిపరుచుకుంటున్నారు. జగన్‌ను నమ్మి దుష్ప్రచారానికి పాల్పడుతున్న వైసీపీ పేటీఎం బ్యాచ్‌కు శిక్ష ఖాయం. వారి తల్లిదండ్రులు కూడా వారిని ఛీదరించుకునే పరిస్థితి రావడం తప్పదు' అని గాయత్రి అన్నారు.

జగన్ పాలనలో దళిత, గిరిజన ప్రాణాలకు విలువలేదు: అనిత

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో దళిత, గిరిజన మహిళల ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని, హక్కుల కోసం అడిగితే ట్రాక్టర్‌తో తొక్కిచ్చి చంపడం సర్వసాధారణంగా మారిందని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఒక ప్రకటనలో ఆరోపించారు. 'శుక్రవారం పల్నాడు జిల్లాలోని రెంటచింతల మండలం మల్లవరంలో సామునిబాయి అనే గిరిజన మహిళను వైసీపీ మద్దతుదారుడు మణికంఠ నాయక్ ట్రాక్టర్‌తో తొక్కించడం హృదయ విదారకం. సైకో పాలనలో దళిత, గిరిజన మహిళలపై దారుణమైన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. 2020 ఆగస్టులో గుంటూరు జిల్లా నకిరేకల్ మండలం శివాపురం తండాకు చెందిన మంత్రూబాయి అనే గిరిజన మహిళను వైసీపీకి చెందిన శ్రీనివాసరెడ్డి ట్రాక్టర్‌తో దాడి చేసి చంపారు. గత ఏడాది జూన్‌లో ప్రకాశం జిల్లా టంగుటూరి మండల, రావివారిపాలెంలో హనుమాయమ్మ అనే దళిత మహిళను కోటేశ్వరావు అనే వైసీపీ నాయకుడు ట్రాక్టర్‌తో ఇదే తరహాలో అతి దారుణంగా హత్య చేశాడు. జగన్ పాలనలో నోరు తెరిచి హక్కులు అడగడమే నేరమన్నట్లు వైసీపీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. జగన్‌ను నమ్ముకుని రెచ్చిపోతే వైసీపీ నేతలు, కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉన్మాదంతో రెచ్చిపోతూ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వైసీపీ నాయకులను రాబోయే టీడీపీ-జనసేన ప్రభుత్వంలో చట్టం ముందు నిలబెడతాం' అని అనిత హెచ్చరించారు.

హంతకులెవరో సూటిగా చెప్పండి

- వైఎస్ సునీతకు ఎంపీ రఘురామ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హంతకులెవరో ప్రజలకు తేల్చి చెప్పాలని ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతారెడ్డిని, ఎంపీ రఘురామకృష్ణ రాజు కోరారు. శనివారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'హంతకులు పరిపాలకులుగా ఉండడానికి వీలులేదని పేర్లు చెప్పకుండానే తన తండ్రి హంతకులెవరో సునీతారెడ్డి చాలా స్పష్టంగా చెప్పింది. వివేకా హత్యలో జగన్‌కు కూడా భాగస్వామ్యం ఉన్నట్లుగా పరోక్షంగా చెప్పింది. ఆమె వ్యాఖ్యలపై స్పందించిన సజ్జల రామకృష్ణారెడ్డి రివర్స్‌లో సునీతపైనే కేసు నమోదు చేసి విచారించాలనడం విడ్డూరంగా ఉంది. వివేకాను ఎవరు? ఎందుకోసం? చంపారో ప్రజలందరికీ తెలుసు. దొంగతనంగా ఫస్ట్ క్లాసులో పాస్ అయినట్టు చెప్పుకునే స్టూడెంట్ కాదు డాక్టర్ సునీతా రెడ్డి. దేశంలోనే ఆమె ఒక ప్రముఖ వైద్యురాలు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదవాల్సిన అవసరం ఆమెకు లేదు' అని ఎంపీ స్పష్టం చేశారు. మంచినీళ్లు అడిగిన గిరిజన మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి చంపేస్తారా? అంటూ మండిపడ్డారు. ప్రస్తుతం వైసీపీకి 65 నుంచి 70 స్థానాలు లభిస్తాయని పందాలు కాస్తున్నారు. కానీ 40 స్థానాలకు మించి రావు. ఎన్నికల నాటికి వైసీపీ దౌర్జన్యాలు ఇలాగే కొనసాగితే 20 నుంచి 15 స్థానాలకు పడిపోయే ప్రమాదం ఉంది. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా కాపులకు 70 సీట్లకు తగ్గకుండా ఇవ్వాలని, రెండున్నర ఏళ్ల పాటు పవర్ షేరింగ్ ఇవ్వాలని ప్రతిపాదిస్తున్న నాయకులకు, ఇప్పుడు జగన్ పవర్ షేరింగ్ ఇస్తున్నారా? అని రఘురామ ప్రశ్నించారు.

వివేకా హత్య కేసులో
జగన్ పాత్రపై విచారణ జరగాలి: చినరాజప్ప

పెద్దాపురం, మార్చి 2: వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ పాత్రపై విచారణ జరగాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే వివేకానందరెడ్డిని జగన్ ముఠానే హతమార్చిందన్నారు. వివేకా ఎలా చనిపోయారో జగన్‌కు తెలుసు. దాన్ని ఎందుకు దాచాలనుకుంటున్నారో? జగన్‌రెడ్డి సీఎం కాగానే కేసు విచారణలో పురోగతి ఎందుకు ఆగిపోయింది? సొంత చెల్లెళ్లకు న్యాయం చేయలేని జగన్ రాష్ట్రంలోని మహిళలకు ఏమి న్యాయం చేస్తారు?' అని రాజప్ప ప్రశ్నించారు.

'మెడికల్ క్యాంప్' మతలబేంటో?!

- వివేకా కేసులో నిందితుడు శంకర్‌రెడ్డి కుమారుడికి అదే జైలులో క్యాంప్‌కు అనుమతి
- ఆ ముసుగులో తనకు 20కోట్లు ఆఫర్ చేశాడన్న దస్తగిరి
- ఖండించడానికి పెట్టిన ప్రెస్‌మీట్ తర్వాతా చైతన్యరెడ్డి తీరుపై మరిన్ని అనుమానాలు
- జైలు అధికారుల వైఖరిపైనా నీలినీడలు

కడప, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సీఎం జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డికి సన్నిహితుడైన దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కడప సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్నారు. ఆయన కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డి మెడికల్ క్యాంపు ముసుగులో తనను జైలులోపల కలిసి రూ. 20 కోట్లు ఆఫర్ చేశారని ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కలకలం రేపాయి. దీనిపై శనివారం చైతన్యరెడ్డి స్పందించారు. వివేకా హత్యలో తన తండ్రికి, ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిల ప్రమేయం లేదని చెప్పే ప్రయత్నం చేశారు. మెడికల్ క్యాంపు కోసం జైలు లోపలకు వెళ్లిన మాట ఒప్పుకొంటేనే.. దస్తగిరిని బెదిరించి ఉంటే ఆయన అప్పుడే ఎందుకు ఫిర్యాదు చేయలేదంటూ వాదనకు ప్రయత్నించారు. నిజానికి, వివేకా హత్య కేసు సీబీఐ టేకప్ చేసి, దస్తగిరి అప్రూవర్‌గా మారిన తర్వాత వివేకా హత్య కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. దస్తగిరి వాంగ్మూలం మేరకు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు. దేవిరెడ్డి శంకర్‌రెడ్డిని అరెస్టు చేసి కొద్దిరోజులు కడప సెంట్రల్‌జైలులో పెట్టారు. అయితే ఆరోగ్య సమస్యల సాకుతో జైలులో శంకర్‌రెడ్డి రాజభోగాలు అనుభవించారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జైలు అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జగన్‌కు వరుసకు సోదరుడు ఎంపీ అవినాశ్‌రెడ్డి ప్రమేయం ఉన్నట్లు సీబీఐ కేసు నమోదు చేయడంతో ఈ కేసు హైప్రొఫైల్‌గా మారింది. ఇంతలో.. దస్తగిరి ఓ కిడ్నాప్ కేసులో గత ఏడాది అక్టోబరు 31న కడప సెంట్రల్ జైలుకు రిమాండుకు వచ్చారు. సెంట్రల్ జైలులో ఖైదీలకు వైద్యపరీక్షలు నిర్వహించడం సాధారణమే. అయితే, శంకరరెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి నిర్వహించిన వైద్యశిబిరం తీవ్ర దుమారం రేపుతోంది. గత ఏడాది జైలులో ఐదు క్యాంపులు నిర్వహించారు. చివరి క్యాంపును ఆ ఏడాది నవంబరు 28న చైతన్యరెడ్డి... శంకర్ హాస్పిటల్, శ్రీకళ హాస్పిటల్ పేరుతో నిర్వహించారు. ఆ సమయంలో దస్తగిరి ఓ కిడ్నాప్ కేసులో అరెస్టు అయి ఎస్ఎస్ఆర్ బ్యారెక్‌లో రిమాండులో ఉంటున్నారు. వైద్యసిబ్బంది పేరిట జైలుకు వచ్చిన చైతన్యరెడ్డి.. అక్కడ తనను కలిశాడని దస్తగిరి ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. "రూ.20 కోట్లు ఇస్తాం, సీబీఐ ఎస్పీ రాంసింగ్ చెబితే తప్పుడు ఆరోపణలు చేశాను అని మీడియా ముందు చెప్పు" అంటూ బెదిరించినట్లు దస్తగిరి చెప్పుకొచ్చారు. మరోవైపు జైలు అధికారుల తీరూ అనుమానాలను రేపేలా ఉంది. అరెస్టు అయి తమ దగ్గరే జైలులో ఉన్న నిందితుడి కుమారుడికి అదే జైలులో క్యాంపు నడపడానికి ఎలా అనుమతి ఇస్తారని సర్వత్రా ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

దస్తగిరి ఆరోపణలు అవాస్తవం

- నా తండ్రికి బెయిల్ రాకూడదనే దస్తగిరి డ్రామాలు
- మీడియాతో దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి

కడప (మారుతీనగర్), మార్చి 2: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరిని తాను కడప జైల్లో కలిసి తమకు అనుకూలంగా మాట్లాడితే రూ.20 కోట్లు ఇస్తామంటూ బేరాలకు దిగినట్లుగా దస్తగిరి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కుమారుడు దేవిరెడ్డి చైతన్యరెడ్డి తెలిపారు. శనివారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసు దర్యాప్తులో ఉండగా మీడియా ముందుకు రాకూడదని భావించానని, అయితే దస్తగిరి తమపై లేనిపోని అవాస్తవాలు చెబుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గత ఏడాది నవంబరులో కడప జైలులో పది మంది వైద్య అధికారులు, సిబ్బందితో కలిసి మెడికల్ క్యాంపు నిర్వహించామని, ఆ సమయంలో దస్తగిరిని తాను బెదిరించినట్లుగా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలా చేసివుంటే ఆరోజే ఎందుకు ఫిర్యాదు చేయలేదో చెప్పాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు డైరెక్షన్‌లో దస్తగిరి డ్రామాలాడుతున్నారనే సంగతి అందరికీ అర్థమవుతోందన్నారు. వివేకా హత్యతో ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి, తన తండ్రి దేవిరెడ్డి శంకర్‌రెడ్డిలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తన తండ్రికి బెయిల్ రాకుండా అడ్డుకునే కుట్రలో భాగంగా కట్టుకథలు అల్లుతున్నారని విమర్శించారు. హత్య జరిగిన చీతర్వాత తొలుత మీడియా ముందు మాట్లాడింది ప్రస్తుతం బీజేపీలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి అని, దీనిని సునీత ప్రశ్నించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

వైసీపీని చిత్తుగా ఓడించాలి

- ఈ ప్రభుత్వం వర్గీకరణకు వ్యతిరేకి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ

అద్దంకిటౌన్, మార్చి 2: మాదిగ జాతికి ద్రోహం చేసే జగన్ ను చిత్తుగా ఓడించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. మాదిగల భవిష్యత్ వర్గీకరణతోనే సాధ్యమని, అందుకు ఎమ్మార్పీఎస్ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉండాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి బాపట్ల జిల్లా అద్దంకిలోని బంగ్లారోడ్డులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ ఉమ్మడి ప్రకాశం జిల్లా మహాసభ అనపర్తి రమేష్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణమాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సమాజంలోని అన్ని వర్గాలు ప్రజలు అనుకూలంగా ఉన్నారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిన సమయంలో 22వేల మంది మాదిగలు ఉద్యోగాలు పొందారన్నారు. పార్టీ పెట్టిన సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపారన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం సుప్రీం కోర్టులో కీలక దశలో ఉన్న సమయంలో ఆయా పార్టీలు తమ మద్దతు తెలియజేశాయన్నారు. చంద్రబాబునాయుడు తమ మద్దతును తెలియజేశారన్నారు. అయితే, జగన్‌మోహన్‌రెడ్డి తమ వైఖరి తెలియజేయాలని కోరిన మిన్నకుండి కనీసం సుప్రీంకోర్టులో న్యాయవాదిని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. మాదిగ జాతికి ద్రోహం చేసే జగన్ ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మన జాతి బిడ్డల భవిష్యత్ మనకు ముఖ్యం అని, దానిని అడ్డుకునే వారికి ఎటువంటి మద్దతు తెలియజేయవద్దన్నారు. వైసీపీని గెలిపిస్తే మన బిడ్డల భవిష్యత్ ప్రమాదంలో పడుతుందన్నారు. దేశంలోనే ఎవరిపై లేనన్ని అవినీతి కేసులు జగన్‌పై ఉన్నాయని, వైసీపీకి ఓటు వేస్తే అతనిని జైలుకు పోకుండా కాపాడినట్టేనన్నారు. వర్గీకరణ అంశం సుప్రీంకోర్టులో కీలక దశలో ఉందని, ఎటువంటి తీర్పు వచ్చిన వాటిని అమలుచేసేది రాష్ట్ర ప్రభుత్వాలనేనన్నారు. ఎన్నికల సమయం అయినందున ఈ సమయంలో ఎమ్మార్పీఎస్ పోరాటం ఏ నిర్ణయం తీసుకున్న దానికి మాదిగలందరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.

న్యాయశాస్త్రానికి, సమాజానికి అంతర్గత సంబంధం

- జస్టిస్ రామకృష్ణ ప్రసాద్


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

తాడేపల్లి, మార్చి 2: న్యాయశాస్త్రానికి, సమాజానికి అంతర్గత సంబంధం ఉందని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ న్యాయకళాశాల ఆధ్వర్యంలో ప్రోబోనో క్లబ్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు మనకు మొదటి నుంచి ఉన్నప్పటికీ అవి రాజ్యాంగంలో పొందుపరిచిన తరువాతే తప్పనిసరి చేశారని తెలిపారు. న్యాయకళాశాల విద్యార్థులు న్యాయ శాస్త్రాలు, సమాజం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయసేవలు అందించాలనే ఉద్దేశంతో కెఎల్‌యూలో ప్రోబోనో క్లబ్‌ను స్థాపించడంపై హర్షం వ్యక్తంచేశారు.

సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గాయత్రి మృతి



గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం అందుకుంటున్న గాయత్రి


గాయత్రి

గుంటూరు (లీగల్), మార్చి 2: విశాఖపట్నానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గాయత్రి (58) గుండెపోటుతో మరణించారు. శనివారం గుంటూరు మెడికల్ కళాశాల జింఖానా ఆడిటోరియంలో రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న రెగ్యులర్, టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో నిర్వహించిన సమావేశంలో ఈ విషాదం చోటు చేసుకుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం వరకు సాగింది. చివరిలో కోర్టు కేసుల విచారణలో ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రశంసా పత్రం అందుకొని గ్రూప్ ఫోటో కార్యక్రమంలో కూడా పాల్గొన్న విశాఖపట్నం నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న గాయత్రి స్టేజ్ దిగివచ్చి తన సీట్లో కుప్పకూలారు. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే తుదిశ్వాస విడిచినట్టు డాక్టర్లు నిర్ధారించారు.

2034 వరకూ హైదరాబాద్ 'ఉమ్మడి' కావాలి

- మరో పదేళ్లు కొనసాగించేలా చట్టం చేయాలి
- ఈ మేరకు కేంద్ర హోం శాఖను ఆదేశించండి
- హైకోర్టులో 'కృష్ణా' జిల్లా వాసి వాజ్యం



అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మరో పదేళ్ల హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలంటూ హైకోర్టులో వాజ్యం దాఖలైంది. ఈ మేరకు చట్టం తెచ్చేలా కేంద్ర హోంశాఖను ఆదేశించాలని అందులో కోరారు. హైదరాబాద్ పదేళ్ల ఉమ్మడి రాజధానిగా కొనసాగుతుందని ప్రకటించిన గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగుస్తున్నా ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పులు తొమ్మిదవ షెడ్యూల్‌లోని కంపెనీలు, కార్పొరేషన్ల ఆస్తుల విభజన పూర్తి కాలేదని అందులో పేర్కొన్నారు. 2034 జూన్ 2వరకు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించేలా, కేంద్ర హోంశాఖకు ప్రతిపాదన పంపించేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించాలని కోరారు. ఉమ్మడి కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నంకి చెందిన ప్రజాసంక్షేమ సేవా సంఘం కార్యదర్శి పొదిలి అనిల్ కుమార్ ఈ పిల్ దాఖలు చేశారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ కార్యదర్శి, సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శిని వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయంగా విభజించడంతో రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా ఏపీ రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోయింది. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, అంగీకారం, ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆస్తుల విభజన వివాదాలకు దారితీసింది. చట్టబద్ధమైన విధులు నిర్వర్తించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం కావడంతో వివాదాలు పరిష్కారానికి నోచుకోలేదు. పునర్విభజన చట్టంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో మొత్తం 91 కంపెనీలు, కార్పొరేషన్లు ఉన్నాయి. 90 సంస్థల విషయంలో నిపుణుల కమిటీ ఒకే విధానాన్ని అనుసరించకపోవడంతో సిఫారసులను రాష్ట్రాలు అంగీకరించలేదు. సమస్యల పరిష్కారం పై కేంద్రం దృష్టి సారించకపోవడంతో వివాదాలు కోర్టుకు చేరుతున్నాయి. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్న సమయంలోనే వివాదాలు పరిష్కారం కావాలి. లేకుంటే ఏపీ ప్రయోజనాలు దెబ్బతింటాయి. విభజన హామీలు అమలు కానందున హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని కోరే హక్కు ఏపీకి ఉంటుంది. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని 2034వరకు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు చట్టం తెచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించండి' అని వాజ్యంలో కోరారు.

పోలీసులు ఏకపక్షంగా పాస్‌పోర్టు రద్దు చేయలేరు

ప్రయాణించడం, అందుకు పాస్‌పోర్టును కలిగి ఉండడం పౌరుల ప్రాథమిక హక్కు

హరియాణా పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో న్యాయవర్గాల విశ్లేషణ

న్యూఢిల్లీ, మార్చి 2: పంజాబ్ సరిహద్దుల్లోని శంభు, ఖనౌరీ ప్రాంతాల్లో ఆందోళనల్లో పాల్గొంటున్న రైతుల పాస్‌పోర్టులు, వీసాలను రద్దు చేస్తామంటూ హరియాణా, అంబాలా జిల్లా పోలీసులు హెచ్చరించారు. బారికేడ్లు ధ్వంసం చేస్తున్న, హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు ఫొటోలు, వీడియోలు తీస్తున్నామని మాజీ క్రికెటర్, ప్రస్తుతం డీఎస్పీగా పనిచేస్తున్న జోగిందర్ శర్మ ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసలు పాస్‌పోర్టును ఏఏ కారణాలతో రద్దు చేయవచ్చు? పోలీసులకు రద్దు చేసే అధికారం ఉందా? అన్యాయంగా రద్దు చేశారని భావిస్తే ఆ నిర్ణయాన్ని ఏ వేదికపై చాలెంజ్ చేయాలి? అసలు రైతులు చేసే ఆందోళనను పాస్‌పోర్టు రద్దు చేయదగ్గ కారణంగా పేర్కొనే అవకాశం ఉందా? అన్న మీమాంసపై న్యాయవాది కొలిన్ గోన్సాల్వెస్ స్పందించారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం ప్రయాణించడం, అందుకు పాస్‌పోర్టును కలిగి ఉండడం పౌరుని ప్రాథమిక హక్కు. రైతులు నేరం చేశారా..! ఆ ఘటనలన్నీ మహా అయితే బలవంతపు చొరబాటుగా మాత్రమే పరిగణించగలం. పోలీసులకు తమ పాలనపై నమ్మకం లేనట్లుంది. నిరసన తెలపడం, ర్యాలీలో పాల్గొనడం, బ్యాంకు మోసాలకు పాల్పడడం రాజ్యానికి ప్రమాదమేమీ కాదు' అని కొలిన్ అన్నారు. 'విదేశాంగ శాఖ ప్రమేయం లేకుండా, ఏకపక్షంగా పాస్‌పోర్టును రద్దు చేసే అధికారం పోలీసులకు లేదు. ఇకపోతే వీసాల జారీ సంబంధిత దేశ రాయబార కార్యాలయం ద్వారా జరుగుతుంది. పాస్‌పోర్టు చట్టం 1967లోని సెక్షన్ 10 ఏ, 10బీ ప్రకారం పాస్‌పోర్టు అథారిటీ మాత్రమే పాస్‌పోర్టును, ప్రయాణ పత్రాన్ని రద్దుచేసే, జప్తు చేసే అధికారాన్ని కలిగి ఉంటుంది. ఈ చట్టం ప్రకారం భారత సార్వభౌమాధికారానికి, సమగ్రతకు, దేశ భద్రతకు ప్రమాదమని నిర్ధారణ అయినపుడు, ఏదేని దేశంతో భారత్ స్నేహపూర్వక సంబంధాలు దెబ్బతింటాయని, ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని భావించినపుడో పాస్‌పోర్టును సీజ్ చేయవచ్చు. అయితే ఈ ఆరోపణలతో పాస్‌పోర్టును రద్దు చేయాలన్నా, సీజ్ చేయాలన్నా అనేక పద్ధతులను పాటించాల్సి ఉంటుంది. చేసిన ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరగాలి. ఆరోపణల నిరూపణకు తగినన్ని సహేతకమైన ఆధారాలు ఉండాలి. పాస్‌పోర్టు రద్దుకు ముందు ఆయా వ్యక్తులు తమ వాదనను సంబంధిత అధికారుల ముందు వినిపించడానికి తగిన అవకాశం కచ్చితంగా ఇవ్వాలి. అప్పటికీ తన పాస్‌పోర్టును అన్యాయంగా రద్దు చేశారని భావిస్తే న్యాయ సమీక్షను కోరే హక్కు ఉంటుంది. అలాగే పాస్‌పోర్టు రద్దు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరుతూ ఉన్నత స్థాయి అధికారుల వద్దకు, కోర్టుకు వెళ్లే హక్కు ఆయా వ్యక్తులకు ఉంటుంది. నిరసనకారుల పాస్‌పోర్టులను రద్దు చేస్తామని హర్యానా పోలీసులు హెచ్చరించడం సరైంది కాదు. పోలీసుల హెచ్చరిక ప్రాథమిక హక్కుల రక్షణపై ప్రజల్లో ఆందోళనను రేకెత్తిస్తోంది' అని న్యాయవాది కొలిన్ వివరించారు.

బిజీగా ఉన్నానని కోర్టుకు తెలిపిన రాహుల్

- పరువు నష్టం దావాపై విచారణ 13కు వాయిదా



సుల్తాన్‌పూర్, మార్చి 2: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై దాఖలైన పరువు నష్టం దావాపై విచారణను ఈ నెల 13కు వాయిదా వేస్తున్నట్టు ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక న్యాయస్థానం శనివారం ప్రకటించింది. భారత్ న్యాయ జోడో యాత్రలో బిజీగా ఉన్నందున విచారణకు హాజరు కాలేరంటూ ఆయన తరఫు న్యాయవాది చెప్పడంతో కోర్టు అంగీకరించింది. ఇదే కేసు విచారణ నిమిత్తం ఆయన గత నెల 20న కోర్టుకు హాజరు కాగా బెయిల్ మంజూరయింది. తదుపరి విచారణ మార్చి 2కు వాయిదా వేస్తున్నట్టు ఆ సందర్భంగా కోర్టు ప్రకటించింది. శనివారం కేసు విచారణకు రాగా మళ్లీ వాయిదా కోరారు. 2018లో ఎన్నికల సందర్భంగా బెంగళూరులో మాట్లాడిన రాహుల్ అమిత్ షాపై అసత్య ఆరోపణలు చేశారంటూ ఇక్కడ పరువు నష్టం దావా దాఖలయింది. హత్య కేసు ముద్దాయి బీజేపీ అధ్యక్షునిగా ఉన్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యను తప్పు పడుతూ దావా వేశారు. అమిత్ షా గుజరాత్ హోం శాఖ సహాయ మంత్రిగా ఉండగా నకిలీ ఎన్‌కౌంటర్‌తో సంబంధం ఉన్నట్టు 2005లో కేసు నమోదయింది. 2014లో దాన్ని కోర్టు కొట్టివేసినా రాహుల్ తప్పుడు ఆరోపణలు చేశారంటూ స్థానిక బీజేపీ నాయకుడు కేసు పెట్టారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ.. 35 మందికి గాయాలు


లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న బస్సు

పెళ్లకూరు, మార్చి 2: తిరుపతి జిల్లా పెళ్లకూరు మండల పరిధిలోని టెంకాయతోపు వద్ద 71వ నంబరు జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో 35 మంది గాయపడ్డారు. నెల్లూరు జిల్లా రాపూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి తిరుపతికి 55 మంది ప్రయాణికులతో బయలుదేరింది. శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వస్తున్న లారీ ఎదురుగా వేగంగా ఢీనడంతో బస్సులోని 30 మందికి స్వల్ప గాయాలు కాగా మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

రూ.14.5 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం

- విజయనగరంలో ఇద్దరు నిందితుల అరెస్టు

విజయనగరం క్రైం, మార్చి 2: విజయనగరం పోలీసులు నకిలీనోట్ల ముఠా గుట్టు రట్టు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.14.5 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. శనివారం విజయనగరం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ గోవిందరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విజయనగరం కోట జంక్షన్ సమీపంలోని గుమ్చీ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇంతలో విజయనగరం వైఎస్సార్ నగర్‌కు చెందిన బంగారి చక్రధర్, దత్తిరాజేరు మండలం గడసాం గ్రామానికి చెందిన రాజాన విష్ణు.. వారిని చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి విచారించారు. చక్రధర్ ఓ కేసులో అరెస్టయి సబ్ జైల్లో ఉండగా.. అక్కడే ఉన్న ఒడిశా రాష్ట్రం జర్తాపూర్ జిల్లా కాంతియా గ్రామానికి చెందిన చంద్రమణిబాల్ పరిచయం అయ్యాడు. ఆ సమయంలో చంద్రమణిబాల్ తాను దొంగ నోట్లు సరఫరా చేస్తుంటానని చెప్పాడు. తాను కూడా దొంగనోట్లు సరఫరా చేస్తానని చక్రధర్ చెప్పాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత బంగారు చక్రధర్, రాజాన విష్ణుతో కలిసి చంద్రమణిబాల్ వద్ద దొంగనోట్లు తీసుకుని చెలామణి చేయడం ప్రారంభించారు. ఇటీవల విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద చంద్రమణిబాల్ నుంచి రూ.15.5 లక్షల దొంగనోట్లు తీసుకుని రూ.3 లక్షల అసలైన నోట్లు చెల్లించినట్టు పోలీసుల విచారణలో తేలింది. ప్రస్తుతం ఇద్దరి నుంచి రూ.14.5 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నామని, చంద్రమణిబాల్ పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. బంగారు చక్రధర్, రాజాన విష్ణును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

శ్రీకాకుళంలో పట్టపగలే దోపిడీ

- వృద్ధురాలిని బంధించి 30 తులాల బంగారం అపహరణ


గాజులను బలవంతంగా లాగేయడంతో చేతులు వాచి.. గాయాలైన దృశ్యం

శ్రీకాకుళం క్రైం, మార్చి 2: శ్రీకాకుళంలో ఒంటరిగా ఉన్న ఓ వృద్ధురాలి ఇంట్లో ఇద్దరు దొంగలు చొరబడి.. 30 తులాల బంగారు ఆభరణాలను దోపిడీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం నగరం బొంతావారి వీధిలో.. బమ్మిడిపాటి జగదాంబ(75) అనే వృద్ధురాలు తన కొడుకు శ్రీనివాసరావుతో కలిసి నివసిస్తున్నారు. శ్రీనివాసరావు శనివారం విధులకు వెళ్లిపోగా జగదాంబ ఒక్కరే ఇంట్లో ఉన్నారు. ఈ విషయం తెలిసి ఇద్దరు ఆగంతకులు ఉదయం 11.30 నుంచి 12 గంటల మధ్య పెళ్లికి పిలవడానికి వచ్చామంటూ గేట్లు తీసుకుని ఇంట్లోకి ప్రవేశించారు. వెంటనే ఒకరు ఆమె నోరునొక్కి పక్కగదిలో ఉన్న మంచానికి తాళ్లతో కట్టేశారు. మాట్లాడకుండా నోట్లో వస్త్రాలు కుక్కారు. ఆమె చేతికి ఉన్న 16 బంగారు గాజులు, మెడలోని నాలుగు పేటల గొలుసు, రెండుపేటల గొలుసు, పగడం మొత్తంగా 30 తులాల ఆభరణాలను దొంగిలించారు. అరిస్తే కత్తితో గొంతు కోస్తామని బెదిరించి పరారయ్యారు. కొద్దిసేపటి తర్వాత.. జగదాంబ పక్కింట్లో ఉంటున్న సుధీర్ ఆమె కేకలు విని వెళ్లి చూడగా.. మంచానికి కట్టేసి కనిపించింది. స్థానికుల సాయంతో వృద్ధురాలి కట్లువిప్పి విషయం తెలుసుకున్నారు. వెంటనే జగదాంబ కొడుకు శ్రీనివాస్‌తో పాటు ఒకటో పట్టణ పోలీసులకు సుధీర్ సమాచారం అందించారు. సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్ఐ బలివాడ గణేష్ సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం సహాయంతో వేలిముద్రలు సేకరించారు. ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీ వై.శృతి కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి, నిందితులను గుర్తించి త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
దృశ్యం
ఆదివారం
3 మార్చి 2024



పుష్ప-2 అంచనాలకు మించి ఉంటుంది

నేషనల్ క్రష్‌గా పేరున్న రష్మికా మందన్నాకు అంతర్జాతీయంగానూ ఫాలోయింగ్ మామూలుగా లేదు. ఈ ముద్దుగుమ్మ ఇటీవలే జపాన్‌లోని క్రంచీ రోల్ యానిమే అవార్డ్స్‌కు హాజరయ్యింది. అక్కడ ఆమెకు అభిమానుల నుంచి ఓ రేంజ్‌లో ఆదరణ లభించింది. జపనీయుల ఆదరాభిమానాలతో పాటూ భారతదేశం నుంచి ఈ వేడుకకు హాజరయిన సెలబ్రిటీగా 'శ్రీవల్లి' విశేష ఖ్యాతితో పాటు అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా, తన నెక్ట్స్ ప్రాజెక్ట్ గురించి మీడియాతో కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకుంది.

పుష్ప-2లో అత్యుత్తమ నటన

పుష్ప-2లో తాను పుష్పరాజ్‌కు భార్యగా కనిపిస్తానని, తన పాత్ర బాధ్యత మరింతగా పెరిగిందని తెలిపిందీ ఈ కన్నడ కస్తూరి. పార్ట్-1 కంటే ఇందులో మరింత డ్రామా, పాత్రల మధ్య బలమైన సంఘర్షణ ఉంటాయని వివరించింది. వీటితో పాటూ మొదటి భాగాన్ని మించిన మాస్ మసాలా ఇందులో ఉందని తెలిపింది. దర్శకుడు సుకుమార్‌తో మళ్లీ పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పింది మూడేళ్ల తర్వాత మళ్లీ 'పుష్ప' చిత్ర యూనిట్‌ను కలుసుకోవడం సొంత ఇంటి సభ్యులను కలుసుకున్న అనుభూతి కలిగిందని హర్షం వ్యక్తం చేసింది. ఈ సీక్వెల్‌పై ఎన్నో అంచనాలు ఉన్నాయని, అందుకే 'తగ్గేదేలా' అంటూ చిత్ర బృందం అహర్నిశలు శ్రమిస్తోందని వివరించిందీ నటి. పుష్ప-2 షూటింగ్ సమయంలో తన అత్యుత్తమ నటన బయటికొచ్చిందని, తన కెరీర్‌లోనే 'శ్రీవల్లి' పాత్ర ప్రత్యేకంగా మిగిలిపోతుందని విశ్వాసం వ్యక్తం చేసింది. అందరి అంచనాలను మించేలా తెరకెక్కుతోన్న పుష్ప-2 కోసం అభిమానులతో పాటూ తానూ ఆతృతగా ఎదురుచూస్తున్నానందీ క్యూట్ బ్యూటీ

చెప్పాలనిపించే విషయం ఉండాలి

సినిమాలు ఎంచుకునేటప్పుడు తన పాత్ర ప్రాధాన్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానంటోంది రష్మిక. కథల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తూ కొన్ని నియమాలు పాటిస్తానంటోంది. తాను ఎంపిక చేసుకున్న కథల్లో తనకు చెప్పాలనిపించే విషయం ఏదో ఒకటి ఉండాలని, అలాగే, తన పాత్ర ద్వారా వీలైనంత సందేశం ఇవ్వగలిగేలా ప్రయత్నం చేస్తానంటోంది. అందుకే మహిళా ప్రాధాన్యమున్న 'రెయిన్ బో', 'గర్ల్ ఫ్రెండ్' చిత్రాల్లో నటిస్తున్నానని వివరించిందీ అమ్మడు. అయితే ప్రతీ చిత్రం ద్వారా సందేశాన్ని చెప్పలేమని, తనను ఎక్సయిట్ చేసిన పాత్రలు వింటే వెంటనే ఒప్పేసుకుంటా అంది.

మరిన్ని రొమాంటిక్ చిత్రాల్లో నటించాలనుంది

జీవితంలో ఒక్కో దశలో ఒకలా ఆలోచిస్తామని, ఈ మార్పు పాత్రల ఎంపికపైనా ప్రభావం చూపిస్తుందని ఈ కన్నడ భామ తెలిపింది. ఈ మధ్య యాక్షన్ ఓరియెంటెడ్ సినిమాల్లో ఎక్కువగా నటించానని, అందుకే ప్రస్తుతం తనకు మరిన్ని రొమాంటిక్ చిత్రాల్లో నటించాలనుందని, అటువంటి స్క్రిప్టులే తన ముందుకు రావాలని కోరుకుంటున్నానని రష్మిక చెప్పింది.





శ్రీరామ నవమికి ప్రకటిస్తారట!

దర్శకుడు నితిశ్ తివారీ రూపొందించే రామాయణం సినిమా షూటింగ్‌కు కౌంట్ డౌన్ మొదలైంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటించే ఈ భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ త్వరలోనే మొదలవుతుంది. రెండు భాగాలుగా ఈ చిత్రం తయారవుతోంది. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా రామాయణ కథను తెరకెక్కించాలని నితిశ్ ప్రయత్నిస్తున్నారు. అందుకే ఐదేళ్ల పాటు తన టీమ్‌తో కలసి వర్క్ చేసి, స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఇదొక దృశ్య కావ్యంలా ఉండాలని నితిశ్ తపన. విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో కూడా ఆయన ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. రామాయణం షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది, నటీనటుల వివరాలు ఏమిటి అనే పూర్తి సమాచారాన్ని శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 17న వెల్లడిస్తారని సమాచారం. 2025 దీపావళికి ఈ సినిమాను విడుదల చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ, విజువల్ ఎఫెక్ట్స్ కు ఎంతో ప్రాధాన్యం ఉంది కనుక రిలీజ్ విషయంలో తొందర పడకుండా అంతా సంతృప్తికరంగా వచ్చిన తర్వాతే విడుదల చేయాలని నితిశ్ ఆలోచన. నమిత్ మల్హోత్రాతో కలసి నితిశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



బాయ్ ఫ్రెండ్‌కు బెస్ట్ విషెస్

బాలీవుడ్‌లో అత్యంత సన్నిహిత జంటల్లో దిశా పటానీ, టైగర్ ష్రాఫ్ కూడా ఉన్నారు. తన బాయ్ ఫ్రెండ్ టైగర్ ష్రాఫ్ బర్త్‌డే సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఇప్పటివరకు ఎవరూ చూడని ఒక ఫొటోను షేర్ చేసింది. ఈ ఫొటోలో టైగర్ ష్రాఫ్ తన కికింగ్ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఆ ఫొటోపై "పుట్టిన రోజు శుభాకాంక్షలు బాఘీ.. నువ్విలాగే నీ నైపుణ్యాలను చాటుతూ మరింతగా పైకెదగాలి" అని విష్ చేసింది. దీంతో వీరిద్దరి మధ్య ఉన్న అన్యోన్యత మరోసారి బయటపడింది. ఇది బాఘీ సినిమా సిరీస్ షూటింగ్ సమయంలో తీసిన పిక్ అని అర్థమవుతోంది. ప్రస్తుతం సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తోందీ ఫొటో. బాఘీ-2, బాఘీ-3 చిత్రాల్లో కలిసి నటించిన వీరు మొదటి నుంచి ఒకరిపై ఒకరికి ఉన్న అభిమానాన్ని చాటుకుంటూనే ఉన్నారు. మరోవైపు, టైగర్ ష్రాఫ్‌కు బాలీవుడ్ అగ్ర నటుడు అక్షయ్ కుమార్ విషెస్ తెలిపారు.



తొంబై ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహం



భారతీయ చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు అత్యధిక పారితోషికం అందుకున్న నటి, తొలి మహిళా సూపర్‌స్టార్ వైజయంతిమాల. ఆవిడ మంచి నటే కాదు, అద్భుతమైన నర్తకి కూడా. పదహారేళ్ల వయసులోనే చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన వైజయంతిమాల తన అందంతో, అభినయంతో ఓ తరం ప్రేక్షకులను అలరించారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ఎన్నో చిత్రాల్లో నటించిన వైజయంతిమాల ఇటీవల పద్మవిభూషణ్ పురస్కారం పొందారు. ఇప్పుడు ఆమె వయసు 90 ఏళ్లు. మనసులో ఉత్సాహం ఉరకలు వేస్తున్నా.. వయసు పెరిగిన తర్వాత ఎవరికైనా మునపటిలా శరీరం సహకరించదు. అడుగులు వేయడమే కష్టమవుతుంది. అయితే అందుకు తను మినహాయింపు అని నిరూపించారు వైజయంతిమాల. ఇటీవల అయోధ్యలో 'రాగ్ సేవ' పేరుతో 45 రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో భాగంగా వైజయంతిమాల ఒకరోజు నృత్య ప్రదర్శన ఇచ్చారు. 90 ఏళ్ల వయసులో ఆవిడ ఎంతో చలాకీగా, ఉత్సాహంతో నృత్యం చేస్తుంటే చూసిన వాళ్లు షాక్‌కు గురయ్యారు. నిండు నూరేళ్లు ఆవిడ ఇలా ఉండాలని అభిమానులు కోరుకున్నారు.

'కేజీఎఫ్', సలార్ మూవీలతో మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్‌గా ప్రశాంత్ నీల్ పేరు తెచ్చుకున్నారు. తాజాగా ప్రశాంత్ నీల్ ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి జూనియర్ ఎన్టీఆర్ తన సతీమణి ప్రణతితో వెళ్లారు. అలాగే 'కాంతార' సినిమాతో తెలుగువారికి బాగా చేరువైన నటుడు రిషబ్ షెట్టి కూడా తన భార్య ప్రగతితో ఈ కార్యక్రమంలో మెరిశారు. ఇద్దరు సౌత్ ఇండియన్ స్టార్స్ ఇలా ఒకే చోట తళుక్కుమన్న ఫొటోలు అభిమానులకి ఆనందాన్ని పంచాయి.



భర్తను అన్‌ఫాలో చేసిన నయనతార



స్టార్ హీరోయిన్ నయనతార, తన భర్త విఘ్నేశ్ శివన్‌ను ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేసింది. ఈ విషయం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ మధ్యే ఇన్‌స్టా ఖాతా తెరిచింది నయనతార. మొదటి పోస్టుగా తన పిల్లల ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఇప్పుడు ఈ అన్‌ఫాలో విషయంపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొందరు పొరపాటున నయనతార ఇలా చేసుంటుందని సమర్థిస్తున్నారు. మరికొందరు ఏదో టెక్నికల్ సమస్య తలెత్తడం వల్లే విఘ్నేశ్ శివన్ ఫాలోయర్స్ లిస్ట్‌లో నయన్ పేరు లేదని వాదిస్తున్నారు. కోలీవుడ్‌లో ముచ్చటైన జంటగా పేరొందిన వీరు ఏడేళ్లు ప్రేమలో మునిగి తేలి 2022లో ఒక ఇంటి వారయ్యారు. మరి ఈ విషయంలో నయనతార ఎలా స్పందిస్తుందో వేచి చూద్దాం.

12 ఎకరాల స్థలంలో ఆస్పత్రి?



తలైవా రజనీకాంత్ ఏది చేసినా అది ఓ వార్తే. అది ఎప్పుడూ వైరల్ అవుతుంటుంది. అలాగే ఇటీవల ఆయన ఓ ప్రాపర్టీ కొనుగోలు చేశారు. తమిళనాడులో చెంగల్పట్టు జిల్లాలో తిరుపోరూర్ గ్రామంలో ఇటీవల పన్నెండు ఎకరాలు ఆయన కొన్నారు. సినీ తారలు, సెలబ్రిటీలు ఆస్తులు కొనడం కొత్తమీ కాదు. అందులో వింతేమీ లేదు. కానీ ఆ స్థలం రిజిస్ట్రేషన్ కోసం తారలు రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చినప్పుడు అభిమానులు చేసే హడావిడి ఓ రేంజ్‌లో ఉంటుంది. రజనీకాంత్ విషయంలోనూ అంతే జరిగింది. ఎవరికీ తెలియకుండా తన వర్క్ పూర్తి చేసుకోవాలని తలైవా అనుకున్నారు కానీ అభిమానులకు ఎలా తెలిసిందో ఏమో వాళ్లంతా పరుగున అక్కడికి చేరుకున్నారు. దాంతో వాళ్లని కలసి మాట్లాడక తప్పలేదు రజనీకాంత్‌కు.

ఇంతకీ ఆయన పన్నెండు ఎకరాలు ఎందుకు కొన్నట్లు.. అక్కడ ఫామ్ హౌస్ కడతారా, లేక ఆస్పత్రి కడతారా? అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొందరు మాత్రం ఆ స్థలంలో రజనీకాంత్ ఓ పెద్ద ఆస్పత్రి కడతారని, అందులో పేదలకు ఉచితంగా వైద్య సదుపాయాలు కల్పిస్తారని చెబుతున్నారు. మరి తలైవా ఏం చెబుతారో వేచి చూద్దాం.

మల్టీస్టారర్ మూవీ విశ్వనాథ నాయకుడు బడ్జెట్ ఎంతో తెలుసా?

తెలుగు చలనచిత్ర చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన చిత్రం విశ్వనాథ నాయకుడు. 16వ శతాబ్దానికి చెందిన కథతో తీసిన చారిత్రక చిత్రం ఇది. రెండు కోట్ల 70 లక్షల రూపాయల వ్యయంతో రూపుదిద్దుకున్న తొలి తెలుగు భారీ చిత్రం ఇదే. హీరో కృష్ణ ఇందులో టైటిల్ రోల్ పోషించారు. ఆయన నటించిన 250వ చిత్రం ఇది. దాసరి దర్శకత్వంలో విజయమాధవి సంస్థ అధినేత వడ్డే రమేశ్ ఈ సినిమాను నిర్మించారు. ఇందులో శ్రీకృష్ణదేవరాయలుగా కృష్ణంరాజు, నాగమ నాయకునిగా శివాజీ గణేశన్, రాజ నర్తకిగా జయప్రద, పట్టపు రాణిగా సుమలత, తిమ్మరుసుగా సోమయాజులు, రాజ గురువుగా రామకృష్ణ.. ఇలా ప్రముఖ తారాగణమంతా ఈ చిత్రంలో నటించారు. ఇలా మేటి తారాగణంతో రూపుదిద్దుకొన్న ఈ చిత్రాన్ని చెన్నైలో చిత్రీకరిస్తే ఖర్చు పరంగా నిర్మాతకు కలసి వస్తుంది. అయితే స్వరాష్ట్రంలో తెలుగు చిత్ర పరిశ్రమ స్థిరపడాలని సంకల్పంతో మొదటినుంచి తన సినిమాల షూటింగ్స్ హైదరాబాద్ లోనే చేస్తున్న దర్శకుడు దాసరి నారాయణరావు నిర్మాతలను ఒప్పించి 'విశ్వనాథ నాయకుడు' చిత్రాన్ని హైదరాబాదులోనే తీయించారు. అయితే ఇంతటి భారీ చిత్రాన్ని నిర్మించడానికి అనువైన వాతావరణం అప్పట్లో హైదరాబాదులో లేదు ఆర్టిస్టులతో సహా అందరినీ చెన్నై నుంచి తీసుకు రావడంతో చాలా ఖర్చుతో కూడుకున్న విషయం. అయినా నిర్మాతలు రాజీ పడలేదు. వెనక్కి తగ్గలేదు.

సంవత్సరం పాటు నిర్మాణం

1986 ఫిబ్రవరి 4న అన్నపూర్ణ స్టూడియోలో విశ్వనాథ నాయకుడు షూటింగ్ మొదలైంది ఆరు నెలల్లో షూటింగ్ పూర్తి చేయాలని ప్లాన్ వేసుకున్నా, అనుకోని అవాంతరాలు ఎదురు కావడంతో చిత్ర నిర్మాణంలో ఆలస్యం జరిగి సినిమా పూర్తి



చేయడానికి సంవత్సర కాలం పట్టింది ఈ సినిమాలో కీలకమైన యుద్ధ సన్నివేశాలను రూ. 40 లక్షలతో చిత్రీకరించడం విశేషం.ఈ మొత్తంతో ఆ రోజుల్లో ఓ లో బడ్జెట్ చిత్రం తీయవచ్చు. అయినా వడ్డే రమేశ్ ఎక్కడా రాజీపడకుండా డబ్బుని మంచి నీళ్లలా ఖర్చు చేశారు. మే నెలలో.. మండే ఎండల్లో ఈ సన్నివేశాలను రెండు యూనిట్లతో, నాలుగు కెమెరాలతో చిత్రీకరించారు. విద్యుత్ స్తంభాలు ఎక్కడా కనిపించని ప్రదేశం కావాలి కనుక ప్రస్తుతం హైటెక్ సిటీగా ఉన్న మాదాపూర్ పరిసర ప్రాంతాలను ఎన్నుకున్నారు. ఆ రోజుల్లో మాదాపూర్ ప్రాంతం ఓ అడవిలా ఉండేది. జన సంచారం తక్కువ. భారీ అంచనాలతో అగ్రశ్రేణి తారాగణంతో రూపుదిద్దుకున్న 'విశ్వనాథ నాయకుడు' చిత్రం 1987 ఆగస్టు 14న విడుదలైంది. ఆశించిన విజయం సాధించకపోయినా చారిత్రక చిత్ర నిర్మాణాల చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుంది



సేవ్ ద టైగర్స్ సీజన్ 2

సూపర్ హిట్ వెబ్ సిరీస్ 'సేవ్ ద టైగర్స్' సీజన్ 2 వచ్చేస్తోంది. తొలి భాగం ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకోవడంతో సెకండ్ సీజన్ మీద అంచనాలు పెరిగాయి. ఈ నెల 15 నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో 'సేవ్ ద టైగర్స్ 2' స్ట్రీమింగ్ కానుంది. మహి వి రాఘవ్, ప్రదీప్ అద్వైతం ఈ సిరీస్‌ను క్రియేట్ చేశారు. అరుణ్ కొత్తపల్లి దర్శకత్వం వహించారు. ప్రియదర్శి, అభినవ్ గోమఠం, చైతన్యకృష్ణ, పావని, జోర్దార్ సుజాత, శ్రీకాంత్ అయ్యంగార్, గంగవ్వ ప్రధాన పాత్రలు పోషించారు.ఈ సిరీస్ ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా షో క్రియేటర్ మహి వి.రాఘవ్ మాట్లాడుతూ 'ఈ సెకండ్ సీజన్ అందిస్తున్నందుకు హ్యాపీగా ఫీలవుతున్నాం. ఫస్ట్ సీజన్‌కు మించి హ్యూమర్, సస్పెన్స్, ఫన్ ఇందులో ఉంటుంది' అని చెప్పారు. ఈ సిరీస్ ట్రైలర్ వినోద ప్రధానంగా సాగిపోయింది. వైవాహిక జీవితంలో విసిగిపోయిన భర్తలుగా ప్రియదర్శి, అభినవ్ గోమఠం, చైతన్యకృష్ణ నటించారు. సంసారపు ఒత్తిడుల నుంచి రిలాక్స్ అవడం కోసం వీరు ముగ్గురూ చేసే ప్రయత్నాలు ప్రేక్షకులను నవ్విస్తాయని దర్శకుడు అరుణ్ కొత్తపల్లి చెప్పారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 3 మార్చి 2024
diksuchi@andhrajyothy.com



ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా)- డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌నకు నిర్దేశించిన జాతీయ స్థాయి పరీక్షలో సాధించిన ర్యాంక్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సులు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ద్వారా వీటిలో ప్రవేశాలు కల్పిస్తారు. బీ ఆర్కిటెక్చర్‌లో 134 సీట్లు, బీ ప్లానింగ్‌లో 45 సీట్లు ఉన్నాయి.

మాస్టర్స్ ప్రోగ్రామ్‌లు: మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ ప్లానింగ్, మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సులు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. గేట్, సీడ్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు స్కాలర్‌షిప్ ఇస్తారు. మొత్తం 276 సీట్లు ఉన్నాయి.

- **మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ స్పెషలైజేషన్‌లు-సీట్లు:** ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్ 19, అర్బన్ డిజైన్ 25, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్ 29 సీట్లు ఉన్నాయి.
- **మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లు-సీట్లు:** ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ 19, హౌసింగ్ 29, రీజనల్ ప్లానింగ్ 19, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ 29, అర్బన్ ప్లానింగ్ 39 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ డిజైన్(ఇండస్ట్రియల్ డిజైన్) కోర్సులో 29 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ కోర్సులో 39 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** స్పెషలైజేషన్‌ను అనుసరించి ఆర్కిటెక్చర్/సివిల్/కన్‌స్ట్రక్షన్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుకు పీజీ(జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ/ఎకనామిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్) అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నెట్/గేట్/సీడ్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు: ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఏడాదికి రెండు సార్లు అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఫుల్ టైం ప్రోగ్రామ్ వ్యవధి రెండు నుంచి అయిదేళ్ల వరకు ఉంటుంది. పార్ట్ టైం ప్రోగ్రామ్ వ్యవధి మూడు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. మొత్తం 36 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** ప్లానింగ్/ఆర్కిటెక్చర్ విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 80 శాతం మార్కులతో డిగ్రీ(ఆర్కిటెక్చర్/ప్లానింగ్/సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు కనీసం మూడేళ్ల టీచింగ్/రీసెర్చ్/ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారు; అదే 60 శాతం మార్కులతో పదేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,500
- **పీజీ ప్రోగ్రామ్‌ల ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 27
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 10
- **పీజీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 15 నుంచి 19 వరకు
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూలై 25 నుంచి 27 వరకు
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** జూలై 29
- **అకడమిక్ సెషన్స్ ప్రారంభం:** జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.spa.ac.in

ఐఐటీ ఢిల్లీలో సమ్మర్ ఫెలోషిప్

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ ఢిల్లీ)- సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ 2024లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి 8 నుంచి 12 వారాల వరకు ఉంటుంది. దీనిని మే 14 నుంచి జూలై 12 వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదు. ఎంపికైన అభ్యర్థులకు స్లీపర్ క్లాస్ ట్రైన్ ఫేర్ ఇస్తారు. ఐఐటీ ఢిల్లీ క్యాంపస్‌లో భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. వారానికి రూ.500ల స్టయిపెండ్ కూడా ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కళాశాల నుంచి బీఈ/బీటెక్ రెండో ఏడాది పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐఐటీల విద్యార్థులు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ రెండో వారంలో
- **వెబ్‌సైట్:** academics.iitd.ac.in/srf/

కాకతీయ వర్సిటీలో డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు

వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిలో సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీఏ, బీకాం(జనరల్), బీకాం(కంప్యూటర్స్), బీబీఏ, బీఎస్సీ(మేథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్స్) ప్రోగ్రామ్‌ల వ్యవధి మూడేళ్లు. బీలైబ్రరీ సైన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బీకాం కంప్యూటర్స్, బీబీఏ, బీ లైబ్రరీ సైన్స్ ప్రోగ్రామ్‌లను ఇంగ్లీష్ మాధ్యమంలో; మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- **అర్హత:** బీ లైబ్రరీ సైన్స్ ప్రోగ్రామ్‌నకు డిగ్రీ ఉత్తీర్ణులు; మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంఏ స్పెషలైజేషన్‌లు: తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్

- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ
- **ఇతర కోర్సులు:** ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలైబ్రరీ సైన్స్
- ఎంలైబ్రరీ సైన్స్ కోర్సు వ్యవధి ఏడాది. మిగిలిన కోర్సుల వ్యవధి రెండేళ్లు.
- **అర్హత:** ఎంలైబ్రరీ సైన్స్‌కు బీ లైబ్రరీ సైన్స్ ఉత్తీర్ణులు; మిగిలిన కోర్సులకు సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ఏడాది డిప్లొమాలు

- **విభాగాలు:** బిజినెస్ మేనేజ్‌మెంట్, రిటైల్ మార్కెటింగ్, ట్యాలీ, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్-కమ్యూనికేషన్ స్కిల్స్, యోగా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్

మూడు నెలల ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లు

- **విభాగాలు:** మిమిక్రీ, ఓకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మ్యూజిక్, సాఫ్ట్ స్కిల్స్, మీడియా ఫొటోగ్రఫీ

ఆర్నెల్ల సర్టిఫికెట్ ప్రోగ్రామ్

- **విభాగం:** లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** www.sdlceku.co.in



జాబ్ కార్నర్

కేంద్ర ప్రభుత్వ శాఖల్లో వివిధ పోస్టులు



ఖాళీలు 2049

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర విభాగాల్లో ఖాళీగా ఉన్న సెలెక్షన్ పోస్టుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలున్న విభాగాలు: ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, సెంట్రల్ వాటర్ కమిషన్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ మినిస్ట్రీ, హోం అఫైర్స్ మినిస్ట్రీ, డిఫెన్స్ మినిస్ట్రీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్, సెంట్రల్ ట్రాన్స్‌లేషన్ బ్యూరో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రూరల్‌డెవలప్‌మెంట్. వీటిలో ఎస్సీలకు-255; ఎస్టీలకు-124; ఓబీసీలకు-456; యూఆర్-1028; ఈడబ్ల్యూఎస్-186 పోస్టులు రిజర్వ్ చేశారు.

సెలెక్షన్ పోస్టుల లెవల్స్: 1, 2, 3, 4, 5, 6.

పోస్టులు: లైబ్రరీ అటెండెంట్, మెడికల్ అటెండెంట్, నర్సింగ్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, ఫీల్డ్‌మన్, అకౌంటెంట్, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ల్యాబొరేటరీ అటెండెంట్, ఫోర్‌మన్, జూనియర్ ఇంజనీర్, యూడీసీ, డ్రైవర్-కమ్ మెకానిక్, టెక్నికల్ అసిస్టెంట్, సూపర్‌వైజర్, సీనియర్ ట్రాన్స్‌లేటర్, స్టోర్ కీపర్ ఎంట్రీ ఆపరేటర్, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్, కోర్ట్ క్లర్క్, సీనియర్ జియోగ్రాఫర్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: కనిష్ఠంగా 18 ఏళ్లు నిండి ఉండాలి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్-టైపింగ్/డేటా ఎంట్రీ/కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(సంబంధిత ఖాళీలకు మాత్రమే), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంది.

పరీక్ష విధానం: ఇది ఆన్‌లైన్ పరీక్ష. వ్యవధి 60 నిమిషాలు. జనరల్ ఇంటెలిజెన్స్(25 ప్రశ్నలు, 50 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు, 50 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(బేసిక్ అర్థమెటిక్ స్కిల్)(25 ప్రశ్నలు, 50 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్(బేసిక్ నాలెడ్జ్) (25 ప్రశ్నలు, 50 మార్కులు). ప్రతి తప్పు సమాధానానికి0.50 మార్కుల నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18

పరీక్ష తేదీలు: 2025 మే 6 నుంచి 8 వరకు

వెబ్‌సైట్: https://ssc.gov.in/

పుణె ట్రిపుల్ ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 20

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, అప్లయిడ్ మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధన/పరిశోధనానుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: డెమో క్లాస్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ది డైరెక్టర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పుణె చిరునామాకు స్పీడ్/రిజిస్టర్/కొరియర్ ద్వారా పంపాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18

వెబ్‌సైట్: www.iiitp.ac.in/careers

నాల్కోలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీలు

ఖాళీలు 277

భువనేశ్వర్(ఒడిశా)లోని భారత ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (నాల్కో)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: గ్రాడ్యుయేట్ ఇంజనీర్

కేటగిరీ వారీగా ఖాళీలు: యూఆర్-116; ఈడబ్ల్యూఎస్-27; ఓబీసీ-72; ఎస్టీ-18; ఎస్సీ-44; దివ్యాంగులు-15.

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెటలర్జీ, కెమికల్, కెమిస్ట్రీ.

అర్హత: 65 మార్కులతో బీఈ, బీటెక్(మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెటలర్జీ, కెమికల్, కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) ఉత్తీర్ణతతో పాటు గేట్-2023 మార్కులు సాధించి ఉండాలి.

వయోపరిమితి: 2024 ఏప్రిల్ 2 నాటికి 30 సంవత్సరాలు మించకూడదు

పే స్కేల్: రూ.40,000 - రూ.1,40,000

ఎంపిక ప్రక్రియ: ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-2023 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. ఇతరులకు రూ.100

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: మార్చి 4

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 2

వెబ్‌సైట్: https://nalcoindia.com/

ఏపీ ఐటీఐల్లో అసిస్టెంట్ ట్రెయినింగ్ ఆఫీసర్లు

ఖాళీలు 71

ఏపీలోని పలు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి ఉపాధి, శిక్షణ శాఖ దరఖాస్తులు కోరుతోంది.

జోన్: 1, 2, 3, 4

ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్ సివిల్, వైర్‌మ్యాన్, సీవోపీఏ, డ్రెస్ మేకింగ్, మెకానిక్ మోటార్ వెహికల్, కార్పెంటర్, వర్క్‌షాప్ కాలిక్యులేషన్ అండ్ సైన్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్.

అర్హత: సంబంధిత విభాగంలో బి.ఒకేషనల్/డిగ్రీ/డిప్లొమా/ఎన్‌టీసీ/ఎన్ఏసీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2023 సెప్టెంబరు 30 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ప్రాక్టికల్ డెమో, పని అనుభవం తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 20

వెబ్‌సైట్: detrecruitments.apcfss.in/

ఏపీఎండీసీలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్... రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 6

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సర్వే)(మెటాలిఫరస్): **3 పోస్టులు**
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సర్వే)(కోల్): **3 పోస్టులు**

అర్హత: డిగ్రీ/డిప్లొమా(మైనింగ్/మైన్ సర్వే) లేదా డిగ్రీ(సైన్స్), మైన్ సర్వేయర్స్ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 జనవరి 31 నాటికి 18 నుంచి 32 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

పే స్కేల్: రూ.40,970 - రూ.1,24,380

పరీక్ష రుసుము: బీసీ/ఎస్సీ/ఎస్టీ/పీహెచ్ కేటగిరీకి రూ.500. ఇతర కేటగిరీలకు రూ.1000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 14

వెబ్‌సైట్: apmdc.ap.gov.in/

లిటిల్స్



తాబేలు- కుందేలు

ఒక అడవిలో ఓ తాబేలుండేది. దాన్ని అందరూ వెక్కించేవారు. ఎందుకంటే అది సోమరి అని.. అందరికంటే వెనకాల ఉంటుందనీ.. ఆపద వచ్చినప్పుడు తాబేలు ముడుచుకుపోతే.. మిగతా పక్కన ఉండేవి కష్టాలబారిన పడతాయని చెప్పేవారు. దీంతో తాబేలు బాధగా ఉండేది. ఇతర జంతువులు కావాలనే తనను ఇబ్బంది పెట్టడానికి చూస్తున్నాయని తెలుసుకుంది. అయితే ఏమీ చేయలేని పరిస్థితి.

ఒక రోజు తాబేలుకు ఓ కుందేలు పరిచయమైంది. అంత తెల్లగా ఉండే కుందేలును ఇది వరకెన్నడూ ఈ తాబేలు చూడలేదు. కుందేలు తీరును చూసి మెచ్చుకుంది. తెల్లని రంగు బావుందని చెప్పింది. 'ఇవన్నీ కాదు.. ఈ చోటు నాది. ఇక్కడనుంచి వెళ్లిపో' అన్నది కుందేలు. 'నేను ఎప్పటినుంచో ఉన్నానని' చెప్పింది తాబేలు. అయినా కుందేలు ఒప్పుకోలేదు. నీతో వాదించటం ఉపయోగం లేదు. 'మనం పరుగు పందెం పెట్టుకుందాం. ఎవరు గెలిస్తే వారిదే ఈ ప్రాంతం' అన్నది కుందేలు. మిగతా జంతువులన్నీ 'ఇది జరిగే పనేనా' అంటూ నవ్వాయి. తాబేలుకు నిజంగానే కోపం వచ్చింది. ఆ పందేనికి అంగీకరించింది.



ఉదయాన్నే ఓ గీత దగ్గర నిలబడ్డాయి. కుందేలు, తాబేలు పోటీదారులు. సరే అంటూనే పరిగెత్తాలి. కిలోమీటరు దూరం ఉండే గీతను దాటినవాళ్లే విజేతలు. ఎవరు ఓడిపోయినా అవతలి వారి మాటను శిరసావహించాల్సిందే అన్నావి మిగతా జీవులు. పరుగు ప్రారంభమైంది. కుందేలు చెంగుమని పరిగెత్తింది. తాబేలు మెల్లగా నడుస్తోంది. ఇలా అయితే తాబేలు గెలిచినట్లే అంటూ అందరూ వెటకారంతో అరిచారు. కుందేలు కొంచెం దూరంగా వెళ్తూనే చెట్టు కనపడింది. చల్లగా ఉందది. దీంతో అక్కడే నిద్రపోయింది తాబేలు. బాగా నిద్రపోయి లేచాక చూస్తే తాబేలు ఎప్పుడో ముందు వెళ్లిపోయింది. పరుగు గట్టిగా అందుకుంది ఒక్కసారిగా కుందేలు. పరిగెత్తి చూస్తే తాబేలు గమ్యాన్ని చేరుకుంది. లక్ష్యరేఖను దాటింది. దీంతో కుందేలు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అందరూ తాబేలును మెచ్చుకున్నారు. తాబేలు అందరికీ ఆదర్శం అంటూ పొగిడాయి మిగతా జంతువులు. అలా తాబేలు గెలిచింది. తన ప్రాంతాన్ని దక్కించుకుంది. తక్కువ అంచనాతో, అతి తెలివి తేటలతో తాబేలుతో ఓడిపోయిన ఆ కుందేలు మరెన్నడూ కనపడలేదు ఆ అడవిలో.

దారి కనుక్కోండి



7 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 245

	9					8	4	1
	5	4			8			
			2		4			
9	4							2
7			4	2	3			8
3							6	7
			6		9			
			3			2	1	
4	6	3					9	

సుడోకు - 244 సమాధానం

2	6	3	4	5	7	1	8	9
4	5	7	8	9	1	3	2	6
9	1	8	6	3	2	5	4	7
1	3	5	9	4	6	8	7	2
7	9	6	2	8	3	4	5	1
8	2	4	1	7	5	9	6	3
6	4	1	5	2	9	7	3	8
5	7	2	3	1	8	6	9	4
3	8	9	7	6	4	2	1	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.